

తృణమూల్‌లో చీలిక

బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీకి భారీ షాక్

58 మంది రెబల్ ఎమ్మెల్యేల వేరు కుంపటి

ప్రతిపక్ష నేతగా బహిష్కృత ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ › 7

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA



గాడ్జిల్లా ఎల్‌నినో!

ప్రపంచానికి పొంచి ఉన్న తీవ్ర ముప్పు

విపత్కర వాతావరణ పరిస్థితులతోపాటు

ఆర్థిక, రాజకీయ సంక్షోభాలు అనివార్యం

ప్రపంచ దేశాలను హెచ్చరిస్తున్న నిపుణులు › 7

గురువారం THURSDAY 4.6.2026 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 360 ‖ వెల (Price) రూ.6.50 | చవితి

గురువారం, సూర్యోదయం: 5-41, సూర్యాస్తమయం: 6-48. శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం గ్రీష్మ రుతువు అధిక జ్యేష్ఠ మాసం కృష్ణ పక్షం తిథి: చవితి రాత్రి 11-31 వరకు. నక్షత్రం: ఉత్తరాషాఢ తెల్లవారుజామున 3-42 వరకు. వర్జ్యం: ఉదయం 9-52 నుంచి ఉదయం 11-39 వరకు. రాహుకాలం: పగలు 1-52 నుంచి పగలు 3-30 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-03 నుంచి పగలు 10-55 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 3-17 నుంచి సాయంత్రం 4-10 వరకు. అమృతకాలం: రాత్రి 8-34 నుంచి రాత్రి 10-20 వరకు. సంకష్టహర చతుర్థి చంద్రోదయం రాత్రి 10-11 గంటలకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

ఈ నేల భూమిపుత్రుల జాగీరే

ఎవరో మాకు దేశభక్తి పాఠాలు చెప్పాల్సిన పనిలేదు

పోరాటాలు, యుద్ధాలు, త్యాగాలు మాకు కొత్త కాదు

ఈ దేశానికి మా వంతుగా సహకారం అందిస్తున్నం

దేశ జీడీపీకి 5% కంటే ఎక్కువ కాంట్రిబ్యూట్ చేస్తున్నం

ప్రత్యేక తెలంగాణ ఆషామాషీగా ఏర్పడ్డ రాష్ట్రం కాదు

పొట్టి శ్రీరాములుది ప్రాంతీయవాదం అంటారా?

జాతీయవాదం ముసుగు వేసుకొని జరుగుతున్న ఆర్థిక ప్రాంతీయవాదంపై పవన్ జవాబు చెప్తరా?

2018లో, 2023లో జనసేన పోటీ చేయకుండా ఎవరూ అడ్డుకోలే.. కొత్తగా పోటీ చేసేదేమున్నది?

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ‘మీట్ ది ప్రెస్’లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణ ‘ఓజీ’ కేసీఆరే!

- రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని రేవంత్ తెలంగాణలో పూర్తిగా బొందపెట్టడం ఖాయం
- రాష్ట్రంలో కాంగ్రెస్-బీజేపీ ‘హైబ్రిడ్ జోడీ’
- కేసీఆర్ లాంటి నేత దేశంలో ఎక్కడా లేడు
- ఏది చేసినా ఫ్యాషన్‌తో, ఒక టాస్క్‌గా చేసినం
- పాలమూరు ప్రాజెక్టును 90% పూర్తిచేసినం
- నార్లాపూర్ వద్ద మోటర్ ఆన్ చేసి నీళ్లిచ్చి చూపినం
- 20 లక్షల ఇండ్లు కట్టిన తర్వాతే ఓట్లు అడగాలి లేదంటే మంత్రి పొంగులేటి ఇంట్లో కూర్చోవాలి
- బీజేపీతో పొత్తు ప్రశ్నేలేదు..మా పరిధి చిన్నది
- మీ ఇమాజినేషన్ స్క్రిప్ట్‌తో ఒక సినిమా తీస్తే బాహుబలి సినిమాను మించి హిట్టవుతది
- వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఒంటరిగానే పోటీ
- వచ్చే ఏడాది కచ్చితంగా పాదయాత్ర చేస్త
- దానిపై పార్టీ పెద్దలతో మాట్లాడాకే నిర్ణయం
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెట్టినా 90 సీట్లు గెలుస్తం
- వచ్చే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రైమ్ ఏరియాలోనే అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయిస్తం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టీకరణ



సమయం వచ్చినప్పుడు గేర్ మారుస్తం.. తెలంగాణ కథలో నంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే.. కాంగ్రెస్ ఫస్ట్‌హాఫ్ డిజాస్టర్.. సెకండాఫ్ కూడా అంతే.. కేసీఆర్ కంటే దేశంలో ఎవరు ఎక్కడ ఎక్కువ పనులు చేసినట్టు చూపించినా రాజకీయాల నుంచి తప్పుకొంటా! - కేటీఆర్

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పుష్కర కాలం పూర్తయిన సందర్భంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ‘మీట్ ది ప్రెస్’లో పాల్గొని అనేక విషయాలను పాత్రికేయులతో పంచుకున్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ ప్రస్థానం, రాష్ట్ర ఆవిర్భావం అనంతరం పాలనాపగ్గాలు చేపట్టాక బీఆర్‌ఎస్ సాధించిన విజయాలను వివరిస్తూనే ప్రస్తుత కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను ఎండగట్టారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై ప్రజలను జాగృతపరుస్తూనే ‘మన తాతల కథ.. తండ్రుల కథ.. మన జాతి కథను ఉడుకునెత్తురుతో ఉరకలెత్తే యువతరం తెలుసుకోవాలి.. పుట్టిన గడ్డ.. జన్మనిచ్చిన మట్టి కథను యువత చదువుకోవాలి’ అని పిలుపునిచ్చారు.

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాజకీయాల్లో అసలైన ‘ఓజీ’ (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్) ముమ్మాటికీ కేసీఆరేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. కేసీఆర్ ఎప్పుడు ప్రజాక్షేత్రంలోకి రావాలో, రాజకీయంగా ఎప్పుడు గేర్ మార్చాలో తమకు బాగా తెలుసని చెప్పారు. రేవంత్‌రెడ్డి లాంటి వాళ్లకు సమాధానం చెప్పడానికి తమ లాంటి క్షేత్రస్థాయి నాయకత్వం చాలని చురకలంటించారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన ‘మీట్ ది ప్రెస్’లో ఆయన పాత్రికేయులు అడిగిన పలు పదునైన ప్రశ్నలకు తనదైన శైలిలో స్పష్టమైన సమాధానాలు ఇచ్చారు. 2027లో తాను › 2వ పేజీలో

తోకముడిచిన పవన్



ఔను... అదే నిజం

రాష్ట్రంగా ఏర్పడి 12 ఏండ్లయినా తగ్గని తెలంగాణ సెంటిమెంట్

తెలంగాణ, తమిళనాడుల్లో ప్రాంతీయ అస్తిత్వం బలంగా ఉన్నది

కులాల మధ్య పంచాయితీలే తప్ప ఏపీకి ఆంధ్రా అనే భావనే లేదు

చిన్న ఘటన గాలివానైంది.. సభకు అనుమతిస్తే వివాదం కాకపోవు

కేటీఆర్‌తో మంచి సోదరభావం ఉన్నది.. ఆయన చెప్పాడంటే కరెక్టే!

తెలంగాణలో పోటీ చేసే ఉద్దేశమేదీ వ్యక్తిగతంగా నాకు లేనే లేదు

అమరావతిలో మీడియాతో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ‘తెలంగాణ ప్రజలకు తెలంగాణ అనే బలమైన భావన ఉన్నది. అటు తమిళనాడు వాళ్లకు తమిళ భావన ఉన్నది. కానీ దురదృష్టవశాత్తూ ఆంధ్రప్రదేశ్ వాళ్లకే ఆంధ్రా భావన అనేదే లేదు. అక్కడ ఎప్పుడూ కులాల పంచాయితీలు తప్ప ప్రాంతీయ అస్తిత్వం, బలం కనిపించవు’ అని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ‘తెలంగాణ అంశంపై కేటీఆర్ తప్పుగా ఏమీ మాట్లాడి ఉండరు. తెలంగాణ ముమ్మాటికీ ఇక్కడి భూమిపుత్రుల జాగీరే.. కాదని ఎవరన్నారు? ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహాలు అవసరం లేదు’ అని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా జనసేన పార్టీ ప్రతిపాదించిన ‘తెలంగాణ నవనిర్మాణ సభ’కు పోలీసులు అనుమతి నిరాకరించిన నేపథ్యంలో మంగళవారం నాడు పవన్‌కల్యాణ్ హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ పలు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యలపై రాజకీయాలకు అతీతంగా తెలంగాణ భగ్గుమన్నది. ప్రజలనుంచి, ఉద్యమకారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో పవన్‌కల్యాణ్ తోకముడిచారు. తెలంగాణ ఎవరి జాగీర్? అని ప్రశ్నించిన ఆయనకు గంటల వ్యవధిలోనే జ్ఞానోదయం కలిగినట్టుంది. బుధవారం అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ.. ‘నిజమే! తెలంగాణ భూమిపుత్రుల జాగీరే’ అంటూ › 5వ పేజీలో

భూముల విలువ పెంపు

- రాష్ట్ర ప్రజల నెత్తిన రేవంత్‌రెడ్డి సర్కార్ మరో బాంబ్
- రేపటి నుంచే అమల్లోకి రానున్న సవరించిన విలువ
- అదనపు ఆదాయమే లక్ష్యంగా సర్కార్ అడ్డగోలు బాదుడు
- ప్రస్తుత విలువపై 15% నుంచి 100% వరకు పెంపుదల
- ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ పరిధిలో భారీగా పెరుగనున్న ధర
- శేరిలింగంపల్లిలో భూమి ధర ఎకరం కనిష్ఠంగా 30 కోట్లు
- గ్రామాల్లో కనిష్ఠంగా ఎకరం రూ.2.75 లక్షలకు పెంపు



హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ విలువలను పెంచుతున్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఈ నిర్ణయం శుక్రవారం నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. బహిరంగ మార్కెట్ ధరకు, ప్రభుత్వ ధరకు మధ్య భారీ వ్యత్యాసం ఉన్నదని, ఈ వ్యత్యాసాన్ని తగ్గించేలా భూముల ధరలను సవరించినట్టు పేర్కొన్నారు. అపార్ట్‌మెంట్‌లలో కొన్నిచోట్ల అన్ని ఫ్లోర్లకు ఒకే రకమైన ధరను నిర్ణయించినట్టు తెలిపారు. హెచ్ఎండీఏ, క్యూర్ పరిధిలో, ఇతర ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, ఓపెన్ ప్లాట్లు, ఫ్లాట్లకు కనీస ధరలను ఖరారు చేశామని చెప్పారు. సర్కార్ నిర్ణయంతో శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా గ్రేటర్ పరిధిలో వ్యవసాయ భూములు, ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల రిజిస్ట్రేషన్ ధరలు భారీగా పెరుగనున్నాయి. ఓఆర్ఆర్, ట్రిపుల్‌ఆర్ పరిధిలో ప్రస్తుత ధరలపై 100శాతం పెరిగే అవకాశం ఉన్నది. భూముల విలువ పెంపుతో ప్రజల నెత్తిపై అనివార్యంగానే రిజిస్ట్రేషన్ చార్జీల భారం కూడా పడనున్నది. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ ధరలను ప్రభుత్వం భారీగా పెంచిన నేపథ్యంలో రంగారెడ్డిలో ఎకరం ధర రూ.10 కోట్లకు చేరింది. శేరిలింగంపల్లిలో ఎకరం ధర రూ.30 కోట్లుగా ఖరారు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ వ్యవసాయ భూముల ధరలు భారీగా పెరిగాయి. ప్రస్తుతం ఎకరం ధర కనిష్ఠంగా రూ.75 వేలు › 8వ పేజీలో

రియల్టీకి చావుదెబ్బ

- సవరించిన భూముల రిజిస్ట్రేషన్ విలువలను 5 నుంచి అమలు చేయాలని సర్కార్ నిర్ణయం
- పేదలకు సొంతింటి కల శాశ్వతంగా దూరం › 9
- రాష్ట్రంలో ఇప్పటికే కుప్పకూలిన స్థిరాస్తి రంగం
- భూములు కొనేటోడు లేడు, ఇల్లు కట్టేటోడు లేడు



బోర్లల్లో నీళ్లున్నాయని వరి సాగు చేయొద్దు

ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టిసారించాలి

కేంద్రం కారణంగానే కొనుగోళ్లల్లో ఇబ్బందులు : తుమ్మల

ఖమ్మం, జూన్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బోర్లలో నీళ్లున్నాయని వరి సాగుచేసే పద్ధతిని రైతులు ఇప్పటికీ అనుసరిస్తున్నారని, అందువల్లే మార్కెటింగ్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రాజకీయ కోణం కారణంగానే రాష్ట్రంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదనపు గోదాముల ఏర్పాటుకు, రవాణాకు అవసరమైన డీజిల్ పంపిణీకి సరైన చర్యలు తీసుకోకపోవడంతోనే రైతులు అవస్థ పడాల్సి వస్తున్నదని తెలిపారు. రైతులు పంటల మార్పిడీని తప్పనిసరిగా పాటించాలని, ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గుచూపాలని సూచించారు. ముఖ్యంగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడం ద్వారా విక్రయానికి ఇబ్బంది ఉండదని చెప్పారు. పప్పు ధాన్యాలు, కూరగాయలు, నూనె గింజలను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, వీటివైపు రైతులు ఆసక్తి పెంచేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. మక్కజొన్న, ధాన్యం › 8వ పేజీలో



డాలర్ల కోసం ఆర్బీఐ బంగారాన్ని అమ్మేసిందట!

2 వారాల్లో రూ.1.15 లక్షల కోట్ల పసిడి నిల్వలను విక్రయించింది

బ్లూమ్‌బర్గ్ ఎకనమిక్స్ తాజా నివేదిక

వార్తలను ఖండించిన రిజర్వ్‌బ్యాంక్

అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో సంక్షోభం.. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల విజృంభణ.. దేశీయ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణలు.. భారమైన దిగుమతులతో విదేశీ మారకం నిల్వల్లో క్షీణత.. ఈ నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ డాలర్ల కోసం తమ దగ్గరున్న పసిడి నిల్వలను అమ్మేసిందన్న వార్తలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. › 12



భూ సమస్య పరిష్కారం కావడం లేదని సచివాలయం ఎదుట ఆత్మహత్యకు యత్నించిన దంపతులకు సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

సచివాలయం సాక్షిగా దంపతుల ఆత్మహత్యాయత్నం

భూమి సమస్య తీరడం లేదని మనస్తాపం › 9

పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొనే యత్నం

అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

కాంట్రాక్టర్ల బకాయిలు వెంటనే చెల్లించాలి

బిల్డర్స్ అసోసియేషన్ డిమాండ్

18న చలో హైదరాబాద్‌కు పిలుపు › 9

సెక్రటేరియట్‌లో హౌస్‌కీపింగ్ సిబ్బంది ధర్నా



3 నెలలుగా జీతాలివ్వడం లేదని నిరసన › 9

‘ముఖ్యనేత’ అనుచరుడికే ఏజెన్సీ!

- అగ్రిమెంట్ లేకుండానే అన్నారం, సుందిళ్ల బరాజ్ పనుల అప్పగింత?
- ఇప్పటికీ కొనసాగుతున్న పరీక్షలు
- వానకాలంలోగా పూర్తి అనుమానమే
- హఠాత్తుగా మేడిగడ్డ అధికారుల బదిలీ
- నేడు కాళేశ్వరం బరాజ్‌ల వద్దకు రానున్న కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బరాజ్ వద్ద పరీక్షలు నిర్వహిస్తున్న ఏజెన్సీ సిబ్బంది

జయశంకర్ భూపాలపల్లి, జూన్ 3 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టును ఈ ఏడాది సైతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పక్కనపెట్టే కుట్ర కొనసాగిస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 30 నెలలుగా కాలయాపన చేసిన కాంగ్రెస్ సర్కార్ రైతుల నుంచి వచ్చిన వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకొని తప్పనిసరి పరిస్థితుల్లో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లో టెస్టింగ్ పనులను ప్రారంభించింది. ఇవి పూర్తికాగానే మరమ్మతు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇంకా అదే నిర్లక్ష్యపు వైఖరిని అవలంబిస్తున్నది. వానకాలం సమీపిస్తున్న సమయంలో కావాలనే టెస్టింగ్ పనులు ప్రారంభించి వరదల › 8వ పేజీలో

మన కోటా నీళ్లూ వాడుకోలే!

గత నీటి సంవత్సరంలో వాడింది 25 శాతమే

గత పన్నెండేండ్లలో ఇదే అత్యల్ప వినియోగం

కృష్ణా నీటి మళ్లింపులో ఏపీ సరికొత్త రికార్డు

శ్రీశైలం నుంచే 260 టీఎంసీల నీటి తరలింపు

అందులో పోతిరెడ్డిపాడు నుంచే 197 టీఎంసీలు

మొత్తంగా 777 టీఎంసీల నీటి వినియోగం

తెలంగాణ రాష్ట్రం వాడుకున్నది 274 టీఎంసీలే

జలాలను ఏపీకి ధారాదత్తం చేసిన కాంగ్రెస్ సర్కార్

(మ్యాకం రవికుమార్)

హైదరాబాద్, జూన్3 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ఘోరంగా విఫలమవుతున్నది. గత 2025-26 నీటి సంవత్సరంలో మొత్తంగా 271 టీఎంసీలు (25 శాతం) మాత్రమే వాడుకోగలిగింది. గత పన్నెండేండ్లలో ఇదే అత్యంత తక్కువ. ఏపీ మాత్రం గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో 777 టీఎంసీలను తరలించుకుపోయింది. తన కోటాకు › 8వ పేజీలో

ఈ నేల భూమిపుత్రుల జాగీరే

మొదటిపేజీ తరువాయి...

చేపట్టబోయే రాష్ట్రవ్యాప్త పాదయాత్రను ప్రకటిస్తూనే.. రాష్ట్రంలో నడుస్తున్నది కాంగ్రెస్-బీజేపీ 'హైబ్రిడ్ జోడీ' ప్రభుత్వమని విమర్శించారు. రాబోయే రోజుల్లో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని తెలంగాణలో పూర్తిగా బొందపెట్టడం ఖాయమని జోస్యం చెప్పారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యపై స్పందిస్తూ రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రెస్ క్లబ్‌తో కలిపి జాయింట్ కమిటీ వేసి, జర్నలిస్టులు కోరుకున్న ప్రైమ్ ల్యాండ్‌లోనే ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాత్రికేయులు అడిగిన ప్రశ్నలు.. కేటీఆర్ ఇచ్చిన సమాధాలు ఇలా.. ప్రశ్న: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిన్న మాట్లాడుతూ 'నన్ను ఎవరు అడ్డుకుంటారు? తెలంగాణ ఏమైనా మీ అయ్య జాగీరా?' అని వ్యాఖ్యానించారు. ఏపీలో జనసేన కార్యకలాపాలను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నదని పరోక్షంగా ప్రస్తావించారు. దీనిపై మీ స్పందన ఏమిటి?

కేటీఆర్: ప్రజాస్వామ్య భారతదేశంలో బాబాసాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగం ప్రకారం ఏ నాయకుడైనా, నాయకురాలైనా నిరభ్యంతరంగా ఎక్కడైనా పార్టీ పెట్టవచ్చు. ఏ రాష్ట్రంలోనైనా పోటీ చేయొచ్చు. అది అందరి హక్కు. అందులో ఎలాంటి అనుమానం లేదు. కానీ, మీరు ఏ ప్రాంతంలో రాజకీయం చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంత ఆకాంక్షలు, పరిస్థితులు, అక్కడి ప్రజల మానసిక స్థితిగతులు, వారి పోరాటాలు, త్యాగాల గురించి కనీస అవగాహన ఉండాలి, వారిపై అభిమానం ఉండాలి. పవన్ కల్యాణ్‌ను నేను అడుగుతున్నా.. ఇవాళ మీరు కొత్తగా తెలంగాణలో పోటీ చేసేది ఏమున్నది? జనసేన పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయలేదా? మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో 350 వార్డుల్లో పోటీ చేయలేదా? మిమ్మల్ని అసలు ఎవరు ఆపుతున్నారు? 2018లో చంద్రబాబు వచ్చారు, పోటీ చేశారు. 2023లో మీరు పోటీ చేశారు. పోటీ చేయండి, ఎవరు వద్దన్నారు?

తెలంగాణ కచ్చితంగా భూమి పుత్రుల జాగీరే!

పవన్‌కల్యాణ్ ఇక్కడికి వచ్చి మాట్లాడేటప్పుడు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలి. తెలంగాణ ఏదో ఆషామాషీగా ఏర్పడ్డ రాష్ట్రం కాదు. అనాయాసంగా వచ్చిన నేల కాదు. వేల మంది బలిదానాలతో, రక్తంతో తడిసిన నేల ఇది. నిన్న పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఎవరో అడ్డుకుంటున్నట్టు ఒక ఊహాజనిత ప్రపంచాన్ని సృష్టించుకొని మాట్లాడుతున్నారు. మిమ్మల్ని 2018లో అడ్డుకోలేదు, 2023లోనూ అడ్డుకోలేదు. ప్రజలు మిమ్మల్ని తిరస్కరిస్తే (అడ్డుకుంటే) దానికి మేమేం చేస్తాం? ఇక 'మీ అయ్య జాగీరా' అన్న వ్యాఖ్యకు వస్తే.. నేను పవన్ కల్యాణ్‌కు ఒకటే గుర్తు చేస్తున్నా. తెలంగాణ కచ్చితంగా ఈ ప్రాంత భూమిపుత్రుల జాగీరే! ఇందులో ఎవరికీ ఎలాంటి అనుమానం అక్కర్లేదు.



హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేశ్, సమన్వయ కర్త రవికాంత్‌రెడ్డి

రాబోయే ఎన్నికలకు బీఆర్ఎస్ ఎలా సిద్ధమవుతున్నది?

ఏ రాజకీయ పార్టీ అయినా ఎన్నికల తర్వాత చేయాల్సింది తనను తాను పునర్వ్యవస్థీకరించుకోవడం, లోపాలను సరిదిద్దుకోవడం. ప్రస్తుతం మేము అదే చేస్తున్నం. శాసనసభలో ప్రధాన ప్రతిపక్షంగా కొనసాగుతూనే, ప్రభుత్వ వైఫల్యాలు, హామీల ఉల్లంఘనలపై నిలదీస్తూనే ఉంటం. మరోవైపు మా సొంత పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేయబోతున్నం. ఈ జూన్ నుంచే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కానున్నది. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 36,000 పైచిలుకు పోలింగ్ బూత్ స్థాయిల నుంచి మొదలుకొని రాష్ట్ర కమిటీ వరకు అన్ని స్థాయిల్లో పార్టీని సమూలంగా పునర్వ్యవస్థీకరిస్తం. ఈ ప్రక్రియకు కొన్ని నెలల సమయం పడుతుంది. ఐపీఎల్ మ్యాచ్ ఆడే ముందు ఆటగాళ్లకు ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో, ఎన్నికలకు వెళ్లే ముందు పార్టీ శ్రేణులకు అంత ఫిట్‌నెస్ అవసరం. అందుకే మా క్రియాశీల కార్యకర్తలు, నాయకులకు సోషల్ మీడియా వినియోగం, క్షేత్రస్థాయి వ్యూహాలపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తం. ప్రతి బీఆర్ఎస్ సోల్జర్‌నూ పూర్తి సమాచారంతో సన్నద్ధం చేసి, ప్రజల్లోకి వెళ్లి మళ్లీ వారి మద్దతు కూడగడుతం.

రండి వ్యాపారాలు చేసుకోండి

మీరు ఇక్కడికి రండి, ఉండండి. మీ కుటుంబాలు ఇక్కడే ఉన్నయి.. మీ వ్యాపారాలు ఇక్కడే ఉన్నయి. గత పది, పన్నెండేండ్లలో ఎక్కడైనా చిన్న సమస్య వచ్చిందా? ప్రాంతాలుగా విడిపోయినా ప్రజలుగా కలిసి ఉండాలనేదే మా దృక్పథం. అందుకే మోదీ ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తుంటే మేము స్వయంగా వెళ్లి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమానికి మద్దతు తెలిపి, పబ్లిక్ సెక్టార్ సంస్థలను కాపాడాలని డిమాండ్ చేసినం. అది మా ఫిలాసఫీ.

పొట్టి శ్రీరాములుది ప్రాంతీయవాదమా?

నిన్న పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ప్రాంతీయ వాదం అనేది ఉగ్రవాదం కంటే ప్రమాదకరం అన్నట్టుగా మాట్లాడారు. నేను ఆయనకు గుర్తు చేస్తున్నా.. ఆనాడు మద్రాస్ ప్రెసిడెన్సీ నుంచి ఆంధ్ర రాష్ట్రం వేరుపడాలని పొట్టిశ్రీరాములు 58 రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి ఆత్మబలిదానం చేసుకున్నారే.. మరి దాన్ని కూడా ప్రాంతీయవాదం అంటారా? ఇంకో మాట.. జాతీయవాదం ముసుగులో జరుగుతున్న ఆర్థిక ప్రాంతీయవాదం గురించి పవన్‌కల్యాణ్ సమాధానం చెప్తారా? మా హయాంలో తెలంగాణకు రావాల్సిన కేస్ అనే పరిశ్రమను, మైక్రాన్ అనే సంస్థ పెట్టుబడుల్ని మోదీ ఇక్కడి నుంచి గుజరాత్‌కు పట్టుకుపోయారు. మోదీ కేవలం గుజరాత్‌కే ప్రధానిగా వ్యవహరించడం కరెక్టా? దీనికి పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలి.

దేశభక్తి పాఠాలు మాకు అక్కర్లేదు

ఇంకొన్ని రోజులైతే తెలంగాణలో జనగణమన కూడా పాడరనే విధంగా విచిత్రమైన వ్యాఖ్యలు చేశారు. దేశభక్తి గురించి, జాతీయ భావాల గురించి మేము పవన్ కల్యాణ్ దగ్గర పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు. ఈ నేల ఆనాడు నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడిన నేల. కమ్యూనిస్టులు కదం తొక్కిన నేల. మాకు పోరాటాలు, యుద్ధాలు, త్యాగాలు కొత్త కాదు. ఈ దేశానికి మా వంతు సహకారం మేము అందిస్తున్నం. జనాభా పరంగా భారతదేశంలో మేము 3 శాతం కంటే తక్కువే ఉన్నా, దేశ జీడీపీకి 5 శాతం కంటే ఎక్కువ కాంట్రిబ్యూట్ చేస్తున్నం. కాబట్టి మాకు ఎవరి నుంచో మోరల్ లెక్చర్స్ లేదా మోరల్ పోలీసింగ్ అవసరం లేదు.

ఓజీ కేసీఆరే

పవన్ కల్యాణ్‌ను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా మేము డెఫినెట్‌గా గౌరవిస్తం. ఒక నటుడిగా, కళాకారుడిగా అభిమానిస్తం. ఒక సోదరుడిగా మా ఇంటికి వస్తే అద్భుతమైన హైదరాబాదీ బిర్యానీ పెట్టి సత్కరిస్తం. కానీ వచ్చి మా సెక్రటేరియట్‌లో కూర్చొని పెత్తనం చేస్తామంటే కుదరదు. 60 ఏండ్లు పోరాడి, ఎంతో కష్టపడి 2014లోనే మేము వేరుపడ్డం. ఈ మధ్యనే పవన్ కల్యాణ్ ఓజీ (ఒరిజినల్ గ్యాంగ్ స్టర్) సినిమా వచ్చింది కదా.. నేను నా బ్రదర్ పవన్ కల్యాణ్‌కు ఒకటే గుర్తు చేయాలనుకుంటున్నా.. తెలంగాణకు ఒకే ఒక్క ఓజీ ఉన్నారు. ఆయనే కేసీఆర్. ఇక్కడ మా కేసీఆర్ ఉన్నారు. ఆయన చాలు మాకు. ఆయనే మమ్మల్ని, మా రాష్ట్రాన్ని, మా సమస్యలను చూసుకుంటారు.

> తెలంగాణ కచ్చితంగా తెలంగాణ భూమి పుత్రుల జాగీరే! ఇందులో ఎవరికీ ఎలాంటి అనుమానం అక్కర్లేదు. వందశాతం ఈ నేల కోసం కష్టపడ్డవాళ్లు, పోరాటాలు చేసినవాళ్లు, త్యాగాలు చేసిన వాళ్లు.. ఇక్కడున్న నాలుగు కోట్ల మంది తెలంగాణ భూమి పుత్రుల జాగీరే ఈ నేల!
>
> -కేటీఆర్

ప్రశ్న: పదేండ్లలో రాష్ట్రం సాధించిన అభివృద్ధేమిటి?

కేటీఆర్: గత పదేండ్లలో భారతదేశంలో తెలంగాణ సాధించిన విజయాలు, నెలకొల్పిన మైల్‌స్టోన్స్ అపూర్వమైనవి, సాటిలేనివి. ఏ ఇండికేటర్ తీసుకున్నా తెలంగాణ అగ్రగామిగా నిలిచింది. నేను ఐటీ శాఖ మంత్రిగా కూడా పనిచేశాను కాబట్టి పూర్తి బాధ్యతతో చెప్తున్నా. ఒక్క ముక్కలో చెప్పాలంటే స్వతంత్ర భారత చరిత్రలో తెలంగాణ అత్యంత విజయవంతమైన స్టార్టప్ స్టేట్. కేవలం దశాబ్ద కాలంలో తెలంగాణ సాధించినంత ప్రగతి దేశంలో మరే రాష్ట్రం కూడా సాధించలేదు.

ప్రశ్న: బాల్క సుమన్ వ్యాఖ్యలపై స్పందనేంటి?

కేటీఆర్: మా పార్టీ పంథా ఏమాత్రం మారలేదు. ఒక చుక్క రక్తం చిందించకుండా, శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే తెలంగాణ సాధించాలని కేసీఆర్ నాడు చెప్పారు. నేడూ మేము అదే సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నం. బాల్క సుమన్ మాటల విషయానికి వస్తే.. ఆయన డెఫినెట్‌గా పొరపాటుగానే మాట్లాడారు. అందులో ఎలాంటి అనుమానం లేదు. ఆయన బహుశా మిలిటెన్సీ స్పిరిట్ (పోరాట పటిమ)తో పని చేయాలని అని ఉంటారు తప్ప, హింసాత్మక పోరాటాలు చేయాలని అని ఉండరు. ఒకవేళ ఆయన నిజంగా మిలిటెంట్ పోరాటాల గురించే మాట్లాడి ఉంటే అది 100 శాతం తప్పే. ఆ వ్యాఖ్యలతో ఏకీభవించే సమస్యే లేదు.

చట్టం అందరికీ సమానంగా ఉండాలి

దేశంలో చట్టం, లా అండ్ ఆర్డర్ అనేవి సెలెక్టివ్‌గా ఉండకూడదు. బాల్క సుమన్ అన్న మాటలకు ఆయనపై కేసు పెట్టి జైల్లో పెట్టారు. మరి ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న ఒక మాజీ ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంప్ ఆఫీస్‌ను, కేసీఆర్ గజ్వేల్ క్యాంప్ హౌస్‌ను తగులబెడుతామంటే కేసులు ఎందుకు పెట్టలేదు? ఒక సిట్టింగ్ ఎమ్మెల్యే ఫార్మా కంపెనీని తగులబెడుతామన్నా, మరొకరు చెయ్యి నరికేస్తానన్నా ఎందుకు యాక్షన్ తీసుకోలేదు? స్వయంగా ముఖ్యమంత్రే బీఆర్ఎస్ జెండా దిమ్మెలను కూల్చాలని పిలుపునిచ్చారు. అది హింస కాదా? కేసీఆర్ చావును కోరుకుంటూ కాంగ్రెస్ నాయకులు మాట్లాడే రోత భాషపై ఎన్ని కేసులు పెట్టాలి? కాంగ్రెస్ వాళ్లు ఏం చేసినా చెల్లుతుంది.. ఇతరులు మాట్లాడితే జైల్లో పెడుతామంటే కుదరదు. చట్టం అందరికీ ఒక్కటే ఉండాలి.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఫ్యూచర్ సిటీని మీ ప్రభుత్వం వస్తే రద్దు చేస్తుందా? జర్నలిస్టులకు అక్కడ ఇండ్ల స్థలాలు ఇస్తామనడంపై మీ అభ్యంతరం ఏంటి?

మొదట ఆ ఫ్యూచర్ సిటీ అనే భ్రమల్లోంచి బయటకు రండి. అక్కడ ఏమీ లేదు. గాడిదగుడ్డు కూడా లేదు. హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం మేము ల్యాండ్ అక్విజిషన్ చట్టం కింద దాదాపు 14,000 ఎకరాల భూమి సేకరించినం. అది కండిషనల్ ల్యాండ్ అక్విజిషన్ (నిబంధనలతో కూడిన భూసేకరణ). అంటే ఆ భూమిని కేవలం ఫార్మా యూనిట్లు, ఫార్మా పార్క్ ఏర్పాటుకు మాత్రమే వినియోగించాలి. ఇప్పుడు ఈ ప్రభుత్వం ఫార్మాసిటీ లేదు ఏమీ లేదు.. అక్కడ జూ పార్క్ పెడుతాం, వంతారా తీసుకొస్తాం, ప్లాట్లు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తాం అంటున్నది. రేపు ఇలాంటి మిస్-అడ్వెంచర్ (నిబంధనల ఉల్లంఘన) చేస్తే చట్టపరంగా అది ఆగిపోతుంది. హరీశ్‌రావు అన్నదాంట్లో వందశాతం నిజం ఉన్నది. ఓవైపు హైకోర్టులో ఫార్మాసిటీ అక్కడే ఉన్నదని అఫిడవిట్ ఇస్తూ, బయటేమో డ్రామాలు ఆడుతున్నారు. అయినా, జర్నలిస్టులందరూ వెళ్లి ఫార్మా మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ల పక్కన ఇండ్లు కట్టుకొని ఉంటారా? మీకు అది సమ్మతమేనా? ప్రస్తుతం రేవంత్‌రెడ్డి చెప్తున్న ఫ్యూచర్ సిటీలో మీకు స్థలాలు ఇస్తామనడం, పక్కనే జూ పార్క్ పెడుతామనడం కేవలం ఒక భ్రమ. ఆయనకు అసలు ఫ్యూచరే లేదు. రాహుల్‌గాంధీకి కోపం వస్తే రేపు సాయంత్రానికల్లా ఆయన ఉద్యోగం ఊడిపోతుంది. త్వరలోనే మా ప్రభుత్వం వస్తుంది. మీ సమస్యలన్నీ తీరుస్తం.

మంచిరేవుల్లోనో, బుద్వేల్లోనో 100 ఎకరాలు ఇవ్వొచ్చుకదా!

ముఖ్యమంత్రికి నిజంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలనే చిత్తశుద్ధి ఉంటే నగరానికి దగ్గరగా ఉన్న మంచిరేవుల్లోనో, బుద్వేల్లోనో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి కదా! అక్కడ ఒక 100 ఎకరాలు ఇవ్వమనండి. మేము ఎందుకు వద్దు అంటాం? ప్రభుత్వ స్థలాలను ఎంతసేపూ అమ్ముకోవడమేనా? జర్నలిస్టులకు ఇవ్వలేరా? గతంలో మా ప్రభుత్వ హయాంలో జిల్లాల్లో చాలా మంది జర్నలిస్టులకు స్థలాలు ఇచ్చినం. హైదరాబాద్‌లో ల్యాండ్ కాస్ట్లీ కావడం, కోర్టుల్లో న్యాయపోరాటం జరుగడం వల్ల ఆలస్యమైంది.



జర్నలిస్టులకు 100 కోట్లు కేటాయించిన ఏకైక సీఎం కేసీఆర్

గతంలో పేట్ బషీరాబాద్ ల్యాండ్ వివాదంలో ఉన్నప్పుడు కేసీఆర్ ప్రత్యేకంగా నాటి చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణతో మాట్లాడి జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమం కోసం రూ.100 కోట్లు కేటాయించిన ఏకైక సీఎం కేసీఆర్. కరోనా సమయంలో జర్నలిస్టులకు రూ.20,000 చొప్పున ఆర్థిక సాయం అందించినం. జర్నలిస్ట్ చనిపోతే మీడియా అకాడమీ ద్వారా పెన్షన్ ఇచ్చే విధానం తెచ్చినం. కాబట్టి జర్నలిస్టుల సంక్షేమం గురించి మేము రేవంత్‌రెడ్డి దగ్గర నేర్చుకోవాల్సిన అవసరం లేదు. నిజంగా ఇవ్వాలనుకుంటే నగరంలో ఉన్న ప్రైమ్ ల్యాండ్స్ ఇవ్వండి. అంతేగానీ ఫార్మా సిటీ ల్యాండ్స్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, జూ పార్కులు పెడుతామంటే కుదరదు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఫ్యూచర్ సిటీ భూములు చాలా దూరంలో ఉన్నాయి. మంచిరేవుల, బుద్వేల్ లాంటి ప్రైమ్ ల్యాండ్స్ ఇవ్వాలని మీరు డిమాండ్ చేస్తున్నారు. రాబోయే రోజుల్లో మీ ప్రభుత్వం వస్తే అక్కడ స్థలాలు ఇస్తామని మాట ఇవ్వగలరా?

మా ప్రభుత్వం వస్తుందనే విషయంలో మీకు ఎలాంటి అనుమానం అక్కర్లేదు. మాకు ప్రజల ఆశీస్సులున్నయి. రేవంత్‌రెడ్డి ఫ్యూచర్ సిటీ పేరిట కేవలం డ్రామాలు ఆడుతున్నడు తప్ప మీకు పట్టాలు ఇవ్వడు. ఒకవేళ ఫార్మా యూనిట్లు, జూ పార్క్ పక్కన ఇస్తానన్నా మీరు వెళ్లకండి. ఇవాళ 2026 జూన్ 3 నాడు నేను మీకు ప్రెస్‌క్లబ్ సాక్షిగా మాట ఇస్తున్నా. మా ప్రభుత్వం రాగానే.. ప్రభుత్వం, ప్రెస్‌క్లబ్, మీడియా అకాడమీతో కలిపి జాయింట్ కమిటీ ఏర్పాటు చేస్తం. ఆ కమిటీ ద్వారా జర్నలిస్టులైన మీరే స్థలాన్ని ఎంపిక చేయండి. మీరు ఏ స్థలాన్ని ఎంపిక చేస్తే, అక్కడే మీకు ఇండ్ల స్థలాలు ఇచ్చే పూర్తి బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటది. తెలంగాణ జర్నలిస్టులు తెలంగాణ జర్నలిస్టుల ఫోరం పేరిట ఉద్యమంలో కదంతొక్కింద్రు. కలిసినడిచింద్రు. యాజమాన్యాల ఎజెండా ఎలా ఉన్నా.. మా ఎజెండా తెలంగాణేనని పోరాడిన కలం వీరులు.

తమ్మిడిహట్టి ప్రాజెక్టు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. మహారాష్ట్ర సీఎంకు రెండు సార్లు లేఖలు రాశానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్నారు. అసలు ఈ ప్రాజెక్టు మళ్లీ సాధ్యమేనా?

సీఎం రేవంత్‌రెడ్డి ఆడే 'డైవర్షన్ గేమ్స్'లో తమ్మిడిహెట్టి ప్రాజెక్టు కూడా ఒకటి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటిపోయింది. అంటే 50 శాతం టైం, ఇంటర్వెల్ అయిపోయింది. నిజంగా చేసేది ఉంటే ఎప్పుడో చేయాలి కదా? ఇప్పుడు ఎందుకు చేయలేదు? అయినా ఈ ప్రాజెక్టు హిస్టరీ సీఎం ఆఫీస్‌లోనే ఉన్నది, ఆయనకు తెలియదా? గతంలో 2013లో కేంద్రంలో యూపీఏ (కాంగ్రెస్), ఉమ్మడి ఏపీలో కిరణ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్), మహారాష్ట్రలో పృథ్వీరాజ్‌సింగ్ చౌహాన్ (కాంగ్రెస్) ముఖ్యమంత్రులుగా ఉన్నరు. మూడు చోట్లా కాంగ్రెస్ ఉన్నప్పుడే 152 మీటర్ల ఎత్తుతో తమ్మిడిహట్టి కట్టడానికి ఏ పరిస్థితుల్లోనూ ఒప్పుకోమని, అక్కడ పెట్టే ప్రతి రూపాయి నిష్ఫలమని మహారాష్ట్ర కాంగ్రెస్ సీఎం లేఖ రాసింద్రు. మేము అధికారంలోకి వచ్చాక కూడా కేసీఆర్, హరీశ్‌రావు స్వయంగా వెళ్లి అప్పటి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను బతిమిలాడింద్రు. కానీ ఆయన 'ఈ ప్రాజెక్టు వల్ల నా ప్రాంతమే ముంపునకు గురవుతుంది. దీనికి వ్యతిరేకంగా పోరాడి నేను పైకి వచ్చిన.152 మీటర్లకు ఒప్పుకొనే ప్రసక్తే లేదు' అని తెగేసి చెప్పింద్రు. ఇదంతా రేవంత్‌రెడ్డికి తెలుసు. పక్క రాష్ట్ర సీఎం కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వట్లేదని ఉత్తరాలు రాస్తూ డ్రామాలు చేయడం కాదు. రేవంత్‌రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముంబై వెళ్లి, మహారాష్ట్ర సీఎం ఇంటి ముందు ధర్నా చేయాలి. నిరాహార దీక్ష చేయాలి. ఉత్తరాల పేరుతో భ్రమలు కల్పించొద్దు. ఆయన చేసే ప్రతి పనిలో డ్రామా, డైవర్షన్, డిస్ట్రక్షన్ (ధ్వంసం) తప్ప మరేమీ లేదు.

ఇప్పుడు ఎన్నికలు జరిగినా 90 సీట్లు గెలుస్తం

రేవంత్.. దమ్ముంటే అసెంబ్లీని రద్దుచెయ్

- ధైర్యముంటే మళ్లీ ఎన్నికలకు వెళ్దాం
- బీఆర్ఎస్‌కు 90 సీట్ల మెజారిటీ ఖాయం
- ఫ్రీకరెంట్‌పై కాంగ్రెస్‌కు మాట్లాడే హక్కే లేదు
- 72శాతం బడుగుల కాంట్రాక్టులపై చట్టం తెస్తే మొదటి మద్దతు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలదే
- స్థానికంలో బీఆర్ఎస్ పట్టు నిలుపుకొన్నది
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసే ఉన్నాయి
- కేసీఆర్ సర్కార్ చేసిన అప్పు 4.20 లక్షల కోట్లే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): 'ఇప్పటి కిప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ పార్టీ 90 సీట్లు కచ్చితంగా గెలుస్తుంది. దమ్ముంటే సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీని రద్దు చేయాలి. ధైర్యముంటే వెంటనే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్దాం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సవాల్ విసిరారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం 'మీట్ ది ప్రెస్'లో ఆయన మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్తు కొనసాగిస్తే బీఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉంటుందా? అని సీఎం రేవంత్‌రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరిస్తారా?

కేటీఆర్: ఉచిత విద్యుత్తు గురించి మాట్లాడే హక్కు ఈ రోజు రేవంత్‌రెడ్డికి అస్సలు లేదు. అమెరికా పర్యటనలో రేవంత్‌రెడ్డి తానే స్వయంగా 'రైతులకు 3 గంటల కరెంట్ ఇస్తే చాలు, 24 గంటలు దండుగ' అని మాట్లాడింద్రు. మొన్న పబ్లిక్ హియరింగ్‌లో వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కూడా అదే మాట చెప్పింద్రు. కేసీఆర్ ఎలాంటి నిబంధనలు లేకుండా 24 గంటల ఉచిత విద్యుత్తు ఇస్తే, ఈ ప్రభుత్వం కొత్త డ్రామాలు చేస్తున్నది. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ మోటర్లకు మీటర్లు పెట్టకపోతే రూ.30 వేల కోట్ల రుణం ఇవ్వబోమని స్పష్టంగా చెప్పారు. దాన్ని రేవంత్‌రెడ్డి విభేదిస్తారా? పైగా సోలార్ పవర్ ద్వారానే భవిష్యత్తులో ఉచిత కరెంట్ ఇస్తామంటున్నారు. మరి రాత్రిపూట సోలార్ పవర్ రాదు కదా? అప్పుడు కరెంట్ ఎలా ఇస్తారు?

అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు రావాలి

రేవంత్‌రెడ్డికి సవాళ్లు విసిరి పారిపోవడం కొత్తేమీ కాదు. 2018లో కొడంగల్‌లో ఓడిపోతే సన్యాసం తీసుకుంటా అని చెప్పి, మూడు నెలల్లోనే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిండు. ఆయనకు సిగ్గు లేదు. ఎన్నికల్లో ఇచ్చిన 420 అభయహస్తం హామీలను అమలు చేయకపోతే ఓట్లు అడుగను అనే దమ్ము రేవంత్‌రెడ్డికి ఉన్నదా? ఆయనకు 2034 దాకా నేనే సీఎంగా ఉంటా అనేంత ధైర్యం ఉంటే, ఇప్పుడే అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు రావాలి. ఈ రోజు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ 90కి పైగా సీట్లతో చరిత్రలో ఎన్నడూ లేనంత భారీ మెజారిటీతో గెలుస్తది. ఈ నిజం రేవంత్‌రెడ్డికీ తెలుసు.

ప్రశ్న: ఏపీ కాంట్రాక్టర్లకు పనులివ్వకుండా చట్టం చేస్తామన్న కోమటిరెడ్డి వ్యాఖ్యలపై అభిప్రాయం?

కేటీఆర్: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గారికి నేను ఒకటే గుర్తుచేస్తున్నా. మీ ఎన్నికల మ్యానిఫెస్టో (ఎస్సీ, ఎస్టీ, బీసీ డిక్లరేషన్) ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12 శాతం, బీసీలకు 42 శాతం.. అంటే మొత్తం 72 శాతం కాంట్రాక్టులు స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీలకే ఇవ్వాలి. మరి ఈ 72 శాతంలో కనీసం 72 పైసల పనులైనా ఇప్పటివరకు తెలంగాణలోని వీరికి ఇచ్చారా? ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాంట్రాక్టును, హైదరాబాద్ డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టును ఎవరికిచ్చింద్రు? గతంలో కాంగ్రెస్ నాయకులే ఈస్ట్ ఇండియా కంపెనీ అని విమర్శించిన మేఘా కృష్ణారెడ్డికి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కట్టబెట్టింద్రు. వెంకట్‌రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. వెంటనే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, 72 శాతం కాంట్రాక్టులు స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీలకే ఇచ్చేలా చట్టం తీసుకురావాలి. ఆ చట్టానికి అసెంబ్లీలో మొదటి ఓటు మా బీఆర్ఎస్సే వేస్తది.

ప్రశ్న: లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపై విశ్లేషణ ఏంటి?

కేటీఆర్: గత పార్లమెంట్ ఎన్నికలు దేశవ్యాప్తంగా ఒక తీవ్రమైన పోలరైజ్డ్ వాతావరణంలో జరిగినయ్. ప్రజలు 'మోదీ వైపా? లేక మోదీకి వ్యతిరేకమా?' అనే కోణంలోనే ఓట్లేసింద్రు. ఇందులో బీఆర్ఎస్ మాత్రమే కాదు.. ఒడిశాలో నవీన్ పట్నాయక్ (బీజేడీ) లాంటి పవర్ ఫుల్ పార్టీకి, మాయావతి బీఎస్పీకి, పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్‌కు, కశ్మీర్‌లో మెహబూబా ముఫ్తీ పార్టీ సహా దేశంలోని 13 బలమైన ప్రాంతీయ పార్టీలకు ఒక్క సీటు కూడా రాలేదు. ఓటమి, గెలుపులు రాజకీయాల్లో తాత్కాలికం.

కాంగ్రెస్ కూడా ఎన్నో ఓటములను చూసింది

గతంలో కాంగ్రెస్ కూడా ఎన్నో ఓటములు చూసింది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో, మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన పట్టు నిరూపించుకున్నది. మా కార్యకర్తలు, నాయకులు చాలా బలంగా, దృఢంగా ఉన్నారు. ఎన్నికలెప్పుడొచ్చినా, 2028లో వచ్చినా తెలంగాణలో మళ్లీ ఎగిరేది గులాబీ జెండానే.. తిరిగి సీఎం అయ్యేది కేసీఆరే.. 'ఫెయిల్యూర్ ఈజ్ ఆన్ ఆర్ఫన్.. బట్ సక్సెస్ హ్యాస్ మెనీ ఫాదర్స్' (గెలిస్తే నా వల్లే అంటారు.. ఓడిపోతే వంద కారణాలు వెతుకుతారు). మా ఓటమికి కూడా వంద కారణాలుండొచ్చు. అందులో మీరు చెప్పేది ఒకటి కావచ్చు. కానీ మేము మళ్లీ పుంజుకుంటం.

ప్రశ్న: మీ కుమారుడు హిమాన్షు సిరిసిల్ల పర్యటన.. ఆయన రాజకీయ అరంగేట్రానికి సంకేతమా?

కేటీఆర్: (నవ్వుతూ) ఎందుకన్నా.. పాపం ఆ పిల్లగాడిని ఎందుకు మధ్యలోకి లాగి చెడగొడుతరు? ఆయనో దేవుడి దర్శనానికి గుడికి పోయిండు. హిమాన్షుతోపాటు చదువుకునే కాలేజీ స్నేహితులు ఇద్దరు అమెరికా నుంచి ఎండకాలం సెలవులకు వచ్చింద్రు. వారిని గుడికి తీసుకెళ్లిండు. ఫొటోలు దిగి సోషల్ మీడియాలో పెట్టుకున్నరు. మీ పిల్లలైనా అంతే చేస్తరు కదా? దానికి పాపం ఆయనను ఎందుకు లాగుతున్నరు? మేమే బాధపడుతుంటే, ఆయనను మధ్యలోకి తీసుకురాకండి.

సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగించి గాంధీభవన్‌కు భద్రంగా పంపిస్తామని గతంలో మీరన్నారు. తాజాగా అమీర్‌పేట మైత్రీవనంలో పెట్టిన ఎన్టీఆర్ విగ్రహాన్ని కూడా ఆంధ్రాకు పార్సిల్ చేస్తామని కవిత అంటున్నారు. దీనిపై మీ పార్టీ వైఖరి ఏంటి?

రాష్ట్రంలో ఎన్నో ముఖ్యమైన సమస్యలు ఉంటే రేవంత్‌రెడ్డి ఆడుతున్న ఈ డైవర్షన్ గేమ్‌లో మీడియా కూడా పడినట్టున్నది. రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతగాక ఇలాంటి టైమ్‌పాస్ కార్యక్రమాలు పెడుతున్నడు. రాగానే తెలంగాణ తల్లి విగ్రహం రూపాన్ని మార్చిండు. ఆడపిల్ల పెండ్లికి తులం బంగారం ఇస్తానని చెప్పి, తెలంగాణ తల్లి నెత్తిన ఉన్న కిరీటాన్ని, వడ్డాణాన్ని మాయం చేసిండు. సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాల్సిన చోట రాహుల్‌గాంధీ తండ్రి (రాజీవ్‌గాంధీ) విగ్రహాన్ని పెట్టిండు. ఆయనకు తెలంగాణకు ఏం సంబంధమో రేవంత్‌రెడ్డికే తెలియాలి. ఇక ఎన్టీఆర్ విగ్రహం విషయానికి వస్తే.. మాకు ఆయనపై ఎలాంటి అగౌరవం లేదు. కానీ, కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని, రాహుల్‌గాంధీ తండ్రి విగ్రహాన్ని మాత్రం మా ప్రభుత్వం వచ్చిన మరుక్షణమే భద్రంగా గాంధీభవన్‌కు పార్సిల్ చేసే బాధ్యతను వ్యక్తిగతంగా నేనే తీసుకుంటా.

> అభయహస్తం మ్యానిఫెస్టో అమలు చేయకపోతే ఓటు అడుగను అనే దమ్ము రేవంత్ రెడ్డికి ఉన్నదా? 2034 దాకా ముఖ్యమంత్రిగా ఉంటానంటున్నవ్ కదా.. అంత ధైర్యం ఉంటే ఇప్పుడే అసెంబ్లీని రద్దు చేసి రా.. ఈ రోజు ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ చరిత్రలో ఎన్నడూ లేనంత పెద్ద మెజారిటీతో గెలుస్తది. 90 సీట్లకు పైగా గెలిచే అవకాశం ఈరోజు ఉన్నది. ఇవన్నీ ఆయనకు తెలిసే అటెన్షన్ డైవర్షన్ కోసం నాటకాలు ఆడుతున్నడు.
>
> -కేటీఆర్

ప్రశ్న: 2023లో జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్ బాగా పెర్ఫార్మ్ చేసింది. కానీ రూరల్‌లో ఆ స్థాయిలో ఎందుకు రాణించలేకపోయింది?

కేటీఆర్: దానికి కారణం కాంగ్రెస్ ఇచ్చిన అడ్డగోలు 420 హామీలు తప్ప మరేమీ లేదు. రైతులకు రూ.10,000 బదులు రూ.15,000 ఇస్తం, తులం బంగారం ఇస్తం అని నమ్మబలికింద్రు. రూరల్ తెలంగాణలో కొందరు ప్రజలు ఆ మాటలు నమ్మింద్రు. కానీ ఇవాళ నమ్మిన వాళ్లంతా తీవ్రంగా బాధపడుతున్నరు. చివరి గింజ దాకా ధాన్యం కొంటమన్న సీఎం, తొలి గింజ కూడా కొనట్లేదు. పంటలకు 500 బోనస్ ఎక్కడైనా ఇచ్చింద్రా? రైతు భరోసా రూ.15,000 ఒక్క రైతుకైనా అందిందా? కాంగ్రెస్‌కు, మాకు ఉన్న ఓట్ల తేడా కేవలం 1.8 శాతం మాత్రమే. అంటే రాష్ట్రవ్యాప్తంగా కేవలం 4 లక్షల ఓట్ల డిఫరెన్స్. 119 స్థానాల్లో మేము 39 సీట్లు గెలిచి 37 శాతం ఓట్ షేర్ సాధించినం. ఇది ఏదో భయంకరమైన ఓటమి కాదు. 2014, 2018, 2023లో మేము ఒంటరిగానే పోటీ చేసి గణనీయమైన ఓట్లు తెచ్చుకున్నం. రాబోయే రోజుల్లో కూడా ఒంటరిగానే పోటీ చేస్తం. తిరిగి అధికారంలోకి వస్తం. రేవంత్‌రెడ్డి పంటల మార్పిడి గురించి మాట్లాడటం విడ్డూరం. వ్యవసాయం తెలిసిన తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్తే రైతులు వింటరు.

ప్రశ్న: సుంకిశాల ప్రాజెక్టు వైఫల్యం, హైదరాబాద్‌లో తాగునీటి, కరెంట్ కొరతపై ఏమంటారు?

కేటీఆర్: సుంకిశాల ప్రాజెక్ట్‌ను 2024 నాటికే పూర్తి చేయాలని మేము ప్లాన్ చేసినం. కానీ దురదృష్టవశాత్తు ప్రస్తుత సీఎం (మున్సిపల్ మంత్రి కూడా ఆయనే) హయాంలో వందల కోట్ల ప్రజాధనం వృథా చేస్తూ నిర్మించిన రిటైనింగ్ వాల్ కూలిపోయింది. అంత పెద్ద ప్రమాదం జరిగినా, హెచ్ఎండబ్ల్యూఎస్‌బీ రికమండ్ చేసినా సరే.. ఆ కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టే దమ్మూధైర్యం ఈ ముఖ్యమంత్రికి లేదు. ఇదీ తెలంగాణ ప్రస్తుత పరిస్థితి. హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్‌కు సీట్లు ఇవ్వలేదనే కక్షతో, నారాజుతో ఈ నగర ప్రజలను సతాయిస్తున్నరు. గత పదేండ్లలో హైదరాబాద్‌లో నీటి ఇబ్బందే లేదు. మిషన్ భగీరథ ద్వారా జబర్దస్త్ పని చేసినం. కానీ, వీళ్లు మెయింటెనెన్స్ చేస్తలేరు. మేము పవర్ సప్లయ్‌ని 7,000 మెగావాట్ల నుంచి 17,000 మెగావాట్లకు తీసుకెళ్తే.. వీళ్లు మెయింటెనెన్స్ చేయక పవర్ కట్స్ పెడుతున్నరు. 2014కు ముందున్న ఖాళీ బిందెలు, ట్యాంకర్ల ముందట యుద్ధాలు, జనరేటర్ల గబ్బు, ఇన్వర్టర్ల గబ్బును రేవంత్‌రెడ్డి మళ్లీ తెచ్చిండు. కాంగ్రెస్ ఉంటే కరెంట్ ఉండదనేది మరోసారి నిజమైంది.

ప్రశ్న: బీజేపీ మీతో కలిసే చాన్స్ ఉన్నదా? రాష్ట్రంలో కాంగ్రెస్-బీజేపీ వ్యూహం ఏమిటి?

కేటీఆర్: బీజేపీ మాతో కలవడమేంటి? వాళ్లు ఆల్రెడీ ఇక్కడ కాంగ్రెస్‌తో కలిసే ఉన్నరు కదా! ఇక్కడ నడుస్తున్నది కాంగ్రెస్-బీజేపీ 'జోడీ ప్రభుత్వం'. నేను ఊరికే చెప్పట్లేదు. ఆధారాలతో చెప్తున్నా.. ఒక కేంద్ర మంత్రి కుమారుడు పోక్సో కేసులో నిందితుడిగా ఉంటే, తొమ్మిది రోజులపాటు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాపాడలేదా? ఒకరినొకరు బ్రహ్మాండంగా రక్షించుకుంటున్నరు. 2024 సెప్టెంబర్ 28 నాడు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంటిపై ఈడీ రైడ్స్ జరిగినయ్. ఇప్పుడు మనం 2026లో ఉన్నం.. రెండేండ్లు కావస్తున్నా ఈడీ కనీసం ప్రెస్‌నోట్ కూడా ఎందుకు వదల్లేదు? కేసు ఏమైంది? ఎవరు కాపాడుతున్నరు? రేవంత్‌రెడ్డి 'ఆర్ఆర్ టాక్స్' వసూలు చేస్తున్నారని స్వయంగా ప్రధానమంత్రే ఆరోపించింద్రు. మరి ఎందుకు చర్యల్లేవు?

ప్రశ్న: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై బీఆర్ఎస్ ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నది?

కేటీఆర్: రాష్ట్రంలో దాదాపు 71,000 మంది బూత్ లెవెల్ ఏజెంట్లను అపాయింట్ చేసుకున్నం. వారందరికీ ట్రైనింగ్ ఇచ్చి హ్యాండ్‌బుక్స్ అందిస్తున్నం. సస్పెక్టెడ్, డూప్లికేట్ ఓటర్ల లిస్టును వారికి ఇచ్చి వెరిఫై చేయిమంటున్నం. 'అర్హుడైన ఏ ఒక్కరి ఓటు పోకూడదు..అనర్హుడైన ఎవరికీ ఓటు రాకూడదు' అనే నినాదంతో ముందుకు పోతున్నం.

కాంగ్రెస్, బీజేపీది ఫెవికాల్ బంధం

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో 10,000 కోట్ల కుంభకోణం జరిగిందని సుప్రీంకోర్టు నియమించిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ చెప్పింది. సీబీఐ, ఈడీ లేదా ఐటీతో దర్యాప్తు చేయించాలని రికమండ్ చేస్తే ఆ రిపోర్ట్ ఎటుపోయింది? సింగరేణిలో సైట్ విజిటేషన్ సర్టిఫికెట్ పేరిట నిబంధనలు మార్చి రేవంత్‌రెడ్డి బావమరిది సృజన్‌రెడ్డి కాంట్రాక్టులను రింగ్ చేస్తున్నడని సాక్ష్యాలిస్తే కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోదు? కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకంలో రేవంత్‌రెడ్డి బావమరిదికి కాంట్రాక్టులు వస్తయి. ఇటు స్టేట్ గవర్నమెంట్ యంగ్ ఇండియా స్కూల్స్‌లో బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి కాంట్రాక్టులు వస్తయి. ఫ్యూచర్ సిటీలో బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు కాంట్రాక్టులు వస్తాయి. వీరిద్దరిది అంత గట్టి ఫెవికాల్ బంధం.

కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను రూ.6 లక్షల కోట్ల అప్పుల్లో ముంచేసిందని, ప్రస్తుతం రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నదన్న కాంగ్రెస్, కిషన్‌రెడ్డి ఆరోపణలపై మీరేమంటారు?

కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్నవన్నీ పచ్చి అబద్ధాలు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై నేను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక ఆధారంగానే మాట్లాడుతున్నా. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ప్రతి నెలా ఎంత వడ్డీ (మిత్తి) కడుతున్నదో అధికారిక లెక్కలు నా దగ్గర ఉన్నయి.

- ఏప్రిల్ : రూ.2,260 కోట్లు
- మే: రూ.1,905.60 కోట్లు
- జూన్ : రూ.2,600 కోట్లు
- జూలై: రూ.2,582 కోట్లు
- ఆగస్టు: రూ.2,091 కోట్లు
- సెప్టెంబర్: రూ.2,923 కోట్లు
- అక్టోబర్: రూ.2,159 కోట్లు
- నిరుడు చెల్లించిన వడ్డీ: రూ.29,679 కోట్లు

ఈ రకంగా గత ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి (2026) వరకు మొత్తం రూ.29,679 కోట్ల వడ్డీ చెల్లించింద్రు. సగటున నెలకు రూ.2,500 కోట్లు అవుతుంది. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాము నెలకు రూ.6,500 కోట్లు అప్పులకే కడుతున్నామని చెప్తున్నరు. ప్రభుత్వం తన కాకి లెక్కలు పక్కన పెట్టి, వాస్తవాలు మాట్లాడాలి. వీరు ఒకసారి రూ.6 లక్షల కోట్ల అప్పు అంటరు. మరోసారి రూ.10 లక్షల కోట్ల అప్పు అంటరు. కానీ పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వమే స్వయంగా కేసీఆర్ ప్రభుత్వం చేసింది రూ.4.20 లక్షల కోట్ల అప్పేనని స్పష్టం చేసింది. మరి మనం ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వ లెక్కలను నమ్మాల్నా? లేక రేవంత్‌రెడ్డి కాకి లెక్కలను నమ్మాల్నా? కిషన్‌రెడ్డి ఆరోపణల విషయానికి వస్తే.. బీజేపీతో పొత్తులు ఉన్నప్పుడు నితీశ్‌కుమార్, ఉద్ధవ్‌ఠాక్రే, ఆదిత్య ఠాక్రే వంటి వారి కుటుంబ రాజకీయాలతో ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ సిద్ధాంతపరంగా తమను వ్యతిరేకించే వారిపై మాత్రం కుటుంబ రాజకీయం అంటూ విమర్శలు గుప్పిస్తరు.

తెలంగాణకు మెయిన్ విలన్ కాంగ్రెస్సే

కాంగ్రెస్ ఫస్ట్ హాఫ్ డిజాస్టర్.. సెకండ్ హాఫ్ కూడా.. కేసీఆర్‌లాంటి నాయకుడు దేశంలో ఎక్కడాలేడు: కేటీఆర్

- ఏ పని చేసినా పాషన్‌తో, టాస్క్‌గా చేసినం
- కేసీఆర్ కంటే కాంగ్రెస్ ఎక్కువ చేసినట్టు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా
- మన జాతి కథను యువతరం తెలుసుకోవాలి.. పుట్టిన గడ్డ.. జన్మనిచ్చిన మట్టి కథను చదవాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు



దేశానికి స్వాతంత్య్రం వచ్చి 79 ఏండ్లు పూర్తయినయ్. స్వాతంత్య్ర పోరాటాలు.. త్యాగాలను మనం ఇప్పటికీ మననం చేసుకుంటున్నం. ఇదే తరహాలో మన తాతల కథ.. తండ్రుల కథ.. మన జాతి కథను ఉడుకునెత్తురుతో ఉరకలెత్తే యువతరం తెలుసుకోవాలి. పుట్టిన గడ్డ.. జన్మనిచ్చిన మట్టి కథను యువత చదువుకోకపోతే.. తెలుసుకోకపోతే తీవ్ర నష్టం జరుగుతుంది. -కేటీఆర్

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు మెయిన్ విలన్ కాంగ్రెస్సేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. 'ఉన్న తెలంగాణను ఊడగొట్టింది.. వందలాది మందిని బలితీసుకున్నది ఈ కాంగ్రెస్ విలనే'నని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పుష్కర కాలం పూర్తయిన సందర్భంగా బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. 'తుపాకీ మోతలతో ముల్కీ ఉద్యమంలో ఏడుగురిని బలికొన్న విలన్ కాంగ్రెస్ పార్టీయే..1956లో ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా బలవంతపు పెండ్లి చేసింది కూడా కాంగ్రెస్ విలనే. 1968 నుంచి 1971 వరకు జరిగిన తెలంగాణ ఉద్యమంలోనూ 370 మంది విద్యార్థులను తుపాకీ తూటాలకు బలిగొన్నది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వమే. మా తెలంగాణ మాకు ఇవ్వండని అడిగిన ప్రతిసారీ ఉద్యమాన్ని అణచివేసింది కాంగ్రెస్ పార్టీయే. 2001లో కేసీఆర్ నేతృత్వంలో గులాబీ జెండా ఎగిరిన తర్వాత రాష్ట్రం ఇస్తామని, ఎన్నికల ఎజెండాలో పెట్టి, కామన్ మినిమం ప్రోగ్రాంలో పెట్టి, రాష్ట్రపతి చేత చెప్పించి పదేండ్లు పాటు కాలయాపన చేసి.. వందలు, వేల మంది విద్యార్థులను బలిగొన్నది కాంగ్రెస్సే.. అని ధ్వజమెత్తారు.

హీరోలు, విలన్లు ఎవరో తెలుసుకోవాలి

తెలంగాణలో హీరోలు ఎవరో.. విలన్లు ఎవరో యువత తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ కథలో మహోన్నతమైన గతం.. మహోజ్వల చరిత్ర ఉన్నది. బానిస సంకెళ్లు తెంచిన పోరాట కథ.. వీరుడు.. కథనాయకుడు.. వీరోచిత గాథలు.. పోరాటాలు, అమరులు ఒక వైపు ఉంటే.. మరో వైపు ద్రోహులు.. ధోకాలు కూడా ఉన్నయి. తెలంగాణ కథలోనూ శకుని, శిఖండి.. మారీచుడు, దుశ్శాసనుడు ఎవరో.. హీరోలెవరో, విలన్లు ఎవరో యువతరం తెలుసుకోవాలి' అని పిలుపునిచ్చారు.

మొండిగా కూర్చోకపోతే..

'తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో' .. 'కేసీఆర్ శవయాత్రనో.. తెలంగాణ జైత్రయాత్రనో' అని కేసీఆర్ మొండిగా కూర్చోకపోతే తెలంగాణ రాష్ట్రమనేదే ఉండేది కాదు' అని కేటీఆర్ స్పష్టంచేశారు. ఎత్తిన జెండా దించనని.. దించితే రాళ్లతో కొట్టండని ప్రతినబూనిన ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్ మాత్రమేనని గుర్తుచేశారు.

స్వరాలు మారినా.. వాస్తవాలు మారవు..

తెలంగాణ ఏర్పాటుకు ప్రత్యేకత ఉన్నదని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణకు పెద్ద చరిత్ర ఉన్నదని.. తరాలు మారినా, స్వరాలు మారినా వాస్తవాలు మారవని స్పష్టంచేశారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చి 12 ఏండ్లు గడిచిపోయిందని తెలిపారు. 'ఎన్నో త్యాగాలు, పోరాటాలతో తెలంగాణను సాధించుకున్నాం. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 79 ఏండ్లు పూర్తయినయ్. స్వాతంత్య్ర పోరాటాలు.. త్యాగాలను మనం ఇప్పటికీ మననం చేసుకుంటున్నం. ఇదే తరహాలో మన తాతల కథ.. తండ్రుల కథ.. మన జాతి కథను ఉడుకునెత్తురుతో ఉరకలెత్తే యువతరం తెలుసుకోవాలి' అని సూచించారు. 'పుట్టిన గడ్డ.. జన్మనిచ్చిన మట్టి కథను యువత చదువుకోవాలి. తెలుసుకోకపోతే తీవ్ర నష్టం జరుగుతుంది' అని చెప్పారు.

ఇలాంటి నాయకుడు దేశంలో ఎక్కడాలేరని తేల్చిచెప్పారు. 'ఏపీ నుంచి విడిపోయినా.. మళ్లీ తిరిగి తెలంగాణలోనే కలుపుకుంటా' అని చెప్పిన ఖలేజా.. గుండె ధైర్యం గల శక్తి.. తెలంగాణ కోసం ప్రాణత్యాగానికి కూడా వెనుకాడని మహనీయుడు కేసీఆర్ అని కొనియాడారు. కేసీఆర్‌కు తెలంగాణ సమాజం మొత్తం అండగా నిలబడిందని, తెలంగాణ ఆషామాషీగా ఏర్పడలేదని చెప్పారు. కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వక తప్పని పరిస్థితిని ప్రజానీకం కల్పించిందని, 'ఇస్తవా.. సస్తవా' అని తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్ మెడమీద కత్తిపెట్టకపోతే తెలంగాణ సాకారమయ్యేదే కాదని తేల్చిచెప్పారు.

ఉత్త కరెంట్ నుంచి

సమైక్యరాష్ట్రంలో కాంగ్రెస్ ఉచిత కరెంట్ అని చెప్పినా అది ఉత్త కరెంట్ అయ్యిందని కేటీఆర్ విమర్శించారు. ఏనాడూ నాణ్యమైన ఉచిత విద్యుత్తునివ్వలేదని తెలిపారు. సాగుకు 24 గంటల కరెంట్ ఇచ్చిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణను మలిచామని గుర్తుచేశారు. 'నల్లగొండ జిల్లాకు ఫ్లోరోసిస్ దరిద్రం నుంచి విముక్తి కల్పించినం. మర మగ్గాల మీద మరణ మృదంగాన్ని ఆపినం. రైతుల ఆత్మహత్యలు

అమోఘమైన ఆర్థిక విప్లవాన్ని సృష్టించినం

కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ సర్కార్ అమోఘమైన ఆర్థిక విప్లవాన్ని సృష్టించిందని కేటీఆర్ గుర్తుచేశారు. 'మేం ప్రభుత్వంలోకి వచ్చిన నాడు తలసరి ఆదాయంలో 12వ ర్యాంకులో ఉండే.. మేం వైదొలగేనాడు రూ.3.47 లక్షల తలసరి ఆదాయంతో నంబన్ వన్‌కు చేర్చినం' అని కేటీఆర్ గుర్తుచేశారు. జీఎస్‌డీపీ నాలుగున్నర లక్షల కోట్లు ఉంటే.. ప్రభుత్వం నుంచి దిగిపోయే నాటికి 15 లక్షల కోట్లకు చేర్చామన్నారు. మధ్యలో కరోనా అడ్డు వచ్చినా ఎక్కడా ఆగలేదని చెప్పారు. 200 గురుకులాలను వెయ్యి గురుకులాలకు తీసుకెళ్లామని వివరించారు. 'ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసి తెల్లకోటు విప్లవాన్ని సృష్టించినం. ఇన్‌ల్యాండ్ ఫిషరీస్‌లో తెలంగాణను అగ్రభాగాన నిలబెట్టినం. కొత్త పరిశ్రమలొస్తాయా? ఉన్న పరిశ్రమలు ఉంటాయా? తరలిపోతాయా? అనే అనుమానపు నీడలను పటాపంచలు చేసినం. విశ్వవిఖ్యాత కంపెనీలకు తెలంగాణను చిరునామాగా మార్చినం. ఐటీ కొలువులను 10 లక్షలకు తీసుకుపోయినం. బెంగళూరును వెనక్కి నెట్టినం. ఇది మన దేశంలోనే ఎవరూ చేయని ఫీట్ అంటూ గుర్తుచేశారు.

తెలంగాణలోనే తక్కువని టైమ్స్ ఆఫ్ ఇండియా అనే పత్రిక రాసే పరిస్థితి కల్పించినం. ఇలాంటి ఎన్నో విప్లవాలను తెచ్చినం' అని గుర్తుచేశారు. 'రైతు దగ్గర డబ్బుల వసూలు చేసిన ప్రభుత్వాలున్నయి. కానీ మేం హామీ ఇవ్వకపోయినా రైతుబంధు పథకాన్ని తెచ్చినం. 72 లక్షల రైతుల ఖాతాల్లో 73 వేల కోట్లు జమచేసినం. ఏదీ చేసినా పాషన్‌తో, ఒక టాస్క్‌గా తీసుకొని ప్రయత్నించినం' అని గుర్తుచేశారు.

పెండింగ్ ప్రాజెక్టుల రన్నింగ్

రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మలిచామని కేటీఆర్ వివరించారు. కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను పూర్తిచేయగలిగామని చెప్పారు. 'ఒకప్పుడు సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలుంటే.. మేం దిగిపోయే నాటికి 2.29 కోట్ల ఎకరాలకు చేర్చినం. మిషన్ కాకతీయ, కాళేశ్వరం సహా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసినం. ఒకప్పుడు ఆదర్శ గ్రామమంటే గంగదేవిపల్లి మాత్రమే. కానీ దేశంలో టాప్ 20 బెస్ట్ విలేజ్‌లలో 19 మన రాష్ట్రం నుంచే ఉండే స్థాయికి చేర్చినం.

కేసీఆర్ కంటే ఎక్కువ చేస్తే తప్పుకొంటా

జాతి నిర్మాణంలో తెలంగాణ కీలక పాత్ర పోషించిందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. తాను చెప్పిన విషయాలు తప్పని ఎవరైనా రుజువు చేయగలరా? అని సవాల్ విసిరారు. 'కాంగ్రెస్, బీజేపీ నేతలెవరైనా తాము పాలిస్తున్న రాష్ట్రాలు కేసీఆర్ కంటే ఎక్కువ సాధించినట్టు రుజువు చేస్తే నేను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటా.. బీజేపీ పాలిస్తున్న 25 -26 రాష్ట్రాల్లో ఎక్కడైనా మా కంటే ఎక్కువ చేశామని చూపిస్తే.. రాజకీయాలకు గుడ్‌బై చెబుతా' అని సవాల్ విసిరారు. తాను చెప్పిన పథకాలను రుజువు చేసినా తాను రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పారు. కేసీఆర్ పథకాలను మోదీ ప్రభుత్వం, పలు రాష్ట్రాలు కాపీ కొట్టాయని గుర్తుచేశారు. రైతుబంధును పీఎం కిసాన్ సమ్మాన్.. కాలియా.. కృషిబంధు పేరిట.. మిషన్ భగీరథను హర్ ఘర్ జల్.. మిషన్ కాకతీయ పథకాన్ని అమృత్ సరోవర్ పేరిట కాపీ కొట్టాయని సోదాహరణంగా వివరించారు.

మమకారంతో పనిచేస్తే అహంకార ముద్ర..

మేము మమకారంతో పనిచేస్తే కొందరు అహంకారమని ముద్ర వేశారని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడ్డదని.. నలుగురి కోసమే తెలంగాణ అని విష ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ మొత్తం నాలుగు కోట్ల ప్రజలు తమ కుటుంబంగా భావిస్తే.. నలుగురి కోసమేనా అంటూ దుష్ప్రచారం చేశారని వాపోయారు. 'అధికారం శాశ్వతం కాదు. అలా అనుకుంటే మూర్ఖత్వం అవుతుంది. ఎవరెన్ని ప్రచారాలు చేసినా దుర్మార్గమైన ఆరోపణలు చేసినా పట్టించుకోకుండా తదేక దీక్షతో ముందుకెళ్లాం. అధికారం పోయిందన్న బాధ ఏమాత్రం మాకు లేదు' అని స్పష్టంచేశారు. కానీ కష్టపడి త్యాగాలతో ఏర్పడ్డ రాష్ట్రానికి ఒక ద్రోహి ముఖ్యమంత్రిగా ఉండటం అత్యంత బాధాకరమని వాపోయారు. తెలంగాణ వాదుల మీదికి తుపాకీ ఎత్తిన వ్యక్తిని కాంగ్రెస్ మన నెత్తిన రుద్దిందని చెప్పారు. 'కాంగ్రెస్ కల్చరే సీల్డ్ కవర్ సీఎం. డబ్బులెక్కువెవరిస్తే.. వాళ్లకే సీఎం పదవి వస్తదని అందరికీ తెలిసిందే'నని దుయ్యబట్టారు.

ఫస్ట్ హాఫ్ డిజాస్టర్.. సెకండాఫ్ కూడా

కాంగ్రెస్ ఫస్ట్ ఆఫ్ డిజాస్టర్ అని కేటీఆర్ అభివర్ణించారు. 'సెకండాఫ్ కూడా డిజాస్టర్ కావడం ఖాయమని చెప్పారు. సినిమా భాషలో చెప్పాలంటే ఒక సినిమా హిట్టా.. ఫట్టా అనేది ట్రైలర్ చూస్తే తెలిసిపోతుంది. మన దగ్గర ఇంటర్వెల్ కూడా అయిపోయింది. ఫస్ట్ హాఫ్ డిజాస్టర్. సెకండ్ హాఫ్ కూడా పక్కా డిజాస్టర్' అని జోస్యం చెప్పారు. నూరు రోజులు ఆరు గ్యారెంటీలని పనికిమాలిన ప్రచారాలు చేసింద్రు. ఆర్థిక పరిస్థితి ఏమిటంటే మాకు అపారమైన అనుభవమున్నది.. చేసి చూపిస్తామన్నారు. ఇప్పుడు ఎంత కండలు తిరిగిన పహిల్వాన్ అయినా మూడు నెలల్లో పిల్లలు పుట్టిస్తడా? అంటున్నరు. మూడు నెలల్లో పుట్టరని మాకు తెలుసు. కానీ 30 నెలల్లో కూడా పుట్టకపోతే ఏమని పిలువాలి?' అంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు రవికాంత్‌రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కా ర్యదర్శి వరికుప్పల రమేశ్, ఉపాధ్యక్షులు రా జేశ్, అరుణ, కోశాధికారి రమేశ్ వైట్ల, సంయుక్త కార్యదర్శులు హరిప్రసాద్, వర్దెల్లి బాపురావు తదితరులు పాల్గొన్నారు.

నెత్తురు తడిసిన నేలల్లో నీళ్లు పారించినం

వలసలు, కరువులతో నెర్రెలుబారిన నేలల్లో.. నెత్తురుతో తడిసిన నేలల్లో సాగు నీరు పారించామని కేటీఆర్ వివరించారు. 'అన్నమో రామచంద్రా' అనే రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే స్థాయికి కేసీఆర్ నాయకత్వంలో చేర్చామని గుర్తుచేశారు. ఉద్యమ తెలంగాణను.. ఉజ్వల తెలంగాణగా నిలబెట్టాలనే బృహత్తర యజ్ఞం చేశామని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్థిక విప్లవాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. దశాబ్దంలో సుసంపన్నమైన.. సస్యశ్యామల.. సిరిసంపదల తెలంగాణను ఆవిష్కరింపజేసి దేశం ముందుపెట్టామని వివరించారు. 'అసలు తెలంగాణకు నాయకత్వ పటిమ.. సామర్థ్యమున్నదా?' అన్న ప్రశ్నల నుంచి 'మాకు కూడా కేసీఆర్ లాంటి ముఖ్యమంత్రి ఉంటే బాగుండు' అనే మాటను దేశం చేత అనిపించగలిగామని చెప్పారు. 'దట్ ఈజ్ తెలంగాణ. దట్ ఈజ్ కేసీఆర్.. దట్ ఈజ్ బీఆర్‌ఎస్' అని పేర్కొన్నారు.

- హరీశ్‌కు కేటీఆర్ బర్త్‌డే విషెస్..



మాజీ మంత్రి హరీశ్‌రావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మండలి విప్ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఘనంగా హరీశ్ జన్మదిన వేడుకలు

- యూకేలోని ప్రెస్టన్‌లో సెలబ్రేషన్స్

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి, బీఆర్‌ఎస్‌ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్‌రావు జన్మదిన వేడుకలను బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. సిద్దిపేటలోని ఆయన నియోజకవర్గం, హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో కేకులు కట్ చేసి, స్వీట్లు పంచారు. నిండునూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. యూకేలోని ప్రెస్టన్‌లో బీఆర్‌ఎస్ నేత బాణాల పవన్‌రావు ఆధ్వర్యంలో బర్త్‌డే సెలబ్రేషన్స్ జరిగాయి. బీఆర్‌ఎస్వీ(నాగార్జునసాగర్), బీఆర్‌ఎస్ యూకే నేతలు పెద్దసంఖ్యలో హాజరై భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ, బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ యూకే నాయకులు మాట్లాడారు. శివసాయి, మహేందర్, వరుణ్, హరికృష్ణ, పవన్, అక్షయ్, రవి, ఉమాకాంత్, సమరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూరీ బీచ్‌లో సైకత శిల్పం

పూరీ బీచ్‌లో లలితాసోమిరెడ్డి ఆధ్వర్యంలో గులాబీ జెండాల నడుమ హరీశ్‌రావు సైకత శిల్పాన్ని ఏర్పాటుచేసి అభిమానం చాటుకున్నారు. 'వర్ధిల్లు.. వందేండ్లు'అంటూ శుభాకాంక్షలు తెలిపారు.

హరీశ్‌కు కేటీఆర్ గ్రీటింగ్స్

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. హరీశ్‌రావుకు బర్త్‌డే గ్రీటింగ్స్ చెప్పారు. బుధవారం సాయంత్రం మండలి విప్ దేశపతి శ్రీనివాస్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి కోకాపేటలోని ఆయన నివాసానికి వెళ్లగా పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో సుదీర్ఘకాలం ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

అభిమానుల సమక్షంలో..

అభిమానులు, శ్రేయోభిలాషులు, పార్టీ కార్యకర్తల సమక్షంలో హరీశ్‌రావు తన జన్మదిన వేడుకలను హైదరాబాద్ కోకాపేటలోని తన నివాసంలో ఘనంగా జరుపుకొన్నారు. ఆయన గ్రీటింగ్స్ చెప్పిన వారిలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, రాష్ట్ర నేతలు చిరుమర్తి లింగయ్య, కూచుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కర్నాటి విద్యాసాగర్, గోసుల శ్రీనివాస్ యాదవ్, అభిలాష్ రంగినేని, కిశోర్‌గౌడ్, నరోత్తమ్, ఆదర్శ్‌రెడ్డి, బండా నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



గజ్వేల్‌లో కార్యకర్తల కుటుంబాలకు రూ.4లక్షల ఎఫ్‌డీబాండ్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, .రాధాకృష్ణశర్మ

కార్యకర్తల కుటుంబాలకు 4లక్షల ఎఫ్‌డీ బాండ్లు

హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా అండగా నిలిచిన నాయకులు

గజ్వేల్, జూన్ 3: ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పుట్టినరోజు సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. ఈ మేరకు బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గజ్వేల్ మండలం కోమటిబండకు చెందిన షేక్ భాస్కర్, జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ ఎం సుమన్‌గౌడ్, ములుగు మాజీ ఎంపీటీసీ బొడ్డు ప్రవీణ్, మర్కూక్ మండలం కాశిరెడ్డిపల్లి సీనియర్ నాయకుడు బండారి ఎల్లయ్య కుటుంబ సభ్యుల ఒక్కొక్కరికి లక్ష చొప్పున మొత్తం నాలుగు లక్షల ఎఫ్‌డీ బాండ్లను అందజేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, తదితరులు పాల్గొన్నారు.

20 లక్షల ఇండ్లు కట్టే ఓట్లడగాలి

- లేదంటే పొంగులేటీ ఇంట్లో కూర్చో
- 'పాలమూరు'ను 90% పూర్తిచేశాం
- నార్లాపూర్ మోటర్‌తో నీళ్లిచ్చినం
- వచ్చే ఏడాది పాదయాత్ర చేస్త
- బీజేపీతో పొత్తు ప్రశ్నేలేదు..
- మీట్ ది ప్రెస్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



జెన్-జీ గురించి 6 నెలల క్రితమే చెప్పా

కేటీఆర్: నేపాల్ తరహాలో ఇక్కడ కూడా జెన్-జీ ఉద్యమం రావచ్చు అని నేను ఆరు నెలల క్రితమే ఎన్డీటీవీ ఇంటర్వ్యూలో చెప్పిన. కానీ అప్పుడక్కడా ఉన్నవాళ్లు కొందరు వెకిలిగా నవ్వారు. ఇప్పుడు ఏమైంది? సీజేఐ అన్న ఒక్క మాటమీదికెళ్లి కాక్రోచ్ జనతా పార్టీ పెడితే సోషల్ మీడియాలో బీజేపీ కంటే ఎక్కువగా 14 మిలియన్లు ఫాలోవర్లు చేరారు. దీనర్థం యువత తీవ్ర నిరాశలో ఉన్నది. ప్రభుత్వాలపై వారికి కోపం కనిపిస్తున్నది. దానిని ఎవరూ చానలైజ్ చేసుకొంటే వారే నెగ్గుతారు.

హైదరాబాద్, జూన్3 (నమస్తేతెలంగాణ): 'రాష్ట్రంలో 20 లక్షల ఇండ్లు కట్టిన తర్వాతే ఓట్లడుగుతాం.. అని గతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరిన్రు. ఆయనకు దమ్ముంటే, తన మాటపై నిలబడే ధైర్యముంటే 20 లక్షల ఇండ్లు కట్టించిన తర్వాతే కాంగ్రెస్ పార్టీ ఓట్లడుగాలి. లేదంటే పొంగులేటి ఇంట్లో కూర్చోవాలి' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు స్పష్టంచేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు అడిగిన పలు అంశాలపై సమాధానాలు ఇచ్చారు. వచ్చే ఏడాది కచ్చితంగా తాను పాదయాత్ర చేస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టంచేశారు. బీజేపీతో పొత్తు పెట్టుకొనే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టుల అంశాలపై కూలంకషంగా వివరించారు.

ప్రశ్న: కాంగ్రెస్ దుష్ప్రచారం వల్లే ఓడిపోయామని మీరంటున్నరు.. మీ పదేండ్ల పాలన అంత మంచిగా ఉంటే ప్రజలు ఎందుకలా తీర్పునిస్తరు? మీరు వారి విచక్షణను అవమానిస్తున్నారా? పదేండ్లలో వచ్చిన వ్యతిరేకతను ఒప్పుకోవడం లేదనే చర్చ నడుస్తుంది.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు 2013-14లోనే షురూ అయింది. పదేండ్లయినా పూర్తి చేయలేదు. కానీ 2016లో మొదలు పెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు టైమ్‌లో పూర్తిచేశారు. మరి 'పాలమూరు'ను పూర్తిచేయలేదెందుకు?

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో 32 పంపులు ఉన్నాయి. నార్లాపూర్ వద్ద మొదటి పంప్‌ను ఆన్ చేసి నీరందించింది కేసీఆర్ కాదా? పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్ సర్కార్‌దే. పాలమూరు జిల్లాలో 8 లక్షల ఎకరాలను సాగులోకి తీసుకొచ్చింది కేసీఆరే. ఎవరైనా కాదనగలరా? ఈ రోజు ధాన్యం ఉత్పత్తిలో నల్లగొండ జిల్లా కరీంనగర్‌ను మించిపోయి నంబర్‌వన్‌గా నిలిచింది. ఇందుకు కారణం కాళేశ్వరం నీళ్లు కాదా? కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని టెయిల్ ల్యాండ్ ప్రాంతాలకు కాళేశ్వరం నీరందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే. నల్లగొండ అయినా, ఖమ్మం అయినా ప్రతి జిల్లా ప్రజల కోసం ప్రేమతోనే పనిచేశాం. కానీ కొన్నిచోట్ల సాంకేతిక, న్యాయపరమైన చిక్కులు, భూసేకరణలో సమస్యలు ఉండవచ్చు. మూడు, నాలుగు పెద్ద ప్రాజెక్టులు ఒకేసారి నిర్మించేటప్పుడు ఒకటి కొద్దిగా ముందు అవుతుండవచ్చు. మరొకటి వెనుక అవుతుండవచ్చు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 90 శాతం పూర్తిచేసి మోటర్ ఆన్‌చేసి నీళ్లు చూపెట్టినం కదా! మరి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 30 నెలలు అవుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు ప్రాజెక్టుకు ఆయన మామ జైపాల్‌రెడ్డి పేరు పెట్టుకున్నడు. కానీ పనులు మాత్రం చేస్తలేడు. వేగంగా పూర్తిచేసి నీళ్లు ఇవ్వమనండి. మేం వద్దంటున్నమా?

ఇక ప్రజల విచక్షణను మేము ఎప్పుడు? ఎక్కడ? అవమానించినం. కాంగ్రెసోళ్లు చెప్పిన దొంగమాటలు కొందరు నమ్మారని అన్నం. నేనే కాదు.. ప్రజలు కూడా కాంగ్రెస్‌కు ఓటేసి తప్పుచేశామంటున్నరు. సోషల్ మీడియాలో చూడండి. వాళ్ల ఆర్తనాదాలు వినబడటం లేదా? బాధలు కనిపించడంలేదా? ఇక వ్యతిరేకత అంటరా. అందరి మీద వస్తది. ఎవరూ దేవుడు కాదు. ఎవరి ప్రయత్నం వారు చేస్తరు. కొన్నిసార్లు ఫలితాలు వస్తయి, రావు. 2014, 2018లో గెలిచినం. 2023లో వెంట్రుకవాసి తేడాతో ఓడిపోయినం. దానికేం బాధలేదు. కానీ ఈ కాంగ్రెస్ దుర్మార్గులు తెలంగాణను భ్రష్టు పట్టిస్తుంటే చాలా బాధనిపిస్తున్నది.

రాష్ట్రంలో మీ హయాంలో నిర్మించిన ఇండ్ల కంటే ఎక్కువ కట్టిన తర్వాతే ఓట్లడుగుతామని మంత్రి పొంగులేటి విసిరిన సవాల్‌కు మీ సమాధానమేమిటి?

20 లక్షల ఇండ్లు కట్టిన తర్వాతే ఓట్లడుగుతానని గతంలో మంత్రి పొంగులేటి సవాల్ విసిరిన్రు. ప్రభుత్వ అనుకూల పత్రికల్లోనే వచ్చింది. నిజంగా ఆయనకు దమ్ముంటే, మాటమీద నిలబడే నాయకుడైతే 20 లక్షల ఇండ్లు కట్టిన తర్వాతే ఓట్లడుగాలి. లేదంటే మూసుకొని ఇంట్లో కూర్చోవాలి. ఇక ఇంత కన్నా చెప్పేదేం ఉండదు.

ఉత్తర భారతదేశంలో బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి పోటీ చేసేందుకు ఒప్పందం కుదిరిందని, మీరు కేంద్ర మంత్రి కాబోతున్నారని జరుగుతున్న ప్రచారం నిజమేనా?

కేటీఆర్: మీకు ఈ సోర్స్ ఎవరిచ్చారో తెలియదు. కానీ ఇదంతా అబద్ధం. బీజేపీతో పొత్తు ఆలోచన అసలే లేదు. మీరు భగవద్గీతను తెచ్చిపెట్టండి. నిజం తప్ప అబద్ధం చెప్పను. 'బీజేపీ, బీఆర్‌ఎస్ పొత్తు పెట్టుకుంటయి.. నేను గెలిచిన తర్వాత కేంద్ర మంత్రిని అవుతాను..' అన్నదానిపై ఇంతకంటే ఇమాజినేషన్ స్క్రిప్ట్ ఎవరూ రాయలేదు. కానీ ఈ సోర్స్ ఆధారంగా స్క్రిప్ట్ రాసి సినిమా తీస్తే బాహుబలి కంటే పెద్ద హిట్ అవుతుంది. సినిమా స్క్రిప్ట్ రాసి మీరే ప్రొడ్యూస్ చేయండి. ఎవరైనా హీరోను మీ జర్నలిస్టుల నుంచి మంచి వాళ్లను చూసి పెడుదాం. మా పరిధి చాలా చిన్నది. నేను చాల చిన్న మనిషిని. చిన్న రాష్ట్రమైన తెలంగాణలోనే ఉంట. మీతోనే ఉంట. ప్రెస్‌క్లబ్‌కు రావద్దంటే నాకేం అభ్యంతరంలేదు. బయటే ఉండి నా పని నేను చేసుకుంట.

> **వచ్చే ఏడాదిలో నా పాదయాత్ర**
>
> *కచ్చితంగా పాదయాత్ర చేస్తా. వచ్చే ఏడాది మొదలు పెడుతా. ఎక్కడి నుంచి ఎక్కడికి? ఏ టైమ్‌లో చేయాలనేది పార్టీలో చర్చించి, పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకొంటం.*

లేని నవ్వును తెచ్చుకొని మాట్లాడటం రాదు

నవ్వుతూ మాట్లాడుమని కొందరు మిత్రులు నాతో చెప్తుంటారు. కానీ లేని నవ్వును తెచ్చుకొని మాట్లాడటం కష్టం. నాది తెలంగాణ కదా! ఉన్నది ఉన్నట్టు మాట్లాడుతా. నేను అహంకారంగా ఎప్పుడు మాట్లాడిన. ఒక ఉదంతం చూపెట్టుమని అంటే ఎవరూ చెప్పరు. కడుపులో కత్తులు పెట్టుకొని పెదవులపై చిరునవ్వులు చిందించే తెలివితేటలు నాకులేవు. కొంతమందికి నిజం నిక్కచ్చిగా చెబితే నచ్చదు. పర్లేదు అట్ల అలవాటైంది.



నినాదమే రైజింగ్.. విధానం ఫాలింగ్

సొంత పన్నులు, రిజిస్ట్రేషన్, వెహికల్ సేల్స్ రెవెన్యూ డౌన్

- ఒక్క ఎక్సైజ్ శాఖ మాత్రమే అద్భుతంగా పనిచేస్తున్నది
- రాష్ట్రంలో మందు గమనమే తప్ప అంతా మందగమనమే
- 'మీట్‌ది ప్రెస్'లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో స్టేట్ ఓన్ ట్యాక్స్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రెవెన్యూ, జీఎస్టీ గ్రోత్ రేటు, వెహికల్ సేల్స్ రెవెన్యూ డౌన్ అయిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఒకటే డిపార్ట్‌మెంట్ అద్భుతంగా పనిచేస్తున్నదని, అది కూడా ఎక్సైజ్ శాఖ మాత్రమేనని తేల్చి చెప్పారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో ఆయన మాట్లాడుతూ రా ష్ట్రంలో మందు గమనం ఒక్కటే జోరు మీద ఉన్నదని, మిగతా అన్ని రంగాల్లో మందగమ నం నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నినాదం రైజింగ్ అని, విధానం మా త్రం ఫాలింగ్ అని విమర్శించారు. రాష్ట్రంలో 2024-25లో రూ.9,420 కోట్లు, 2025-26లో రూ.9,235కోట్ల రెవెన్యూ లోటులో సర్కార్ ఉన్నదని వెల్లడించారు. నాడు స్వయం పాలనలో రాష్ట్రం అద్భుతంగా వృద్ధి సాధించి ఎస్‌వోటీఆర్ 84 శాతం సాధించి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచేలా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తీర్చిదిద్దారని గుర్తుచేశారు. 2023లో లక్షా 11 వేల కోట్లు ఉన్న ఎస్‌వోటీఆర్, 2024కు వచ్చే సరికి లక్షా 9 వేల కోట్లకు చేరి రూ.2 వేల కోట్లు తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓ వైపు ఆర్థిక పరిస్థితి బాగోలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అంటూనే పేపర్లలో దుబారాగా ప్రకటనలు ఇస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా ఆర్బీఐ లెక్కలను కేంద్రం చెప్పిన తర్వాత కూడా కేసీఆర్ భారీగా అప్పులు చేశారని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్తే మంత్రులు పొన్నం 70 వేలు, శ్రీధర్‌బాబు 80 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పడం విడ్డూరంగా ఉన్నదని చెప్పారు. ఇక పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఏకంగా లక్ష ఉద్యోగాలు ఇచ్చామని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

కాంగ్రెస్ వచ్చాక రూ.4 లక్షల కోట్ల అప్పు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సగం కాలం గడిచి పోయిందని రెండున్నరేండ్లలోనే రూ.4 లక్షల కోట్లు అప్పు చేసిందని కేటీఆర్ వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి అప్పులు తెచ్చి రైతుబంధు, యూరియా, రూ.4 వేలు పింఛను, మహిళలకు రూ.2,500, దివ్యాంగులకు రూ.6 వేలు, నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇచ్చారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములకు ఎకరానికి రూ.237 కోట్లు వచ్చిందని సర్కారే చెప్తున్నదని, మరి ఆ డబ్బులు ఎక్కడికి వెళ్తున్నాయని ప్రశ్నించారు. ఉద్యోగులకు పీఆర్సీ, రిటైర్మెంట్ పొందిన వారికి బెనిఫిట్స్, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు అమలు చేశారా? అని నిలదీశారు. ఈ ఏడాది మొత్తం రూ.55 వేల కోట్లు అప్పు చేయాల్సి ఉండగా.. కాంగ్రెస్ సర్కార్ ఇప్పటికే రూ.75 వేల కోట్లు అప్పు చేసిందని వెల్లడించారు. నెలకు రూ.2 వేల కోట్లు అప్పునకు మిత్తీ కడుతున్నట్టు కాగ్ లెక్కలు చెప్తుంటే.. కాంగ్రెస్ నేతలు మాత్రం ఏకంగా రూ.6,500 కోట్లు కడుతున్నామని అబద్ధాలు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఏ డిస్కమ్ లేకుండా కేసీఆర్ 24 గంటల ఉచిత కరెంట్ ఇవ్వలేదా?

సీఎం రేవంత్‌రెడ్డి మోటర్లకు మీటర్లు పెట్టము అంటూనే ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో 5 లక్షల ట్రాన్స్‌ఫార్మర్లు, 30 లక్షల వ్యవసాయ మోటర్లు ఉన్నాయని వెల్లడించారు. అంటే ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ కింద ఆరు మోటర్లు ఉంటాయని వివరించారు. ఇవాళ ఆరు మోటర్లకు ఒక మీటర్ పెడుతామని రేవంత్‌రెడ్డి చెప్తున్నాడని, కొద్ది రోజుల తర్వాత మూడు మోటర్లకు ఒక మీటర్, తర్వాత ఒక్కో మోటర్‌కు మీటర్ పెడుతారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కేసీఆర్ ఏ డిస్కమ్ పెట్టకుండా 24 గంటల ఉచిత విద్యుత్తు ఇవ్వలేదా? నాడు వ్యవసాయ దిగుబడులు పెరిగి దేశంలోనే రాష్ట్రం నంబర్ వన్ కాలేదా?' అని ప్రశ్నించారు. కేసీఆర్ లాంటి నాయకుడు తెలంగాణకు రక్షణ కవచంలా ఉన్నంతకాలం ఎవరూ ఏమీ చేయలేరని, రాష్ట్రాన్ని ఉజ్వల తెలంగాణగా భారతదేశానికి ఓ లైట్ హౌస్‌గా నిలబెట్టేదాకా బీఆర్‌ఎస్ ప్రయాణం కొనసాగుతుందని చెప్పారు.

అప్పులపై తప్పుడు లెక్కలు

బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అప్పుల లెక్కలపై, కాంగ్రెస్ వచ్చాక ఇచ్చిన ఉద్యోగాలపై మంత్రులకే ఓ సయోధ్య లేదని కేటీఆర్ చురకలంటించారు. బీఆర్‌ఎస్ తొమ్మిదిన్నరేండ్లలో చేసిన అప్పు రూ.2.8 లక్షల కోట్లు అని ఆర్బీఐ చెప్పిన లెక్కను పార్లమెంట్ సాక్షిగా కేంద్రం వెల్లడించిందని గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడిన నాడు రూ.73 వేల కోట్లతో తెలంగాణ ప్రయాణం ప్రారంభమైందని వివరించారు. తమ ప్రభుత్వం అప్పు చేసి లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రూ.30 వేల కోట్లతో 90 శాతం పూర్తి చేశామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టును 80 శాతం పూర్తి చేసినట్టు తెలిపారు. రూ.73 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేసినట్టు వెల్లడించారు. జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశామని, దేశంలోనే అతిపెద్దదైన ఆల్ట్రా మెగా పవర్ ప్రాజెక్టును దామరచర్లలో రూ.35 వేల కోట్లతో నిర్మించామని వెల్లడించారు. 1,000 గురుకులాలు పెట్టడంతో పాటు.. ప్రతి జిల్లాలో కొత్త కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం కట్టారని చెప్పారు.

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

దాదాపు ప్రతి ఖండాన్ని ప్రభావితం చేసే వాతావరణ ఘటన తరుముకొస్తున్నది. సముద్రాలు వేడెక్కటం వల్ల వాతావరణంలో బలీయమైన మార్పులు కలిగించే ఎల్ నినో ప్రభావంతో ప్రకోపం ఎంతో దూరంలో లేదనే హెచ్చరికలు అంతకంతకూ మిన్నంటుతున్నాయి. ఎల్ నినో ప్రారంభం కావటం 80 శాతం ఖాయమని, అది అంతిమంగా తీవ్రస్థాయికి చేరుకోవటం 90 శాతం ఖాయమని ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోని ప్రపంచ వాతావరణ విభాగం (డబ్ల్యూఎంవో) స్పష్టం చేసింది. భౌగోళిక ఉష్ణోగ్రతలు ఈ సరికే కాకలు పుట్టిస్తున్నాయి. ప్రపంచ వ్యవసాయం తీవ్రమైన వత్తిడికి గురవుతున్నది. ఈ నేపథ్యంలో ఎల్ నినో వేగంగా దూసుకువస్తుండటం ఆందోళన కలిగించే విషయమే. ఈసారి ఎల్ నినో ప్రభావం ఆస్ట్రేలియా, ఇండోనేషియా, సెంట్రల్ అమెరికాతో పాటు ఈసారి వర్షపాతం సగటుకు దిగువన ఉంటుందని భావిస్తున్న దక్షిణాసియాలో ఎక్కువగా ఉంటుందని డబ్ల్యూఎంవో హెచ్చరిస్తున్నది. అదే పరిధిలోకి వచ్చే తెలంగాణ ఎల్ నినో దుష్ప్రభావాలకు దూరంగా ఉండలేదనేది వాస్తవం. వర్షాలు తగ్గిపోయి ఎండలు పెరగటం అనేది అంతిమంగా ప్రభావం చూపేదీ సాగు మీదనే. పైగా రాబోయే ఉత్పాతానికి సంసిద్ధం కావటానికి సమయం చాలా తక్కువగా ఉన్నదని శాస్త్రవేత్తలు అంటున్నారు. మరి తెలంగాణ ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నదా అనేది ఇప్పుడు మనముందున్న ప్రశ్న.

ముంచుకొచ్చే ఎల్ నినో ముప్పు

తెలంగాణ పీఠభూమిపై ఉన్న సంగతి తెలిసిందే. ఇక్కడి వ్యవసాయంలో అధికశాతం వర్షాధారంగానే సాగుతుంది. వానలు ముఖం చాటేస్తే సాగు సడుగులు విరిగిపోతాయి. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు ఆదుకునేది ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లోనే. ఆ సోయి కరువైన కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతూ నీటి భరోసాకు నీళ్లు వదిలింది. ప్రాజెక్టులను పడావు పెడుతూ జలాశయాలను ఎండబెడుతున్నది. ఇటీవల ఎల్ నినో భయంతో కాళేశ్వరం మరమ్మతులంటూ కొంత హడావుడి చేసినా పనులు ముందుకు సాగటం లేదు. మరోవైపు ఎల్ నినో వంటి ప్రకృతి విపత్తుల ప్రభావాన్ని తగ్గించటంలో చెట్ల పెంపకం చాలా కీలకం. కేసీఆర్ హయాంలో చేపట్టిన తెలంగాణకు హరితహారం అద్భుత ఫలితాలను సాధించింది. 2015-21 మధ్యకాలంలో అటవీ విస్తీర్ణం 19,854 చదరపు కిలోమీటర్ల నుంచి 21,214 చదరపు కిలోమీటర్లకు అంటే దాదాపు 8 శాతం మేర పెరిగింది. పల్లెలు, పట్టణాల్లోని అటవీయేతర ప్రదేశాల్లో వృక్షాల పెరుగుదల 14.5 శాతానికి పెరిగింది. 2019-21 అంచనాల్లో హరితావరణం విస్తరణలో దేశ సగటును మించిపోయి ప్రశంసలు అందుకున్నది తెలంగాణ. హరితహారం కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవంగా పేరు మార్చి తూతూమంత్రంగా నడుపుతుండటం మనం చూస్తున్నాం. ఈ రెండు ప్రధాన అంశాలు ఎల్ నినో సంసిద్ధతలో సర్కార్ వైఫల్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. ఇప్పుడు ఎల్ నినో ఉత్పాతం తలుపు తడుతున్న వేళ రేవంత్‌రెడ్డి హడావిగా సమీక్ష జరిపి, అధికారులకు మొక్కుబడిగా ఆదేశాలిచ్చి చేతులు దులిపేసుకున్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర రైతులకు కష్టాలు ఇప్పట్లో తప్పేలా కనిపించటం లేదు. ఓ వైపు సాగుకు సర్కార్ పెట్టుబడి సాయం ఎగ్గొట్టటమే కాకుండా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తగిన స్థాయిలో అందుబాటులో ఉంచటం లేదు. మరోవైపు ధాన్యం కొనుగోళ్ల విషయమై నరకం చూపిస్తున్నది. తాజాగా యూరియాపై రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేస్తున్నది. ఇదంతా చూస్తుంటే వానకాలం సాగుబడి ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే దడ పుడుతున్నది. సర్కార్ సహాయ నిరాకరణకు వర్షాల లేమి తోడైతే రైతు పరిస్థితి అధోగతే. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రాజెక్టుల స్థితిగతులపై దృష్టి సారించాలి. అలాగే తక్షణ ప్రాతిపదికపై సాగుబడికి అవసరమైన పెట్టుబడి, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచి కొనుగోళ్ల వ్యవస్థను సమూలంగా చక్కదిద్దాలి. అప్పుడే తెలంగాణ రైతన్న ఎల్ నినో దుష్ప్రభావాల నుంచి కొంచెమైనా ఉపశమనం పొందగలుగుతాడు.



సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ప్రజల కన్నీళ్లు పట్టని 'పాలమూరు బిడ్డ'

తెలంగాణలో అత్యధికంగా 35 లక్షల ఎకరాలు సాగుకు యోగ్యమైన భూమి ఉన్న ప్రాంతం ఉమ్మడి పాలమూరు జిల్లా. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కలిసిన పాపానికి అతి ఎక్కువగా నష్టపోయిన జిల్లా పాలమూరు అనే విషయం తెలిసిందే. అందువల్లనే తెలంగాణ ఉద్యమంలో పాలమూరు కన్నీళ్లు, కష్టాలు, కరువు, వలస చావులు, ఆకలి చావులు, ఆత్మహత్యలు ప్రముఖ అంశాలై నిలిచాయి. రాష్ట్రం వచ్చిన తర్వాత ఆ సమస్యలకు పరిష్కారం కోసం, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను కేసీఆర్ నాయకత్వంలో త్వరితగతిన పూర్తిచేశారు. చెరువులు, కుంటలను పునరుద్ధరించి, వందలాది చెక్ డ్యామ్‌లు నిర్మించి భూగర్భజలాలు పెంచారు. ఇవన్నీ చేసినా పాలమూరు భూములు మొత్తం పచ్చబడవు అని భావించి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టారు.

ఆరున్నర టీఎంసీల సామర్థ్యం గల జూరాల ప్రాజెక్టు ద్వారా న్యాయం జరగదని భావించి, నిండుకుండలా ఉండే శ్రీశైలం రిజర్వాయర్‌ను సోర్స్‌గా పెట్టుకుని, రోజుకు రెండు టీఎంసీలను ఎత్తిపోసుకునే విధంగా కేసీఆర్ హయాంలో 90 టీఎంసీలకు జీవో ఇచ్చి పనులు ప్రారంభించారు. 2015 జూన్ 11 నాడు శంకుస్థాపన చేశారు. ఈ పరిణామాలతో కండ్లు మండిన కాంగ్రెస్.. ఆంధ్రాలోని తెలంగాణ వ్యతిరేక శక్తులతో జతకట్టి, అనేకరకాల కేసులు వేసి, ప్రాజెక్టు ముందుకు సాగకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేసింది. 'పాలమూరు జిల్లా బిడ్డను. నన్ను ఆశీర్వదించండి. అండగా నిలవండి' అని చెప్పుకొని, ఎన్నికల సమయంలో కన్నీళ్లు రేవంత్‌రెడ్డి నమ్మబలికారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కాలువల పనుల టెండర్లు రద్దు చేశారు.

పాలమూరుతోపాటు ఆరు జిల్లాల రైతుల భవిష్యత్తును రేవంత్‌రెడ్డి ఒక్క సంతకంతో పక్కన పెట్టేశారు. పాలమూరు రైతుల ఆశలు, ఆకాంక్షలు, నీటి కోసం ఎదురుచూస్తున్న లక్షల ఎకరాలు, ఇవన్నీ ఆయనకు కేవలం ఓట్ల కోసం మాత్రమే ఉపయోగపడిన 'ఎమోషనల్ ఓటు బ్యాంక్ అకౌంట్'లుగా మిగిలిపోయాయి. కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన పనులను కాదనడం ద్వారా రేవంత్‌రెడ్డి తన అహాన్ని తృప్తి పరచుకున్నారు కానీ, పాలమూరు రైతుల గొంతు కోశారు. వట్టెం పంప్ హౌస్ మునిగిపోయి ఏడాది దాటినా ఒక్కసారి కూడా పాలమూరును సీఎం పట్టించుకోలేదు.

సొంత జిల్లాలోని జలవనరులు, రిజర్వాయర్లు, ప్రాజెక్టులు ఎండిపోతున్నా, తెలంగాణ నీటి హక్కులు, పాలమూరు నీటి హక్కులు కోల్పోతున్నా హైదరాబాద్‌లో కూర్చొని, తన ప్రాంతం గురించి మాట్లాడటం ఎంత దారుణం? పాలమూరు బిడ్డ అని చెప్పి, వ్యక్తి తన సొంత భూమి, పుట్టిన గడ్డ దురవస్థ చూసి కూడా మౌనం వహించడం తగిన పనేనా? బీఆర్ఎస్ ప్రశ్నించడం, పాదయాత్ర చేస్తామని హెచ్చరించడంతో పాలమూరు ప్రాజెక్టుల పరిశీలనకు బయల్దేరుతానని రేవంత్ ప్రకటించారు. ఇది రాజకీయ ఒత్తిడితో చేస్తున్న 'డ్యామేజ్ కంట్రోల్' యాత్ర మాత్రమే.

బీఆర్ఎస్ హయాంలో పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులో రూ.35,200 కోట్ల పనులు జరి



గాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు జరగడం లేదు. ఈ పథకంలో కీలకమైన ఎన్విరాన్‌మెంటల్ పబ్లిక్ హియరింగ్. దానిని బీఆర్ఎస్ ప్రభుత్వమే పూర్తి చేసింది.

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఉన్న కేసులన్నీ తొలగించుకొని, సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేసిన కేసులను దాటుకొని, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ ముందు ప్రతిపాదనలు పెట్టింది. అనేక అడ్డంకులు దాటుకొని చివరి దశకు తీసుకువచ్చింది. చివరి దశలో ఉన్న పర్యావరణ అనుమతులు మంజూరు చేయకుండా కేవలం చంద్రబాబునాయుడి ప్రోద్బలంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల డీపీఆర్‌ను వెనక్కి పంపించారు. ఆ డీపీఆర్ గురించి ఇప్పటివరకు సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు నోరు విప్పడం లేదు? పైగా కేంద్రం చెప్పిందని 45 టీఎంసీలకు ఒప్పుకొంటూ కేంద్రానికి లేఖ రాయడం దుర్మార్గం. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పజెప్పే ప్రసక్తేలేదని బీఆర్ఎస్ అడ్డుకున్నది. ఖరాఖండిగా తీర్మానం చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించి చేతులు ముడుచుకున్నది. ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు అత్యంత ప్రాధాన్యం. అందుకే 90 టీఎంసీల నికరజలాలు వాడుకొనేలా కేసీఆర్ హయాంలో ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఇది చారిత్రాత్మక నిర్ణయం. గతంలో కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల విషయంలో జీవోలు ఇవ్వకుండా డీపీఆర్‌ల పేరుతోనే ప్రాజెక్టులను చేపట్టారు. డీపీఆర్ తుది దశలో ఉన్న పరిస్థితుల్లో ఈ పథకం కింద 12.30 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ఉద్దేశంతో అన్ని కాల్వల టెండర్లు పిలిచారు. వాటిని ఫైనల్ చేసే సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రేవంత్ ప్రభుత్వం టెండర్లు పూర్తి చేసి పనులు ఇచ్చి ఉంటే ఈ రోజు ప్రభుత్వానికి దాదాపు 4 వేల కోట్లు భారం తగ్గేది. ఇప్పటికి నీళ్లొచ్చే దశలో కాలువలు ఉండేవి. కేవలం కేసీఆర్‌కు పేరు వస్తుందన్న దురుద్దేశంతో, ఈ కాలువలు పూర్తయితే నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల చేపట్టలేనన్న భావనతో సొంత ప్రాంత ప్రజల గొంతు కోసేందుకు కాలువల టెండర్లు రేవంత్‌రెడ్డి రద్దుచేశారు. తెలంగాణ సమాజం ఇప్పుడు ప్రధానంగా గుర్తుంచుకోవాల్సిన అంశం ఇదే. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం ప్రాజెక్టును తెలంగాణకు కాకుండా చేసింది. ఇప్పుడు నాగార్జునసాగర్ నుంచి కూడా ఏపీకి ధారాదత్తం చేసుకునేందుకు గోదావరి అనుసంధానం పేరుతో కుట్రలు చేస్తున్నది. రేవంత్ ప్రభుత్వం వీటిని అడ్డుకోకుంటే తెలంగాణకు అన్యాయం జరుగుతుంది. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను క్షమించరు.

(వ్యాసకర్త: వ్యవసాయ శాఖ మాజీ మంత్రి)



రమేశ్ హజారి

ప్రమాదంలో తెలంగాణ అస్తిత్వం!

'హైదరాబాద్ మీ అయ్య జాగీరా? ఏమయా? ఆ ?' అంటూ తెలంగాణ సమాజాన్ని బెదిరిస్తూ, భుజాలెగిరేసురేకుంటూ పవన్ కల్యాణ్ ప్రదర్శించిన హావభావాలు, ఎచ్చుల మాటలు.. 'గద్దరన్నకు బండికొనిచ్చిన' అంటూ బండెనుక బండి కట్టిన పాటను నేనే రాసిన అంటూ బిల్డప్‌లు ఇస్తూ, హైదరాబాద్‌లో ప్రెస్ మీట్ పెట్టి తెలంగాణ జర్నలిస్టులను నడిరోడ్డుమీద కూర్చోబెట్టిన అహంకార ప్రదర్శనలు.. ఆయన 'పగ'టేషాలు అన్నీ జాగ్రత్తగా గమనిస్తే.. మల్లోసారి తెలంగాణ సమాజం అస్తిత్వ సంక్షోభంల పడుతున్నదనీ అర్థమైంది. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఆంధ్రా ఆధిపత్య వ్యవస్థల ఆటవిక వ్యవస్థనే రాజ్యమేలుతున్నది. దాడి చేసే క్రూరమృగానికి కావల్సింది అవకాశమే కానీ, విచక్షణ కాదు.

అడవిలో తోడేలు దాడి చేసినప్పుడు దాని బారి నుంచి జింక ఒకసారి తప్పించుకోవచ్చు. అంతమాత్రాన ఆ క్రూరమృగం మళ్లీ ఎప్పటికీ దాడి చేయదని అనుకుంటే అంతకంటే అది జింక అమాయకత్వం తప్ప మరొకటి కాదు. పవన్ కల్యాణ్ చంద్రబాబుతో హైదరాబాద్‌లో జరిగిన మొన్నటి మోదీ రహస్య సమావేశంలో లోపాయికారి ముచ్చట్లు, అనంతరం రేవంత్‌రెడ్డితో బహిరంగ సమావేశంలో 'నాతో కలిసి పో' మని ఆహ్వానిస్తూ చెప్పిన 'బహిరంగ రహస్యం' తెలంగాణ బుద్ధిజీవులకు అర్థం కాకుండా ఉంటుందా? ఈ కుట్రల పరిణామాలను ప్రజలకు అర్థం చేయించే దిశగా 'ప్రమాదంలో తెలంగాణ అస్తిత్వం- ఏకమౌదాం తెలంగాణ సమస్తం' అంటూ పిలుపునివ్వాల్సిన అత్యవసర స్థితి ఏర్పడింది.. దీనిని గుర్తిస్తూ, గన్‌పార్క్ వద్ద.. అమరులకు నివాళులు అర్పిస్తూ టీజేఎఫ్ ఆవిర్భావ రజతోత్సవ ముగింపు వేడుకలను సీనియర్ జర్నలిస్ట్ అల్లం నారాయణ ఆధ్వర్యంలో తెలంగాణ జర్నలిస్టులందరం కలిసి నిర్వహించుకున్నాం.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం స్వరాష్ట్రంలో ఆంధ్రా వలసవాదం అంతమైందని సంతోషించే లోపే, ఇప్పుడు దానికి తోడుగా కేంద్రంలోని నరేంద్రమోదీ, అమిత్ షా ద్వయం కన్ను కూడా మన 'భాగ్య'నగరంపై పడింది. తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకుని, హైదరాబాద్ సంపదను కొల్లగొట్టడానికి కేంద్ర బీజేపీ పెద్దలు సామాన్యుల ఊహలకు అందని సరికొత్త కుటిల పన్నాగాలు పన్నుతున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేసిన ప్రకటనలో సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి.. తెలంగాణను ప్రపంచానికి గేట్ వేగా మార్చుతాను అన్నారు. కానీ, అంతకుముందే మోదీ, అమిత్ షా జోడీకి తద్వారా బీజేపీకి దక్షిణ భారతదేశంలోకి రాజకీయంగా చొరబడటానికి హైదరాబాద్‌ను 'గేట్ వే ఆఫ్ సౌత్ ఇండియా' (దక్షిణ భారత ద్వారం)గా మార్చే ఎత్తుగడలు వ్యూహాలు ఇప్పటికే అమలులోకి వచ్చినాయి.. అనేదానికి, 'మీ అయ్య జాగీరా?' అంటూ.. పవన్ కల్యాణ్ కూసిన కూతలే నిదర్శనం.

ఒకవైపు పక్క రాష్ట్రం నుంచి చంద్రబాబునాయుడు నడుపుతున్న తెరవెనుక వ్యూహాలు, మరోవైపు ఢిల్లీ బీజేపీ పెద్దల కుటిల నీతి, వీటన్నింటినీ భుజానకెత్తుకుని ఇక్కడి వ్యవస్థలను శాసిస్తున్న రేవంత్‌రెడ్డి రూపంలో తెలంగాణపై ఇప్పుడు ముప్పేట దాడి స్పష్టంగా నడుస్తున్నది. ఈ లోపాయికారి రాజకీయ వ్యూహాలు నిన్న మొన్నటివి కావు.

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచే ఈ కుట్రకు పునాదులు పడ్డాయి. రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు కావడం దగ్గరి నుంచి, ఆయన ముఖ్యమంత్రి పదవిలో కూర్చొనే వరకు జరిగిన ప్రతి పరిణామాన్నీ నిశితంగా పరిశీలిస్తే దీని వెనుక ఎవరి హస్తం ఉన్నదో తెలిసిందే. మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్, రేవంత్‌రెడ్డి రాజకీయ పొత్తులను అర్థం చేసుకోవాల్సి ఉన్నది. తెలంగాణ అస్తిత్వం మీద దాడిలో,



మోదీ, చంద్రబాబుల ఉమ్మడి ప్రణాళిక దాగి ఉన్నదనే నిజం తెలంగాణవాదులకు ముందే అర్థమైనా పవన్ కల్యాణ్ ఓవర్ యాక్షన్‌తో, చంద్రబాబు, మోదీ, రేవంత్ నడుమ ఏర్పడిన ఈ 'ట్రయాంగిల్' పొలిటికల్ గేమ్, వాళ్ల అసలు రంగును బయటపెట్టింది.

హైదరాబాద్ నడిమధ్యన ప్రతిష్ఠిస్తున్న ఆంధ్ర నాయకుల విగ్రహాలు కేవలం సాధారణ విగ్రహాలు కావు. అవి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, చైతన్యాన్ని పరీక్షించడానికి శత్రువులు వేస్తున్న అడుగులు. ముఖ్యమంత్రి స్వయంగా కట్టగట్టుకొని వెళ్లి హైదరాబాద్ నడిమధ్యన నిలబెట్టింది ఒక 'పొలిటికల్ రాముడిని'. తెలుగు నటుడిగా, కళాకారుడిగా ఎన్టీఆర్ అందరివాడే కావచ్చు, అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ, తెలంగాణ వ్యతిరేక శక్తులకు నాయకత్వం వహించి, ఇక్కడి అస్తిత్వాన్ని చిట్లగొట్టిన ఆంధ్ర ఆధిపత్య రాజకీయ నాయకుడిగా ఎన్టీఆర్ కేవలం కొందరివాడు మాత్రమే. కళలకు, సాహిత్య సాంస్కృతిక వ్యవహారాలకు ఎంతటి ఉన్నత స్థానం ఉన్నదో.. కుటిల రాజకీయాలకు అంతటి హీనమైన చరిత్ర ఉంటుంది. హైదరాబాద్‌లో దశాబ్దాలుగా స్థిరపడిన కమ్మ, కాపు సామాజిక వర్గాలకు చెందిన తెలంగాణ బిడ్డలు.. ఆవేశపడకుండా, సహనంతో, విజ్ఞతతో ఆలోచించాల్సిన సమయం వచ్చింది.

హైదరాబాద్ సహా తెలంగాణలో పలు జిల్లాల్లో నివాసం ఉంటున్న కమ్మ, కాపు సహా సబ్బండ కులాలకు చెందిన ఆంధ్రా బిడ్డలు తెలంగాణ స్థానికులే తప్ప, సెటిలర్లు కాదు. ఇదే విషయాన్ని పలు మార్లు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పదే పదే ప్రకటించారు కూడా. ఈ గడ్డపై కలిసిపోయిన తెలంగాణ బిడ్డలుగా, వాళ్ల పిల్లల భవిష్యత్తు, వారి ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ ఈ తెలంగాణ రాష్ట్రంతోనే ముడిపడి ఉన్నాయి.

పక్కన తమది అనుకునే ఆంధ్ర రాష్ట్ర రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబునాయుడిని, పవన్ కల్యాణ్‌ను ఆయా సామాజిక వర్గాలు గనుక కుల, ప్రాంతీయ అభిమానంతో తెలంగాణకు ఆహ్వానించాలని అనుకొంటే అది ఆత్మహత్యా సదృశమే అవుతుంది. 'బంగారు కత్తి అని మోజుపడి ఆ కత్తితో మన మెడను మనమే కోసుకోవడం' లాంటిదే అవుతుంది. బంధువులపై, కులంపై ఉండే అభిమానం వేరు.. మనం బతుకుతున్న సొంత ఇంటి బాధ్యత వేరు. పవన్ కల్యాణ్ ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బిడ్డలను బలిచేస్తున్నాడు. చంద్రబాబును అడ్డం పెట్టుకుని, రేవంత్ రెడ్డిని చేతుల్లో ఉంచుకుని, హైదరాబాద్‌ను ఆక్రమించాలని అనుకుంటున్న బీజేపీ పెద్దల కుటిల నీతిని పసిగట్టకపోతే, హైదరాబాద్ సంపదను ఉత్తరాదికి తరలించి, హైదరాబాద్‌ను యూటీగా మార్చి లూటీ చేసినా చేసే ప్రమాదం పొంచి కనిపిస్తున్నది.

రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి మళ్లీ ఏకమై తెలంగాణపై దాడికి వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఏ చంద్రబాబు వర్గ రాజకీయ వ్యవస్థ ఇక్కడుంటే తెలంగాణ మొత్తం ఆగం అవుతుందని గతంలో ప్రజలు వారిని తట్టాబుట్టా సర్దించి ఆంధ్రాకు పంపించారో మళ్లీ ఆ శక్తులనే ఇక్కడికి తీసుకొచ్చి రాజకీయాలు చేస్తామంటే ఎలా? ఆలోచించండి. ఉమ్మడి రాష్ట్రంలో అధికారం నడిపించిన సమైక్య పాలకులు తెలంగాణను నిలువునా దోచుకున్నారు. ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా ఇక్కడ తమ బంట్లను, ఏజెంట్లను పెట్టుకొని మళ్లీ దోచుకుంటామంటే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదు. ఇటీవల టీజేఎఫ్ ఆధ్వర్యంలో చేసిన ప్రకటన.. ప్రమాదంలో పడ్డ తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ కోసం వేసే మరో ముందడుగు. ఆ దిశగా సమాజాన్ని సమన్వయం చేసే తెలంగాణ జర్నలిస్టుల ఉద్యమానికి చేయి చేయి కలుపుదాం.. అస్తిత్వాన్ని పరరక్షించుకుందాం. జై తెలంగాణ

(వ్యాసకర్త: టీజేఎఫ్ ఉపాధ్యక్షుడు)



అధికార పార్టీల అక్రమ సమీకరణాలు



డాక్టర్ అయాచితం శ్రీధర్
9849893238


కొన్నాళ్ల క్రితం ఖమ్మంలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'తెలంగాణలో తెలుగుదేశం పార్టీ లేకుండా చేసిన బీఆర్ఎస్ జెండా దిమ్మెలను కూల్చండి.. ఏమన్నా అయితే నేంజూసుకుంటా' అని ఎన్టీఆర్ అభిమానులకు చంద్రబాబు అనుచరగణానికి రెచ్చగొట్టారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ చిద్విలాసంగా నవ్వుతూ తన వైపు రమ్మని బహిరంగానే రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. వెనువెంటనే ప్రత్యేకమైన సందర్భమేదీ లేకుండా హైదరాబాదులో చంద్రబాబు ఇంటికి వెళ్లి సుదీర్ఘ మంతనాలు జరిపారు. అదేపనిగా పవన్ కళ్యాణ్‌ను పరామర్శించారు. అమిత్ షా, పవన్ కళ్యాణ్ భేటీకి సంబంధించిన వ్యవహారంలో ప్రముఖ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె నాగేశ్వర్ చేసిన ఒక వ్యాఖ్య ఆధారంగా ఆంధ్రప్రదేశ్ కూటమి మద్దతుదారులు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున దాడికి ఎగబడ్డారు.

అమిత్‌షాతో, పవన్ కల్యాణ్ భేటీకి సంబంధించిన వ్యవహారంలో నాగేశ్వర్ చేసిన తన వ్యాఖ్యలు ఉపసంహరించుకున్నప్పటికీ జనసేన కార్యకర్తలు బెదిరింపులకు పాల్పడ్డారు. ఆంధ్రాలో ఒకటి రెండు చోట్ల పోలీస్ కేసులు నాగేశ్వర్ తెలంగాణ పోలీసులను ఆశ్రయించడం వరకు వ్యవహారం తీవ్రస్థాయికి చేరింది. ఎన్టీఆర్ జన్మదిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరిలో జరిగిన టీడీపీ మహానాడులో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ మాట్లాడుతూ తెలంగాణలో పార్టీని బలోపేతం చేస్తానని చెప్పారు. ఆంధ్ర పదం ఉన్నది తప్ప, తెలంగాణ పదం అసలు డిక్షనరీలోనే లేదని, దాన్ని స్వార్థపరులు సృష్టించారని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు అన్నారు. అదే రోజు హైదరాబాద్‌లో సురవరం ప్రతాపరెడ్డి విగ్రహావిష్కరణకు పోకుండా అమీర్‌పేట్ మైత్రివనం చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పటిలాగే తెలుగుదేశం రాగం ఎత్తుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో ఒక సభ ఏర్పాటు చేశారు. ఈ వరుస ఘటనలు యాదృచ్ఛికంగా జరుగుతున్నాయంటే నమ్మలేం. తెలంగాణపై మళ్లీ ఏవో కుట్రల మేఘాలు కమ్ముకుంటున్నాయి.

కేసీఆర్ ధాటికి తెలంగాణ రాజకీయాలకు క్రమక్రమంగా దూరమైన చంద్రబాబుకు పదేండ్ల తర్వాత మళ్లీ రావడానికి ప్రయత్నిస్తున్నారు. 2014 ఎన్నికల్లో గెలిచి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఏడాది తిరగకముందే ఓటుకు నోటు ఉదంతంలో దొరికిపోయిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖం చాటేశారు. అనంతరం ఏడాదిన్నరకి జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో లోకేశ్ రంగంలోకి దిగి ప్రచారం చేసినా తెలుగుదేశం పార్టీ ఒక్క సీటుకే పరిమితమైంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని పునఃప్రవేశానికి ప్రయత్నించినా రెండు సీట్లకే పరిమితమైంది.

2023 ఎన్నికల్లో అసలు పోటీనే చేయలేదు. తెలుగుదేశం పార్టీ కదలికలు, కార్యక్రమాలు ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కే పరిమితమైపోయాయి. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తెలుగుదేశం పార్టీ ఆశలు మళ్లీ చిగురించడం ప్రారంభమైంది. అందు కారణం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధినేత అయినప్పటికీ ఏనాడు చంద్రబాబుతో సొంత రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజల పక్షాన బరిగీసి నిలువలేదు. తెలుగుదేశం పార్టీ పుట్టిందే కాంగ్రెస్ వ్యతిరేక సిద్ధాంతంతో. కాంగ్రెస్ పార్టీ సైతం సమైక్య రాష్ట్రంలో 35 ఏండ్ల పాటు తెలుగుదేశం పార్టీని ప్రధాన ప్రత్యర్థిగా పరిగణించింది. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభల్లో, కార్యక్రమాల్లో తెలుగుదేశం జెండాలు ఎగురుతున్నాయి. గత లోక్ సభ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశంతో పొత్తు పెట్టుకున్న బీజేపీ ప్రచార సమయంలో చంద్రబాబు సహా తెలుగుదేశం అగ్రనేతలను అక్కడికే పరిమితం చేశారు. తెలంగాణలో అడుగుపెట్టనీయలేదు. రేవంత్‌రెడ్డి అటు మోదీని ఇటు చంద్రబాబును భుజాన ఎక్కించుకుని ఊరేగుతున్నా నియంత్రించలేని దీనస్థితికి కాంగ్రెస్ చేరుకున్నది.

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్, బీజేపీకి చిక్కని యోధుడు కేసీఆర్. తెలంగాణ ప్రయోజనాల విషయానికొస్తే ఎవరికీ తలవంచని నైజం కేసీఆర్ సొంతం. ఉద్యమంలో ఉన్నా, అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తెలంగాణపై ఈగ వాలినా ఆయన సహించరు అనేది జగమెరిగిన సత్యం. కేసీఆర్ అధికారంలో ఉన్నంతకాలం తెలంగాణ వైపు కన్నెత్తి చూసే ధైర్యం ఎవరికీ ఉండేది కాదు. ఇప్పుడా పరిస్థితి లేదు. కేసీఆర్ అధికారంలో లేరు. రేవంత్‌రెడ్డిని తెలుగుదేశం, బీజేపీ అవకాశం అనుకుంటున్నాయి. ఆ రెండు పార్టీల మూలాలు తనలో ఉన్నాయని రేవంత్‌రెడ్డి బహిరంగంగానే ప్రకటించారు. ఇదే అదనుగా తెలంగాణ అస్తిత్వ ఆత్మగౌరవాలను భగ్నం చేయడానికి, బీఆర్ఎస్‌ను దెబ్బతీయడానికి బీజేపీ, టీడీపీ, కాంగ్రెస్ ఒక్క తాటి మీదికి వచ్చాయిని వరుస పరిణామాలను బట్టి స్పష్టమవుతున్నది. కుడి, ఎడమల మిత్ర పక్షాల భుజాలపై చేతులు వేస్తే తప్ప రాజకీయంగా ఒక్క అడుగూ ముందుకువేయలేని చంద్రబాబు నెరపే రాజకీయ స్నేహాలకు ఒక శాశ్వతత్వం ఉండదు. అవసరాన్ని బట్టి ఎవరితోనైనా జత కట్టడం, వదిలిపెట్టడం ఆయన ఎత్తుగడల నైజం. స్థానిక బీజేపీ, కాంగ్రెస్ నేతలు పావులు మాత్రమే. జరుగుతున్న పరిణామాలు వెల్లడిస్తున్న సంకేతం అదే. పుష్కర తెలంగాణదీపం కొడిగట్టే ప్రమాదమున్నది. ప్రజలారా తస్మాత్ జాగ్రత్త!



బరాబర్!



అవును
ఇది మా అయ్యల జాగిరే

ఇక్కడ పోరాటాలు పురుడుపోసుకున్నప్పుడు
ఇక్కడ తుపాకులు మృత్యుఘోషలై గర్జిస్తున్నప్పుడు
కొమురం భీం, సర్వాయి పాపన్న మా జాగిరే

ఇక్కడ పెయ్యి మీది బట్టపేగులు రక్తంతో తడిసి
రక్త రగల్ జెండాలై ఎగిసినరోజు
బరాబర్ ఇది కమ్మరి బ్రహ్మయ్య,
నల్ల నర్సింహులు, చాకలి ఐలమ్మ జాగిరే

వడ్ల ఎల్లయ్య ధాతికి సాకవోసిన
సాలేటి కుందెన్ల కొత్తొడ్ల కొలుపులే
పండుగ సాయన్న, మాదిగ జుట్టెంకయ్య జాగిరే

పెద్దగొల్ల నరసింహులు
ఏడుదుక్కుల ఎడ్ల కోండ్ర
పరుపుదాల్ల జగ్గల కింద దాసిన
ఆరుద్ర పురుగుల అయ్యజాగిరే

సిరిసనవాడల్ల కోటివేయిల
కుమ్మరిపురుగులు
మంగలోని పడె మీద మాల సూరమ్మ జోలె
పూసలి సత్తెమ్మ గాజుల గంపలు
ఎరుకలి ఎల్లమ్మ జీవులెనుబది లక్షలు
మా జాగిరే

వొట్టిపోయిన వంగపండ్ల సంగతి సూడనోడు
గద్దర్‌కి గజ్జెల లాగులు కొనిచ్చినాడట

దండంరా దూత
చెరువుగట్టు గుండ్ల మీద జాగిప్పిస్తం
గవ్వలు, పావులాలు, తూటుపైసలు,
యాపరిల్లలు పట్టుకొని శిగాలూగు
పచ్చని తెలంగాణాల చిచ్చుబెట్టకు
తెలంగాణను తెర్లుజేయకు




విశ్వనాథుల పుష్పగిరి

బాబు ఆదేశం.. పవన్ 'నిర్మాణ' రాగం!

- నాడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటునే వ్యతిరేకించిన చంద్రబాబు
- ఏటా జూన్ 2న 'నవ నిర్మాణ దీక్ష' పేరుతో నిరసనలు
- ఇప్పుడు అదేరోజు 'నవ నిర్మాణ సభ'కు పవన్ యత్నం
- బాబు డైరెక్షన్‌కు ఇదే సాక్ష్యమంటున్న విశ్లేషకులు

వరంగల్, జూన్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన రాష్ట్రంలోని సమస్యలన్నీ గాలికి వదిలేసి అకస్మాత్తుగా తెలంగాణ రాజకీయాల్లో ఎందుకు వేలు పెట్టినట్టు? తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2వ తేదీనే 'నవ నిర్మాణ సభ' పేరుతో సమావేశం నిర్వహించాలని ఎందుకు నిర్ణయించినట్టు? సందర్భం లేకపోయినా, అవసరం లేకపోయినా 'తెలంగాణ మీ అయ్య జాగీరా?' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఎందుకు చేసినట్టు? వీటన్నింటి వెనుక ఎవరున్నారు? అని తెలంగాణ సమాజంలో చర్చ జరుగుతున్నది. దీనిపై లోతుగా ఆరా తీస్తే చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఇదంతా జరిగిందని రాజకీయ విశ్లేషకులు తేల్చి చెప్తున్నారు. తెలంగాణ ఆవిర్భావాన్ని మొదటినుంచీ జీర్ణించుకోలేని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారని, మళ్లీ తెలంగాణలో పాగా వేసేందుకు సిద్ధమవుతున్నారని, అందులో భాగమే ఇటీవలి వరుస పరిణామాలు, పవన్‌కల్యాణ్ ఎపిసోడ్ అని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.



బాబు డైరెక్షన్‌కు పేరే సాక్ష్యం

2014 జూన్ 2న తెలంగాణ ఆవిర్భవించినప్పటినుంచి ఏటా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను తెలంగాణ ప్రజలు ఘనంగా నిర్వహించుకొంటున్నారు. కానీ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు 2015 జూన్ 2న ఏపీలో 'నవ నిర్మాణ దీక్ష' పేరుతో రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర విభజన వల్ల నష్టపోయామంటూ విషప్రచారం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రజలను ఏకం చేయడమనే ముసుగు తొడిగినా.. నవ నిర్మాణ ప్రతిజ్ఞలోనే 'అశాస్త్రీయంగా జరిగిన రాష్ట్ర విభజన' అని పేర్కొన్నారని, అంటే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించడమే కదా! అని విశ్లేషకులు చెప్తున్నారు. ఐదేండ్లపాటు ఏటా వారం రోజులు తెలంగాణ ఆవిర్భావం రోజే 'నవ నిర్మాణ దీక్ష' పేరుతో రాష్ట్ర విభజనను ఆడిపోసుకున్నారని గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు పవన్‌కల్యాణ్ కూడా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజే 'నవ నిర్మాణ సభ'ను నిర్వహించాలని భావించారని, ఈ పేరును బట్టే బాబు డైరెక్షన్‌లోనే ఇదంతా జరిగిందని స్పష్టమవుతున్నదని అంటున్నారు.

ఆశ చావని చంద్రబాబు

'చింత చచ్చినా పులుపు చావలేదు' అన్నట్టు తెలంగాణ రాష్ట్రంగా ఆవిర్భవించి 12 ఏండ్లయినా, తాను ఆంధ్రప్రదేశ్‌కు రెండోసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నా.. చంద్రబాబు ఇంకా తెలంగాణ వనరులపై ఆశ వదులుకోలేకపోతున్నారని విమర్శకులు పేర్కొంటున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఉన్నన్నాళ్లూ చంద్రబాబు తెలంగాణ రాజకీయాల వైపు చూడలేదు. రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ ఆయన కన్ను తెలంగాణ మీద పడిందని చెప్తున్నారు. తెలంగాణలో బలపడేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ క్రమంలోనే ఇటీవలి మహానాడు వేదికగా తెలంగాణ వ్యతిరేక ప్రసంగాలు, ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు తెరవెనుక సూత్రధారి ఆయనేనని స్పష్టంచేస్తున్నారు. హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మాట్లాడినవాళ్లు.. ప్రత్యేకించి సీఎం రేవంత్‌రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబు పేరు ఎత్తగానే సభా ప్రాంగణంలో పథకం ప్రకారం ఆయనకు అనుకూలంగా పెద్ద ఎత్తున్న నినాదాలు చేయించారనే ప్రచారం జరుగుతున్నది. మరోవైపు పవన్‌కల్యాణ్ సభకు అనుమతి నిరాకరించడంపై చంద్రబాబు అభ్యంతరం వ్యక్తంచేయడం, ఎవరు ఎక్కడైనా సభలు నిర్వహించుకోవచ్చు' అని చంద్రబాబు బుధవారం పేర్కొనడాన్ని బట్టి చూస్తే, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో పోటీచేసేందుకు సన్నద్ధమవుతున్న విషయం తెలుస్తున్నదని చెప్తున్నారు. 'నేను తమిళనాడులో ప్రచారం చేసి వచ్చా, అక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్ ఉన్నది. బీఆర్ఎస్ నేషనల్ పార్టీ అని ఆంధ్రాలోనూ పెట్టారు' అని మొదలుపెట్టి అమెరికా, యూరప్, దేశాల ఉదాహరణలతో ఊకదంపుడు వెనుక ఆంతర్యం 'నేనూ తెలంగాణలో పోటీ చేస్తా' అని చెప్పడమేనని అంటున్నారు.

పవన్‌కల్యాణ్‌కు చంద్రబాబు వత్తాసు

- జన సేన చీఫ్ వైఖరిని సమర్థించిన టీడీపీ అధినేత
- ప్రజల మనోభావాలు ఏ మాత్రం పట్టించుకోని ఏపీ సీఎం చంద్రబాబు
- తెలంగాణ రాష్ట్రంలో పవన్ సభను అడ్డుకోవడం అర్థరహితమని వ్యాఖ్య
- విభేదాలు సృష్టించేందుకు తెలంగాణ నేతలు పోటీపడొద్దంటూ సుద్దులు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేళ కయ్యానికి కాలుదువ్విన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు వత్తాసు పలికారు. ఓ వైపు పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై తెలంగాణ సమాజం ఆగ్రహంతో రగిలిపోతుంటే అవేమీ పట్టనట్టు జనసేన 'నవ నిర్మాణ సభ'ను అడ్డుకోవడం సరికాదని సుద్దులు చెప్పారు. మరోవైపు టీడీపీ, బీజేపీ తెలంగాణపైకి పవన్‌ను బాణంలా వదిలారని ప్రచారం జరుగుతుండగా.. బాబు మాత్రం ప్రజలకు మంచి చేయడంలో నాయకులు పోటీ పడాలని ఉచిత సలహా ఇచ్చారు. ప్రజల మధ్య విభేదాలు తెచ్చేందుకు నేతలు పోటీపడొద్దంటూ తెలంగాణ నేతలను హెచ్చరించేలా వ్యాఖ్యానించారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏండ్ల సమయం గడిచిందని, తమకు ఎవరు మంచి చేశారో ప్రజలకు తెలుసునంటూ చెప్పుకొచ్చారు. అభివృద్ధిని లాజికల్‌గా ముందుకు తీసుకెళ్లాలని, అనవసరంగా వివాదాలు సృష్టించడం ఎవరికీ మంచిది కాదని హితవు పలికారు. తాను తమిళనాడుకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేసి వచ్చానని, పవన్‌కల్యాణ్ తెలంగాణలో సభలు నిర్వహించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం ఏమిటో తనకు అర్థం కావడం లేదని పేర్కొన్నారు. తెలంగాణలో పవన్‌కల్యాణ్‌పై కొంతమంది నేతలు చేస్తున్న వ్యాఖ్యలు మంచి రాజకీయ సంస్కృతి కాదని పేర్కొన్నారు.

బాబుపై నెటిజన్ల ఫైర్

ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలపై నెటిజన్లు మండిపడుతున్నారు. 'పవన్ ఎపిసోడ్ వెనుక స్టోరీ, డైరెక్షన్ బాబుదే' అంటూ సోషల్ మీడియా వేదికగా చురకలు అంటిస్తున్నారు. 'మీకు ముఖం చెల్లకే మీ సిపాయిని తెలంగాణ పైకి పంపారు.. ఈ పరిణామాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు.. 2014లో మీకు పట్టిన గతే రానున్న రోజుల్లో మీ సిపాయికీ పడుతుంది' అంటూ ఘాటుగా స్పందిస్తున్నారు. 'వాళ్లని వీళ్లని పంపడం ఎందుకు? డైరెక్ట్‌గా మీరే రావొచ్చుగా బాబు.. గతంలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని పోటీచేస్తే ఏమైందో చూశారుగా.. వచ్చే ఎన్నికల్లో అంతకు మించి ఉంటుంది' అంటూ కామెంట్లు పెడుతున్నారు. 'ఇక్కడ కాంగ్రెస్, ఏపీలో టీడీపీ ఫెయిల్యూర్స్ నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే పవన్‌కల్యాణ్‌ను రంగంలోకి దింపారు..'అని అభిప్రాయాలు వ్యక్తంచేశారు.

రాజధానే కట్టుకోలేనోళ్లు తెలంగాణను పునర్నిర్మిస్తారా?

ఈ రాష్ట్రంపై దండయాత్రకు మోదీ, బాబు, పవన్ ప్లాన్

- వారికి ఏజెంట్‌గా రేవంత్‌రెడ్డి
- ఉచిత విద్యుత్ ఎసరుకే 'రైతు డిస్కమ్' పేరిట కుట్రలు
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, వేదికపై బిగాల గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, హన్మంత్ షిండే, వీజీ గౌడ్, రవీందర్ సింగ్ తదితరులు

ఖలీల్‌వాడి, జూన్ 3: రాజధాని, సెక్రటేరియట్‌ను కూడా కట్టుకోలేని వారు తెలంగాణకు వచ్చి పునర్నిర్మిస్తారా అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. నిజామాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, 'సర్'పై అవగాహన, నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో జరుగుతున్న పరిణామాల వెనుక చంద్రబాబు, మోదీ ఉన్నారని, రేవంత్‌రెడ్డిని ఏజెంట్‌గా వాడుకుంటూ తెలంగాణపై దండయాత్రకు ప్లాన్ చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ వ్యతిరేక శక్తుల నుంచి కాపాడుకోవడానికి కేసీఆరే శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ కబ్జాలు చేయడమే కాంగ్రెస్ నాయకుల పనిగా మారిందని మండిపడ్డారు. నాదరగుల్, వట్టినాగులపల్లి భూముల్లో వందల కోట్ల కుంభకోణాలకు పాల్పడ్డారని, మంచిరేవులలో వేణుగోపాలస్వామి దేవాలయానికి చెందిన 116 ఎకరాల దేవాదాయ భూములను మింగేసేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారని ఆరోపించారు.

ఉచిత విద్యుత్తును ఎత్తేసేందుకే ప్లాన్

రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్ అందకుండా చేసి వ్యవసాయ రంగాన్ని నిలువునా ముంచేందుకే రైతు డిస్కమ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి తెరపైకి తెచ్చినట్టు వేముల విమర్శించారు. విద్యుత్ డిస్కమ్‌ను మూడు ముక్కలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తెస్తున్న కొత్త విధానం వెనుక వేల కోట్ల కుంభకోణం దాగి ఉన్నదని ఆరోపించారు. ఫ్యాక్టరీలు, కమర్షియల్, గృహావసరాలకు సంబంధించి ఆదాయం వచ్చే డిస్కమ్‌లను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి వేల కోట్లు దోచుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పథకం వేసినట్టు తెలిపారు. గతంలో కమర్షియల్, ఇండస్ట్రియల్ విభాగాల నుంచి వచ్చే ఆదాయంలో నుంచి ఏటా రూ.10 వేల కోట్ల ఉచిత వ్యవసాయ విద్యుత్ కోసం వాడేవారమని తెలిపారు. ఇప్పుడు లాభాలు వచ్చేవి ప్రైవేట్‌కు ఇచ్చి కరెంట్ డిపార్ట్‌మెంట్‌పై ఉన్న రూ.35 వేల కోట్ల బాకీని రైతు డిస్కమ్‌పై నెడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ షిండే, సభ్యత్వ నమోదు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, అర్బన్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి రవీందర్ సింగ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నోరుపారేసుకుంటే నాలుకలు తెగ్గోస్తం

- తెలంగాణ బిడ్డలను అవమానిస్తే ఊరుకోం
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- కాంగ్రెస్ పాలనలో ప్రజలకు సంతోషం దూరం: మహబూద్ అలీ
- మళ్లీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలి: శ్రీనివాస్‌గౌడ్
- మహబూబ్‌నగర్, కొత్తకోట, పేట, మక్తల్‌లో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశాలు



వనపర్తి జిల్లా కొత్తకోటలో జరిగిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్, జూన్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ ప్రజలపై నోరు పారేసుకుంటే నాలుకలు తెగ్గోస్తమని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లా కొత్తకోట, నారాయణపేట జిల్లాతోపాటు మక్తల్‌లో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశాలు బుధవారం నిర్వహించారు. మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయ వాదం.. ఉగ్రవాదం కంటే ప్రమాదం అంటావా? తస్మాత్ జాగ్రత్త అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను హెచ్చరించారు. మాది ముమ్మాటికీ జాతీయ వాదమేనని పేర్కొన్నారు. తెలంగాణను మీ స్వార్థం కోసం ఉమ్మడి రాష్ట్రంలో కలుపుకొని ఇక్కడి సంస్కృతీసంప్రదాయాలు, జీవన విధానాలకు భంగం కలిగించి అభివృద్ధిలో వివక్షత చూపడం వల్లే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం పురుడు పోసుకున్నదని గుర్తుచేశారు. హామీలు అమలు చేయక ప్రజల తిరస్కారానికి గురైన రేవంత్ ద్రోహిగా చరిత్ర సృష్టించాడన్నారు.

కాంగ్రెస్ పాలనతో సంతోషానికి ప్రజలు దూరం: మహమూద్ అలీ

అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా లేరని మాజీ డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, 'సర్'పై పార్టీ నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ప్రాణాలను పణంగా పెట్టారని తెలిపారు.

కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయాలి: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కేసీఆర్ మళ్లీ సీఎం కావాలన్న లక్ష్యంతో కార్యకర్తలు అలుపెరుగని కృషి చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాలనపై అన్ని వర్గాలు అసంతృప్తిలో ఉన్నాయని, ఇచ్చిన హామీల అమలు కోసం రేవంత్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. ప్రజల వద్దకు వెళ్లి సర్కారు వైఫల్యాలను ఎండగట్టాలని కోరారు. బీఆర్ఎస్ సభ్యత్వ నమోదులో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేయాలని, రాష్ట్రంలోనే అత్యధికంగా సభ్యత్వాలు పాలమూరులో నమోదయ్యేలా చూడాలని పిలుపునిచ్చారు. సర్‌లో అర్హుల పేర్లు తొలగించకుండా చూడాలని సూచించారు.

ఈ నేల భూమిపుత్రుల జాగీరే

ఔను.. అదే నిజం!

> మొదటిపేజీ తరువాయి...

వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో తనకు మంచి సోదరభావం ఉన్నదని తెలిపారు. తెలంగాణలో రాజకీయం చేయాలనిగానీ, అక్కడ పోటీ చేయాలనే ఉద్దేశంగానీ తనకు లేవని వెల్లడించారు. ఇక్కడి జనసేన కార్యకర్తలే తెలంగాణలోనూ పోటీ చేద్దామని తనపై ఒత్తిడి తెచ్చారని చెప్పారు. ఈ క్రమంలో జరిగిన చిన్న ఘటన అనవసరంగా పెద్దగా మారిందని, పోలీసులు ముందే సభకు అనుమతి ఇచ్చి ఉంటే ఇది జరిగేది కాదన్నారు.

12 ఏండ్లయినా తరగని సెంటిమెంట్

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి 12 ఏండ్లు గడుస్తున్నా.. ఆ రాష్ట్ర ప్రజల్లో తెలంగాణ అనే భావోద్వేగం, సెంటిమెంట్ ఏమాత్రం తగ్గలేదని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. ఏపీ వాళ్లకే ఎలాంటి ఆంధ్రా భావన అనేది లేదని, ఇక్కడ ఎప్పుడూ కులాల పంచాయితీలు తప్ప ప్రాంతీయ అస్తిత్వం, బలం కనిపించబోవని పేర్కొన్నారు. సభలకు అనుమతులు నిరాకరిస్తూ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. ఈ అప్రజాస్వామిక ధోరణిపై కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ కూడా ఆలోచించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు.



మంత్రి పొన్నంకు జనసేన బెదిరింపులు

తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జనసేన కార్యకర్తలు పలువురు బెదిరింపులకు దిగారు. దమ్ముంటే ఫోన్ లిఫ్టు చెయ్.. అంటూ తీవ్ర దుర్భాషలాడుతూ జనసేన నాయకుడు చందు తదితరులు హెచ్చరికలు జారీచేశారు. సోషల్ మీడియా వేదికగా కూడా జనసేన కార్యకర్తలు బెదిరింపులకు పాల్పడ్డారు. అదే విధంగా సీఎం రేవంత్‌రెడ్డిపైనా చందు మరికొందరు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీచేశారు. బలిస్తామంటూ చందు మరికొందరు హెచ్చరిస్తున్న వీడియో ఎస్ఎంలో వైరల్‌గా మారింది.

పవన్‌కల్యాణ్‌ది ప్రజాద్రోహమే!

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేయడం ప్రజాద్రోహమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. పవన్‌కల్యాణ్ పరిపక్వతలేని వ్యాఖ్యలు తెలుగు ప్రజల మధ్య అనవసర ఉద్రిక్తతలు సృష్టించేలా ఉన్నాయని మండిపడ్డారు. తెలంగాణ అవతరణ దినోత్సవం రోజునే వచ్చి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం వెనుక దాగి ఉన్న ఎజెండా ఏమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రెండు రాష్ట్రాల మధ్య సోదరభావాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ఖండించాలని కోరారు. ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై అక్రమ కేసులను నిరసిస్తూ నేడు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని కూనంనేని తెలిపారు.

హుందాగా వ్యవహరించాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ



హైదరాబాద్, జూన్ 3(నమస్తే తెలంగాణ) : పవన్‌కల్యాణ్ తన హోదాకు తగ్గట్టు హుందాగా వ్యవహరించడం లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ తప్పుబట్టారు. ఆంధ్ర రాష్ట్ర సమస్యలపై దృష్టిపెట్టకుండా కేవలం తెలుగు రాష్ట్రాల మధ్య ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించడమేమిటని బుధవారం ఒక ప్రకటనలో నిలదీశారు. ఓ చానల్ ఇంటర్వ్యూలో ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరముంటే బీజేపీ గానీ, జనసేన గానీ అదే మీడియా వేదికగా ఖండించవచ్చుని.. కానీ అంశం తీవ్రతను పెంచి ఆయనపై కాకినాడ, తదితర స్టేషన్లలో కేసులు పెట్టడం ప్రజాస్వామ్యం అనిపించుకుంటుందా? అని ప్రశ్నించారు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంత జర్నలిస్టులు ఖండించి, నిరసనలు తెలిపారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం తెలుగు రాష్ట్రాల మధ్య ప్రాంతీయ విభేధాలు సృష్టించే పరిస్థితికి దారితీసిందని ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం రోజున హైదరాబాద్‌లో పవన్‌కల్యాణ్ మీడియా సమావేశం పెట్టి ఆవేశపూరితంగా ప్రసంగించడం అగ్గికి ఆజ్యం పోసినట్టయ్యిందని మండిపడ్డారు.

పవన్ క్షమాపణలు చెప్పాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



హైదరాబాద్, జూన్ 3(నమస్తే తెలంగాణ) : కమ్యూనిజం, ప్రజాపోరాటాలపై పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రాంతీయ, భాషా విభేదాలను రెచ్చగొట్టేలా, పీడిత ప్రజల వర్గ పోరాటాలను అవమానించేలా మాట్లాడటం తగదని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ బుధవారం ఒక ప్రకటనలో ఆక్షేపించారు. ప్రపంచంలో పెట్టుబడిదారులు, దోపిడీ వర్గాలు ఉన్నంత కాలం శ్రామిక వర్గాల తరపున ఎర్రజెండా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టంచేశారు. పవన్ పూర్తిగా బీజేపీ, ప్రధాని మోదీ అజెండాకు అనుగుణంగా మతోన్మాద, విద్వేష రాజకీయాలను తెలంగాణలో చొప్పించడానికి ప్రయత్నిస్తున్నారని.. ఇక్కడి ప్రజలను రెచ్చగొట్టేలా ఆయన చేస్తున్న చర్యలను తెలంగాణ సమాజం ఎన్నిటికీ ఆమోదించదని తేల్చిచెప్పారు. ఇప్పటికైనా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని సూచించారు.

తెలంగాణ అస్తిత్వంపై కుట్రలు

- మాజీ వీసీ ప్రొఫెసర్ సీతారామారావు



హైదరాబాద్ సిటీ బ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ అస్తిత్వాన్ని, ఉనికిని దెబ్బతీసేందుకు ఢిల్లీ, ఆంధ్రా పాలకుల ఆధ్వర్యంలో తెరవెనుక కుట్రలు జరుగుతున్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు తెలంగాణ సమాజం, యువత తిరిగి ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని బీఆర్ఏఓయూ మాజీ వీసీ ప్రొఫెసర్ సీతారామారావు పిలుపునిచ్చారు. తెలంగాణ అధ్యయన సమాలోచన కేంద్రం(టాస్క్) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'తెలంగాణ అస్తిత్వం-మన కర్తవ్యం' సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం తీవ్రమైన డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయని సీతారామారావు పేర్కొన్నారు. మోదీ సారథ్యంలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసేందుకు వ్యూహాలు పన్నుతున్నారని ఆరోపించారు. ఓయూ మాజీ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ.. 1952 నాటి ఇడ్లీ-సాంబార్ గోబ్యాక్ ఉద్యమం నుంచి తెలంగాణ అస్తిత్వ పోరాటం మొదలైందని గుర్తుచేశారు.


తెలంగాణ మా జాగీరే

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై గద్దర్ కుమార్తె వెన్నెల ఫైర్



హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు గద్దర్ కూతురు, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల కౌంటర్ ఇచ్చారు. 'తెలంగాణ గడ్డ నిన్న మా అయ్యల జాగీర్.. ఈ రోజు మా జాగీర్.. రేపు మా బిడ్డల జాగీర్' అని స్పష్టంచేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సినిమా నటుడిగా, గద్దర్ అభిమానిగా పవన్ కల్యాణ్‌ను తాము అభిమానిస్తామని వెన్నెల తెలిపారు. అలా అని తెలంగాణ గురించి ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ బిడ్డగా తాను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. ఎవరినీ బాధపెట్టకుండా, హింసించకుండా తనను తాను ఆత్మాహుతి చేసుకున్న శ్రీకాంతాచారినే తెలంగాణ ఆవిర్భావానికి సాక్ష్యమని పేర్కొన్నారు. పైసలు పంచితేనో, లాబీలు చేస్తేనో తెలంగాణ రాలేదని తెలిపారు.

లోకం పోకడ



ఒక్క పంట ఏందయ్యా అసహ్యంగా.. మరిన్ని పంటలు వేసి లాభాలు గడించండి!



తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేటీఆర్ పంపిన లేఖను చదువుతున్న గండ్ర జ్యోతి

గండ్ర జ్యోతికి శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్

కృష్ణకాలనీ, జూన్ 3 : వరంగల్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మాజీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పుట్టినరోజు సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం గండ్ర జ్యోతికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన లేఖ రాశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి

కన్నెర్రజేసిన సింగరేణి కార్మికులు

సింగరేణివ్యాప్తంగా మెడికల్ బోర్డు కోసం నిరసన

నమస్తే నెట్‌వర్క్ జూన్ 3: సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించి అన్‌ఫిట్ అయిన కార్మికుల పిల్లలకు వెంటనే ఉద్యోగాలివ్వాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సింగరేణి ఏరియాల్లో టీబీజీకేఎస్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం పెద్దఎత్తున కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో జరిగిన కార్యక్రమంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ.. సింగరేణిలో అవినీతి, అక్రమాలు, కుంభకోణాలపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సింగరేణివ్యాప్తంగా 40నుంచి 50లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, లేని బొగ్గుకు ఐటీ, సీఎస్ఆర్ యాజమాన్యం చెల్లించిందని మండిపడ్డారు. సింగరేణికి విద్యుత్తు పరిశ్రమలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు రూ.54వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, అవి చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని ధ్వజమెత్తారు. దీంతో కార్మికులకు జీతాలు చెల్లించడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లా గోదావరిఖని, జయశంకర్ భూపాలపల్లి, కొత్తగూడెం, మణుగూరులో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. అనంతరం గనుల మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు.


చల్లని కబురు

- 24గంటల్లో కేరళ తీరానికి నైరుతి రుతుపవనాలు
- 8న తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం
- ఇప్పటికే పలు జిల్లాల్లో మొదలైన వర్షాలు
- రాబోయే 3రోజులు భారీ వర్షాలు పడే చాన్స్
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, జూన్ 3(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. నైరుతి రుతపవనాలు 24గంటల్లో కేరళ తీరాన్ని తాకనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 6న రాయలసీమ, 8వ తేదీ నాటికి తెలంగాణకు చేరుకొనే అవకాశం ఉన్నట్టు తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణ, ఏపీలో ఇప్పటికే విస్తారంగా చిరుజల్లులు కురుస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. మంగళవారం ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో కేంద్రీకృతమైన ఉపరితల చక్రవాక ఆవర్తనం బుధవారం బలహీనపడిందని, ఈ ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు. గురు, శుక్రవారా ల్లో రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలో రానున్న నాలు గు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా రెండు నుంచి నాలుగు డిగ్రీలు తగ్గే అవకాశం ఉన్నదని తెలిపారు. బుధవారం సూర్యాపేట లో అత్యధికంగా 44.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. శుక్రవారం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో 40 నుంచి 50 కి.మీ వేగం కలిగిన ఈదురుగాలులతో కూడిన వర్షాలు కొన్నిచోట్ల కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బుధవారం సాయంత్రం నల్లగొండ, సూర్యాపేట, యా దాద్రి-భువనగిరి, సంగారెడ్డి, వికారాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, హనుమకొండ, కామారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు కురిసినట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 24గంటల్లో అత్యధికంగా ఎన్కూరు (ఖమ్మం)-5.74 సెం.మీ వర్షం పడింది.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచీ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పటికప్పుడు అనేక విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుడుతూ పేద, బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి కొత్త బాటలు వేశారు. దేశానికి కొత్తదారి చూపారు. సంక్షేమ రంగంలో వినూత్న సంస్కరణలకు నాందిపలికారు. పదేండ్ల పాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా, గతంలో ఏ రాజకీయ పార్టీ చేపట్టని విధంగా కనీవినీ ఎరుగని రీతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, అనాథలు, లింగమార్పిడీ వ్యక్తులు ఇలా సమాజంలోని ప్రతి వర్గానికీ ఏదో ఒక లబ్ధి చేకూర్చేలా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేయడం విశేషం.

ప్రజాపాలనలో.. సంక్షేమం పాతర



కేసీఆర్ పాలనలో భరోసా.. కాంగ్రెస్ వచ్చాక ఆక్రందన

- దేశానికే దిక్సూచిగా నిలిచిన బీఆర్ఎస్ మానవీయ పథకాలు
- అన్ని రంగాల్లో సమూల మార్పునకు గొప్ప పునాదులు
- పసిగుడ్డు నుంచి పండు ముసలి వరకూ దక్కిన ఫలాలు
- ప్రజాపాలనంటూ గద్దెనెక్కి పథకాలకు రేవంత్ తిలోదకాలు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లోనూ నూతన ఆవిష్కరణలకు చిరునామాగా తెలంగాణను మార్చారనడంలోనూ ఎలాంటి అతిశయోక్తి లేదు. రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, గురుకుల విద్యాలయాలు, ఉచిత విద్యుత్తు, గొర్లు, చేపల పంపిణీ, దళితబంధు, గృహలక్ష్మి, బీసీ బంధు, మైనార్టీ బంధు ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో సంక్షేమ పథకాలు ఉదాహరణగా నిలుస్తాయి. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలన్నీ ప్రత్యక్షంగా ఆయా వర్గాలకు లబ్ధి చేకూర్చడంతోపాటు, పరోక్షంగా రాష్ట్ర ప్రగతికి దోహదపడ్డాయి. బాల్య వివాహాలు, మాతా శిశు మరణాల రేటు కూడా గణనీయంగా తగ్గాయి. రాష్ట్రంలో మాంసం, చేపల ఉత్పత్తి పెరిగింది. పాఠశాలల్లో డ్రాపౌట్స్ తగ్గాయి. ఉన్నత చదువులు చదివే బాలికల సంఖ్య పెరిగింది. భూగర్భజలాలు పెరిగాయి. ఈ విప్లవాత్మక మార్పులన్నీ కేసీఆర్ పథకాల ఫలితాలకు తార్కాణాలుగా నిలిచాయి. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అనుసరిస్తున్న అభివృద్ధి విధానాలు యావత్ దేశానికే స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఇక్కడి పలు పథకాలను అమలు చేయడం విశేషం.

పథకాల రద్దు.. లేదంటే నిధుల కోత..

వినూత్న పథకాలకు, సంక్షేమానికి మారుపేరుగా నిలిచిన తెలంగాణలో ప్రస్తుత రేవంత్ పాలనలో అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి నెలకొన్నది. ఆరు గ్యారెంటీలని చెప్పి అరచేతిలో వైకుంఠం చూపించి ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది. ఫ్రీ బస్సు మినహా ఒక్క గ్యారెంటీ కూడా అమలు కాలేదు. ఇదిలా ఉంటే గత కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన పథకాలను ఒక్కొక్కటిగా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రద్దు చేస్తూ వస్తున్నది. కొన్ని పథకాలను పేరుకు అమలు చేసినా అందులోనూ కోతలు విధిస్తున్నది. కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు, దళితబంధు, బీసీబంధు, మైనారిటీ బంధు, పల్లెప్రగతి, పట్టణ ప్రగతి, చేనేతమిత్ర, కంటివెలుగు తదితర స్కీమ్‌లన్నింటినీ రేవంత్ ప్రభుత్వం రద్దు చేసింది. కల్యాణలక్ష్మి, విదేశీ విద్యానిధి, ఉచిత విద్యుత్తు తదితర పథకాలకు నిధుల విడుదల నిలిపివేసింది. కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇచ్చిన దాఖలా లేదు. స్వయం ఉపాధి పథకాలు లేవు. ఆరుగ్యారెంటీలు కేవలం ప్రకటనలకే పరిమితం కావడంతో తెలంగాణలోని సబ్బండవర్గాల సంక్షేమం ప్రస్తుతం సంక్షోభంలో కూరుకుపోయింది.

కేసీఆర్ కిట్.. కాంగ్రెస్ కట్

మాతాశిశు మరణాల సంఖ్యను తగ్గించడం, ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్య పెంచడమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం 2017లో కేసీఆర్ కిట్ పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవిస్తే మగబిడ్డకు రూ.12 వేలు, ఆడబిడ్డకు 13 వేల ప్రోత్సాహకంతోపాటు, శిశువులకు కావాల్సిన వస్తువుల కిట్లను అందించింది. 2023 చివరి నాటికి దాదాపు 13,29,951 మందికి లబ్ధి చేకూర్చింది. ఫలితంగా సంస్థాగత ప్రసవాల శాతం 91 నుంచి 97 శాతానికి పెరుగగా, ప్రసూతి మరణాల సంఖ్య 92 నుంచి 56 శాతానికి తగ్గింది. నవజాత శిశు మరణాల సంఖ్య 39 నుంచి 17 శాతానికి తగ్గింది. పిల్లల వ్యాక్సినేషన్ రేట్ 68 శాతం నుంచి 96 శాతానికి పెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా పక్కనపెట్టింది.



పైసా ఇవ్వడమూ కష్టమేనా?

బీఆర్ఎస్ అమలు చేస్తున్న పలు పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పేరుకే కొనసాగిస్తున్నది. ఆయా పథకాలకు సంబంధించిన నిధులను కూడా సక్రమంగా విడుదల చేయడం లేదు. కల్యాణలక్ష్మి పథకానికి సంబంధించిన చెక్కుల పంపిణీలో తీవ్ర జాప్యం నెలకొన్నది. ప్రమాదవశాత్తు మరణించిన గీతకార్మికులకు చెల్లించే ఎక్స్‌గ్రేషియా నిధులను నెలల తరబడి విడుదల చేయడం లేదు. రజకులు, నాయీబ్రాహ్మణులకు సంబంధించి 250 యూనిట్ల ఉచిత విద్యుత్తు పరిస్థితి కూడా ఇలాగే తయారైంది. ఇక ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు దాదాపు రూ.10 వేల కోట్లు పేరుకుపోయాయి. ప్రభుత్వం హామీలు ఇవ్వడం తప్ప గడిచిన 24 నెలలుగా రూపాయి విదల్చలేదు. దీంతో కోర్సులు పూర్తి చేసుకున్నా విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. బీసీ ఓవర్సీస్ బకాయిలను కూడా సకాలంలో చెల్లించడం లేదు. 2025 స్ప్రింగ్, ఫాల్ సీజన్లకు సంబంధించి ఎంపిక ప్రక్రియనూ పూర్తి చేయలేదు. దీంతో పథకానికి దరఖాస్తు చేసుకునేవారి సంఖ్య తగ్గిపోతున్నదని అధికారులే వెల్లడిస్తున్నారు. బీసీ స్టడీ సెంటర్లకు నిధులు విదల్చడం లేదు. ఆయా సర్కిళ్లలో పోటీపరీక్షలకు సంబంధించిన శిక్షణ నత్తనడకన కొనసాగుతున్నది. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లోని విద్యార్థులకు మెస్ బిల్లుల చెల్లింపు, అద్దె చెల్లింపు పూర్తిగా గాడి తప్పిపోయింది.

చేనేతకు మొండిచెయ్యి

చేనేత కార్మికుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. తొలుత బతుకమ్మ చీరల ఆర్డర్లను ఇస్తూ చేనేత కార్మికుల ఆదాయాన్ని పెంచింది. అటు తర్వాత థ్రిఫ్ట్ తదితర పథకాలను అమలు చేస్తూ ఆర్థికంగా అండగా నిలిచింది. వర్కర్ టు ఓనర్ పథకాన్ని ప్రవేశపెట్టి యజమానులుగా తీర్చిదిద్దింది. రైతు బీమా తరహాలోనే చేనేత కార్మికులకు రూ.5 లక్షల బీమా కల్పించింది. మగ్గాల ఆధునికీకరణ చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా పథకాలకు పూర్తిగా మొండిచెయ్యే చూపింది. బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వడం లేదు. యూనిఫామ్ దుస్తుల టెండర్లను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నది.

గొర్రెల పంపిణీ నిల్

గొల్లకురుమల కోసం కేసీఆర్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. రూ.11 వేల కోట్లతో 7.3 లక్షల యూనిట్ల గొర్రెల పంపిణీ లక్ష్యంగా పెట్టుకోగా అందులో 7.5 లక్షలకుపైగా యూనిట్లను పంపిణీ చేసింది. మొత్తంగా 1.80 లక్షల మందికి యూనిట్లు అందజేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేసింది.

'కంటివెలుగు'పై చీకట్లు

అంధత్వ రహిత తెలంగాణ నినాదంతో కేసీఆర్ సర్కార్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కంటివెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ కంటిపరీక్షలు నిర్వహించడంతోపాటు, అవసరమైన వారికి కండ్లద్దాలు పంపిణీ చేసింది. పథకం ద్వారా దాదాపు 1,93, 81,127 మందికి పరీక్షలు నిర్వహించింది. కాంగ్రెస్ ఈ పథకాన్ని అటకెక్కించింది.

పల్లె, పట్టణప్రగతి

పల్లెలు, పట్టణాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దడంతోపాటు మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా 2019లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లె ప్రగతి, పట్టణ ప్రగతికి శ్రీకారం చుట్టింది. పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు చేపట్టింది. ఏటా డంప్‌యార్డులు, వైకుంఠధామాల నిర్మాణం, చెత్తసేకరణ, పారిశుధ్య కార్యక్రమాలు, హరితహారం వంటివి క్రమం తప్పకుండా అమలు చేసింది. ఈ కార్యక్రమాలు 80శాతానికి పైగా లక్ష్యాన్ని సాధించాయి. కానీ కాంగ్రెస్ ఈ రెండు స్కీమ్‌లను పక్కనపెట్టింది. పంచాయతీలకు డబ్బులివ్వడం లేదు. మున్సిపాలిటీల్లో కనీసం చెత్త ఊడ్చే పరిస్థితి లేదు. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతున్న దుస్థితి. హరితహారం చెట్లు, పల్లె ప్రకృతి వనాలు ఎండిపోతుండగా, యువకుల కోసం పెట్టిన క్రీడా ప్రాంగణాల్లో చెట్లు మొలుస్తున్న దుస్థితి నెలకొన్నది. ఇటీవల 99రోజుల ప్రణాళికకు కాంగ్రెస్ ప్రభుత్వం పిలుపునిచ్చినా పల్లెలు, పట్టణాల అభివృద్ధికి రూపాయి విదల్చలేదు.

పైసల కటకట ఉన్న పథకాలు

రైతుబంధు

రైతులకు వానకాలం, యాసంగి పంటల సాగుకు రూ.10వేల పెట్టుబడి అందివ్వడం కోసం 2018లో అప్పటి కేసీఆర్ సర్కార్ రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. లబ్ధిదారుల సంఖ్య 50.25 లక్షల మందితో మొదలై 65 లక్షలకు చేరుకున్నది. రైతుల మరణాలు తగ్గుముఖం పట్టాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అరకొరగానే అమలు చేస్తున్నది. పెట్టుబడి సాయం ఎప్పుడు వేస్తుందో తెలియని పరిస్థితి ఉన్నది.

250 యూనిట్ల ఉచిత విద్యుత్తు

బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నాయీబ్రాహ్మణుల సెలూన్లు, రజకుల ధోబీ ఘాట్లకు నెలకు 250 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా అందించే పథకానికి శ్రీకారం చుట్టింది. తద్వారా 1,07,352 మంది రజక, నాయీబ్రాహ్మణులకు లబ్ధి చేకూరింది. అయితే, ఈ స్కీమ్‌కు సంబంధించి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు రూ.250 కోట్లను పెండింగ్ పెట్టింది.

ఫీజురీయింబర్స్‌మెంట్

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. అయినా కేసీఆర్ ప్రభుత్వం దీనిని ప్రతిష్ఠాత్మకంగానే తీసుకొని అమలు చేసింది. కానీ రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నది. పథకానికి సంబంధించి దాదాపు రూ.10 వేల కోట్లను పెండింగ్‌లో పెట్టింది. పైసా విడుదల చేయడం లేదు. అదీగాక ఇటీవల జీవో 7 ద్వారా ఈ ఏడాది నుంచి కేవలం విద్యార్థుల ఖాతాలకే నిధులు జమ చేయాలని నిర్ణయించింది. దానిపైనా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

దళితబంధుకు రాం రాం ..



దళితుల సముద్ధరణ కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా దళితబంధు పథకానికి రూపకల్పన చేసింది. స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకొని జీవించడానికి నిరుపేద దళిత కుటుంబాలకు ఎలాంటి షరతులు, బ్యాంకు లింకేజీ లేకుండా ఏకమొత్తంగా రూ.10 లక్షల నగదు సాయం అందించింది. పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 44 వేల దళిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ దళితబంధు పథకం స్థానంలో అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేసి రూ.12 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇప్పటికీ పథకాన్ని ప్రారంభించలేదు. దళితబంధు పథకాన్ని కొనసాగించకుండా రద్దు చేసింది.

బీసీ 'బంధు'


వెనుకబడిన వర్గాల కుల వృత్తులు, చేతివృత్తిదారులకు ముడిసరుకులు, యంత్రపరికరాల కొనుగోలుకు 100 శాతం సబ్సిడీతో రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా బీసీ బంధు పథకాన్ని అమలు చేసింది. తొలివిడతలో 40 వేల మందికి రూ. లక్ష చొప్పున రుణాలు అందించింది. ఇంకా జాబితాలో 3.60 లక్షల మంది అర్హులకు ఇవ్వాలని నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ పథకాన్ని నిలుపుదల చేసింది.

ఆ చట్టం తెస్తే.. రాజకీయ సన్యాసం తీసుకుంటా

- ఆంధ్రోళ్లకు కాంట్రాక్టులివ్వకుండా చట్టం తెచ్చే దమ్ముందా?
- మంత్రి కోమటిరెడ్డికి మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సవాల్
- గులాబీ జెండాకంటే తనకు ఏ పదవీ పెద్దది కాదని వ్యాఖ్య



హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ఆంధ్రోళ్లకు ఒక్క కాంట్రాక్టు కూడా ఇవ్వబోమని, ఆ విధంగా చట్టం తెస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అంటున్నాడని, సీఎంను ఒప్పించి ఆ చట్టం తెస్తే తాను రాజకీయ సన్యాసం చేస్తానని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సవాల్ విసిరారు. బీజేపీ, టీడీపీ కలిసి మరోసారి తెలంగాణ మీద దాడి చేస్తున్నాయని, ఆంధ్రా కాంట్రాక్టర్లకు తెలంగాణలో ఒక్క ప్రాజెక్టు కూడా ఇవ్వబోమని, అవసరమైతే చట్టం తెస్తామని ప్రకటించిన మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలపై తలసాని ఘాటుగా స్పందించారు. నగరంలోని సీతాఫల్‌మండిలో బుధవారం నిర్వహించిన సికింద్రాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణుల శిక్షణ కార్యక్రమంలో తలసాని మాట్లాడారు. కొందరు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అహంకారం అంటున్నారని.. 'మీ అయ్యను తిడితే నీకు కోపం రాదా?' అని ప్రశ్నించారు. ఎవరు ప్రశ్నిస్తే వారిని లోపలేస్తున్నారని రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గులాబీ జెండా కంటే ఏ పదవీ పెద్దది కాదని, సమయం కోసం వేచిచూడాలని సూచించారు. తాము ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశామని, కానీ రేవంత్‌రెడ్డి వాడే భాష ఎవరినుంచీ వినలేదని విమర్శించారు. ఎన్టీఆర్, చెన్నారెడ్డి, చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి, రోశయ్య, కేసీఆర్ వంటి వారిని చూశామని, పేగులు తీసి మెడలో వేసుకుంటా.. తొండలు వదుల్తా.. గుడ్లు పీకి గోళీలాడుతా.. పండపెట్టి తొక్కుతా అన్న వారిని చూడలేదని చెప్పారు. 'పండపెట్టి తొక్కుతా అని మాత్రమే నువ్వు అంటున్నవ్.. కానీ మేము తొక్కి చూపిస్తాం' అని హెచ్చరించారు. కేసీఆర్ తమకు మర్యాద నేర్పించారని, రాజ్యాంగబద్ధంగా ఉండాలని చెప్పారని గుర్తుచేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ తదితరులు

6న మలేషియాలో ఆవిర్భావ వేడుకలు

- బీఏఎం, మైటా ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- హాజరుకానున్న మాజీ మంత్రి కేటీఆర్
- వేడుకలకు పెద్ద సంఖ్యలో తరలిరానున్న తెలంగాణ ఎన్నారైలు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ వేడుకలను మలేషియాలోని మా ట్రేడ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 6న అట్టహాసంగా నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ ఎన్నారై మలేషియా(బీఏఎం), మలేషియా తెలంగాణ అసోసియేషన్ (మైటా) ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ వైభవాన్ని ప్రతిబింబించేలా కాకతీయ కళాతోరణం, అమరవీరుల స్మారక చిహ్నాల నమూనాలతో వేదికను తీర్చిదిద్దనున్నారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారని నిర్వాహకుడు, బీఆర్ఎస్ ఎన్నారై మలేషియా ప్రెసిడెంట్ మారుతి తెలిపారు. వేడుకల్లో రెండు తెలంగాణ ఎన్నారై యూనియన్లతోపాటు మొత్తం ఎనిమిది తెలుగు సంఘాలు ప్రత్యక్షంగా పాలుపంచుకుంటున్నాయని వెల్లడించారు. మరో 9 యూనియన్లు మద్దతు ప్రకటించాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలకు మలేషియా, సింగపూర్, ఆస్ట్రేలియా సహా పలు ఆగ్నేయాసియా దేశాల నుంచి 2,500 మంది తరలిరానున్నారని తెలిపారు. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు ఉట్టిపడేలా కళారూపాలను ప్రదర్శించనున్నట్టు వివరించారు. కాగా, కార్యక్రమ విజయవంతంపై బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షుడు మహేశ్ బిగాల దృష్టిసారించారు. దీనిపై నిర్వాహకులతో సమీక్షించి పలు సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులా?


బీఆర్ఎస్ నాయకులకు జైళ్లు, కేసులు కొత్తకాదు

మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి తీవ్ర మండిపాటు



చంచల్‌గూడ జైలు వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్

సైదాబాద్, జూన్ 3 : ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ, నిరంతరం పోరాడుతున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వికృతానందం పొందుతున్నదని మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి దుయ్యబట్టారు. బుధవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి చంచల్‌గూడ జైలులో ఉన్న సుమన్‌తో ములాఖత్ అయ్యారు. అనంతరం మీడియాతో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడారు. బాల్క సుమన్‌పై పెట్టిన సెక్షన్లను చూసి జడ్జి సైతం ఆశ్చర్యపోయారని, దేశంలో ఉన్న అన్ని సెక్షను, హత్య, ఆయుధాలు వంటి కేసులు నమోదు చేయడం విడ్డూరమని, ఆయనపై పెట్టిన కేసులపై కోర్టులో న్యాయపోరాటం చేసి న్యాయబద్ధంగా మద్దతు అందిస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు, బీఆర్ఎస్ పార్టీ నాయకులకు కేసులు, జైళ్లు కొత్తకాదని పేర్కొన్నారు. ప్రభుత్వ దమననీతిని ప్రజలకు అర్థం చేయిస్తామని, అణచివేతను ఎదుర్కొంటామని స్పష్టంచేశారు. పదేండ్లలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిబద్ధతతో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఆయన చూపిన దారిలో తాము నడుచుకొంటున్నామని తెలిపారు. చిన్న గదిలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ అంతర్గత సమావేశంలో మాట్లాడిన సంబంధంలేని విషయాలను వక్రీకరించి తప్పుడు కేసును పెట్టిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడానికి సీఎం, మంత్రులు.. పోలీసులను ఉపయోగించుకొంటూ తప్పుడు కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియాలో ప్రశ్నించిన వారందరిపై కేసులు పెట్టి జైళ్లకు పంపిస్తామనుకోవడం ప్రభుత్వ మూర్ఖత్వమని పేర్కొన్నారు. అక్రమ కేసులను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కొంటామని తేల్చిచెప్పారు. ఈ మధ్య అనేకమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజలను భయపెట్టి డబ్బులు వసూళ్లు చేసుకోవడానికి ఫ్యాక్టరీ, ఇండ్లను పేల్చివేస్తామని బహిరంగంగా మాట్లాడినా ఎక్కడ చిన్న కేసులు కూడా పెట్టలేదని మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ తాము అధికారంలోకి వస్తామని, చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఎంబీబీఎస్ విద్యార్థి తండ్రికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి

పేద ఎంబీబీఎస్ విద్యార్థికి 'మర్రి' చేయూత

రూ.75 వేలు అందించిన మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌టౌన్, జూన్ 3: పేద ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థికసాయం చేసి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తన దాతృత్వాన్ని చాటారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని 20వ వార్డుకు చెందిన గౌతమ్‌సాయి ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గౌతమ్‌సాయి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో ఫీజు చెల్లించడం కష్టంగా మారింది. దీంతో విషయం తెలుసుకున్న మర్రి జనార్దన్‌రెడ్డి ఎంజేఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 75 వేల చెక్కును గౌతమ్‌సాయి తండ్రికి బుధవారం అందజేశారు.

బాల్క సుమన్ కేసు బంజారాహిల్స్ పీఎస్‌కు!

బంజారాహిల్స్,జూన్ 3: సింగరేణి ఆస్తులు ధ్వంసం చేయాలని చెప్పారన్న ఆరోపణలతో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును బంజారాహిల్స్ పీఎస్‌కు బదిలీ చేశారు. గతనెల 26న బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలపై నాంపల్లిలోని సింగరేణి సంస్థ జూనియర్ అసిస్టెంట్ ఆనంద్ నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సింగరేణి ఆస్తులను కాల్చేయండి.. రైలు పట్టాలను కోసేయండి.. తదితర వ్యాఖ్యలు చేయడంపై బీఎన్ఎస్ 326(జీ),55,61(2), 351(3), 353 (1),(బీ), 152తో పాటు పీడీపీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. గత శనివారం సుమన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా సుమన్ వ్యాఖ్యలు చేసిన తెలంగాణ భవన్ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుండడంతో ఈ కేసును బుధవారం ఇక్కడికి బదిలీ చేశారు. దీంతో ఇక్కడ తాజాగా మరోసారి ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు తదుపరి విచారణను చేపట్టారు.

● ధాన్యం కొనుగోలులో జాప్యంపై నిరసన



ధాన్యం కొనుగోలులో జాప్యం, గన్నీ సంచులు, లారీల కొరతను నిరసిస్తూ రైతులు యాదాద్రి జిల్లా మోత్కూరు మండలంలోని పాలడుగు హైవేపై గ్రామంలోని రహదారిపై రైతులు బుధవారం బైఠాయించి గంటకు పైగా ఆందోళన చేశారు. పోలీసులు వచ్చి సముదాయించినా రైతులు వినలేదు. నెలన్నర నుంచి ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని రైతులు మండిపడ్డారు. – మోత్కూరు



జనగామ జిల్లా పాలకుర్తిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

ధాన్యం కొనుగోలులో సమస్యల్లేవని నిరూపిస్తే రాజకీయ సన్యాసం

- సీఎం, మంత్రులకు ఎర్రబెల్లి సవాల్
- పాలకుర్తిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన దయాకర్‌రావు

పాలకుర్తి, జూన్ 3: రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు సమస్యలు లేవని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్, తుమ్మలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సవాల్ విసిరారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ శ్రేణులు, రైతులతో కలిసి బుధవారం ఎర్రబెల్లి పరిశీలించారు. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి వడ్లు తడిశాయని, రెండు నెలలైనా కాంటా పెట్టడం లేదని రైతులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల సమస్యలు పరిష్కరించడంలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు విఫలమయ్యారని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి సమస్యలు లేవని చెప్పడం సరికాదని హితవు పలికారు. కాంటాలు కాక ఓ పక్క, కాంటా అయిన ధాన్యాన్ని మిల్లుల వద్ద దింపుకోలేక మరో పక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. తరుగు పేరుతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను నిండా ముంచుతున్నారని మండిపడ్డారు. ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, ఇతర నాయకులు ఉన్నారు.



పెద్దపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నాచేస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తదితరులు

అక్రమ దందాలు నియంత్రించలేరా?

- మట్టి మాఫియా, వడ్ల తరుగు దోపిడీని పట్టించుకోరేందుకు?
- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి


పెద్దపల్లి, జూన్3: పెద్దపల్లి నియోజకవర్గంలో మట్టి మాఫియాను అరికట్టడం, వడ్ల కొనుగోలులో తరుగు దోపిడీని నియంత్రించడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట రాజీవ్ రహదారిపై ధర్నా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నియోజకవర్గంలో అక్రమ దందాలు అడ్డగోలుగా సాగుతున్నాయని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలోని చెరువుల్లో మట్టి మాఫియా చెలరేగిపోతున్నదని మండిపడ్డారు. అధికారుల అండదండలతో సాగుతున్న మట్టి మాఫియా దందాను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. అక్రమంగా ధాన్యాన్ని కట్ చేసిన మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, నష్టపోయిన రైతుల ఖాతాల్లో ఆ తరుగు డబ్బులను తిరిగి జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏవో బండి ప్రకాశ్‌కు వినతి పత్రం సమర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తృణమూల్‌లో చీలిక

బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీకి భారీ షాక్

- 58 మంది టీఎంసీ రెబల్ ఎమ్మెల్యేల వేరు కుంపటి
- ప్రతిపక్ష నేతగా బహిష్కృత ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ





టీఎంసీ రెబల్ ఎమ్మెల్యేలతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న రితబ్రత బెనర్జీ

కోల్‌కతా, జూన్ 3: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆమె పార్టీ రెండుగా చీలిపోయింది. 58 మంది రెబల్ ఎమ్మెల్యేలు వేరు కుంపటి పెట్టుకున్నారు. ఇటీవల మమత పార్టీ నుంచి బహిష్కరించిన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీని పార్టీ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. ప్రతిపక్ష నేతగా రితబ్రత నియమితులయ్యారు. తిరుగుబాటు వర్గాన్ని పార్టీ శాసనసభా పక్షంగా గుర్తించాలని తాము చేసిన విజ్ఞప్తిని స్పీకర్ ఆమోదించారని రితబ్రత మీడియాకు వెల్లడించారు. టీఎంసీకి చెందిన 58 మందితో పాటు మరో ఇద్దరు తమకు మద్దతు ఇస్తున్నారన్నారు. ఆయనకు అధికారులు ప్రతిపక్ష నేత చాంబర్ తాళాలను అప్పగించారు. 'మేమే ప్రధాన ప్రతిపక్షం.. మేం ఒక జట్టుగా పోరాడుతాం' అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై ఆయన విమర్శలు చేశారు. ఈ రెబల్ వర్గం జావెద్ ఖాన్, సందీపన్ సాహా, సియులి సాహాలను తప ఉప నేతలుగా ఎన్నుకుంది. అలాగే అశ్రుబ్రచన్‌ను చీఫ్ విప్‌గా నియమించారు.

మమతే మా నేత

బుధవారం బెంగాల్‌లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్న క్రమంలో తమ పార్టీ నేత మమతా బెనర్జీయేనని, అభిషేక్ బెనర్జీ నాయకత్వాన్ని తిరస్కరిస్తున్నట్టు రెబల్ వర్గ నేత రితబ్రత బెనర్జీ ప్రకటించారు. పార్టీని చీల్చే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. అభిషేక్ బెనర్జీ తీసుకునే నిర్ణయంతో తమ లెజిస్లేటివ్ పార్టీకి సంబంధం లేదని రెబల్ వర్గం స్పష్టం చేసింది. అసెంబ్లీలో విపక్ష నేతగా శోవన్‌దే చటోపాధ్యాయను నియమిస్తున్నట్టు స్పీకర్‌కు అభిషేక్ బెనర్జీ లేఖ రాసిన క్రమంలో ఆయనీ ప్రకటన చేశారు. కాగా, ఆ లేఖపై తాము సంతకం చేయలేదని, అవి ఫోర్జరీవని ఎమ్మెల్యేలు సందీపన్ సాహా, రితబ్రత బెనర్జీలు అంతకుముందు ప్రకటించారు. దీంతో పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై సందీపన్ సాహా, రితబ్రత బెనర్జీలను మమతా బెనర్జీ పార్టీ నుంచి బహిష్కరించారు. పలువురు టీఎంసీ ఎంపీలు టచ్‌లో ఉన్నారు పార్టీ ఎమ్మెల్యేలు రెబల్స్‌గా మారి తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న వేళ టీఎంసీలో మరో విపత్కర పరిణామం చోటుచేసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఆ పార్టీకి చెందిన ఎంపీలు కొందరు పార్టీని వీడుతారని ప్రచారం జరుగుతున్నది. పలువురు టీఎంసీ ఎంపీలు తమతో టచ్‌లో ఉన్నారని బీజేపీ ఎమ్మెల్యే దివ్యేందు అధికారి సంచలన ప్రకటన చేశారు. ఇటీవల కాలంలో 10 నుంచి 15 మంది టీఎంసీ ఎంపీలు తనను ఫోన్‌లో సంప్రదించారని తెలిపారు. త్వరలోనే టీఎంసీ పార్టీ కుప్పకూలనుందని జోస్యం చెప్పారు.

రాష్ట్ర స్థాయి కమిటీలు రద్దు

పార్టీలో తిరుగుబాటు సంభవించి రెండుగా చీలిపోయిన క్రమంలో రాష్ట్ర స్థాయి కమిటీలు, సంస్థాగత విభాగ కమిటీలను తక్షణం రద్దు చేస్తున్నట్టు మమతా బెనర్జీ బుధవారం ప్రకటించారు. పార్టీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా త్వరలోనే వీటిని పూర్తిగా పునర్నిర్మాణం చేయనున్నట్టు ఆమె తెలిపారు. దీంతో పార్టీ సంస్థాగత విభాగాలుగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ ఛత్ర పరిషత్ (టీఎంసీపీ), తృణమూల్ మహిళా కాంగ్రెస్, తృణమూల్ యూత్ కాంగ్రెస్, ఐఎన్‌టీటీయూసీ, మైనారిటీ సెల్ విభాగాల కార్యవర్గాలన్నీ రద్దయినట్టు ఆమె వెల్లడించారు.

మేయర్ పదవికి హకీమ్ రాజీనామా

టీఎంసీ నేత, మమతకు అత్యంత సన్నిహితుడు ఫిర్హాద్ హకీమ్ కోల్‌కతా మేయర్ పదవికి బుధవారం రాజీనామా చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీలో ఏర్పడిన సంక్షోభం తర్వాత కూడా ఆయన మమతకు మద్దతుగా నిలిచారు. మంగళవారం కోల్‌కతాలో జరిపిన నిరసనలో కూడా ఆయన మమతతో ఉన్నారు. అయితే పార్లమెంటరీ పార్టీ తప్ప పార్టీకి చెందిన అన్ని కమిటీలను మమత రద్దు చేయడంతో ఆయన మేయర్ పదవికి రాజీనామా చేశారు. హకీమ్ రాజీనామాను మమత ఆమోదించినట్టు సమాచారం.

'నీట్'గా మరో స్కామ్!

- రూ.20 లక్షలకు గవర్నమెంట్ కాలేజీల్లో మెడికల్ సీట్లు ఆఫర్
- విద్యార్థులతో బ్రోకర్ల బేరం



న్యూఢిల్లీ, జూన్ 3: నీట్ ఎగ్జామ్ పేపర్ లీక్ అయి క్యాన్సిల్ కావడం దేశవ్యాప్తంగా ఎంతటి సంచలనం రేపుతున్నదో చూస్తున్నాం. జూన్ 21న పేపర్ రీఎగ్జామ్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించబోతున్నది. అయితే నీట్ స్కామ్‌లో మరో కొత్తకోణం వెలుగులోకి వచ్చింది. బ్రోకర్లు స్టూడెంట్లకు గవర్నమెంట్ కాలేజీల్లో సీట్లు ఇప్పిస్తామని.. ఇందుకోసం రూ.20 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారట. లీక్ అయిన పేపర్‌ను అమ్మడానికి ఒక్కరి దగ్గరి నుంచి రూ.15 లక్షలు వసూలు చేసిన సంగతి తెలిసిందే. అయితే మరికొందరికి నేరుగా సీట్లు ఎరగా వేశారట. అహ్మదాబాద్‌కు చెందిన శుభమ్ థాకేర్ తనతో సదరు బ్రోకర్లు మెడికల్ సీట్లను ఆఫర్ చేస్తూ మాట్లాడిన ఆడియో కాల్‌ను రికార్డు చేసి బయటపెట్టాడు.

ఏమీ రాయకుండా వదిలేయాలి..

ఈ మెడికల్ సీట్ల కోసం విద్యార్థులకు బ్రోకర్లు కొన్ని సూచనలు చేశారు. ఎవరైతే సీట్లు కావాలనుకుంటారో వాళ్లు ఎగ్జామ్ ఆన్సర్ షీట్లలో ఏమీ రాయకుండా ప్లేన్‌గా వదిలేయాలి. ఆ ఎగ్జామ్ సెంటర్లలో ఉండే కొందరు స్టాఫ్ మెంబర్లు, అధికారులు ఆ ఆన్సర్ షీట్లను సరైన సమాధానాలతో నింపుతారు. వీళ్లు సదరు బ్రోకర్ల నుంచి ఇందుకోసం పేమెంట్ తీసుకుంటారట. అయితే మెరుగైన ర్యాంకులు వచ్చే స్థాయిలో కాకుండా గవర్నమెంట్ కాలేజీల్లో మెడికల్ సీట్లు వచ్చే స్థాయిలో ఆన్సర్లు నింపుతారట. ఈ విషయంపై ఇప్పుడు మరో రచ్చ జరుగుతున్నది. ఎగ్జామ్ సెంటర్లలో అధికారులు కూడా అమ్ముడుపోయారా? అంటూ స్టూడెంట్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరో పరీక్ష నిర్వహణలో వైఫల్యం

- జేఈఈ అడ్వాన్స్‌డ్ అభ్యర్థుల వివరాలు బహిర్గతం
- 1.87 లక్షల మంది డాటా లీక్
- నిజమేనన్న ఐఐటీ రూర్కీ



న్యూఢిల్లీ, జూన్ 3: సీబీఎస్‌ఈ నిర్వహించిన 12వ తరగతి పరీక్షల అస్తవ్యస్త సమస్యల నుంచి విద్యార్థులు బయటపడక ముందే మరో పరీక్ష నిర్వహణ వైఫల్యం వెలుగుచూసింది. తాజాగా జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026 ఫలితాలకు సంబంధించి నిర్వాహకుల నిర్లక్ష్యం ఒకటి బయటపడింది. గత వారం ప్రకటించిన ఈ ఫలితాలకు సంబంధించి లక్షలాది మంది విద్యార్థుల రికార్డుల డాటా ఆన్‌లైన్‌లో లీకయ్యింది. అభ్యర్థుల రికార్డులు, అడ్మిట్ కార్డుల సమాచారం నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా బహిర్గతమైంది. అభ్యర్థుల సమాచారం లీకైన విషయాన్ని ఈ ఏడాది జేఈఈ అడ్వాన్స్‌డ్ నిర్వహించిన ఐఐటీ, రూర్కీ అంగీకరించింది. క్లౌడ్ స్టోరేజ్ తప్పుడు కాన్ఫిగరేషన్ కారణంగా ఈ సమస్య ఏర్పడిందని వివరించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలకు సంబంధించిన పబ్లిక్ క్లౌడ్ స్టోరేజి ప్రామాణీకరణ లేకుండానే అనియంత్రిత యాక్సెస్‌ను అనుమతిస్తున్నట్టు ఒక సైబర్ సెక్యూరిటీ రిసెర్చర్ ఎక్స్ ద్వారా ఐఐటీ దృష్టికి తీసుకువచ్చారు. దీని ద్వారా 1,79,600 మంది అభ్యర్థుల ఫలితాల రికార్డులు, 1,87,00 అడ్మిట్ కార్డు పీడీఎఫ్‌లు బహిరంగంగా యాక్సెస్ అవుతున్నాయని తెలిపారు. దీని ద్వారా అభ్యర్థుల పేర్లు, పుట్టిన తేదీ, ఫోన్ నంబర్లుతో పాటు వారి సబ్జెక్టుల వారీ మార్కులు, ర్యాంకులు అంతా బట్టబయలైందనిఆయన తెలిపారు. అయితే బహిర్గతమైన ఈ డాటా రీడ్ ఓన్లీ రూపంలో ఉన్నందున వాటిని ఎవరూ మార్పు చేయలేరని ఐఐటీ రూర్కీ తెలిపింది.

ఢిల్లీ హోటల్లో భారీ అగ్నిప్రమాదం

21 మంది మృతి, పలువురికి గాయాలు ▪ మృతులలో విదేశీయులే అత్యధికం



మంటల్లో చిక్కుకున్న ఢిల్లీలోని 'ఫ్లరిష్ స్టే బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్' హోటల్

న్యూఢిల్లీ: దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్‌లోగల ఓ రెస్టారెంట్‌లో బుధవారం ఉదయం భారీ స్థాయిలో మంటలు చెలరేగి 21 మంది మరణించగా పలువురు గాయపడ్డారు. ఒకే ప్రవేశ, నిష్క్రమణ మార్గమున్న ఫ్లరిష్ బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ హోటల్లో ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో విదేశీయులే ఎక్కువగా ఉన్నారు. ప్రమాదం నుంచి పలువురిని కాపాడినప్పటికీ మరికొందరు మంటల్లో చిక్కుకుని ఉంటారని తెలుస్తున్నది. స్థానికులు రోడ్డుపై పరుపులు పరచడంతో భవనంలోని మూడవ అంతస్తులో చిక్కుకున్న పలువురు వ్యక్తులు పైనుంచి కిందికి దూకారు. ఓ మహిళ తన చంటిబిడ్డను పట్టుకుని 3వ అంతస్తు నుంచి కిందకు దూకగా ఆమెకు కాలు విరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డీఎఫ్ఎస్‌తోపాటు ఢిల్లీ విపత్తు నిర్వహణ సంస్థ సిబ్బంది, పోలీసులు, అంబులెన్సు సర్వీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. హోటల్‌లో బస చేసిన విదేశీయులు సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా నుంచి చికిత్స కోసం వచ్చినట్లు అధికారులు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద ఈ హోటల్ నడుస్తున్నది. మంటలు వ్యాపించడానికి గల కారణాలు తెలియరాలేదు.

అభిషేక్ బెనర్జీకి ఈడీ సమన్లు

కోల్‌కతా: ప్రాథమిక పాఠశాలల నియామకాల్లో జరిగిన అక్రమాలకు సంబంధించిన కేసులో జూన్ 15న తమ ఎదుట విచారణకు హాజరుకావాలంటూ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ అభిషేక్ బెనర్జీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లు జారీచేసింది. ఈడీ అధికారుల బృందం బుధవారం సాయంత్రం దక్షిణ కోల్‌కతాలోని బెనర్జీ నివాసానికి వెళ్లింది. ఆ సమయంలో ఆయన అక్కడ లేకపోవడంతో ఈడీ అధికారులు ఆ సమన్లను ఆయన సిబ్బందికి అందజేశారు. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడైన అభిషేక్ బెనర్జీని సాల్ట్ లేక్‌లోని సీజీవో కాంప్లెక్స్‌లో తమ ఎదుట హాజరుకావాలని ఈడీ ఆదేశించినట్టు వారు తెలిపారు. ప్రాథమిక పాఠశాలల నియామకాల్లో కుంభకోణంపై 2022 నుంచి ఈడీ విచారణ జరుపుతున్నది. ఈ కేసులో రాష్ట్ర విద్యాశాఖ మాజీ మంత్రి పార్థ చటర్జీతో సహా పలువురు కీలక నేతలను ఈడీ అరెస్ట్ చేసింది.

భారత్‌పై యూఎస్ అదనపు సుంకాలు?

వెట్టిచాకిరీ నిర్మూలనలో విఫలమైనందుకే

న్యూయార్క్, జూన్ 3: భారత్‌పై యూఎస్ మళ్లీ టారిఫ్ బాంబులు వేయడానికి రెడీ అవుతున్నది. ఇండియా-యూఎస్ మధ్య ప్రస్తుతం ట్రేడ్ డీల్ మీద చర్చలు జరుగుతున్నప్పటికీ ఈ టారిఫ్‌లు వేసేందుకు యూఎస్ సిద్ధమవుతున్నది. వెట్టిచాకిరీని నిర్మూలించడంలో ప్రపంచవ్యాప్తంగా 54 దేశాలు ఫెయిల్ అయ్యాయని ఆ దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 10 నుంచి 12.5 శాతం సుంకాలు విధించాలని యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) ప్రతిపాదించింది. ఈ 54 దేశాల్లో ఇండియాతో పాటు యూకే, ఆస్ట్రేలియా, సౌత్ కొరియా, ఇజ్రాయెల్, సౌదీ మరికొన్ని దేశాలున్నాయి.

భారత్‌కు ఎస్-400 స్క్వాడ్రన్

రష్యా నుంచి 4వ యూనిట్

న్యూఢిల్లీ: భారత వాయు రక్షణ సామర్థ్యాలకు ఊతమిస్తూ, రష్యాకు చెందిన ఎస్-400 సుదర్శన్ గగనతల రక్షణ క్షిపణి వ్యవస్థకు చెందిన నాల్గవ స్క్వాడ్రన్ భారత్‌కు చేరుకుంది. రష్యాతో 2018 ఒప్పందం ప్రకారం కుదుర్చుకున్న ఐదు ఎస్-400 స్క్వాడ్రన్‌లలో ఇది నాల్గవది. ప్రతి ఎస్-400 స్క్వాడ్రన్‌లో కమాండ్ అండ్ కంట్రోల్ యూనిట్లు, క్షిపణి లాంచర్లలో కలిసి 16 వాహనాలు ఉంటాయి. ఎస్-400 అనేది ప్రపంచంలోనే అత్యంత అధునాతన గగనతల రక్షణ వ్యవస్థ. ఇది యుద్ధ విమానాలు, నిఘా ప్లాట్‌ఫామ్‌లు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులను గుర్తించడంతో పాటు వాటిని ట్రాక్ చేయగలదు.

ఖమేనీని కలువాలనుంది: ట్రంప్

న్యూయార్క్, జూన్ 3: ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీని కలువాలనుందని అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. యుద్ధం మొదలైనప్పుడే ఖమేనీ గాయపడి మంచాన పడ్డారని.. కానీ అతను ఇరాన్‌ను ప్రభావితం చేస్తున్నారన్నారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండటాన్ని అంగీకరించబోమని ట్రంప్ తేల్చి చెప్పారు. ఇరాన్ కూడా అణ్వాయుధాలు వదిలేయడానికి అంగీకరించిందని.. వాళ్లు తమ మైండ్ సెట్ మార్చుకుంటున్నారని తెలిపారు. ఇరాన్-అమెరికా మధ్య చర్చలు ఆగిపోయాయంటూ వస్తున్న వార్తలన్నీ ఫేక్ అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఐడీలో పోస్టు చేశారు.

ముగ్గురు అధికార ప్రతినిధులను నియమించిన సీజేపీ

న్యూఢిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) బుధవారం ముగ్గురు అధికార ప్రతినిధులను ప్రకటించింది. సామాజిక కార్యకర్త, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ ఈ ఆన్‌లైన్ ఉద్యమంలో చేరాలని నిర్ణయించుకున్న మర్నాడే ఈ పరిణామం చోటుచేసుకోవడం విశేషం. సౌరవ్ దాస్, విజేత దహియా, అశుతోష్ రాంకాలను పార్టీ తమ అధికార ప్రతినిధులుగా పేర్కొన్నది. అధికారిక ఖాతా సస్పెండ్ చేయడంతో, మరో ప్రత్యామ్నాయ 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో సీజేపీ.. 'భారతదేశ రాజకీయ చర్చా సరళిని మార్చడానికి సీజేపీ కట్టుబడి ఉంది. దీనికి కొత్తతరం నేతలు నాయకత్వం వహిస్తారు' అని పేర్కొన్నది. అభిజీత్ దిప్కే అమెరికా నుంచి తిరిగి రాగానే పరిణామం చోటుచేసుకుంది.

అమెరికాలో త్రివర్ణ పతాకానికి అవమానం


న్యూయార్క్, జూన్ 3: అమెరికాలో భారత జాతీయ జెండాకు అవమానం జరిగింది. టెక్సాస్‌లోని ఫ్రిస్కో సిటీ హాల్ బయట క్లేటన్ వాకర్ అనే వ్యక్తి నోట్లో సిగరెట్ ఉంచుకుని.. భారత జెండాను చింపేస్తూ బూతులు మాట్లాడాడు. పక్కనే ఉన్న కొందరు అమెరికన్లు చప్పట్లు కొడుతూ భారత వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ ఘటన ఎప్పుడు జరిగిందో తెలియరాలేదు. కాగా ఫ్రిస్కో సిటీలో ఇండియన్ల జనాభా పెరిగిపోతున్నదని.. వాళ్లే ఆక్రమించేసుకుంటున్నారంటూ అక్కడ వ్యతిరేకిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

దుబాయ్‌లో భారతీయుడికి 9.58 కోట్ల జాక్‌పాట్

దుబాయ్: యూఏఈలోని దుబాయ్‌లో ఉంటున్న భారతదేశానికి చెందిన మదన్ 'దుబాయ్ డ్యూటీ ఫ్రీ డ్రా'లో రూ. 9.58 కోట్లు గెలుచుకున్నారు. తాను గెలుచుకున్న ఈ మొత్తాన్ని ఇక్కడే ఆస్తిలో పెట్టుబడి పెట్టాలనుకుంటున్నట్లు మదన్ తెలిపారు. బుధవారం దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం కాంకోర్స్‌లో జరిగిన డ్రాలో ఆయన ఈ మొత్తాన్ని గెలుచుకున్నారు.

గాడ్జిల్లా ఎల్ నినో!

- ప్రపంచానికి పొంచి ఉన్న ముప్పు
- విపత్కర వాతావరణంతో పాటు ఆర్థిక, రాజకీయ సంక్షోభాలు
- దేశాలకు నిపుణుల హెచ్చరిక



న్యూఢిల్లీ, జూన్ 3: ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ అవాంతరాలను సృష్టించగల తీవ్ర వాతావరణ పరిస్థితులు గాడ్జిల్లా లాంటి ఎల్ నినోతో ఏర్పడే ముప్పు పొంచి ఉంది. ప్రతి దశాబ్దంలో రెండు, మూడు సార్లు సంభవించే సముద్రపు ఉష్ణ తరంగమైన ఎల్‌నినో భూమధ్యరేఖ చుట్టూ పసిఫిక్‌లో ఏర్పడుతున్నదని, అది సెప్టెంబర్‌లో గరిష్ఠస్థాయికి చేరుకుంటుందని ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ ఇప్పటికే హెచ్చరించింది. వెచ్చని సముద్ర ప్రవాహం వాతావరణ సరళిని ప్రభావితం చేసి ఆస్ట్రేలియా, ఆసియా, ఆఫ్రికాలోని దక్షిణ ప్రాంతాల్లో కరువు ముప్పును పెంచుతుంది. ఇది అమెరికా ఖండంలోని కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన తుపానులు, భారీ వర్షపాతం సంభవించే అవకాశాన్ని కూడా పెంచుతుంది. ఇప్పటికే తీవ్రమైన దుర్భిక్షాలు, తుఫానులు మనం చూసినప్పటికీ వచ్చేది మాత్రం రికార్డు స్థాయిలో అత్యంత బలమైన ఎల్‌నినో కావచ్చని, దీని వల్ల మరింత తీవ్రమైన పరిణామాలు సంభవించవచ్చని నిపుణులు తెలిపారు. వీటిలో వరదలు, కొండచరియలు విరిగిపడటం, కార్చిచ్చులు, కరువుకాటకాలు, యుద్ధాలు, వలసల వంటివి ఉంటాయి. ఊహించిన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని డజన్ల కొద్దీ మాన్‌స్టర్ చిత్రాల్లో కనిపించిన భారీ డైనోసార్ లాంటి జీవి పేరు మీద వాతావరణ శాస్త్రవేత్తలు "గాడ్జిల్లా ఎల్ నినో" అనే పదాన్ని వాడుతున్నారు. ఎల్ నినో శతాబ్దాలుగా వాతావరణ సంబంధిత విపత్తులను కలిగిస్తున్నది. ఉదాహరణకు 8వ శతాబ్దంలో పెరూ ప్రాచీన మోచే నాగరికత పతనానికి ఇది కారణమైందని చరిత్రకారులు భావిస్తున్నారు. కాబట్టి ప్రపంచ సరఫరా గొలుసులు, భౌగోళిక రాజకీయాలు అత్యంత సంక్లిష్టంగా ఉన్న ఈ సమయంలో గాడిల్లా ఎల్ నినో ప్రపంచానికి ఎలాంటి పరిణామాలను తీసుకురాగలదన్న విషయమై తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతున్నది.

ఆహార సరఫరాకు అంతరాయం

కరువులు, వరదలను కలిగించడం ద్వారా ఎల్ నినో ప్రపంచ ఆహార వ్యవస్థలకు అంతరాయం కలిగిస్తుందని, దీని వల్ల ఆహార ధరలు విపరీతంగా పెరిగి ఇప్పటికే ఉన్న సరఫరా గొలుసుపై ఒత్తిళ్లు మరింత తీవ్రమవుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇరాన్ యుద్ధానికి ముందు ప్రపంచంలోని ఎరువుల్లో దాదాపు మూడింట ఒక వంతు రవాణాకు ఉపయోగపడిన హార్ముజ్ జలసంధిని మూసివేయడం వల్ల రైతులు ఇప్పటికే అధిక ఎరువుల ధరలతో ఇబ్బందులు పడుతున్నారు.

ఆహార సంక్షోభాలు

చారిత్రకంగా ఎల్ నినో ప్రధాన ఆహార సంక్షోభాలతో ముడిపడి ఉంది. తీవ్రమైన వాతావరణ పరిస్థితుల వల్ల ఏర్పడిన 1877, 1878 నాటి తీవ్ర కరువులు ఉష్ణమండల ప్రాంతాల అంతటా లక్షలాది మంది ప్రాణాలను బలిగొంది. ప్రపంచ ఆహార వ్యవస్థలోని తీవ్రమైన అసమానతలను ఇది బయటపెట్టింది. ఇటీవలే 2015 నుంచి 2016 వరకు కొనసాగిన శక్తివంతమైన ఎల్ నినో సమయంలో దశాబ్దాలలోనే అత్యంత తీవ్రమైన కరువును దక్షిణాఫ్రికా చవిచూసింది. దక్షిణాఫ్రికాలోని కీలక ప్రాంతాల్లో వర్షపాతం తీవ్రంగా పడిపోవడం, మొక్కజొన్న పంట దిగుబడులు కుప్పకూలడం, దీంతో ఆ దేశం లక్షల టన్నుల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవలసి రావడంతో ఆహార ధరలు ఆకాశాన్నంటాయి.

వలసల పెరుగుదల

ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే తీవ్రమైన కరువు పరిస్థితులు వలసలను ప్రేరేపించగలవని, ముఖ్యంగా వ్యవసాయంపై ఎక్కువగా ఆధారపడిన ప్రాంతాల్లో ఇది ఎక్కువగా జరుగుతుందని నిపుణులు తెలిపారు. ప్రాంతాన్ని బట్టి ప్రభావాలు మారుతూ ఉంటాయి. తూర్పు ఆఫ్రికాలో ఈ ప్రభావం తరచుగా సగటుకంటే ఎక్కువ వర్షపాతానికి దారితీస్తుంది. దీనివల్ల సంభవించే వరదలు ఇండ్లను ముంచెత్తి లక్షలాది మంది ప్రజలను నిరాశ్రయులను చేస్తాయి. దీనికి విరుద్ధంగా గ్యాటెమాల, హోండురాస్, ఎల్ సాల్వడార్, నికరాగువా దేశాల్లోని కొన్ని భాగాల్లో విస్తరించి ఉన్న మధ్య అమెరికా "పొడి(డ్రై) కారిడార్" సాధారణంగా ఎల్ నినో సంవత్సరాల్లో తీవ్రమైన కరువును ఎదుర్కొంటుంది. పంట నష్టాలు, ఆహార కొరతలు గ్రామీణ సమాజాలను నాశనం చేస్తాయి. దీనివల్ల చాలా మంది రైతులు పని వెతుక్కుంటూ పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లవలసి వస్తుంది.

యుద్ధాలకు ఆజ్యం

ఎల్ నినోతో ముడిపడి ఉన్న తీవ్ర వాతావరణ పరిస్థితులు ఇప్పటికే బలహీనంగా ఉన్న దేశాల్లో అస్థిరతను పెంచుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్రియాశీల ఘర్షణ ప్రాంతాల్లో ఇప్పటికే క్షీణించిన సహజ వనరులపై మరింత ఒత్తిడి పెరగవచ్చు. కొన్ని సందర్భాల్లో యుద్ధంలో పాల్గొనే పక్షాలు వాటిని ఆయుధాలుగా ఉపయోగించుకోవచ్చు. ఉదాహరణకు యెమెన్‌లో ఘర్షణ సమయంలో నీటి మౌలిక సదుపాయాలు పదేపదే దెబ్బతినడం లేదా అంతరాయానికి గురవడం జరిగింది. 2026 నాటి ఎల్ నినో వల్ల ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడిపోతారో కచ్చితంగా ఎవరూ అంచనా వేయలేరు. కానీ దాని ప్రభావాలు విస్తృతంగా ఉంటాయని నిపుణుల హెచ్చరికల ద్వారా స్పష్టమవుతున్నది. కొందరికి అవి గాడ్జిల్లా తరహాలో భయంకరంగా, ప్రమాదకరంగా ఉంటాయి.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు అత్యవసర ప్రణాళికలు

రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ: వర్షాకాలంలో నైరుతి పవనాలు సాధారణం కంటే తక్కువగా ఉంటాయని, ఎల్ నినో ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అంచనా వేసిన నేపథ్యంలో జిల్లా స్థాయి అత్యవసర ప్రణాళికలను తక్షణమే అమలు చేయాలని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ మంగళవారం కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలను ఆదేశించింది. కృషి భవన్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశానికి అధ్యక్షత వహించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రైతులకు సకాలంలో సలహాలు ఇవ్వడం, కరువును తట్టుకునే, స్వల్పకాలిక విత్తనాల లభ్యత, తేమ సంరక్షణ, జలాశయ నీటిని శాస్త్రీయంగా ఉపయోగించడం వంటి అంశాలకు సన్నాహక చర్యల్లో ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. అత్యవసర చర్యలు స్థానిక పరిస్థితుల ఆధారంగా అమలు చేయాలని, అవి కాగితాలకే పరిమితం కాకూడదని ఆయన అధికారులకు చెప్పారు. రెండు నుంచి నాలుగు వారాలపాటు వర్షం కురువకపోతే తిరిగి విత్తనాలు నాటడం, ప్రాణరక్షక నీటిపారుదల, ప్రత్యామ్నాయ పంటల కోసం స్పష్టమైన వ్యూహాలను సిద్ధం చేసుకోవాలని చౌహాన్ రాష్ట్రాలను కోరినట్లు ఒక అధికారిక ప్రకటన తెలిపింది. రైతులకు త్వరితగతిన చేరువయ్యేందుకు డిజిటల్, కాల్-సెంటర్ సలహాలను ప్రభుత్వం బలోపేతం చేస్తుందని, రాష్ట్రాల స్పందన బలహీనంగా ఉన్నచోట కేంద్ర మద్దతును అందిస్తుందని ఆయన తెలిపారు.

కర్ణాటక సీఎంగా డీకే ప్రమాణం

- డిప్యూటీ సీఎంగా పరమేశ్వర
- మంత్రులుగా 13 మంది
- ఖర్గే, సిద్ధూ వారసులకు చోటు



బెంగుళూరు, జూన్ 3: కర్ణాటక కొత్త సీఎంగా ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు మాజీ సీఎం సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేరళ, హిమాచల్ ప్రదేశ్ సీఎంలు హాజరయ్యారు. 13 మంది మంత్రులుగా, సీనియర్ లీడర్ పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. మే 28న సిద్ధరామయ్య రాజీనామా చేయగా.. 29న డీకే సీఎల్పీ నేతగా ఎన్నికైన సంగతి తెలిసిందే. మూడేండ్లు సిద్ధరామయ్య సీఎంగా పనిచేయగా.. ఇప్పుడు డీకే రెండేండ్లు పనిచేయబోతున్నారు.

మంత్రివర్గంలో 13 మంది..

డీకే క్యాబినెట్‌లో పరమేశ్వర డిప్యూటీ సీఎంగా ఉన్నారు. ఇక మంత్రులుగా కేహెచ్ మునియప్ప, కేజే జార్జ్, ఎంబీ పాటిల్, రామలింగారెడ్డి, సతీశ్ జార్కిహోలి, క్రిష్ణా బైరెగౌడ, ప్రియాంక్ ఖర్గే, యూటీ ఖాదర్, ఈశ్వర్ ఖండ్రే, యతీంద్ర సిద్ధరామయ్య, బైరతి సురేశ్, శరన్ ప్రకాశ్ పాటిల్‌లు ప్రమాణస్వీకారం చేశారు. ఖాదర్, యతీంద్ర మినహా మిగతా వారంతా సిద్ధరామయ్య ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన వారే. ఇక సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గేలకు మంత్రివర్గంలో చోటు దక్కింది.

కువైట్ ఎయిర్‌పోర్ట్‌పై ఇరాన్ దాడి

- ఒక భారతీయుడి మృతి..
- కువైట్, బహ్రెయిన్‌పై ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులు
- అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఆపరేషన్



న్యూఢిల్లీ, జూన్ 3: కువైట్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇరాన్ బుధవారం జరిపిన క్షిపణి దాడిలో ఒక భారతీయుడు మరణించగా మరో 63 మంది గాయపడినట్లు కువైట్ అధికారులు ప్రకటించారు. కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణి, డ్రోన్ దాడులు ప్రారంభించినట్లు ఇరాన్ బుధవారం తెలిపింది. ఇరాన్ టెలికమ్యూనికేషన్ ఆంటెనాను, చమురు ట్యాంకర్‌ను లక్ష్యంగా చేసుకుని ఖేష్మ్ ద్వీపం, హార్ముజ్ జలసంధి సమీపాన అమెరికా ఇదివరకు జరిపిన దాడులకు ప్రతీకారంగా ఈ దాడులు చేపట్టినట్లు ఇరాన్ సాయుధ దళాలు ప్రకటించాయి. భిన్నమైన, మరింత తీవ్రమైన ప్రతిస్పందన ఉంటుందని తాము చేసిన గతంలో చేసిన హెచ్చరిక ఈ ఆపరేషన్‌తో పూర్తయినట్లు ఇరాన్ తెలిపింది. పర్షియన్ గల్ఫ్, హార్ముజ్ జలసంధి, ఖేష్మ్ ద్వీపంలో అమెరికా చేపట్టిన శత్రు చర్యల కారణంగానే కువైట్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ ప్రభుత్వ ప్రసార సంస్థ ఐఆర్ఐబీ పేర్కొన్నది. తమ టెలికమ్యూనికేషన్ ఆంటెనా, చమురు ట్యాంకర్‌పై అమెరికా జరిపిన దాడులకు ప్రతీకారంగా తాము అమెరికా నౌకాదళాన్ని, అమెరికా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నామని ఇరాన్ సాయుధ దళాలు తెలిపాయి.

ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ ధ్వంసం

అంతర్జాతీయ విమానాశ్రయం, దౌత్య మిషన్లుసహా కువైట్‌లోని పౌర సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ జరిపిన దాడుల్లో ఒక భారతీయుడు మరణించినట్లు అంతర్గత రక్షణ మంత్రిత్వశాఖ బుధవారం తెలిపింది. అయితే ఏ దౌత్య మిషన్లకు నష్టం వాటిల్లిందన్న వివరాలను వెల్లడించలేదు. ఏప్రిల్ 8న ఇరాన్ యుద్ధంలో కాల్పుల విమరణ ప్రకటించినప్పటి నుంచి ప్రశాంతంగా ఉన్న గల్ఫ్ దేశానికి ఈ దాడి ఉద్రిక్తతను మరింత పెంచింది. అమెరికాకు సన్నిహిత మిత్రదేశమైన కువైట్‌పై, అలాగే ఇతర గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల వర్షం కురిపించింది. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై తెల్లవారుజామున జరిగిన దాడిలో పలువురు గాయపడ్డారని, దీంతో విమానాలను దారి మళ్లించాల్సి వచ్చిందని ప్రభుత్వ వార్తా సంస్థ తెలిపింది. ఈ దాడి వల్ల విమానాశ్రయం టెర్మినల్ 1 భవనానికి తీవ్ర నష్టం వాటిల్లిందని జనరల్ సివిల్ ఏవియేషన్ అథారిటీని ఉటంకిస్తూ వార్తాసంస్థ పేర్కొన్నది. కొద్దిసేపటికే నష్టాన్ని అంచనా వేసి భద్రతా చర్యలు తీసుకున్న అనంతరం దేశపు ప్రధాన విమానయాన సంస్థ టెర్మినల్-4 నుంచి విమాన సర్వీసులను పునఃప్రారంభించిందని సంస్థ పేర్కొన్నది.

క్షిపణులను అడ్డుకుంటున్నాం

తమ దేశంపై దూసుకువస్తున్న క్షిపణులు, డ్రోన్లను తమ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకుంటున్నాయని కువైట్ సైన్యం ధృవీకరించింది. ఈ అడ్డుకునే క్రమంలో వెలువడుతున్న భారీ పేలుళ్ల శబ్దాలను స్థానికులు విన్నారని కువైటీ ఆర్మీ జనరల్ స్టాఫ్ తెలిపింది. శత్రు లక్ష్యాలను అడ్డుకున్న ఫలితంగా కింద పడిన క్షిపణి శకలాలను, మరే ఇతర గుర్తించలేని వస్తువులను తాకడం, లేదా సమీపానికి వెళ్లడం చేయవద్దని తన పౌరులను కువైట్ సైన్యం హెచ్చరించింది. బహ్రెయిన్ అంతర్గత రక్షణ మంత్రిత్వశాఖ ప్రజలను అప్రమత్తం చేస్తూ సైరన్లు మోగించింది.

కృష్ణాలో కోటా నీళ్లూ వాడుకోలే!

మొదటిపేజీ తరువాయి...

మించి 43 టీఎంసీలను వాడుకున్నది. శ్రీశైలం నుంచి మునుపెన్నడూ లేనివిధంగా 253 టీఎంసీలను మళ్లించుకుపోయి రికార్డు బ్రేక్ చేసింది. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమే ఇందుకు ప్రధాన కారణం.



కాంగ్రెస్ హయాంలోనే అత్యంత కనిష్ఠం

తెలంగాణ ఏర్పాటు తర్వాత కృష్ణా జలాలను అత్యంత కనిష్ఠంగా వినియోగించుకున్నది కాంగ్రెస్ హయాంలోనే. కృష్ణా బేసిన్‌లోని ఉమ్మడి ప్రాజెక్టులకు వచ్చిన జలాలను తాత్కాలిక కోటా మేరకు ఏపీ, తెలంగాణ 66:34 నిష్పత్తిలో వినియోగించుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర విభజనకు ముందు కృష్ణా జలాల్లో తెలంగాణ సగటు వినియోగం 228 టీఎంసీలు మాత్రమే. స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయతోపాటు పలు చెక్ డ్యామ్‌ల నిర్మాణం, పెండింగ్ ప్రాజెక్టులైన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్‌లను పూర్తిచేయడంతో తెలంగాణలోనూ కృష్ణా జలాల వినియోగం పెరిగింది. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేండ్లలో సగటు వినియోగం 228 టీఎంసీల నుంచి 284 టీఎంసీలకు చేరుకున్నది. ముఖ్యంగా 2019–20 నీటి సంవత్సరంలో ఏకంగా 367 టీఎంసీల నీటిని వినియోగించుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది. కానీ, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిస్థితి మళ్లీ తారుమారైంది. ఫలితంగా 2024–25 నీటి సంవత్సరంలో కేవలం 26% జలాలను మాత్రమే వినియోగించుకోగలిగిన తెలంగాణ.. 2025–26లో మరింత తక్కువగా 25.10% జలాల వినియోగానికే పరిమితమైంది.

ఏటా ఏపీ కొత్త రికార్డులు

కృష్ణా జలాల వినియోగంలో ఏటా సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్న ఏపీ 2024–25లో 72%, 2025–26లో ఏకంగా 74.90% (777 టీఎంసీలు) తరలించుకుపోయింది. శ్రీశైలం రిజర్వాయర్ ఫోర్‌షోర్ నుంచి ఏపీకి చెందిన పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ (పీఆర్పీ), తెలుగు గంగ ప్రాజెక్టు (టీజీపీ), ఎస్‌ఆర్‌బీసీ (శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్), మల్యాల, ముచ్చుమర్రి లిఫ్టులు ఉన్నాయి. వాటిలో టీజీపీకి 15 టీఎంసీలు, ఎస్‌ఆర్‌బీసీకి 19 టీఎంసీలు కలిపి మొత్తంగా 34 టీఎంసీల నీటి కేటాయింపులు మాత్రమే ఉన్నాయి. కానీ, గత పన్నెండేండ్లలో ఎన్నడూ లేనివిధంగా ఏపీ కేవలం శ్రీశైలం నుంచే 253 టీఎంసీలను తన్నుకుపోయింది. వాటిలో పీఆర్పీ ద్వారానే 197 టీఎంసీలను కొల్లగొట్టింది.

కాంగ్రెస్ వైఫల్యమే కారణం

2025–26 నీటి సంవత్సరంలో సమృద్ధిగా వానలు కురువడంతో రాష్ట్ర సాధారణ సగటు కంటే 97% అధిక వర్షపాతం నమోదైంది. ఫలితంగా ఎగువ నుంచి కృష్ణాలో నిరుడు నవంబర్ మాసాంతం వరకు వరద ప్రవాహాలు కొనసాగాయి. బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టులు నీటితో కళకళలాడాయి. దీంతో పలుమార్లు క్రస్ట్ గేట్లను ఎత్తాల్సి వచ్చింది. ప్రతి నీటి సంవత్సరం (జూన్ నుంచి మే 31 వరకు) ఉమ్మడి రిజర్వాయర్లలోని నిల్వలను ఏ రాష్ట్రం ఏ మేరకు వినియోగించుకోవాలనేది కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) ఆధ్వర్యంలోని త్రిసభ్య కమిటీ నిర్ణయిస్తూ వస్తున్నది. బోర్డు మెంబర్ సెక్రటరీ, ఇరు రాష్ట్రాల ఈఎన్సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్)లతో కూడిన ఈ కమిటీ ఏటా సీజన్లవారీగా ఎప్పటికప్పుడు సమావేశమై రాష్ట్రాల డిమాండ్లు, అందుబాటులో ఉన్న నీటినిల్వల ఆధారంగా వాటాలను కేటాయిస్తుంది. ఆ మేరకు ప్రాజెక్టుల ఔట్‌లెట్ల నుంచి నిర్ణీత సమయంలో నీటిని విడుదల చేస్తుంది. కానీ, 2025–26 నీటి సంవత్సరం ముగిసే వరకు త్రిసభ్య కమిటీ సమావేశం కాలేదు. కృష్ణా ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు కేఆర్‌ఎంబీ ఎలాంటి ఉత్తర్వులూ జారీ చేయలేదు. కానీ, ఏపీ మాత్రం ఎలాంటి ఇండెంట్లు లేకుండా జూన్ నుంచే కృష్ణా జలాలను కొల్లగొట్టింది. పోతిరెడ్డిపాడు నుంచి యథేచ్ఛగా నీటి మళ్లింపు చేపట్టింది. ఆ తర్వాత నీటి సంవత్సరం ముగియడానికి కేవలం 15 రోజుల ముందు త్రిసభ్య కమిటీ తూతూమంత్రంగా సమావేశమైంది.

తాత్కాలిక కోటా ప్రకారం.. రాష్ట్రం	వాటా	వాడుకోవాల్సిన నీరు	వాడుకున్నది	మిగిలిన జలాలు
ఏపీ	66%	734.27 టీఎంసీలు	777.42 టీఎంసీలు	-43.15 టీఎంసీలు
తెలంగాణ	34%	378.26 టీఎంసీలు	271.79 టీఎంసీలు	106.46 టీఎంసీలు

ఔట్‌లెట్ల వారీగా ఏపీ మళ్లించిన జలాలు

ఔట్‌లెట్	టీఎంసీలు
పోతిరెడ్డిపాడు	197.31
మల్యాల లిఫ్ట్	53.67
ముచ్చుమర్రి లిఫ్ట్	3.18
సాగర్ లెఫ్ట్ కెనాల్	38.45
సాగర్ రైట్ కెనాల్	192.74
ప్రకాశం బరాజ్	190.26
గుంటూరు చానల్	2.12
తుంగభద్ర, సుంకేసుల	94.79
మొత్తం	777.42

తెలంగాణ వాడుకున్న జలాలు..

ఔట్‌లెట్	టీఎంసీలు
కల్వకుర్తి	41.97
హైదరాబాద్ తాగునీరు	16.51
ఏఎమ్మార్పీ లిఫ్ట్	39.28
సాగర్ ఎడమ కాలువ	114.58
ఆర్డీఎస్	6.10
జూరాల	24.61
నెట్టెంపాడు	6.64
భీమా లిఫ్ట్	6.90
కోయిల్‌సాగర్ లిఫ్ట్	1.93
మీడియం ప్రాజెక్టులు	10.81
మొత్తం	271.79

(నోట్: గత నెల 31తో 2025–26 నీటి సంవత్సరం ముగిసిన నాటికి నీటి లెక్కలు. చెన్నై వాటర్ సప్లయ్‌కి సంబంధించిన 7.30 టీఎంసీలు మినహాయించి)

అయినప్పటికీ రేవంత్‌రెడ్డి సర్కార్ ఇదేమిటని అడుగలేదు. తెలంగాణకు సంబంధించిన పూర్తి కోటా జలాలను వినియోగించుకోవడంపై దృష్టి పెట్టలేదు. వాస్తవానికి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్రధాన కాలువకు సంబంధించిన చిన్నపాటి పెండింగ్ పనులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసి ఉంటే ఇప్పటికే అదనంగా మరో 45 టీఎంసీలను వినియోగించుకునే అవకాశం తెలంగాణకు దక్కేది. కానీ ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కాంగ్రెస్ సర్కార్ నిర్వాకం వల్ల ప్రస్తుతం తెలంగాణ కోటాలో 106 టీఎంసీలు వాడకుండా మిగిలిపోయాయి.

రాష్ట్రాలవారీగా కృష్ణా జలాల వినియోగం (శాతాల్లో)

నీటి సంవత్సరం	ఏపీ	తెలంగాణ
2014-15	69.92	30.08
2015-16	64.20	35.80
2016-17	64.81	35.19
2017-18	66.18	33.82
2018-19	67.30	32.70
2019-20	70.12	29.88
2020-21	71.71	28.29
2021-22	70.11	29.89
2022-23	71.04	28.96
2023-24	63.62	36.38
2024-25	72.73	28.27
2025-26	74.90	25.10

- గత నీటి సంవత్సరంలో కృష్ణా నదిలోకి వచ్చిన జలాలు 2,400 టీఎంసీలు
- ఇరు రాష్ట్రాలు కలిపి వాడుకున్న జలాలు 1,049.21 టీఎంసీలు
- ప్రస్తుతం శ్రీశైలం, సాగర్‌లో ఉన్న జలాలు 190 టీఎంసీలు
- అందులో వినియోగానికి అందుబాటులో ఉన్న జలాలు 63 టీఎంసీలు

మధుయాష్కీ సతీమణికి యాక్సిడెంట్

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : నిజామాబాద్ మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్ సతీమణి డాక్టర్ సుచియాష్కీ అమెరికాలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కుమార్తె గగనయాష్కీని ఎండీ కోర్సులో చేర్పించేందుకు బోస్టన్ నుంచి న్యూయార్క్‌కు వెళ్తుండగా, వారు ప్రయాణిస్తున్న కారు భారీ వర్షం కారణంగా అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. సుచియాష్కీ తీవ్రగాయాలతో దవాఖానలో చికిత్స పొందుతున్నట్టు బంధువులు తెలిపారు. ప్రమాద సమయంలో మధుయాష్కీ, సుచియాష్కీ వేర్వేరు కార్లలో ప్రయాణిస్తున్నట్టు తెలిసింది.

బోర్లలో నీళ్లున్నాయని వరి సాగు చేయొద్దు

మొదటిపేజీ తరువాయి...

కొనుగోళ్లకు సంబంధించి ఎన్ని అవాంతరాలు ఎదురైనా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు.

ఎరువుల ధరలు తగ్గించాలి: రైతు సంఘం

హైదరాబాద్, జూన్ 3(నమస్తే తెలంగాణ) : ఎరువుల ధరలు తగ్గించి సకాలంలో రైతు భరోసా ఇవ్వాలని, నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని ఈ నెల 6, 8 తేదీల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్టు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం యూరియా యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

'పెద్ది' టికెట్ రేట్ల పెంపు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): నటుడు రామ్‌చరణ్ హీరోగా నటించిన పెద్ది సినిమా టికెట్ రేట్ల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణలోని సింగిల్ స్క్రీన్లకు రూ.100, మల్టీప్లెక్స్ థియేటర్లలో ఒక్కో టికెట్‌పై రూ.150 చొప్పున పెంచుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నది. గురువారం నుంచి ఈ నెల 13 వరకు ఐదు షోలు వేసేందుకు అనుమతిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భూమ్మర్దికి అధికారుల జీ హుజూర్

కలెక్టర్ ఆదేశంపై ఆక్రమిత భూముల సర్వే • సర్వేకు ముందు మంత్రి బామ్మర్ది ఫామ్‌హౌస్‌కు అధికారులు

- ఆయనతో కలిసి మధ్యాహ్న భోజనం చేసినట్టు వినికిడి
- ముంపుభూముల ఆక్రమణపై స్పష్టత ఇవ్వని అధికారులు

సంగారెడ్డి జూన్ 3 (నమస్తే తెలంగాణ): సింగూరు ముంపు భూములను ఆక్రమించుకుంటున్న వారిపై ఉక్కుపాదం మోపాల్సిన అధికారులు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూమ్మర్దికే జీ హుజూర్ అంటున్నారు. సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం ఖాదిరాబాద్‌లో సింగూరు ముంపు భూముల్లో 200 ఎకరాలపై కన్నేసిన కాంగ్రెస్ మంత్రి బామ్మర్ది వ్యవహారంలో కఠినంగా వ్యవహరించాల్సిన అధికార యంత్రాంగం ఆయన చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సింగూరు ముంపు భూముల ఆక్రమణల మీద 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన భూమ్మర్ది కథనంపై స్పందించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్ సమగ్ర విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూశాఖ నుంచి ఆర్డీవో, ఇరిగేషన్‌శాఖ నుంచి డీఈ స్థాయి అధికారులు ముంపు భూములను పరిశీలించి సర్వే చేపట్టాల్సి ఉంది. అయితే ఉన్నతాధికారులు ఎవ్వరూ సంయుక్తంగా సర్వే నిర్వహించేందుకు సుముఖంగా లేనట్టు తెలుస్తున్నది. కేవలం వట్‌పల్లి తహసీల్దార్ జంగేశ్వర్, ఇరిగేషన్‌శాఖకు చెందిన ఏఈఈలు యాదయ్య, నవీన్, జగన్నాథ్, సర్వేయర్ మురళీధర్ మాత్రమే బుధవారం ఖాదిరాబాద్, సాయిపేట గ్రామాల పరిధిలోని సింగూరు ముంపు భూములను సందర్శించారు. అంతకుముందు తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులు బామ్మర్ది ఫామ్‌హౌస్‌లో ఆయనను కలిశారు. అధికారులతోపాటు ముంపు భూముల వద్దకు బయల్దేరిన ఆ బామ్మర్ది మీడియా ప్రతినిధులను చూసి తిరిగి ఫాంహౌస్‌లోకి వెళ్లిపోయారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్త సర్వే నిర్వహించారు. అయితే సర్వే ప్రారంభానికి ముందు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు మరోమారు ఆ బామ్మర్ది ఫామ్ హౌస్‌లోకి వెళ్లారు. ముంపుభూముల గురించి చర్చించిన అధికారులు ఆయనతో కలిసి మధ్యాహ్న భోజనం చేసినట్టు సమాచారం. దీనిపై స్థానికులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముంపుభూముల ఆక్రమణలపై నిజాలు నిగ్గు తేల్చాల్సిన అధికారులు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి నివాసంలోనే భోజనం చేయటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కాగా మంత్రి భయంతోనే అధికారులు ఆయన బామ్మర్దికి జీ హుజూర్ అంటున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



సంగారెడ్డి జిల్లా సింగూరు ముంపు భూములను సంయుక్తంగా పరిశీలిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు

200 ఎకరాలపై ఆరోపణలు.. సర్వే చేసింది 14 ఎకరాలు

ఖాదిరాబాద్, సాయిపేట గ్రామ శివారులో 200 ఎకరాలను మంత్రి బామ్మర్ది అక్రమించుకున్నట్టు వచ్చిన ఆరోపణలపై నిజానిజాలు తేల్చేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. ఇందులో వట్‌పల్లి తహసీల్దార్ జంగేశ్వర్, ఇరిగేషన్ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు. సింగూరు ముంపు భూములను చదును చేసిన ప్రాంతాలతోపాటు కొరివికుంట, నల్లకుంట కట్టలను తవ్విన ప్రాంతాన్ని, ఆలయం నిర్మాణం కోసం చదును చేసిన ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. అలాగే ముంపుభూముల్లోని మట్టి కుప్పలు, బండరాళ్లు వేసిన ప్రాంతాలను పరిశీలించారు. ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్‌ను గుర్తించేందుకు వీలుగా కబ్జాదారులు బండరాళ్లపై వేసిన గుర్తులను అధికారులు పరిశీలించారు.

రెండు కుంటలు మాయం!

ముంపుభూముల్లోని 200 ఎకరాల భూమిని ఆక్రమించుకోవటంతోపాటు రెండు కుంటలను నామరూపాలు లేకుండా చేశారని ఆరోపణలు వచ్చాయి. అయితే అధికారులు మాత్రం 14.013 ఎకరాల్లో మాత్రమే సర్వే నిర్వహించారు. సింగూరు ముంపు భూముల్లో ఆక్రమణకు గురైనట్టు ఆరోపణలు ఉన్న పెద్ద చెరువు ప్రాంతాన్ని సర్వే చేసినట్టు వట్‌పల్లి తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ముంపుభూముల్లోని కొరివికుంట, నల్లకుంటలను పూర్తిగా ధ్వంసం చేయటం, సింగూరు ప్రాజెక్టు ఫుల్ రిజర్వాయర్ లెవల్‌ను తొలగించటంపై అధికారులు ఎలాంటి ప్రకటన చేయలేదు. అధికారుల తీరుపై ఖాదిరాబాద్, సాయిపేట గ్రామ రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి భయంతోనే అధికారులు మొత్తం ముంపుభూములు, కుంటలను తొలగించిన ప్రాంతాల్లో సర్వే చేయటంలేదని రైతులు అంటున్నారు. సింగూరు ముంపుభూములపై ఉన్నతాధికారులు నిష్పక్షవిచారణ చేపట్టడంతోపాటు భూములు ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గురువారం మరోమారు ముంపుభూములను పరిశీలించి సర్వే నిర్వహించేందుకు సిద్ధం అవుతున్నట్టు తెలిసింది.

భూముల విలువ పెంపు

మొదటిపేజీ తరువాయి...

ఉండగా దీన్ని ప్రభుత్వం రూ.2.75 లక్షలకు పెంచింది. అంటే పల్లెటూళ్లలో ఎకరం ధర ఏకంగా 266.66 శాతం పెరిగింది. హనుమకొండలో ఎకరం ధరను రూ.3 కోట్లుగా నిర్ణయించినట్టు తెలిసింది. ఇక క్యూర్ పరిధిలో వ్యవసాయ భూముల ధరలను కనిష్ఠంగా రూ.15 లక్షలుగా నిర్ణయించినట్టు తెలిసింది. పాత హెచ్‌ఎండీఏ పరిధిలో ఎకరం ధరను రూ.10 లక్షలుగా నిర్ణయించినట్టు సమాచారం. మున్సిపాలిటీల్లో వ్యవసాయ భూముల ధరలను ఎకరానికి కనిష్ఠంగా రూ.5 లక్షలుగా నిర్ణయించినట్టు తెలిసింది. రోడ్ల పక్కన, హైవేల పక్కన వ్యవసాయ భూముల ధరలను భారీగా పెంచినట్టు సమాచారం.

ఓపెన్ ప్లాట్లు.. అపార్ట్‌మెంట్లపై బాదుడు

ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్ ఫ్లాట్లపై ధరలు కూడా భారీగా పెరిగాయి. క్యూర్ పరిధిలో ఓపెన్ ప్లాట్ ధర గజానికి కనీసం రూ.1,500 ఉండగా దీన్ని రూ.3 వేలకు పెంచినట్టు తెలిసింది. అపార్ట్‌మెంట్ ఫ్లాట్లకు రూ.2వేలు నిర్ణయించగా గరిష్ఠంగా రూ.6,500 నుంచి రూ.8 వేలుగా నిర్ణయించినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పాత హెచ్‌ఎండీఏ పరిధిలో ఓపెన్ ప్లాట్ల ధరలను కనిష్ఠంగా రూ.2వేలుగా నిర్ణయించినట్టు తెలిసింది. ఇక్కడ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల ధరలను రూ.1,500గా నిర్ణయించినట్టు సమాచారం. క్యూర్ పరిధిలో ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల ధరలను ప్రస్తుత ధరలపై కనీసంగా 75% పెంచినట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇది 100 శాతం ఉన్నట్టు తెలిసింది.

4వేల కోట్ల ఆదాయమే లక్ష్యం

భూముల ధరలను ఎంతో శాస్త్రీయంగా పెంచినట్టు మంత్రి పొంగులేటి చెప్పారు. శాస్త్రీయత ప్రకటనలకే పరిమితమైందని, పూర్తి అశాస్త్రీయంగా ధరలు పెంచారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవడమే లక్ష్యంగా ధరలు పెంచినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూముల విలువలను పెంచడం ద్వారా ప్రతియేట రూ.1,000 కోట్ల నుంచి 1,500 కోట్ల వరకు అదనపు ఆదాయం వస్తుందని ప్రభుత్వవర్గాలు అంచనా వేస్తున్నాయి. కానీ అసలు లక్ష్యం మాత్రం ప్రతియేటా రూ.4–5 వేల కోట్ల అదనపు ఆదాయం రాబట్టుకునేలా భూముల విలువలను పెంచినట్టు తెలుస్తున్నది. ఓఆర్ఆర్, హెచ్‌ఎండీఏ పరిధి నుంచి భారీగా ఆదాయాన్ని దండుకునేందుకు స్కెచ్ వేసినట్టు పరిశీలకులు భావిస్తున్నారు.

రియల్‌పై ప్రభావం.. ప్రజలపై భారం

అడ్డగోలు విధానాలతో రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేసిన కాంగ్రెస్ సర్కార్.. ఇప్పుడు భూముల ధర పెంపుతో మరో పిడుగు వేసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతంతమాత్రంగా సాగుతున్న వ్యాపారంపై భూముల ధర పెంపు భారీ ప్రభావాన్ని చూపుతుందని రియల్ ఎస్టేట్‌వర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. భూములు, అపార్ట్‌మెంట్ల ఫ్లాట్లు కొనుగోలు చేసేందుకు ప్రజలు ముందుకొచ్చే పరిస్థితి లేదని అంటున్నాయి.

15 నుంచి 100 శాతం పెంపు

బహిరంగ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ ధరలకు మధ్యగల వ్యత్యాసాన్ని అంచనా వేసిన సర్కార్.. భూములు, అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల ధరలను ఆయా ప్రాంతాలను బట్టి కనిష్ఠంగా 15 శాతం, గరిష్ఠంగా 100 శాతం పెంచింది. బహిరంగ మార్కెట్ ధర, ప్రభుత్వ ధర మధ్య వ్యత్యాసం 20 శాతంలోపు ఉంటే అక్కడ ధరలను పెంచలేదు. వ్యత్యాసం 20–50 శాతం మధ్య ఉంటే అక్కడ 15 శాతం పెంచింది. ఇక 50–100 శాతం వ్యత్యాసం ఉంటే అక్కడ 25 శాతం, 100–200 శాతం వ్యత్యాసం ఉంటే 50 శాతం, 200–500 శాతం వ్యత్యాసం ఉంటే 75 శాతం, 500 శాతంవరకు వ్యత్యాసం ఉన్నచోట 100శాతం ధరలను పెంచింది.

'ముఖ్యనేత' అనుచరుడికే ఏజెన్సీ!

మొదటిపేజీ తరువాయి...

సాకుతో మళ్లీ మరో ఏడాది వాయిదా వేస్తుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, మేడిగడ్డ ప్రాజెక్టు కోసం పనిచేస్తున్న అధికారులందరినీ ప్రభుత్వం హఠాత్తుగా బదిలీ చేయడం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది.

'ముఖ్య'నేత అనుచరుడికి పనులు

ప్రభుత్వం అన్నారం, సుందిళ్ల బరాజ్ టెస్టింగ్ పనులకు సంబంధించి అధికారికంగా ఏ ఒక్క ఏజెన్సీతోనూ అగ్రిమెంట్ చేసుకోకుండానే టెస్టింగ్ పనులు కొనసాగిస్తున్నదని, రాష్ట్ర ముఖ్యనేత అనుచరుడికి అనధికారికంగా బరాజ్‌ల పరీక్షలు చేయించే బాధ్యత అప్పగించారనే ఆరోపణలు వస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది వారాల ముందు 2023 అక్టోబర్ 23న మేడిగడ్డ బరాజ్‌లో భారీ శబ్దంతో ఏడవ బ్లాకులోని 20వ పిల్లర్ కుంగింది. 2022లో 29 లక్షల క్యూసెక్కులు, 2023లో 15 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకొని నిలిచిన మేడిగడ్డ బరాజ్‌లో పిల్లర్ కుంగడంపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. అప్పటినుంచి నీటిని మొత్తం 85 గేట్లు ఎత్తి దిగువకు పంపిస్తున్నారు. గత 30 నెలలుగా బరాజ్‌ను పక్కనపెట్టిన రేవంత్ సర్కార్ ఇటీవల మరమ్మతు చేయిస్తామని ప్రకటించినప్పటికీ, పరీక్షల పేరుతో మళ్లీ కాలయాపన చేస్తున్నది. మూడు బరాజ్‌ల్లో పరీక్షల పేరుతో జాప్యం చేస్తూ వస్తున్నది. ఈ వానకాలం సైతం గోదావరి జలాలు మళ్లీ సముద్రం పాలు చేసే కుట్ర చేస్తున్నదనే ఆందోళన వ్యక్తమవుతున్నది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లో అవసరమైన పరీక్షల కోసం నిధులు విడుదల చేశామని, ఏజెన్సీలు పరీక్షలు నిర్వహిస్తున్నాయని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఏజెన్సీలతో అగ్రిమెంట్ కుదుర్చుకోలేదని, ముఖ్యనేత అనుచరుడికి అనధికారికంగా అప్పగించారని ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో మేడిగడ్డ ఏజెన్సీ పనులను ఎట్టకేలకు ఇటీవల ఎల్ అండ్‌టీకి అప్పగిస్తూ అగ్రిమెంట్ చేసుకున్నట్టు తెలుస్తున్నది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల ఏజెన్సీ పనులను ముఖ్యనేత అనుచరుడు చూసుకుంటున్నట్టు సమాచారం.



అరకొరగానే టెస్టులు

మేడిగడ్డ బరాజ్ పునరుద్ధరణ పనులను ఎన్‌డీఎస్‌ఏ నివేదిక సూచనల మేరకు చేపట్టాల్సి ఉన్నది. అందులో భాగంగా బరాజ్‌లకు సంబంధించి జియోఫిజికల్, జియో టెక్నికల్, జియో పెనెట్రేటింగ్ రాడర్ టెస్టులను పుణేలోని సీడబ్ల్యూపీఆర్ఎస్ (సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్) ఆధ్వర్యంలో నిర్వహించాల్సి ఉన్నది. ఆ టెస్టుల నివేదికలను సీడబ్ల్యూసీ, ఎన్‌డీఎస్‌ఏకు పంపి, డిజైన్లను కూడా రూపొందించి వాటికీ ఆమోదం పొందిన తరువాత పనులను చేపట్టాల్సి ఉంటుంది. టెస్టులను మే 28వ తేదీలోగా పూర్తి చేస్తామని సర్కార్ చెప్తూ వచ్చింది. సమీక్షల మీద సమీక్షలు పెట్టి హంగామా చేసింది. అయితే క్షేత్రస్థాయిలో సాంకేతిక పరీక్షల పనులు ఎక్కడివక్కడే మిగిలిపోయాయి. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు చేయాల్సిన టెస్టుల కోసం బోర్‌హోల్స్ వేయాల్సి ఉంటుంది. బరాజ్ పొడవునా, ప్రతి బ్లాక్‌లో పదుల సంఖ్యలో బోర్లు వేయాల్సి ఉన్నది. మొత్తంగా బరాజ్‌ల్లో సాంకేతిక పరీక్షల కోసం దాదాపు 520 బోర్లు వేయాల్సి ఉంటుంది. కానీ, ఇప్పటివరకు మేడిగడ్డలో 11 బోర్‌హోల్స్, అన్నారంలో 10, సుందిళ్లలో 9 మాత్రమే పూర్తి చేశారు. ఇతర టెస్టులు సైతం కనీసం 25% కూడా పూర్తికానీ దుస్థితి నెలకొన్నది.

నేడు కల్నల్ రాక

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను పరిశీలించేందుకు కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ కల్నల్ గురువారం వస్తారని తెలిసింది. ఈ మేరకు ఈఈలు, డీఈలు, ఏఈలు బరాజ్‌ల వద్దకు చేరుకున్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాద మృతులను వెలికితీసే కార్యక్రమంలో కల్నల్ ప్రధాన పాత్ర పోషించారని, ఆయనను కాళేశ్వరం ప్రాజెక్టును పరిశీలించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పంపిస్తున్నారని అధికారుల ద్వారా తెలిసింది. ఐఐటీలో పీహెచ్‌డీ చేసిన కల్నల్ మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్‌లో పనిచేస్తున్నారని చెప్తున్నారు. కాగా, ఆయన మొదట మేడిగడ్డ, అనంతరం అన్నారం బరాజ్‌లను పరిశీలించి వీలునుబట్టి సుందిళ్లకు వెళ్తారని, అధికారులతో అన్నారంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని సమాచారం. ఇదిలా ఉండగా ఒకవైపు బరాజ్‌ల్లో పరీక్షలు నిర్వహిస్తుండగా, మేడిగడ్డ ఈఈ తిరుపతిరావుతోపాటు డీఈ, ఏఈలను ఒకేసారి బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. అన్నారం ఈఈ యాదగిరి గతంలోనే ఉద్యోగ విరమణ పొందగా, ఆయన స్థానంలో ఈఈగా రమేశ్‌బాబు విధులు నిర్వర్తిస్తున్నారు. రమేశ్‌బాబు ఈ ప్రాంతానికి కొత్త కావడం, మేడిగడ్డ ఈఈ తిరుపతిరావు సహా అధికారులంతా బదిలీ కావడం, సుందిళ్ల ఈఈ మరో నెలలో ఉద్యోగ విరమణ పొందనుండటంతో ప్రాజెక్టుపై అవగాహన ఉన్న అధికారులు లేని పరిస్థితి నెలకొన్నది.



తెలంగాణలో హైవేల విస్తరణ

- రూ.7,597కోట్లతో రెండు జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- 190 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల విస్తరణ

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. తెలంగాణ, ఒడిశా, బీహార్ రాష్ట్రాల్లో జాతీయ రహదారుల విస్తరణతో పాటు కొత్త రహదారుల నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా తెలంగాణలోని ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల జాతీయ రహదారి(ఎన్‌హెచ్-63) విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో చేపట్టేందుకు అంగీకారం తెలిపింది. జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-563) విస్తరణకు సైతం కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ పనులను బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్(బీవోటీ-టోల్) పద్ధతిలో విస్తరించనున్నట్టు పేర్కొన్నది. ఈ రెండు జాతీయ రహదారులను కలిపి 190 కిలోమీటర్ల మేర నాలుగు లైన్లుగా విస్తరించనున్నారు. ఇందుకోసం రూ.7,597 కోట్ల వ్యయాన్ని కేంద్రం అంచనా వేసింది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతోపాటు ప్రయాణ సమయం తగ్గి వాణిజ్య కార్యకలాపాలకు కూడా ఊతం లభించే అవకాశం ఉన్నది.

రియల్టీకి చావుదెబ్బ

- సవరించిన భూముల రిజిస్ట్రేషన్ విలువలను 5 నుంచి అమలు చేయాలని సర్కార్ నిర్ణయం
- పేదలకు సొంతింటి కల శాశ్వతంగా దూరం
- రాష్ట్రంలో ఇప్పటికే కుప్పకూలిన స్థిరాస్తి రంగం

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కుదేలైన రియల్ ఎస్టేట్ రంగాన్ని చావుదెబ్బ తీసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది. అందులో భాగంగా ఈ నెల 5 నుంచి రాష్ట్రంలో సవరించిన భూముల రిజిస్ట్రేషన్ విలువలను అమలు చేయాలని నిర్ణయించింది. ఇది ఇప్పటికే మందగమనంలో ఉన్న స్థిరాస్తి రంగానికి ఉరి తాడుగా మారబోతున్నది. మార్కెట్ ధరలకు అనుగుణంగా, శాస్త్రీయంగానే ధరలు పెంచామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరేలా ఉన్నాయి. ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో ఈ నిర్ణయం 'మూలిగే నక్కపై తాటిపండు' పడిన చందంగా ఉన్నదని ఐటీ, నిర్మాణ రంగ నిపుణులు నెత్తీనోరూ బాదుకుంటున్నారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా భూముల క్రయవిక్రయాలు గణనీయంగా పడిపోయాయి. బీఆర్‌ఎస్ హయాంలో కళకళలాడిన రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు పూర్తిగా కుదేలైంది. ఐటీ (సాఫ్ట్‌వేర్) రంగంలో నెలకొన్న ఒడిదొడుకులు, మందగమనం వల్ల కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. భూములు కొనేనాథుడు లేక రియల్టర్లు, ఇండ్లు కట్టే ధైర్యం చేయలేక బిల్డర్లు చేతులెత్తేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భూముల మార్కెట్ విలువలు పెంచడమంటే వెంటిలేటర్‌పై ఉన్న రోగికి ప్రాణవాయువు (ఆక్సిజన్) తీసేయడమేనన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ఆకాశాన్నంటుతున్న నిర్మాణ వ్యయం

నిర్మాణ రంగానికి సంబంధించిన ముడిసరుకుల ధరలు ఇప్పటికే సామాన్యుడికి, బిల్డర్లకు చుక్కలు చూపిస్తున్నాయి. స్టీల్, సిమెంట్, ఇసుక, కంకర, టైల్స్, ఎలక్ట్రికల్ వస్తువుల ధరలు రోజురోజుకూ ఆకాశాన్ని అంటుతున్నాయి. దీనికి తోడు డీజిల్, పెట్రోల్ ధరల మంట రవాణా ఖర్చులను తడిసిమోపెడు చేస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో రిజిస్ట్రేషన్ విలువలను 25 నుంచి 100% మేరకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ రహదారులు, స్టేట్ హైవేల పక్కన ఉన్న ప్రైమ్ ల్యాండ్స్ విలువను కనీసం 50%, వాణిజ్య భూముల విలువను ఎకరాకు కనీసం రూ.10 లక్షలు పెంచబోతున్నది. దీంతో రాష్ట్రంలో ఇప్పటికే అంతంతమాత్రంగా ఉన్న భూముల క్రయవిక్రయాలు పూర్తిగా ఆగిపోయే ప్రమాదం ఉన్నది.

పడిపోతున్న రాబడికి కాగ్ లెక్కలే సాక్ష్యం

ప్రభుత్వ అనాలోచిత విధానాలకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలే అద్దం పడుతున్నాయి. గత బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 2023-24 ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రభుత్వానికి రూ.14,295 కోట్ల ఆదాయం సమకూరింది. ఇది అప్పటి బడ్జెట్ అంచనాల్లో 77.27 శాతానికి సమానం. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ రాబడి దారుణంగా రూ. 8,473 కోట్లకు పడిపోయింది. ఇది బడ్జెట్ అంచనాల్లో కేవలం 45.48 శాతమే. దీన్ని బట్టే రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ ఎంతలా కుదేలైందో అర్థం చేసుకోవచ్చు. అందుకు కారణాలేమిటో పరిశీలించి రియల్ ఎస్టేట్ రంగాన్ని ఆదుకోవాల్సిన రేవంత్‌రెడ్డి సర్కార్ భూముల మార్కెట్ విలువను మరింత పెంచడం ఆత్మహత్యాసదృశ్యమే అవుతుంది.

ప్రజల పాలిట శాపమే

రాష్ట్రంలో ఇండ్ల స్థలాలు, అపార్ట్‌మెంట్ల విలువలు పెంచాలన్న నిర్ణయం సామాన్య, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను శాశ్వతంగా చెరిపేసే అవకాశం ఉన్నది. ఖజానా నింపుకోవడమే ధ్యేయంగా కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయం స్థిరాస్తి రంగాన్ని కోలుకోలేని దెబ్బతీసి, లక్షల మంది భవన నిర్మాణ కార్మికులను రోడ్డున పడేసేలా ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించకపోతే తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ముప్పు తప్పదని ఆర్థిక, స్థిరాస్తి రంగాల నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నేడు వరంగల్‌లో తెలంగాణ వికాస సమితి కవి సమ్మేళనం

వరంగల్, జూన్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా గురువారం హనుమకొండలో తెలంగాణ వికాస సమితి కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. అశోకా కాన్ఫరెన్స్ హాల్ (అనిశెట్టి రజిత ప్రాంగణం)లో నిర్వహించే ఈ కవి సమ్మేళనానికి ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిధారెడ్డి ముఖ్య అతిథిగా, ఆత్మీయ అతిథిగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ హాజరుకానున్నారని తెలంగాణ వికాస సమితి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వనపట్ల సుబ్బయ్య, మల్లావఝుల విజయ్, మాలోత్ భిక్షపతినాయక్, నిమ్మల శ్రీనివాస్ బుధవారం తెలిపారు.సమ్మేళనంలో ప్రముఖ కవులు వీఆర్ విద్యార్థి, రామా చంద్రమౌళి, వఝుల శివకుమార్, నెల్లుట్ల రమాదేవి, కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, పొట్లపల్లి శ్రీనివాసరావు, వేముగంటి మురళీకృష్ణ, ఎన్వీఎన్ చారి, బిల్లా మహేందర్, తైదల అంజయ్య, బండారి రాజ్‌కుమార్, పెద్ది వెంకటయ్య, శంకర్‌రావు శంకేసి, సిరాజుద్దీన్, దేవులపల్లి వాణీదేవి, వల్సపైడి, రామా రత్నమాల, బాలబోయిన రమాదేవి, కోడం కుమారస్వామి, శనిగరపు రాజ్‌మోహన్, షేక్ హాజీ నూరానీ, కార్తీక రాజు, కుంజ కల్యాణి, నాగవెల్లి జితేందర్ సామ్రాట్ తదితరులు తమ కవితాగానం వినిపించనున్నారు.

'పది' అడ్వాన్స్‌డ్ పరీక్షలకు 31వేల మంది

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 31,542 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరంతా పరీక్ష ఫీజు చెల్లించగా, హాల్‌టికెట్లు జారీచేశారు. ఈ పరీక్షలను ఈ నెల 5 నుంచి 12వరకు నిర్వహిస్తామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కే లింగయ్య తెలిపారు.

సచివాలయం సాక్షిగా దంపతుల ఆత్మహత్యాయత్నం

- భూ సమస్య తీర్చడం లేదని మనస్తాపం
- పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొనే యత్నం
- అడ్డుకొని స్టేషన్‌కు తరలింపు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తేతెలంగాణ): తమ భూమి సమస్యకు పరిష్కారం చూపనందుకు మనస్తాపంతో దంపతులిద్దరూ సెక్రటేరియట్ సాక్షిగా బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సెక్రటేరియట్ ప్రధాన ద్వారం సమీపంలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కొండపోచమ్మ గ్రామానికి చెందిన పుట్ట కృష్ణయ్య, ఆయన భార్య సైదమ్మ తమ భూమి సమస్యపై న్యాయం కోసం గత మూడు రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా తమ వినతిని ఎవరూ పట్టించుకోవడం లేదని ఆ దంపతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. బుధవారం ఉదయం పెట్రోల్ డబ్బాతో సెక్రటేరియట్ వద్దకు చేరుకొని ఇద్దరూ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొనేందుకు యత్నించారు. గమనించిన అక్కడి ఎస్పీఎఫ్ సిబ్బంది అప్రమత్తమై వెంటనే వారి శరీరాలపై నీళ్లు చల్లారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. అనంతరం ఆ దంపతులను విచారణ నిమిత్తం సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి భూమి సమస్యకు సంబంధించిన వివరాలను సైఫాబాద్ పోలీసులు సేకరిస్తున్నట్టు సమాచారం.



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న కూలీలు

చట్ట వ్యతిరేక పనులు వద్దు

కోర్టు స్టే ఉన్న భూములు చదును చేయించడంపై ఫార్మా రైతుల ఆగ్రహం

యాచారం, మే 3: చట్టవ్యతిరేక పనులు చేపట్టొద్దని రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతు కూలీలు బుధవారం ఆందోళనకు దిగారు. ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ నాయకురాలు సరస్వతి ఆధ్వర్యంలో మేడిపల్లిలో ఉన్న హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. కోర్టు స్టే ఉన్న ఫార్మా భూములను ఆర్డీవో అనంతరెడ్డి చదును చేయిస్తున్నట్టు కూలీలు తెలిపారు. పోలీసుల అండతో అధికారులు చదును చేయిస్తున్నారన్నారు. తమకు పునరావాసం కల్పించాలని గతంలో కోర్టును ఆశ్రయించినట్టు తెలిపారు. అనంతరం ఫార్మాసిటీ పీఎస్ సీఐ సత్యనారాయణకు వినతిపత్రం ఇచ్చారు.

కాంట్రాక్టర్ల బకాయిలు వెంటనే చెల్లించాలి

- ప్రభుత్వానికి బిల్డర్స్ అసోసియేషన్ డిమాండ్
- 18న చలో హైదరాబాద్‌కు పిలుపు



సచివాలయంలో పోస్టర్లు ప్రదర్శిస్తున్న బిల్డర్లు

హైదరాబాద్, జూన్ 3(నమస్తే తెలంగాణ) : ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, నీటి పారుదల, గిరిజన సంక్షేమం, ఇతర శాఖల్లో చేసిన పనులకు చెందిన రూ.20వేల కోట్లు బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బీఏఐ) రాష్ట్ర చైర్మన్ వీ రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సెక్రటేరియట్ మీడియా సెంటర్ వద్ద ఆయన మా ట్లాడారు. కాంట్రాక్టర్లకు సమస్యను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 18 చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తున్నట్టు ప్రకటించారు. బిల్లుల టోకెన్లు జారీ అయినా ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని వాపోయారు. బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం కారణంగా చిన్న, మధ్యతరహా కాంట్రాక్టర్లు బ్యాంకు లోన్లు చెల్లించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నష్టాలు, తక్కువ టర్నోవర్ కారణంగా అనేక కాంట్రాక్టర్లు కొత్త టెండర్లకు అర్హత కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కంపెనీలు మూతపడటంతో వేలమంది ఉద్యోగాలను కోల్పోతున్నట్టు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఏఐ ఆల్ ఇండి యా వైస్ ప్రెసిడెంట్ వీ సత్యమూర్తి ఆల్ ఇండియా మాజీ వైస్ చైర్మన్ డీవీఎన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ పాల్గొన్నారు.

సెక్రటేరియట్‌లో హౌస్‌కీపింగ్ సిబ్బంది ధర్నా

3 నెలలుగా జీతాలివ్వడం లేదని నిరసన

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పరిపాలనకు కేంద్ర బిందువుగా ఉన్న తెలంగాణ సెక్రటేరియట్‌లో హౌస్‌కీపింగ్ సిబ్బంది ఆందోళనకు దిగడం కలకలం రేపింది. గత మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదంటూ సిబ్బంది బుధవారం ధర్నా చేపట్టడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సెక్రటేరియట్‌లో పనిచేసే సిబ్బందికే రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఇంటి అద్దె చెల్లించలేకపోతున్నామని, కుటుంబపోషణ భారంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. అప్పులు తెచ్చుకొని కాలం వెళ్లదీస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు, కాంట్రాక్టర్లు వెంటనే స్పందించి తమకు బకాయి వేతనాలను తక్షణమే విడుదల చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు.

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి : పీడీఎస్‌యూ

సూర్యాపేట,జూన్ 3: ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భీమనపల్లి ప్రకాశ్, ఎం చందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. అనుమతులు లేకుండా అడ్మిషన్లు ఇస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు దినేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

12న అగ్రికల్చర్ వర్సిటీ ఆవిర్భావ దినోత్సవం

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ ఆవిర్భావ దినోత్సవాన్ని జూన్ 12న నిర్వహించనున్నట్టు యూనివర్సిటీ యాజమాన్యం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఈ సందర్భంగా 'భారత హరిత విప్లవ సాధనలో ఇందిరా గాంధీ సేవలు' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గురుకుల ప్రవేశాల జాబితా విడుదల

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): బీసీ గురుకులాల్లో సీట్లు పొందిన విద్యార్థులు గురువారం రిపోర్టు చేయాలని బీసీ గురుకుల సొసైటీ ఇన్‌చార్జి కార్యదర్శి మల్లయ్యభట్టు వెల్లడించారు. 6, 7, 8, 9 తరగతుల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి రెండో విడత మెరిట్ జాబితా విడుదల చేసినట్టు తెలిపారు. విద్యార్థుల జాబితా సొసైటీ వెబ్‌సైట్ https://tgcet.cgg.gov.in/ https://mjptbcwreis.telangana.gov.inలో అందుబాటులో ఉన్నదని సూచించారు. అడ్మిషన్లు 5 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

టీశాట్ సీఈవో ఉద్యోగ కాలం పొడిగింపు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : టీశాట్ చానల్ సీఈవో బీ వేణుగోపాల్‌రెడ్డి పదవీకాలాన్ని సర్కార్ పొడిగిస్తూ విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా బుధవారం జీవో జారీచేశారు. 2024 మార్చి 5న రెండేండ్ల కాలానికి నియమించగా, ఈ ఏడాది మార్చితో గడువు పూర్తయ్యింది.తదుపరి ఉత్తర్వులొచ్చే వరకు వేణుగోపాల్‌రెడ్డి సీఈవోగా కొనసాగాలని సూచించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల ప్రమోషన్లలో గందరగోళం

- 'రూల్ ఆఫ్ రిజర్వేషన్' పేరిట సీనియారిటీకి తూట్లు?
- ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ హోదాల్లో ఇది వర్తించదంటున్న ఉద్యోగులు

కరీంనగర్ విద్యానగర్, జూన్ 3: ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్ ఉద్యోగోన్నతుల వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. లెక్చరర్ నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ప్రమోషన్లు కల్పించే విషయంలో అమలు చేసే 'రూల్ ఆఫ్ రిజర్వేషన్'ను వర్తింపజేయడంపై అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

ఆర్వోఆర్ పేరిట సీనియర్లకు అన్యాయం


రాష్ట్రంలో 37 ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలు ఉండగా గతనెల చేపట్టిన ప్రమోషన్లపై విమర్శలు వస్తున్నాయి. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పేరిట సీనియర్లకు అన్యాయం చేశారని ఉ ద్యోగులు మండిపడుతున్నారు. గతంలో సీనియారిటీ జాబితాలో చివర్లో ఉన్న పేర్లు, ఇప్పుడు ముం దువరుసలోకి రావడం వెనుక అసలు ప్రమాణాలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అప్పటి అధికారులు తయారు చేసిన జాబితా సరైనదా..? లేక ఇప్పుడు తయారు చేసిన జాబితానే సరైనదా..? అని సిబ్బంది బహిరంగంగానే నిలదీస్తున్నారు. నిబంధనల ప్రకారం.. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ వంటి పరిపాలనా పదవుల్లో సీనియారిటీనే ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు.

నిబంధనలకు విరుద్ధం: టీజీసీటీఏ

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : ప్రమోటీ డిగ్రీ లెక్చరర్స్‌కు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ పదోన్నతులకు జూనియర్ లెక్చరర్ల సర్వీసును పరిగణనలోకి తీసుకోవడంపై టీజీసీటీఏ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బ్రిజేశ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలు, డీఆర్‌డీవో వంటి సైంటిఫిక్ ప్రొఫెసర్ సంస్థల్లో పనిచేసిన సర్వీసును మాత్రమే పరిగణనలోకి తీసుకోవాల్సి ఉండగా, లెక్చరర్‌గా పనిచేసిన కాలాన్ని లెక్కించడంపై ప్రశ్నించారు.

కోరుకున్న చోట పోస్టింగ్‌లు?

గాంధీ నర్సింగ్ కళాశాలకు ఏకంగా ఏడుగురు ప్రొఫెసర్లను కేటాయించగా, మరికొన్ని కళాశాలలకు ఐదుగురు, ముగ్గురు చొప్పున నియమించినట్టు చెబుతున్నారు. జిల్లాల్లో ప్రొఫెసర్ స్థాయి అధికారులు లేకుండానే కళాశాలలు కొనసాగుతున్నా పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొంటున్నారు. కాలేజీల అవసరాల కంటే కోరుకున్న చోట పోస్ట్ ఇవ్వడానికే ప్రాధాన్యం ఇచ్చినట్టు కనిపిస్తున్నదని ఆరోపిస్తున్నారు. నర్సింగ్ విద్యా విభాగాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులు మూడేండ్లుగా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తూ ఉద్యోగోన్నతులు, బదిలీలు, పోస్టింగ్‌ల వ్యవహారాలను తమకు అనుకూలంగా నిర్వహిస్తున్నారని ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.



ఏఐ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న నమీషా ప్రభాకర్, తదితరులు

విజ్ఞాన్‌లో గూగుల్ ఏఐ ల్యాబ్‌తో సాంకేతిక విప్లవం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): విజ్ఞాన్ వర్సిటీలో గూగుల్ ఏఐ ల్యాబ్ ప్రారంభోత్సవం విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులను భవిష్యత్తు సాంకేతిక ప్రపంచానికి సిద్ధం చేసే కీలక ప్రయాణానికి నాంది అని గూగుల్ క్లౌడ్ ఎడ్యుకేషన్ రీజినల్ హెడ్ నవిషా ప్రభాకర్ పేర్కొన్నారు. ఏపీలోని గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జెమిని ఎంటర్‌ప్రైజ్ ఫర్ ఎడ్యుకేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన గూగుల్ ఏఐ ల్యాబ్‌ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నవిషా ప్రభాకర్ మాట్లాడుతూ.. ఫిన్‌టెక్, ఆరోగ్య రంగం, రోబోటిక్స్, ఇంజినీరింగ్, ఆటోమేషన్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అనేక రంగాల్లో ఏఐ అపార అవకాశాలు సృష్టిస్తున్నదని పేర్కొన్నారు. విద్యార్థులను భవిష్యత్తు సృష్టికర్తలు, ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దడానికి విజ్ఞాన్ వర్సిటీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గూగుల్ భాగస్వామి సంస్థ హెనోటిక్ గ్రూప్ సీఈవో మల్లేశం, వర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, వీసీ ప్రొఫెసర్ కేవీ కృష్ణకిశోర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీఎంవీ రావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రిన్స్‌టన్'తో సంబంధం లేదని బోర్డులు పెట్టండి

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో 'ప్రిన్స్‌టన్' పేరుతో నడుస్తున్న విద్యాసంస్థలకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ.. వాగ్దేవీ విద్యాసంస్థలకు వ్యతిరేకంగా దాఖలు చేసిన ట్రేడ్‌మార్క్ కేసుపై ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. అమెరికాలో ఉన్న యూనివర్సిటీతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ క్యాంపస్ వెలుపల బోర్డులు పెట్టాలని ఆదేశాలు జారీ చేసింది. అమెరికా యూనివర్సిటీ అని విద్యార్థులు మోసపోకుండా ఉండేందుకే ఈ నిర్ణయమని జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, జస్టిస్ వినోద్‌చంద్రన్‌ల ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. జూన్ 12లోగా ప్రముఖ దినపత్రికలలో పావుపేజీ ప్రకటనలు ఇవ్వాలని కాలేజీ యాజమాన్యానికి ఆదేశాలు ఇచ్చింది. కాలేజీ వెబ్‌సైట్లలో పెద్ద అక్షరాలతో డిస్‌క్లెయిమర్ నోటీసు ప్రదర్శించాలని, కాలేజీకి సంబంధించిన అన్నిరకాల సర్టిఫికెట్లు, ఇతర అన్నిపత్రాలపై తప్పనిసరిగా డిస్‌క్లెయిమర్ ముద్రించాలని ఆదేశించింది.

మీ ఫ్రీడమ్ ఫండ్ రెడీనా?

నేటితరం అమ్మాయిలు కేవలం ఉద్యోగం సంపాదించడమే కాదు, తమకంటూ ఒక 'ఆర్థిక సామ్రాజ్యాన్ని' నిర్మించుకోవడంలో దూసుకుపోతున్నారు. అయితే, సంపాదించడం ఎంత ముఖ్యమో, దాన్ని సరైన రీతిలో దాచుకోవడం అంతే అవసరం. మన చేతిలో ఉండే డబ్బు సమాజంలో గౌరవాన్ని మాత్రమే కాదు, అత్యవసర సమయాల్లో ఎవరి ముందూ తలవంచకుండా నిలబడే ఆత్మవిశ్వాసాన్నీ ఇస్తుంది. దీన్నే మనం 'ఫ్రీడమ్ ఫండ్' అనుకోవచ్చు. జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు. హఠాత్తుగా ఉద్యోగం మారాల్సి రావడం, కెరీర్‌లో బ్రేక్ తీసుకోవడం లేదా ఏదైనా వ్యక్తిగత అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు ఈ ఫండ్ రక్షణ కవచంలా పనిచేస్తుంది. మరి దాన్ని ఎలా సమకూర్చుకోవచ్చంటే ...



బడ్జెట్ ప్లానింగ్: ప్రతి నెల సంపాదనలో కనీసం 20 శాతం పొదుపు ఖాతాలోకి వెళ్లేలా చూసుకోవాలి.

పెట్టుబడులపై అవగాహన: బంగారం మాత్రమే కాకుండా మ్యూచువల్ ఫండ్లు, రికరింగ్ డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లలాంటి పెట్టుబడుల పైనా అవగాహన పెంచుకోవాలి.

ఆర్థిక విషయాల్లో భాగస్వామ్యం: ఇంట్లో ఆర్థిక నిర్ణయాల్లో మీరు కూడా పాలుపంచుకుంటూ ఎక్కడ ఖర్చు తగ్గించవచ్చో ఆలోచిస్తూ ముందుకు వెళ్లాలి. అవకాశం ఉన్నప్పుడు ఫ్రీలాన్సింగ్ వర్కులు చేయడంతో పాటు అనవసరమైన షాపింగ్ తగ్గించుకోవడం కూడా కొత్త సంపాదన మార్గమే!





వావ్.. వడ పావ్!

ముంబైకర్లు తెగ ఇష్టపడి తినేవాటిలో వడ పావ్ ఒకటి. అందులోనూ ముంబయిలోని 'అశోక వడపావ్' దగ్గర తినాలని ఉవ్విళ్లూరుతారు. అంత బాగుంటుందక్కడ! ఎంత బాగుంటుందంటే... టేస్ట్ అట్లాస్ నిర్వహించిన సర్వేలో ప్రపంచంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన శాండ్‌విచ్‌లలో 'అశోక వడపావ్' 25వ స్థానాన్ని దక్కించుకుంది. దాదర్‌లోని కృతి ఎం.డోంగ్రేస్ కాలేజీ సమీపంలో ఉన్న అశోక వడపావ్ ముంబైకర్లకు సుపరిచితం. ఎనిమిది దశాబ్దాలుగా తాజా రుచులు పంచుతూనే ఉంది. ఎప్పుడు చూసినా ఈ కొట్టు రుచులు ఆస్వాదిస్తున్న విద్యార్థులు, యాత్రికులు, ఫుడ్ లవర్స్‌తో కిటకిటలాడుతూనే కనిపిస్తుంది.

1960 ప్రాంతంలో అశోక వైద్య అనే వ్యక్తి దాదర్ రైల్వే స్టేషన్ సమీపంలో స్ట్రీట్ ఫుడ్ సెంటర్ నడిపేవాడు. ప్రయాణికులు, మిల్లు కార్మికులు, స్థానికులు ఇష్టపడే స్థానిక వంటకమైన బటాటా వడ (ఉడికించిన ఆలుగడ్డలతో చేసే వడ)ని బన్‌తో చేయడం మొదలుపెట్టాడు. ఆలూతో చేస్తే చాలా సమయం పడుతుంది. మిల్లు కార్మికులకు, స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు అంత సమయం ఉండేది కాదు. అందుకే, వేగంగా అయిపోతుందని బన్‌తో చేయడం ప్రారంభించాడు. ఆయన చేసిన వడపావ్ రుచిగా అందరినీ అలరించింది. ఈ సంగతి ఆ నోటా.. ఈ నోటా ముంబయి అంతా పాకింది. కొన్ని రోజులకే దాదర్‌లో వడపావ్ సెంటర్ ఓపెన్ చేశాడు అశోక వైద్య. నాటి ఆదరణ నేటికీ కొనసాగుతుండటం విశేషం. యూత్‌లో ఈ వెరైటీకి క్రేజ్ అంతా ఇంతా కాదు. తాజాగా టేస్ట్ అట్లాస్ గుర్తింపుతో చిన్న బడ్డీ కొట్టులో వండి, వడ్డించే అశోక వడపావ్ స్ట్రీట్ ఫుడ్ సెంటర్ ఇప్పుడు దేశమంతా పాపులర్ అయింది. ఈసారి ముంబయికి వెళ్లినప్పుడు మీరూ ఓ పట్టు పట్టేయండి.



ఈ తప్పు చేయొద్దు

ఇప్పుడు బీపీ మానిటర్ పరికరాలు విరివిగా అందుబాటులోకి వచ్చాయి. చాలా ఇళ్లలో ఇవి కనిపిస్తున్నాయి. కాకపోతే కొందరు వీటిని సొంత వైద్యానికి ఉపయోగించుకోవటమే చిక్కు తెచ్చి పెడుతున్నది. రెండు, మూడు సార్లు రక్తపోటు నార్మల్ ఉన్నట్టు తేలగానే మందులు మానేయటం.. బీపీ పెరగ్గానే ట్యాబ్లెట్లు వేసుకోవటం చేస్తుంటారు చాలామంది. ఇలాంటి తప్పు చేయొద్దని సూచిస్తున్నారు వైద్యులు. బీపీ మానిటర్‌ని సక్రమంగా వాడుకోవాలి. డాక్టర్ చెబితే తప్ప మాటిమాటికీ పరీక్షించుకోవద్దు. రోజుకోసారి చూసుకుంటే చాలు. రక్తపోటు ఫలితాలను కాగితం మీద రాసుకొని, డాక్టర్ దగ్గరికి వెళ్లినప్పుడు చూపించాలి. అంతే తప్ప సొంతంగా మందులు మానెయ్యటం, మోతాదు తగ్గించటం, పెంచటం లాంటివి చేయొద్దు.



ఇంకా ఎదగాలనే ఆలోచనతో ఉన్నత చదువుల కోసం స్కాలర్‌షిప్‌తో అమెరికాకు వెళ్లింది ఈ హైదరాబాద్ అమ్మాయి. ఓ రోజు ఆమె జీవితం అనుకోని మలుపు తిరిగింది. చామన ఛాయ.. అందమైన పలువరుస.. కలువల్లాంటి కళ్లు... చురుకైన చూపులు గుర్తించి ఫ్యాషన్ ఇండస్ట్రీ ఆమెను ఆహ్వానించింది. ఏడాది గడిచింది.. ప్రఖ్యాత వోగ్ మ్యాగజైన్ కవర్ స్టార్ అయింది. ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ బ్రాండ్ చానెల్‌కి అంబాసిడర్‌గా ఎదిగింది. ఇప్పుడు ఫోర్బ్స్ 30 అండర్ 30 ఆసియా జాబితాకెక్కింది. అంతర్జాతీయ వేదికలపై అతి తక్కువ కాలంలో అద్భుత విజయాలు సాధిస్తూ సంచలనాలు సృష్టిస్తున్న ఆ హైదరాబాద్ అమ్మాయి పేరు భవిత మండవ.

ఫ్యాషన్ ప్రపంచంలో హైదరాబాద్ అందం!



ప్రఖ్యాత బిజినెస్ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇటీవల 'ఫోర్బ్స్ 30 అండర్ 30 ఆసియా' జాబితా ప్రకటించింది. అందులో ఓ తెలుగమ్మాయి భవిత మండవ పేరు కనిపించింది. ఎన్నడూ వినని పేరు, చూడని ముఖం హఠాత్తుగా వార్తల్లో కనిపిస్తే ఎవరీమె? అని భారతీయులు ఇంటర్నెట్‌లో సెర్చ్ చేస్తున్నారు. మనవాళ్లు ఆమె గురించి తెలుసుకునే లోపే పాశ్చాత్య ప్రపంచం తన అందాన్ని, దానికి తగ్గ ప్రతిభని గుర్తించింది. ప్రపంచ ఫ్యాషన్ వేదికలపై తారలా మెరిసిన ఆ అమ్మాయి ప్రఖ్యాత మేగజైన్లపై కవర్ ఫొటోలతో అలరించింది. ప్రపంచ మార్కెట్లో పేరున్న ఫ్యాషన్ బ్రాండ్‌కి అంబాసిడర్‌గా పని చేస్తున్నది. హైదరాబాద్ నుంచి న్యూయార్క్ వరకు చదువు కోసం సాగిన ప్రయాణంలో అనుకోకుండా అందాల ప్రపంచంలోని అడుగుపెట్టి, అనూహ్య విజయాలు సాధించిన ఈ సౌందర్య రాశి ఎవరు? ఏమిటీ ఈమె స్టోరీ?

భవిత పుట్టింది, పెరిగింది హైదరాబాద్‌లో. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో ఆర్కిటెక్చర్ బ్యాచిలర్ డిగ్రీ సాధించింది. హైదరాబాద్‌లోనే ఓ కంపెనీలో కొంతకాలం పని చేసింది. కొన్ని నెలల తర్వాత బెంగళూరులోని ఓ ఆర్కిటెక్చర్ కంపెనీలో ఉద్యోగంలో చేరింది. కొన్నేళ్లకు ఆ ఉద్యోగం వదిలిపెట్టి ఉన్నత విద్య కోసం అమెరికా చేరింది. న్యూయార్క్ యూనివర్సిటీ మెరిట్ స్కాలర్‌షిప్ సాధించింది. అక్కడ ఇంటిగ్రేటెడ్ డిజైన్ అండ్ మీడియా, హ్యూమన్ కంప్యూటర్ ఇంటెరాక్షన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో చేరింది.

ఏడాది క్రితం..

చదువు కోసం అమెరికాకు వెళ్లిన భవిత ఓ రోజు తన స్నేహితురాలి కోసం సబ్‌వేలో ఎదురు చూడసాగింది. ఆ సమయంలో ఒక మాడలింగ్ ఏజెంట్ భవితను గమనించాడు. తన శరీర సౌందర్యమే కాదు అందమైన నవ్వు, నడకలో హుందాతనం చూసి, మీకు ఫ్యాషన్ రంగంలో మంచి అవకాశాలు ఉంటాయని సలహా ఇచ్చాడు. ఆ పరిచయంతో 2024లో భవిత ఫ్యాషన్ ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. ఆర్కిటెక్ట్ చదివిన భవిత మాడలింగ్‌లో అనుకోకుండా అడుగుపెట్టింది. దానిని సీరియస్‌గా తీసుకోలేదు. అమెరికాలో చదువుకునే రోజుల్లో సరదాగా గడపొచ్చని భావించింది.

భవిత జీవితాన్ని అమెరికా కొత్త మలుపు తిప్పింది. ఫ్యాషన్ రంగానికి చెందినవాళ్లు ఆమెలోని ప్రత్యేకతను గుర్తించారు. 'బొట్టెగా వెనెటా ఫ్యాషన్ షో'కి ఆమెను ఎంపిక చేసుకున్నారు. వాళ్ల సూచనలు, సహకారంతో భవిత ర్యాంప్‌పై అడుగుపెట్టింది. ఫ్యాషన్ ఇండస్ట్రీలో అతి తక్కువ కాలంలో అంతర్జాతీయ స్థాయి ఫ్యాషన్ షోలలో క్యాట్‌వాక్ దాకా ఆమె ప్రయాణం సాగింది. ఇండస్ట్రీలో ఈ అమ్మాయిని చూసి.. 'భలే చాన్స్ కొట్టేసిందే' అనే టాక్ వచ్చింది! సరదా ప్రయాణం కొద్ది రోజుల్లోనే ఎంతో మంది మాడల్స్ చేరుకోలేని మైలు రాయిదాకా నడిపిస్తుందని ఆమె కూడా ఊహించలేదు. క్రిస్టియన్ డియోర్, చానెల్ వంటి ప్రఖ్యాత బ్రాండ్‌ల ఫ్యాషన్ షోలలో అవకాశం రావడంతో అత్యంత వేగంగా ఆమె పాపులారిటీ సాధించింది. అంతర్జాతీయ మీడియా దృష్టిలో పడింది. కొద్ది రోజుల్లోనే పెద్ద ఫ్యాషన్ షో కోసం ఎంపికవడంతో భవిత ఈ కెరీర్‌ని సీరియస్‌గా తీసుకొని, జెట్ స్పీడ్‌తో దూసుకుపోయింది.

ఫస్ట్ ఇండియన్ మాడల్!

'Met Gala 2026' షో ద్వారా భవిత వార్తల్లోకెక్కింది. ఈ షోలో ఆమె ధరించిన ప్యాంట్ ఎంతో మందిని ఆకట్టుకుంది. మస్లిన్, సిల్క్ దారాలతో తయారు చేసిన ఈ జీన్స్ వార్తల్లోకి ఎక్కడంతో చర్చ మొదలైంది. ఆ దుస్తుల్లో ఆమె లుక్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రఖ్యాత ఫ్యాషన్ మేగజైన్ వోగ్ 2026 మార్చి సంచికలో కవర్ స్టార్‌గా భవిత ఫ్యాషన్ ప్రియులకు మరింత చేరువైంది. ఈ పత్రిక ముఖచిత్రంపై కనిపించిన అతి కొద్దిమంది భారతీయ మాడళ్లలో ఆమె ఒకరు. అందాల ప్రపచంలో భవితకు ఉన్న ఆదరణను గుర్తించి చానెల్ సంస్థ 'హౌస్ అంబాసిడర్'గా నియమించుకుంది. ఈ అవకాశం అందుకున్న తొలి భారతీయ మాడల్ తనే కావడం విశేషం. ఇది తనకే కాదు భారతీయ మాడళ్లకు దక్కిన గౌరవంగా భావిస్తున్నారు.

చామన ఛాయ గెలుపు!

అందానికి చర్మం రంగు ఒక ప్రమాణంగా చూసే మన సమాజంలో చామన ఛాయకు ఫ్యాషన్ ప్రపంచంలోనే కాదు సాధారణ జీవితంలోనూ చిన్న చూపే. కానీ, ఆ చామన ఛాయ అందమే ఇప్పుడు ఫ్యాషన్ ఇండస్ట్రీలో తళుకులీనుతున్నది. అందరూ ఎదుర్కొన్నట్టే చిన్నప్పుడు భవిత కూడా మేని రంగు గురించి అవహేళనకు గురైందట. కానీ, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా ముందుకు సాగిపోయింది. అందాల ప్రపంచంలో ఎంతోకాలం శ్రమిస్తే చేరుకునే మైలురాళ్లెన్నో కెరీర్ ఆదిలోనే అందుకుంది. అందం, ప్రతిభ, సహనంతో చేరుకున్న విజయతీరాల్లో ఆమె క్యాట్‌వాక్ చేస్తుంటే ఆ షోని ఇంట్లో ఉండి చూస్తూ ఆనందబాష్పాలు కార్చిన అమ్మానాన్నల వీడియో నెట్టింట్లో వైరల్ అయింది. భారత్ నుంచి వచ్చిన కొత్త సూపర్ మాడల్‌గా ఫ్యాషన్ ప్రపంచం భవిత గురించి చెప్పుకుంటున్నది.







స్మార్ట్‌గా పరిగెత్తండి

ఉదయం నిద్రలేవగానే మనల్ని పలకరించే తొలి నేస్తం స్మార్ట్ ఫోన్. వాట్సాప్, ఫేస్‌బుక్ , ఇన్‌స్టాగ్రామ్ చూడటానికి మాత్రమే కాకుండా ఈ స్మార్ట్‌ఫోన్.. మన ఆరోగ్యాన్ని శాసించే ఒక అద్భుతమైన పరికరమని చాలామందికి తెలియదు. మన శరీరాన్ని మెరుగుపరుచుకోవడం కోసం మనం జిమ్ కోచ్ కోసమో, డైటీషియన్ అపాయింట్ కోసమో చూడాల్సిన పనిలేదు. మన జేబులో ఉండే స్మార్ట్ ఫోనే మనల్నీ పరిగెత్తిస్తుంది. మనం ఏం తినాలో చెబుతుంది.. చివరికి మనం ఎంతసేపు నిద్రపోవాలో కూడా డిసైడ్ చేస్తుందని ఇటీవల ఓ అధ్యయనం సైతం పేర్కొంది.

యాక్టివిటీ ట్రాకింగ్: మన ఫోన్‌లో ఉండే యాక్సిలరోమీటర్ అనే సెన్సర్ సాయంతో మనం నడవడం, మెట్లు ఎక్కడం, పరిగెత్తడం వంటి పనులను గుర్తించి ఆ డేటాను మనకు అర్థమయ్యే విధంగా మారుస్తుంది. అలాగే మనం ఎంత దూరం ప్రయాణించాం? ఏ మార్గంలో వెళ్లామో ఇది మ్యాప్ రూపంలో చూపుతుంది. ఇందులో అడుగుల లెక్కింపు, క్యాలరీల ఖర్చు, దూరం, యాక్టివ్ టైమ్ లాంటివన్నీ గమనించవచ్చు.



పర్సనల్ వర్కౌట్ కోసం: ఇది మన శరీర తత్వం, బరువు, ఎత్తు, మన ఆరోగ్య లక్ష్యాలను బట్టి మనకు సరిపోయే వ్యాయామాలను రూపొందించే ఒక డిజిటల్ సిస్టమ్. ఇది మన సామర్థ్యాలను బట్టి వ్యాయామాలను సూచిస్తూ మనల్ని గైడ్ చేస్తుంది.


డైట్ ట్రాకింగ్: మనం ప్రతి రోజూ తీసుకునే అల్పాహారం, లంచ్, స్నాక్స్, డిన్నర్‌లో ఉండే క్యాలరీలను, పోషకాలను లెక్కగట్టడమే ఈ డైట్ ట్రాకింగ్. మన లక్ష్యం ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండటమైనా మనం తీసుకునే ఆహారంపై అవగాహన ముఖ్యం. ఇది క్యాలరీల లెక్కింపు, మాక్రో న్యూట్రియెంట్స్‌ని విశ్లేషణ చేస్తుంది. దీనివల్ల మనం మైండ్‌ఫుల్ ఈటింగ్ అలవాటు చేసుకుంటాం.

స్లీప్ అనాలసిస్: ఆరోగ్యకరమైన జీవితానికి సరైన ఆహారం, వ్యాయామం ఎంత ముఖ్యమో నాణ్యమైన నిద్రకూడా అంతే ముఖ్యం. మనం రాత్రి పడుకున్నప్పటి నుంచి ఉదయం నిద్ర లేచే వరకు మన శరీరం ఏ స్థితిలో ఉంది, మధ్యలో ఎన్నిసార్లు మెలకువ వచ్చింది, ఎంతసేపు గాఢనిద్రలో ఉన్నాం.. తదితర వివరాలన్నిటినీ అనాలిస్ చేసి డేటాను అందిస్తుంది.

సాధారణంగా మనం చేసే ఏ పనిలోనైనా విజయం సాధించాలంటే మనం ఎంత వరకు సాధించామో తెలుసుకోవడం కూడా చాలా ముఖ్యం. ఈ ఫిట్‌నెస్ ప్రయాణంలో కూడా అంతే. మనం ఎక్సర్‌సైజ్‌లు మొదలుపెట్టిన తొలి రోజు నుంచి నేటి వరకు శరీరంలో, సామర్థ్యంలో వచ్చిన మార్పులను గమనించుకోవడం అవసరం. ఇందులో బీఎంఐ, వీక్లీ, మంత్లీ సమ్మరీ వంటివి ఉంటాయి.

లేజీ గాల్స్ జాబ్

కరోనా తర్వాత సామాజిక జీవితంలో కొత్త ధోరణులు చాలానే వచ్చాయి. వాటిల్లో ఒకటైన 'లేజీ గాల్ జాబ్' ఇప్పుడు ట్రెండింగ్ అని సైకాలజిస్టులు అంటున్నారు. 'పని కోసం ఆసక్తి చూపకపోవడం వల్ల వచ్చిన సమస్య' అనుకునేరు. అది కాదట పని తమ జీవితాలకు అనుకూలంగా ఎలా ఉండాలో భావించే కొత్త తరం సంప్రదాయ ఉద్యోగ ధోరణుల్ని తిరస్కరిస్తున్నారు. అంతేకానీ, పనిని ప్రేమించట్లేదని కాదు. ఎక్కువ సమయం డెస్కుకి పరిమితమైపోయి ఉండే ఉద్యోగాలు కంఫర్ట్ కాదని భావిస్తున్నారట. 'ప్రొడక్టివ్ జాబ్ ఓకే. కానీ, రోజంతా పనికి అందుబాటులో ఉండాలి. ఎక్కువ గంటలు పని చేయాలి' అంటే ఆ ఉద్యోగాలు వద్దనుకుంటున్నారట. ఆడపిల్లలు ఉద్యోగాలు చేసినా, తమకు కావాల్సినంత సమయం, వ్యక్తిగత జీవితం ఉండాలని కోరుకుంటున్నారు. సమయాన్ని అర్థవంతంగా గడపడానికి ఉద్యోగం ఆటంకం కాకూడదని చెబుతున్నారు. మానసిక ఆరోగ్యం, వ్యక్తిగత జీవితాలకు ప్రాధాన్యం లేకుండా చేసే ఉద్యోగాల పట్ల అసంతృప్తిగా ఉన్నారు. అందుకే వివాహం, పిల్లలు పుట్టిన తర్వాత చాలామంది ఉద్యోగాలు శాశ్వతంగానో, తాత్కాలికంగానో మానేస్తున్నారు. ఇది ఉద్యోగం అవసరం లేదని, దానిపట్ల విరక్తి, వ్యతిరేకతగానో చూడొద్దని సైకాలజిస్టులు అంటున్నారు. జీవితం అర్థవంతంగా గడపాలనే నిర్ణయానికి ఏదీ ఆటంకం కాకూడదనే ఈ కాలం ఆడపిల్లలకు (లేజీ గాల్స్)కు అనుకూలంగా కంపెనీలూ మారుతున్నాయి. డాటా ఎంట్రీ, హెచ్‌ఆర్, కన్సల్టెన్సీ ఉద్యోగాలే కాకుండా చాలా ఉద్యోగాలు రిమోట్, హైబ్రిడ్ మోడ్‌లో అమ్మాయిల మనస్తత్వానికి అనుకూలంగా మార్చుకున్నాయి. కానీ, ఇంకా మార్పు రావాలని సోషల్ మీడియాలో గళం విప్పుతున్నారు కొందరు లేజీ గాల్స్.



777 రూల్.. ప్రస్తుత డేటింగ్ ప్రపంచంలో తెగ పాపులర్ అవుతున్నది. భాగస్వాముల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేయడానికి సాయపడుతున్నది. ఎవరి పనుల్లో వారు బిజీగా ఉండే జంటల్లో ఆత్మీయత తగ్గకుండా చూస్తున్నది. ఒకరికొకరు తగినంత సమయాన్ని కేటాయించుకోవడానికీ అక్కరకొస్తున్నది. సమయాన్ని మూడు భాగాలుగా విభజించడమే 777 రూల్! అందుకు తగ్గట్టుగా భాగస్వాములు తమ సమయాన్ని కేటాయించడం.

777తో చక్కటి అనుబంధం!

7 రోజులకు ఒకసారి: కనీసం వారానికి ఒకసారైనా ఇద్దరూ కలిసి డేట్‌కు వెళ్లాలి. బయట డిన్నర్ కావచ్చు, ఇంట్లోనే ప్రశాంతంగా సినిమా చూడటం కావచ్చు. ఫోన్లు, ఆఫీస్ వర్క్ పక్కన పెట్టేయాలి. దీంతో ఒకరితో ఒకరు నాణ్యమైన సమయాన్ని గడిపే అవకాశం ఉంటుంది.

7 వారాలకు ఒకసారి: కనీసం ఏడు వారాలకు ఒకసారి.. ఇద్దరూ కలిసి ఓ చిన్న ట్రిప్ ప్లాన్ చేయాలి. రోజువారీ యాంత్రిక జీవితం నుంచి బయటపడి.. కొత్త ప్రదేశంలో కలిసి గడపాలి. దీనివల్ల మనసు రిఫ్రెష్ అవుతుంది.

7 నెలలకు ఒకసారి: కనీసం ఏడు నెలలకు ఒకసారి.. ఒక పెద్ద వెకేషన్‌కు వెళ్లాలి. ఒక వారంపాటు నచ్చిన ప్రదేశాన్ని చుట్టిరావాలి. ఇలాంటి విహారయాత్రల వల్ల.. ఇద్దరి మధ్య బంధం మరింత దృఢంగా మారుతుంది.

ఎందుకింత ట్రెండ్: 777 రూల్ ఇప్పుడు బాగా ట్రెండ్ అవుతున్నది. ఇందుకు కారణం.. బిజీ జీవితమే! నేటికాలంలో పని ఒత్తిడి వల్ల చాలామంది భాగస్వాములకు కనీసం మాట్లాడుకునే సమయం కూడా ఉండటం లేదు. ఇలాంటి వారంతా '777 రూల్'ను పాటిస్తున్నారు. ఒక క్రమశిక్షణకు అలవాటు పడుతున్నారు. ఇలా పక్కా ప్లాన్‌తో కలవడం వల్ల ఇద్దరి మధ్య కమ్యూనికేషన్ పెరుగుతుంది. ఇక ఎప్పుడూ ఒకేలా కాకుండా.. రాబోయే ట్రిప్స్ గురించి ప్లాన్ చేసుకోవడం వల్ల రిలేషన్‌షిప్ మరింత బలోపేతం అవుతుంది.



సబలెంక ఖేల్‌ఖతం

క్వార్టర్స్‌లో ష్నైడర్ చేతిలో పరాజయం ● సెమీస్‌లో క్వాలిఫయర్ మయా



పారిస్: మట్టి కోర్టు టెన్నిస్ మహా సంగ్రామం ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో మరో పెను సంచలనం. ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ అరీనా సబలెంకకు షాక్ తగిలింది. వరుస విజయాలతో టైటిల్ దిశగా దూసుకెళ్తున్న ఈ బెలారస్ స్టార్ క్వార్టర్ ఫైనల్లోనే పరాజయం పాలై ఇంటిదారి పట్టింది. రష్యా క్రీడాకారిణి దయానా ష్నైడర్.. గత సీజన్ రన్నరప్‌గా నిలిచిన అరీనాకు షాకిచ్చి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ష్నైడర్ అద్భుత ఆటతీరుతో 3-6, 7-5, 6-0తో సబలెంకను ఓడించింది. తన కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. 2 గంటల 12 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో నాలుగు గ్రాండ్ స్లామ్స్ విన్నర్ అయిన అరీనా ఆరంభంలో వరుస పాయింట్లతో హడలెత్తించింది. తొలి సెట్‌ను సులువుగా గెలిచి, రెండో సెట్‌లో డబుల్ బ్రేక్ సాధించి 4-1తో ఆధిక్యంలోకి వచ్చింది. ప్రత్యర్థి పుంజుకున్నా 5-4 వద్ద మ్యాచ్ కోసం సర్వ్ చేస్తున్నప్పుడు విజయానికి కేవలం రెండు పాయింట్ల దూరంలో నిలిచింది. కానీ, తన కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్ ఫైనల్ ఆడుతున్న ష్నైడర్ ఒక్కసారిగా చెలరేగింది.పవర్‌ఫుల్ ఫోర్‌హ్యాండ్ విన్నర్లతో టాప్‌సీడ్‌కు చుక్కలు చూపెడుతూ మ్యాచ్‌ను మూడో సెట్‌కు తీసుకెళ్లింది. తీవ్ర ఒత్తిడికి గురైలయ కోల్పోయిన సబలెంక వరుస తప్పిదాలతో బంతిని కోర్టులోకి పంపడానికి ఇబ్బంది పడింది. ఏకంగా 57 అనవసర తప్పిదాలు చేసిన ఈ బెలారస్ స్టార్ తన చివరి 13 గేమ్స్‌లో ఏకంగా 12 గేమ్స్ ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. మరో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో పోలాండ్‌కు చెందిన క్వాలిఫయర్ మయా క్వాలిన్‌స్కా తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ 7-6 (7/3), 6-3 తేడాతో 22వ సీడ్ అనా కాలిన్స్కయా (రష్యా)ను వరుస సెట్లలో ఓడించింది. మూడు క్వాలిఫయింగ్ రౌండ్లు దాటుకుని వచ్చిన 24 ఏండ్ల మయా.. ఇగా స్వియాటెక్ తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ సెమీస్ చేరిన పోలాండ్ రెండో మహిళగా చరిత్ర సృష్టించింది.



ఫెలిక్స్‌కు కొబోలి చెక్

పురుషుల సింగిల్స్‌లో మరో టాప్ సీడెడ్ ఆటగాడు ఇంటిదారి పట్టాడు. కెనడా స్టార్, నాలుగో సీడ్ ఫెలిక్స్ ఆగర్ అలిసిమె పోరాటం క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. ఇటలీ ఆటగాడు, పదో సీడ్ ఫ్లావియో కొబోలి 4-6, 6-4, 6-4, 6-4తో ఆగర్‌ను ఓడించి సెమీఫైనల్లో అడుగు పెట్టాడు. తొలి సెట్ కోల్పోయినా.. గొప్పగా పుంజుకున్న కొబోలి బలమైన షాట్లతో ఫెలిక్స్ పని పట్టాడు. మెరుగైన సర్వీస్‌లతో ఆకట్టుకుంటూ ఏడు ఏస్‌లు కొట్టిన ఆగర్ నాలుగు డబుల్ ఫాల్ట్స్ చేశాడు. తను ఒకే బ్రేక్ పాయింట్ రాబట్టగా.. కొబోలి నాలుగు బ్రేక్స్ సాధించి విజయం అందుకున్నాడు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన 26వ సీడ్ యాకుబ్ మెన్షిక్ కూడా సెమీస్‌లో అడుగుపెట్టాడు. మరో క్వార్టర్ ఫైనల్లో మెన్షిక్ 6-4, 6-3, 7-6 (7/3) తేడాతో 28వ సీడ్ బ్రెజిల్ ఆటగాడు జోవావో ఫొన్సెకాను ఓడించాడు. ప్రారంభం నుంచే తన పవర్‌ఫుల్ సర్వీస్‌లతో పట్టు సాధించిన మెన్షిక్ ప్రత్యర్థికి చెక్ పెట్టాడు.

శ్రీరామ్ బాలాజీ జోడీ ఓటమి

భారత టెన్నిస్ ఆటగాడు ఎన్. శ్రీరామ్ బాలాజీ ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల డబుల్స్ ప్రయాణం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో బాలాజీ- మార్సెలో డెమోలినర్ (బ్రెజిల్) జంట 3-6, 4-6 తేడాతో రెండో సీడ్ హ్యారీ హెలియోవారా-హెన్రీ ప్యాటెన్ జోడీ చేతిలో పరాజయం పాలైంది.

కార్ల్‌సన్‌కు ప్రజ్ఞానంద మళ్లీ చెక్



ఓస్లో: ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద సంచలన ప్రదర్శనతో ప్రపంచ నంబర్ వన్ ఆటగాడు మాగ్నస్ కార్ల్‌సన్‌కు మరోసారి షాకిచ్చాడు. మంగళవారం రాత్రి హోరాహోరీగా సాగిన ఏడో రౌండ్ క్లాసికల్ గేమ్‌లో నల్ల పావులతో బరిలోకి దిగిన ప్రజ్ఞానంద తన ఎత్తులతో అదరగొట్టాడు. ఎండ్‌గేమ్‌లో మాగ్నస్‌పై నిరంతరం ఒత్తిడి పెంచి అతడు లొంగిపోయేలా చేశాడు. ఈ విజయంతో ఈ ఏడాది క్లాసికల్ గేమ్స్‌లో కార్ల్‌సన్‌ను రెండుసార్లు ఓడించిన ఏకైక ఆటగాడిగా 20 ఏండ్ల ప్రజ్ఞానంద అరుదైన రికార్డు సృష్టించాడు. దాంతోపాటు 12 పాయింట్లతో టోర్నీ పట్టికలో మూడో స్థానానికి చేరుకుని టైటిల్ రేసులో నిలిచాడు. మరోవైపు ప్రపంచ చాంపియన్ డి. గుకేశ్‌కు ఈ రౌండ్‌లో నిరాశే ఎదురైంది. ఫ్రాన్స్‌జీఎం అలీరెజా ఫిరౌజా చేతిలో పరాజయం పాలవడంతో గుకేశ్ టైటిల్ ఆశలు పూర్తిగా ఆవిరయ్యాయి. ప్రస్తుతం 8 పాయింట్లతో గుకేశ్ టోర్నీ పట్టికలో ఆఖరి స్థానానికి పడిపోగా, ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ కార్ల్‌సన్ కూడా 9 పాయింట్లతో వెనుకబడటంతో తన టైటిల్ ఆశలు దాదాపు ముగిశాయి. ఇక మహిళల విభాగంలో భారత క్రీడాకారిణి దివ్య దేశ్‌ముఖ్ కజకిస్తాన్‌కు చెందిన బిబిసార అసౌబయేవా చేతిలో ఓడిపోగా, కోనేరు హంపి.. అనా ముజిచుక్‌తో ఆర్మగెడాన్ టై-బ్రేక్ ఓడిపోయింది.

టీ20 కెప్టెన్సీ నుంచి సూర్య ఔట్?

రేసులో తిలక్ వర్మ ముందంజ

ముల్లాన్‌పూర్: భారత టీ20 జట్టులో పెను మార్పులకు సెలెక్టర్లు రంగం సిద్ధం చేశారు. గత 18 నెలలుగా వరుసగా విఫలమవుతూ పూర్తిగా ఫామ్ కోల్పోయిన స్టార్ బ్యాటర్ సూర్యను కెప్టెన్సీ నుంచి తప్పించడమే కాకుండా, భవిష్యత్తు ప్రణాళికల నుంచి కూడా పూర్తిగా పక్కన పెట్టాలని భావిస్తున్నారు. ఇంగ్లండ్ పర్యటనకు జట్టును ఎంపిక చేయడానికి ముందే ఈ కీలక నిర్ణయాన్ని గురువారం జరిగే బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌కు తెలియజేసే అవకాశం ఉంది. సూర్యను తప్పించి శ్రేయస్ అయ్యర్ లేదా ఫ్యూచర్ స్టార్‌గా భావిస్తున్న హైదరాబాదీ తిలక్ వర్మ కెప్టెన్ చేయాలని సెలెక్టర్లు భావిస్తున్నారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్.. అయ్యర్ వైపు మొగ్గు చూపుతుండగా హెడ్ కోచ్ గంభీర్ మాత్రం అయిష్టత వ్యక్తం చేస్తూ సంజు శాంసన్ పేరు ప్రతిపాదించినట్టు సమాచారం. కానీ, బ్యాటర్‌గా నిలకడలేమి శాంసన్‌కు ప్రతికూలంగా మారింది. ఈ నేపథ్యంలో తిలక్ పేరు బలంగా వినిపిస్తోంది. ఇందులో భాగంగానే తిలక్ నాయకత్వ నైపుణ్యాలను పరీక్షించేందుకు ఈ నెలలో శ్రీలంక పర్యటనకు వెళ్లే భారత-ఏ జట్టుకు అతడిని కెప్టెన్‌గా కూడా నియమించారు.



ప్రిక్వార్టర్స్‌లో రుత్విక‌-రోహన్

జకార్తా: ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రుత్వికా శివాని-రోహన్ కపూర్, ఆయుష్ శెట్టి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 20వ ర్యాంకర్ ఆయుష్ 8-21, 22-20, 21-15 తేడాతో 15వ ర్యాంకర్ హంగ్ యాంగ్ వెంగ్‌కు షాకిచ్చాడు. మరో మ్యాచ్‌లో సీనియర్ ఆటగాడు హెచ్‌ఎస్ ప్రణయ్ 17-21, 21-16, 19-21తో నాట్ ఎన్‌గుయెన్ (ఐర్లాండ్) చేతిలో ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో రుత్వికా శివాని-రోహన్ జోడీ 21-14, 21-14తో చైనీస్ తైపీకి చెందిన యాంగ్ ఫొ- హులింగ్ ఫెంగ్‌పై సులువుగా గెలిచి ముందంజ వేసింది. మరో వైపు, పురుషుల డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టికి ఎదురుదెబ్బ తగిలింది. గత వారమే సింగపూర్ ఓపెన్ టైటిల్ గెలిచిన ఈ ద్వయం తొలి రౌండ్ మ్యాచ్ ప్రారంభమైన 7 నిమిషాలకే గాయం కారణంగా వైదొలిగింది. కాంగ్ ఖై క్సింగ్ - ఆరోన్ తై (మలేషియా)తో మ్యాచ్‌లో 6-11తో వెనుకంజలో ఉన్న సమయంలో సాత్విక్ కుడి భుజం నొప్పితో ఇబ్బంది పడటంతో భారత జోడీ రిటైర్ అయింది.

హర్మన్ మెరిసినా..

మూడో టీ20లో భారత్ ఓటమి



టాంటన్: టీ20 ప్రపంచకప్ టోర్నీ చివరి సన్నాహక సిరీస్‌లో భారత మహిళల జట్టు నిరాశపరిచింది. ఇంగ్లండ్‌తో మూడు టీ20ల సిరీస్‌ను 1-2తో కోల్పోయింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (40 బంతుల్లో 7 ఫోర్లతో 56 నాటౌట్) మెరిసినా బౌలర్లు ఫెయిలవడంతో మంగళవారం అర్ధరాత్రి జరిగిన మూడో, చివరి మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో ఇంగ్లిష్ టీమ్ చేతిలో ఓడిపోయింది. తొలుత భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 180/5 భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు మంధాన (8), షెఫాలీ (11) విఫలమైనా.. కెప్టెన్ హర్మన్ అర్ధ శతకంతో సత్తా చాటింది. యాస్తికా భాటియా (32), దీప్తి శర్మ (32) కూడా రాణించారు. ఆతిథ్య బౌలర్లలో లారెన్ బెల్ (2/36) రెండు వికెట్లు పడగొట్టింది. అనంతరం ఛేదనలో అలీస్ క్యాప్సీ (43 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 82), హెదర్ నైట్ (42 బంతుల్లో 10 ఫోర్లతో 70 నాటౌట్) విజృంభించడంతో ఇంగ్లిష్ టీమ్ 18.3 ఓవర్లలోనే 184/4 స్కోరు చేసి సులువుగా గెలిచింది. అరుంధతి రెడ్డి (2/31), క్రాంతి గౌడ్ (2/41) రెండేసి వికెట్లు తీసినా ఫలితం తేకపోయింది. క్యాప్సీకి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, సిరీస్ అవార్డులు లభించాయి. ఈ నెల 12 నుంచి ఇంగ్లండ్‌లోనే జరిగే టీ20 ప్రపంచకప్‌లో భారత్ పోటీ పడనుంది.

అగ్రస్థానంలో చంద్రలేఖ- ధనుష్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: మాన్‌సూన్ రెగట్టా జాతీయ ర్యాంకింగ్ సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ సెయిలర్లు సత్తా చాటుతున్నారు. బుధవారం జరిగిన ఇంటర్నేషనల్ 420 మిక్స్‌డ్ క్లాస్ విభాగంలో చంద్రలేఖ తట్టారి-ధనుష్ జక్కుల జోడీ వరుసగా రెండు రేసుల్లో విజయాలు సాధించి పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. బద్రీనాథ్ - రిశ్వంత రెండో స్థానంలో నిలిచింది. టాప్ సీడ్ సెయిలర్ దీక్షిత కొమరవెల్లి బోటు తిరగబడటంతో ఆమె భుజానికి తీవ్ర గాయమైంది. స్కిఫ్ క్లాస్ 29ఇఆర్ బోట్ విభాగంలో వినోద్ దండు-అరవింద్ మాలోత్ ద్వయం ముందంజలో ఉండగా.. అండర్-15 ఆప్టిమిస్ట్ క్లాస్‌లో సికింద్రాబాద్ క్లబ్ సెయిలర్ శృంగేరి రాయ్ రెండో రేసులో విజయం సాధించింది.

టీజీ20 లీగ్ బరిలో

తిలక్, సిరాజ్

7న ఆటగాళ్ల వేలం



హైదరాబాద్, ఆట ప్రతినిధి: టీమిండియా స్టార్ ప్లేయర్లు తిలక్ వర్మ, మహ్మద్ సిరాజ్ హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టీజీ20 లీగ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ఈ మెగా లీగ్ తొలి ఎడిషన్ వేలంలో ఈ ఇద్దరు ఐకాన్ కేటగిరీలో బరిలో నిలిచారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే ఆటగాళ్ల వేలానికి మొత్తం 1300 మంది క్రికెటర్లు రిజిస్టర్ చేసుకున్నారు. రోహిత్ రాయుడు, రాహుల్ బుద్ధి, సీవీ మిలింద్, తన్మయ్ అగర్వాల్ హైదరాబాద్ సీనియర్ ప్లేయర్లు ఎనిమిది ఫ్రాంచైజీల హాట్ కేక్స్‌గా మారే అవకాశం ఉంది. వేలం కోసం ప్రతీ ఫ్రాంచైజీకి రూ. 60 లక్షల బడ్జెట్ కేటాయించారు. ఇందులో కనీసం రూ. 54 లక్షలు చేసి గరిష్ఠంగా ఒక్కో జట్టు 20 మంది ఆటగాళ్లను కొనుగోలు చేయొచ్చు. వేలం ప్రక్రియ మొదట ఐకాన్ కేటగిరీతో ప్రారంభం అవుతుంది. తర్వాత ఏ ప్లస్, ఏ, బి, సి1, సి2 కేటగిరీల వారీగా కొనసాగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో.. ప్రతి ఫ్రాంచైజీ కనీసం నలుగురు జిల్లా ఆటగాళ్లను జట్టులోకి తీసుకోవాలి. కాగా, ఈ నెల 21న టీజీ 20 లీగ్ ప్రారంభం అవుతుంది. మొత్తం 32 మ్యాచ్‌లు ఉప్పల్ స్టేడియంలోనే జరగనున్నాయి.

హైదరాబాదీ సునీల్ అరుదైన ఘనత

మారథాన్‌లో ఏడు ఖండాలను చుట్టి వచ్చిన అథ్లెట్



హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు చెందిన సునీల్ రాబర్ట్ వుప్పుల మారథాన్‌లో అరుదైన ఘనత సాధించారు. ప్రపంచంలోని మొత్తం ఏడు ఖండాలలో జరిగిన మారథాన్ పోటీలలో పాల్గొని అరుదైన రికార్డు సృష్టించారు. ఇప్పటివరకూ ఈ ఘనత సాధించిన 900 మంది అథ్లెట్లలో ఆయన ఒకరిగా నిలిచారు. ఆయన పాల్గొన్న చివరి మారథాన్ ఇటీవల దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ నగరంలో ముగిసింది. దాదాపు 15 ఏండ్ల పాటు వివిధ ఖండాలలో భిన్న వాతావరణ పరిస్థితులను, సవాళ్లను ఎదుర్కొంటూ ఆయన మారథాన్‌లలో పాల్గొన్నారు. న్యూయార్క్ నగరంలో 2011లో సునీల్ తొలిసారి మారథాన్‌లో పాల్గొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంసీజే, ఎంబీఏ కోర్సులను అభ్యసించిన 57 ఏండ్ల సునీల్ టీసీఎస్, ఒరాకిల్, టీసీఎస్ వంటి బహుళజాతి కంపెనీలలో పనిచేశారు. ప్రస్తుతం అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరపడిన ఆయన వివిధ కంపెనీలకు కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు.

పత్తిపై దిగుమతి సుంకం మినహాయించొద్దు

తెలంగాణ రైతు సంఘం డిమాండ్

హైదరాబాద్, జూన్ 3(నమస్తే తెలంగాణ) : పత్తిపై 11శాతం దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడాన్ని తెలంగాణ రైతు సంఘం తీవ్రంగా ఖండిస్తున్నదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ తెలిపారు. ఇప్పటికే తీవ్ర దోపిడీకి గురవుతున్న లక్షలాది పత్తి రైతులు, కార్మికులను ప్రమాదంలో పడేస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. సుంకం మినహాయింపు ప్రకటించిన వెంటనే ఈ ధరలు 3% పడిపోయాయని చెప్పారు. మారుతున్న వాతావరణం, ఎల్‌నినో వల్ల పత్తి రైతులు ఇప్పటికే అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వారికి అండగా నిలువాలని డిమాండ్ చేశారు.

రైతులకు నష్టం

పత్తిపై దిగుమతి సుంకాన్ని నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చిన్న, సన్నకారు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు వారు తెలిపారు.

పార్టీ జెండా మోసినా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వరా?

మాజీ ఎమ్మెల్యేను నిలదీసిన కాంగ్రెస్ కార్యకర్త

మానవపాడు, జూన్ 3: ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తున్నామని చెబుతున్నా.. ఎక్కడా అమలు కావడం లేదని.. పార్టీ జెండా మోసిన తనకే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం లేదని మాజీ ఎమ్మెల్యే సంపత్‌ను సొంత పార్టీ కార్యకర్త నిలదీశాడు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి నివేదిక బస్సు యాత్రకు హాజరైన మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతుండగా.. అదే గ్రామానికి చెందిన సూదెన్న అక్కడికి చేరుకున్నాడు. ముందుగా ఇల్లు మంజూరైందని చెప్పడంతో బేస్ లెవల్ వరకు నిర్మించుకున్నానని, ఇప్పుడు మంజూరు కాలేదని బిల్లు రాదని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎమ్మెల్యే ఇల్లు మంజూరు గురించి ఆరా తీసి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఇరిగేషన్ శాఖలో ఇష్టారాజ్యం


నచ్చినోళ్లకు కోరినచోట పోస్టింగ్‌లు.. నచ్చనోళ్లకు కండీషన్లు

- సుదీర్ఘకాలంగా ఒకేచోట తిష్ట వేసినవారికి మళ్లీ రిటెన్షన్లు
- ఉద్యోగులను అడుగకుండానే ఉన్నతాధికారుల ఉత్తర్వులు
- బదిలీల వెనుక భారీ అక్రమాలున్నాయని ఆరోపిస్తున్న ఇంజినీర్లు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ఒక్కొక్కరికీ ఒక్కో నిబంధన. నచ్చినోళ్లకు రిటెన్షన్లు. కోరుకున్న చోట పోస్టింగ్‌లు. నచ్చనోళ్లకు కండీషన్లు. ఆప్షన్లను కూడా పక్కకు నెట్టి దూర ప్రాంతాలకు బదిలీలు. ఇదీ ఇరిగేషన్‌శాఖలో పరిస్థితి. అంతా ఉన్నతాధికారుల ఇష్టారాజ్యంగా మారింది. ఇదేమని నిలదీసినందుకు డిప్యుటేషన్లు కల్పిస్తామంటూ దాటవేస్తుండడం కొసమెరుపు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 2024లో జూలైలో బదిలీలను చేపట్టేందుకు మార్గదర్శకాలు విడుదల చేసింది. అయితే వానకాలం నేపథ్యంలో ఆ బదిలీల నుంచి ఇరిగేషన్‌శాఖను ప్రభుత్వం మినహాయించింది. దీంతో సాగు నీటిపారుదల శాఖలో బదిలీలు నిలిచిపోయాయి. అప్పటికే సుదీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్నవారు అక్కడే కొనసాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఇటీవల బదిలీలకు మరోసారి ప్రభుత్వం అవకాశం కల్పించి, ఒకే స్టేషన్‌లో 4ఏండ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న అధికారులను బదిలీ చేయాలని ఆదేశించింది. ఈక్రమంలో సీఈలు, ఎస్‌ఈలు కలిపి 32మంది, ఈఈ(ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు) 60మంది, డీఈఈలు 350 మంది, ఏఈఈ 650 మంది వరకు బదిలీ అయ్యారు. అయితే ఈ బదిలీల్లోనూ ఉన్నతాధికారులు భారీ అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

ఆప్షన్లను పక్కకు నెట్టి..

ట్రాన్స్‌ఫర్లకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో జోన్ ప్రాతిపదికన ఒక్కో ఇంజినీర్ 5ప్రాంతాలకు ఆప్షన్లు ఇచ్చారు. నిబంధనల ప్రకారం అధికారి ఎంపిక చేసుకున్న ఆప్షన్లలో ఏదో ఒక ప్రాంతానికి ట్రాన్స్‌ఫర్ చేయాల్సి ఉంది. ఒకవేళ ఆ స్థానాల్లో ఖాళీ లేకుంటే సదరు ఉద్యోగికి మరోసారి ఆప్షన్ ఎంపిక చేసుకునే అవకాశాన్ని కల్పించాలి. అయితే ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు ఎలాంటి సంప్రదింపులు లేకుండానే ఆప్షన్లు కాదని అనేక మంది ఇంజినీర్లను ఇష్టానుసారం పోస్టింగ్‌లు ఇచ్చారు. ఒకవేళ ఆప్షన్లు కాదని పోస్టింగ్‌లు ఇచ్చినా.. చాలా వరకు సదరు ఉద్యోగి కోరుకున్న ప్రాంతానికి సమీపంలోని మరో ప్రాంతంలోనైనా పోస్టింగ్ ఇస్తారు. కానీ ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు ప్రస్తుతం అది కూడా పాటించలేదు. కోరుకున్న ఆప్షన్లలో పోస్టింగ్ ఇవ్వకపోగా, ఇష్టారీతిన పదుల సంఖ్యలో ఇంజినీర్లను సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడం గమనార్హం.



ఇష్టారీతిన రిటెన్షన్లు..

ప్రస్తుత బదిలీల సందర్భంగా కీలకమైన ప్రాజెక్టు పనులు కొనసాగుతున్న స్థలంలో, అత్యంత ప్రాధాన్యత కలిగిన విభాగాల్లో తగినంత మంది సిబ్బంది, అనుభవజ్ఞులైన ఇంజినీర్లు ఉండాల్సిన అవసరముంది. అయితే ఆయా కార్యాలయాల ఉన్నతాధికారులు తమ అభిప్రాయాలను, వర్క్ లోడ్, కార్యాలయంలో అనుభవమున్న ఉద్యోగుల అవసరాన్ని వివరిస్తూ, అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ పేరిట బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని రిటెన్షన్ కోరుతారు. ప్రభుత్వం పరిశీలించి వారికి బదిలీల నుంచి మినహాయింపునిస్తుంది. దానిని సాకుగా చూపి ఒకే స్టేషన్‌లో దశాబ్దకాలం కంటే ఎక్కువగా కొనసాగుతున్న ఇంజినీర్లు సైతం రిటెన్షన్లు రాయించుకునే దందాకు తెరతీసినట్లు స్పష్టంగా తెలుస్తున్నది. ఇరిగేషన్‌శాఖకు చెందిన ఓ విభాగంలో ఉద్యోగంలో చేరిన నాటినుంచి ఇప్పటికీ 18ఏండ్లుగా ఓ ఇంజినీర్ తిష్టవేశారు. తాజా బదిలీల్లో కచ్చితంగా బదిలీ చేయాల్సి ఉంది. కానీ సదరు ఇంజినీరును అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ మీద బదిలీల నుంచి మినహాయిస్తూ రిటెన్షన్ ఇచ్చారు. అదేవిధంగా సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో) విభాగం, ఓఅండ్‌ఎం, డ్యామ్ సేఫ్టీ, అడ్మిన్ విభాగంతోపాటు, సీఈ పరిధిలోని కార్యాలయంతోపాటు, ఇతర విభాగాల్లోనూ సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న అనేకమందికి ఇదే తీరులో రిటెన్షన్లు కల్పించారు.

ఇంజినీర్ల ఆగ్రహం

శాఖలో చేపట్టిన బదిలీల తీరుపై ఇంజినీర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వందల మంది ఇంజినీర్లు ఎర్రమంజిల్ జలసౌధ కార్యాలయానికి తరలివచ్చి ఈఎన్సీ అడ్మిన్‌ను ఘెరావ్ చేశారు. ఆన్‌లైన్‌లో పెట్టిన ఆప్షన్ ఇవ్వకుండా ఇతర ప్రాంతాల్లో పోస్టింగులు ఎలా ఇచ్చారని నిలదీశారు. పైరవీలు చేసుకున్నోళ్లకే ఇష్టారీతిన పోస్టింగ్‌లను ఇచ్చారని మండిపడుతున్నారు. ఇతర లాంగ్ స్టాండింగ్ ఉద్యోగులకు కూడా రిటెన్షన్లు ఇవ్వడం వల్ల ఫీల్డ్ కార్యాలయాల్లో పనిచేస్తున్న అర్హులైన ఇంజినీర్లు సీడీవో, ఈఎన్సీ అడ్మిన్, ఇతర విభాగాల్లో పనిచేసే అవకాశాన్ని, అనుభవాన్ని పొందే అవకాశాలను కోల్పోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దీనిపై తక్షణం దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు. బదిలీల్లో జరిగిన తప్పులను సరిదిద్దకపోతే కార్యాలయాన్ని, సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.

విద్యార్థులకు వెల్‌కమ్ కిట్ లేనట్టే!

కొలిక్కిరాని గురుకుల 'టెండర్'

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): బడుల ప్రారంభం రోజున విద్యార్థులకు ఇవ్వాల్సిన వెల్‌కమ్ కిట్ ఈసారి అందే పరిస్థితి కనిపించడం లేదు. గురుకుల, ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజునే పుస్తకాలు, యూనిఫామ్‌లు తదితర వాటితో వెల్‌కమ్ కిట్లు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ స్టేషనరీ కోసం నిర్వహించిన టెండర్లు ఇప్పటికీ కొలిక్కిరాలేదు. ఏజెన్సీల ఎంపిక ప్రక్రియ సైతం పూర్తికాలేదు. దీంతో ప్రభుత్వ హామీ అటకెక్కినట్టేనని తెలిసిపోతున్నది. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ గురుకులాలతోపాటు, సంక్షేమ హాస్టళ్లు, కస్తూర్బా విద్యాలయాలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, మాడల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఆయా విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ప్రతి సంవత్సరం పుస్తకాలు, యూనిఫామ్స్, స్టేషనరీ, దుప్పట్లు, బూట్లు, సాక్సులు మొత్తంగా 24 రకాల వస్తువులను ప్రభుత్వమే అందిస్తున్నది. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి ఆయా వస్తువుల కోసం సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ నేతృత్వంలోని పీఎంయూ టెండర్లను ఆహ్వానించింది. ఏజెన్సీలను ఖరారు చేసి, వర్క్ ఆర్డర్లను ఇవ్వాల్సి ఉన్నది. 9 రకాల వస్తువులకు సంబంధించిన టెండర్ల గడువు ముగిసి నెలరోజులు అవుతున్నది. కానీ ఇప్పటికీ ఏజెన్సీలను ఖరారు చేయలేదు. మరోవైపు విద్యాసంస్థలు 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వర్క్ అగ్రిమెంట్లు ఇప్పటికిప్పుడు పూర్తిచేసినా సరఫరాకు 45 రోజుల సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో పాఠశాల ప్రారంభం నాటికి కిట్లు అందడం కష్టమేనని తెలుస్తున్నది.

బదిలీల సిత్రాలు

కాళేశ్వరం ప్రాజెక్టు డివిజన్-1లో భారీగా బదిలీలు

మహదేవపూర్, జూన్ 3: భారీ నీటిపారుదల శాఖ కాళేశ్వరం ప్రాజెక్టు మహాదేవపూర్ డివిజన్-1 పరిధిలో పలువురు అధికారులు, సిబ్బంది బుధవారం బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా ఈ మార్పులు చోటు చేసుకున్నాయి. డివిజన్-1లో విధులు నిర్వర్తిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) (మేడిగడ్డ బరాజ్) తిరుపతిరావుతో పాటు ఆరుగురు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌస్ ఏఈఈలు) గణేశ్, పవన్, భరత్, విజయ్, సాయిచరణ్, శిరీష్ బదిలీ అయ్యారు. వీరితోపాటు ఇద్దరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (డీఈఈలు) సూర్యప్రకాశ్ (కన్నెపల్లి పంపుహౌస్), భీమ్‌రావు (మేడిగడ్డ బరాజ్), మహదేవపూర్ మండల కేంద్రంలోని డివిజన్ కార్యా లయంలో పనిచేస్తున్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు దామోదర్, రాజయ్య స్థానచలనం పొందారు. ఒకేసారి పలువురు అధికారులు, సిబ్బంది బదిలీ కావడంతో డివిజన్ కార్యాలయంలో కొంత ఖాళీలు ఏర్పడ్డాయి. వీరి స్థానాల్లో కొత్తగా అధికారులు, సిబ్బందిని నియమించాల్సి ఉన్నది.

ఇన్ సర్వీస్ టీచర్లకు 'స్పెషల్ టెట్'

ఏటా రెండు టెట్ పరీక్షలు - అనుమతినిచ్చిన సర్కార్

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ఇన్ సర్వీస్ టీచర్లకు విద్యాశాఖ శుభవార్త చెప్పింది. అదనంగా స్పెషల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)ల నిర్వహణకు పచ్చజెండా ఊపింది. ప్రతి ఏటా రెండు టెట్ పరీక్షల నిర్వహణకు అనుమతిస్తూ విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెండు టెట్ పరీక్షలు నిర్వహిస్తుండగా, ఇక నుంచి టీచర్ల కోసం ప్రత్యేకంగా రెండు టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్‌ను తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఇటీవలే ఈ గడువును 2028 ఆగస్టు 31 వరకు పొడిగించింది. రాష్ట్రంలో 1.02లక్షల మంది సర్కార్ టీచర్లున్నారు. వీరిలో 27వేల మంది టెట్ పాస్ కాని వారున్నట్టు అధికారులు చెబుతున్నారు. వీరి కోసం ఏడాది నాలుగు చొప్పున టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు.

ఏజన్సీల్లోని ఆలయాలకు చట్టప్రకారమే కమిటీలు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆలయాలకు పాలక మండళ్లు, నిర్వహణ కమిటీల ఏర్పాటు దేవాదాయ శాఖ చట్టం ప్రకారమే జరుగాలని హైకోర్టు తేల్చి చెప్పింది. వీటి ఏర్పాటుకు ఏజెన్సీ ప్రాంత నిబంధనలు వర్తించబోవని స్పష్టం చేసింది. ఆ ఆలయాలకు స్థానిక గిరిజనులతోనే ట్రస్ట్ బోర్డులు, కమిటీలను ఏర్పాటు చేయాలనడం చెల్లదని తీర్పు వెలువరించింది. ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరులోని శ్రీ హేమాచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణ కమిటీకి దేవాదాయ శాఖ కమిషనర్ 2024 నవంబర్‌లో పత్రిక ద్వారా జారీచేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ పెసా గ్రామసభ తరఫున కార్యదర్శి కే ఆనందరావు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నంద విచారణ చేపట్టారు. ఇరుపక్షాల వాదనల అనంతరం న్యాయమూర్తి స్పందిస్తూ.. ఆలయ పునర్ధరణ కమిటీ చట్టప్రకారమే ఏర్పాటైందని తేల్చిచెప్పారు. దేవాదాయ శాఖ చట్టంలోని సెక్షన్ 146 ప్రకారమే కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేశారని, ఇది చట్టబద్ధమేనని స్పష్టం చేశారు. తెలంగాణ భూ బదలాయింపు నియంత్రణ నిబంధనలు ఏజెన్సీ ప్రాంతాల్లోని భూముల బదలాయింపునకు మాత్రమే వర్తిస్తాయని, ప్రస్తుత కేసులో భూబదలాయింపు ప్రస్తావనే లేనందున పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని ప్రకటించారు. ఆలయ కమిటీ ఏర్పాటుపై గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేశారు.

30లోగా ఆదివాసీ సమస్యలు పరిష్కరించాలి

- లేకుంటే జూలై 1 నుంచి పోరాటాలు ఉధృతం చేస్తాం: తుడుందెబ్బ

కొత్తగూడ, జూన్ 3: ఆదివాసీల సమస్యలపై ఈనెల 30లోగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, లేకుంటే జూలై 1 నుంచి పోరాటాలను ఉధృతం చేస్తామని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో పోరుకేక మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్రంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఆదివాసీలపై కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు చూస్తున్నదని మండిపడ్డారు. ఈనెల 30లోగా ఆదివాసీల ప్రతినిధులను పిలిపించి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. లేకుంటే ఆదివాసీ ప్రాంతాల్లోని వనరుల తరలింపును అడ్డుకొని ప్రభుత్వానికి ఆదాయం రాకుండా చేస్తామని ఆయన హెచ్చరించారు.

డ్రగ్స్ స్థావరంపై మహారాష్ట్ర పోలీసుల దాడి

- 6.22 కోట్ల విలువైన ల్యాబ్ పరికరాలు సీజ్

కోహీర్, జూన్3: సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పీచెర్యాగడి తండా శివారులో ఏర్పాటు చేసిన డ్రగ్స్ తయారీ కేంద్రంపై మంగళవారం సాయంత్రం మహారాష్ట్ర పోలీసులు దాడి చేశారు. ముంబై, తదితర ప్రాంతాలకు చెందిన ఓ ముఠా సభ్యులు పీచెర్యాగడి శివారులో డ్రగ్స్ తయారుచేయడానికి ల్యాబ్ ఏర్పాటు చేసుకున్నట్టు సమాచారం అందడంతో వారు సోదాలు నిర్వహించారు. రూ.6.22కోట్ల విలువైన ల్యాబ్ పరికరాలు, రూ.22కోట్ల విలువైన మత్తు పదార్థాలు, రసాయనాలను సీజ్ చేశారు. ముఠా సభ్యులను అదుపులోకి తీసుకొని ముంబైకి తరలించారు.

డీకే ప్రమాణ స్వీకారానికి రేవంత్‌రెడ్డి హాజరు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. బుధవారం ఉదయం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి బెంగళూర్ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. సాయంత్రం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. డీకే శివకుమార్‌కు రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి కూడా హాజరయ్యారు.



గండికోటలో 'రణబాలి'

అగ్ర హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'రణబాలి' శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. రష్మిక మందన్న కథానాయిక. రాయలసీమ నేపథ్యంలో జరిగే ఈ కథలో విజయ్ దేవరకొండ 19వ శతాబ్దం నాటి చారిత్రక యోధుడి పాత్రలో కనిపించనున్నారు. బ్రిటీష్ ప్రభుత్వం అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడే యోధుడిగా ఆయన పాత్ర అత్యంత శక్తివంతంగా సాగుతుందని చెబుతున్నారు. ఈ సినిమా కోసం విజయ్ దేవరకొండ గుర్రపుస్వారీలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ఏపీలోని వైఎస్ఆర్ కడప జిల్లా గండికోటలో జరుగుతున్నది. కోట ముఖద్వారం, ధాన్యాగారంలో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మరోవారం రోజుల పాటు అక్కడే షూటింగ్ జరుగుతుందని తెలసింది. 'రణబాలి' సెప్టెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.



డాక్టర్ బయోపిక్‌లో సూర్య?

ఇటీవల విడుదలైన 'కరుప్పు'తో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు తమిళ అగ్ర హీరో సూర్య. ఇప్పటికే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద 300కోట్ల మైలురాయిని దాటింది. గత కొంతకాలంగా సరైన విజయాలు లేక సతమతమవుతున్న సూర్య కెరీర్‌కు 'కరుప్పు' మంచి ఊపునిచ్చింది. ఈ నేపథ్యంలో సూర్య కొత్త సినిమాకు సన్నాహాలు జరుగుతున్నాయి. తనకు 'జై భీమ్' వంటి క్లాసిక్ చిత్రాన్ని అందించిన దర్శకుడు టీజే జ్ఞానవేల్‌తో సూర్య మరో సినిమా చేయబోతున్నారని గతకొంతకాలంగా వార్తలొస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఇదొక డాక్టర్ బయోపిక్ అని తెలిసింది. చెన్నైలో ఛాతీ వైద్యుల నిపుణుడిగా, పేదల పాలిట పెన్నిధిగా ప్రసిద్ధికెక్కిన డాక్టర్ కృష్ణ వరదాచారి తిరువేంగడం జీవిత కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుందని చెన్నై ఫిల్మ్‌నగర్ టాక్. కేవలం 5 రూపాయల ఫీజుతో పేదప్రజలకు వైద్యాన్నందించి సేవా గుణాన్ని చాటుకున్నారు డాక్టర్ కృష్ణ వరదాచారి. వైద్యపరంగా ఆయన సేవలకుగాను పద్మశ్రీ పురస్కారం వరించింది. ఆరేళ్ల క్రితం కన్నుమూసిన ఈ లెజండరీ డాక్టర్ జీవితంలోని ముఖ్యఘట్టాలను తీసుకొని సినిమాకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. త్వరలో సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడుతుందని సమాచారం.



ఇప్పటివరకూ రాని కథ!

లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహిస్తున్న సంగీతప్రధాన చిత్రం 'సింగ్ గీతం'. ప్రముఖ దర్శకుడు నాగ్‌అశ్విన్ నిర్మిస్తున్నారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపూడి ప్రధాన పాత్రధారులు. ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర కథానాయిక అహల్యా బమ్రూ విలేకరులతో ముచ్చటించింది. తన నేపథ్యం గురించి చెబుతూ 'మాది పుదుచ్చేరి. ఇంగ్లీష్, ఫ్రెంచ్, బెంగాలీ భాషలు మాట్లాడే ఓ ఇంటర్నేషనల్ కమ్యూనిటీలో పెరిగాను. నా ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్ చూసి నాగ్‌అశ్విన్ సినిమాలో అవకాశం ఇచ్చారు. ఆడిషన్ కూడా ఇన్‌స్టాగ్రామ్ ద్వారానే ఇచ్చాను' అని చెప్పింది. ఈ సినిమాలో తాను బలమైన వ్యక్తిత్వం ఉన్న అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, ఇందులో విలన్ క్యారెక్టర్‌లో కూడా అమ్మాయే నటించిందని తెలిపింది. 'కథాపరంగా కూడా ఇది కొత్త జోనర్ సినిమా. ఇలాంటి కథను ఇంతవరకు చూసి ఉండరు. తెలుగు ఇండస్ట్రీలో పనిచేయడం ఆనందంగా ఉంది. మహేష్‌బాబు నా ఫేవరేట్ హీరో. యాక్షన్ సినిమాలు చేయాలన్నది నా డ్రీమ్' అని అహల్యా బమ్రూ చెప్పింది.

తండ్రి తాలూకు ప్రపంచం



రవితేజ తాజా చిత్రం 'ఇరుముడి' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. ఆధ్యాత్మిక భావాల్ని ప్రతిబింబించే టైటిల్‌తో తండ్రీకూతుళ్ల అనుబంధం ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండటమే అందుక్కారణం. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. బుధవారం 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' పేరుతో గ్లింప్స్‌ను విడుదల చేశారు. కూతురే ప్రపంచంగా బతికే తండ్రీ, వారిద్దరి మధ్య అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ గ్లింప్స్ హృద్యంగా సాగింది. అయ్యప్పదీక్ష తాలూకు విజువల్స్ భావోద్వేగభరితంగా అనిపించాయి. యాక్షన్ ఎలిమెంట్స్ కథపై మరింత ఆసక్తిని పెంచేలా ఉన్నాయి. ఓ తండ్రి తాలూకు ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ ఈ గ్లింప్స్ హార్ట్‌టచింగ్‌గా సాగింది. ప్రియా భవానీ శంకర్, సాయికుమార్, బేబీ నక్షత్ర, అజయ్‌ఘోష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: శివ నిర్వాణ.



రైతు కథ 'వంద దేవుళ్లు'

విజయ్ ఆంటోని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వంద దేవుళ్లు'. 'బిచ్చగాడు' ఫేమ్ శశి దర్శకుడు. ఈ నెల 19న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. గ్రామీణ నేపథ్యంలో రైతు కథ ఇదని, సామాజిక, కుటుంబ అంశాల్ని చర్చిస్తూ భావోద్వేగ ప్రధానంగా సాగుతుందని, మంచి సందేశం ఉంటుందని దర్శకుడు తెలిపారు. స్వాసిక, అజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత: రామాంజనేయులు జవ్వాజి, దర్శకత్వం: శశి.

వాణిజ్య

బ్లూమ్‌బర్గ్ ఎకనామిక్స్ తాజా నివేదిక

డాలర్ల కోసం ఆర్బీఐ బంగారాన్ని అమ్మేసింది!

2 వారాల్లో రూ.1.15 లక్షల కోట్ల పసిడి నిల్వల్ని విక్రయించింది





అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో సంక్షోభం.. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల విజృంభణ.. దేశీయ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణలు.. భారమైన దిగుమతులతో విదేశీ మారకం నిల్వల్లో క్షీణత.. ఈ నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ డాలర్ల కోసం తమ దగ్గరున్న పసిడి నిల్వలను అమ్మేసిందన్న వార్తలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి.

న్యూఢిల్లీ, జూన్ 3: మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలతో పెరుగుతున్న ముడి చమురు ధరలు, తరలిపోతున్న విదేశీ పెట్టుబడుల మధ్య కరిగిపోతున్న విదేశీ మారకం నిల్వల్ని పెంచుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆపసోపాలు పడుతున్నదా? ఈ క్రమంలోనే తమ దగ్గరున్న పసిడి నిల్వల్ని అమ్మేసిందా? ఇందుకు సంబంధించి తాజాగా వస్తున్న వార్తలు సంచలనం సృష్టిస్తున్నాయిప్పుడు. గత నెల మే 22తో ముగిసిన 2 వారాల్లో దాదాపు 12 బిలియన్ డాలర్ల (సుమారు 1.15 లక్షల కోట్లు) విలువైన బంగారాన్ని ఆర్బీఐ విక్రయించి ఉండవచ్చని బ్లూమ్‌బర్గ్ ఎకనామిక్స్ (బీఈ) సమాచారం. ఇదే సమయంలో 7.5 బిలియన్ డాలర్ల విదేశీ కరెన్సీ ఆస్తుల (డాలర్ల)ను కొన్నట్టు బీఈ సీనియర్ ఇండియా ఎకనామిస్ట్ అభిషేక్ గుప్తా రాసుకొచ్చారు.



అప్పట్లో 67 టన్నులు తాకట్టు..

సరిగ్గా 35 ఏండ్ల కిందట జరిగిన పరిణామం.. ఇప్పుడు ఆర్బీఐ తమ వద్దనున్న బంగారం నిల్వల్ని ఉపయోగించి డాలర్లను పోగేసిందన్న వార్తలకు బలం చేకూరుస్తుండటం గమనార్హం. దేశంలో ఏర్పడిన విదేశీ మారక ద్రవ్య సంక్షోభం నుంచి బయటపడటానికి 1991 మే, జూలై నెలల్లో ఆర్బీఐ తమ దగ్గరున్న పసిడి నిల్వల్ని తాకట్టు పెట్టింది. సుమారు 67 టన్నుల పుత్తడిని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్‌లలో తనఖా పెట్టి దాదాపు 600 మిలియన్ డాలర్లను నాడు సెంట్రల్ బ్యాంక్ తీసుకొచ్చింది. నిజానికి అప్పుడు దేశంలో ఉన్న ఫారెక్స్ నిల్వలు కొద్ది వారాల దిగుమతులకే సరిపోనున్నాయి. అవి కూడా అయిపోతే దేశం దివాలా తీసినట్టే.

ఇదీ సంగతి..

దేశీయ ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం విదేశీ దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇందులో మెజారిటీ వాటా గల్ఫ్ దేశాల నుంచే వస్తున్నది. అయితే అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తకర పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. అమెరికాకు అండగా ఉంటున్నాయని పొరుగున ఉన్న యూఏఈ, ఖతార్, కువైట్, సౌదీ అరేబియా, బహ్రెయిన్ తదితర గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు చేస్తున్నదీ చూస్తూనే ఉన్నాం. ఫలితంగా అక్కడ ముడి చమురు, సహజ వాయువుల ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. మరోవైపు భారత్ సహా ఇతర ఆసియా దేశాలకు సరుకు రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ తమ ఆధీనంలోకి తీసుకున్నది. ఈ దెబ్బకు అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలకు రెక్కలు తొడిగాయి. ఇది దిగుమతులపై ఆధారపడుతున్న భారత్‌ను ప్రభావితం చేస్తుండగా, పెద్ద మొత్తంలో డాలర్లను చెల్లించాల్సి వస్తున్నది. అందుకే ఇటీవల చమురేతర దిగుమతుల్లో ముందుగా ఉంటున్న బంగారం, వెండి దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షల్ని తీసుకొచ్చింది. ఇక ఈ పరిణామాలన్నీ దేశీయ క్యాపిటల్, ఫారెక్స్ మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. భారత్ నుంచి పెద్ద ఎత్తున విదేశీ మదుపర్లు తమ పెట్టుబడులను వెనుకకు తీసుకుంటున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ గురించి సరేసరి. గత నెల 20న తొలిసారి 96.86 వద్ద ముగిసింది. ఒకానొక దశలోనైతే 97 మార్కును చేరుతుందా? అన్నట్టు 96.95 స్థాయికి దిగజారింది. రూపీ వాల్యూ పడిపోతున్నకొద్దీ దేశంలోకి దిగుమతయ్యే వస్తూత్పత్తులకు డాలర్లలో ఇంకా ఎక్కువగా చెల్లించాల్సి వస్తుందన్నది తెలిసిందే. అంతర్జాతీయ వాణిజ్యం అంతా ప్రపంచ కరెన్సీగా ఉన్న అమెరికన్ డాలర్లలోనే జరుగుతుంది మరి. ఇలా.. ఫారెక్స్ రిజర్వులపై ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో పసిడి నిల్వలను విక్రయించి ఆర్బీఐ డాలర్లను కొన్నదన్న వార్తలు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి.

వదంతులే: రిజర్వ్ బ్యాంక్

పసిడి నిల్వల అమ్మకం వార్తలు.. వదంతులేనని ఆర్బీఐ బుధవారం స్పష్టం చేసింది. తమ దగ్గర భౌతిక రూపంలో ఉన్న గోల్డ్ రిజర్వుల్లో ఏ మార్పూ లేదని బ్లూమ్‌బర్గ్ ఎకనామిక్స్ వార్తను ఓ ప్రకటనలో ఖండించింది. ఈ ఏడాది మార్చి 31నాటికి 880.52 టన్నులుగా ఉన్నాయన్నది. కాగా, ఏ సమాచారాన్నైనా తమ అధికారిక వెబ్‌సైట్లను చూసి నిర్ధారించుకోవాలని ఆర్బీఐ సూచించింది.

- ఈ ఏడాది ఫిబ్రవరి 27నాటికి దేశంలో ఉన్న ఫారెక్స్ రిజర్వులు 728.494 బిలియన్ డాలర్లు. ఇదే ఆల్‌టైమ్ హై.
- గత నెల మే 22నాటికి 681.384 బిలియన్ డాలర్లకు పతనం.
- పశ్చిమాసియా సంక్షోభం మొదలయ్యాక దాదాపు గడిచిన 3 నెలల్లో కరిగిపోయిన 47.11 బిలియన్ డాలర్లు.
- ముడి చమురు దిగుమతుల్లో ప్రపంచంలోనే భారత్‌ది మూడో స్థానం.
- గల్ఫ్ వార్‌తో పెరుగుతున్న క్రూడాయిల్ రేట్లు.. భారతీయ దిగుమతుల్ని అంతకంతకూ ఖరీదెక్కిస్తున్నాయి.
- ఈ ఏడాది మార్చి ఆఖరుకల్లా ఆర్బీఐ వద్ద 880.52 మెట్రిక్ టన్నుల పసిడి నిల్వలు.
- ఆర్బీఐ గోల్డ్ రిజర్వుల్లో 77 శాతం దేశంలోనే ఉండగా.. 23 శాతం విదేశాల్లో ఉన్నాయి.
- గడిచిన 6 నెలల్లో దాదాపు 30 శాతం విదేశీ గోల్డ్ రిజర్వులను భారత్‌కు తెచ్చిన ఆర్బీఐ.
- విదేశాల్లో ఎక్కువగా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్లలోనే పుత్తడిని దాచిన ఆర్బీఐ.
- రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా ఆస్తుల్ని ఐరోపా దేశాలు ఫ్రీజ్ చేయడంతో స్వదేశమే సేఫ్ అని భావిస్తున్న ఆర్బీఐ.

పుత్తడి అమ్మేందుకు దారితీస్తున్న ప్రధాన కారణాలివే..

- అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న ముడి చమురు ధరలు.
- డాలర్‌తో పోల్చితే రికార్డు కనిష్ఠాలకు దిగజారుతున్న రూపాయి మారకం విలువ.
- యుద్ధాలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు.
- దేశ ఆర్థిక వ్యవస్థలోనూ ప్రతికూల సంకేతాల నడుమ బంగారం కంటే బలమైన విదేశీ మారక ద్రవ్య (ముఖ్యంగా డాలర్లు) నిల్వలే సురక్షితమన్న ఆర్బీఐ ఆలోచనలు.
- దేశంలో ఫారెక్స్ రిజర్వులు ఎక్కువగా ఉంటే.. కరెన్సీ మార్కెట్‌లో రూపాయి నష్టాలను అడ్డుకోవచ్చన్న భావన.

సంగారెడ్డిలో థెరానిమ్ యూనిట్

రూ.1,200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన సంస్థ



హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : క్యాన్సర్, ఇతర అరుదైన రోగాలను నయం చేసే బయోలాజిక్స్, వ్యాక్సిన్లు, సెల్ అండ్ జీన్ థెరపీ వంటి అత్యంత అధునాతన వైద్య పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డి జిల్లాలో రూ.1,200 కోట్ల పెట్టుబడితో థెరానిమ్ బయోలాజిక్స్ తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..పరిశోధన దశ నుంచి కమర్షియల్ ప్రొడక్షన్ దాకా అవసరమైన అన్ని సదుపాయాలను ఒకే చోట కల్పించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'ప్రపంచ స్థాయి ఎకో సిస్టమ్'ను అభివృద్ధి చేసేలా సమగ్ర కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఫార్మా రాజధానిగా కొనసాగుతున్న హైదరాబాద్‌ను బయో టెక్నాలజీ రంగంలోనూ గ్లోబల్ లీడర్‌గా మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాబోయే రోజుల్లో బయోటెక్నాలజీ రంగంలో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ జెనెటిక్స్ వంటి సాంకేతికతలు విప్లవాత్మక మార్పులు తీసుకొస్తామని చెప్పారు. ఫలితంగా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకుంటూనే.. తలెత్తే సవాళ్లను అధిగమించేలా.. దిగ్గజ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించేలా వ్యూహాత్మక అడుగులు వేస్తున్నామని వివరించారు. లైఫ్ సైన్సెస్ పాలసీ, వన్ బయో హబ్, గ్రీన్ ఫార్మా సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్ తదితర విప్లవాత్మక అడుగులు లైఫ్ సైన్సెస్ రంగంలో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్‌ను మరింత విశ్వవ్యాప్తం చేసేందుకు దోహదపడుతాయని పేర్కొన్నారు. తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చే ప్రయాణంలో థెరానిమ్ బయోలాజిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ మరొక కీలక మైలురాయి అని.. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. క్యాన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు సంబంధించిన ఔషధాలను ఇక్కడ ఉత్పత్తి చేసి.. యూఎస్ సహా పలు దేశాలకు ఎగుమతి చేయనున్నట్టుగా వివరించారు.

1.60 లక్షల దిగువకు గోల్డ్

న్యూఢిల్లీ, జూన్ 3: బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడం, అమెరికా-ఇరాన్ సీజ్‌ఫైర్‌పై అనిశ్చితి నెలకొనడంతో ఈ ధరలు భారీగా తగ్గాయి. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర రూ.1,850 లేదా 1.14 శాతం తగ్గి రూ.1,59,600కి దిగొచ్చింది. అంతకుముందు ఇది రూ.1,61,450గా ఉన్నది. కిలో వెండి రూ.1,500 తగ్గి రూ.2,69,500కి దిగొచ్చింది.

ఎన్ఎండీసీ ధరల పెంపు

న్యూఢిల్లీ, జూన్ 3: ఖనిజ ధరలను పెంచినట్టు ఎన్ఎండీసీ ప్రకటించింది. టన్ను ఖనిజ ధరను రూ.200 పెంచిన సంస్థ.. నాణ్యమైన టన్ను ఖనిజ ధరను రూ.150 సవరించింది. పెరిగిన ధరలు వెంటనే అమల్లోకి వచ్చాయని పేర్కొంది. అలాగే ప్రస్తుత త్రైమాసికంలో ఖనిజ ధరలను పెంచడం ఇది మూడోసారి కావడం విశేషం. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో బైలా లంప్సం ఖనిజ టన్ను ధర రూ.5,700కి చేరుకోగా, నాణ్యమైన రకం రూ.4,850గా నమోదైంది.

ప్లాస్టో ప్రచారకర్తగా తాప్సీ



నాగ్‌పూర్, జూన్ 3: ప్లాస్టిక్ పైపులు, వాటర్ ట్యాంక్‌ల తయారీలో అగ్రగామి సంస్థల్లో ఒక్కటైన ప్లాస్టో..ప్రచారకర్తగా ప్రముఖ నటి తాప్సీ పన్నును నియమించుకున్నది. బాత్‌వేర్ ఉత్పత్తులకు తాప్సీ ప్రచారం చేయనున్నారు. కంపెనీ బ్రాండ్‌ను మరింత విస్తృతపర్చాలనే ఉద్దేశంతో తాప్సీని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్టు, తద్వారా మరింత మందికి చేరువకావడానికి వీలు పడనున్నదని కంపెనీ డైరెక్టర్ విశాల్ అగర్వాల్ తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 4 జూన్ 2026 | HYDERABAD

సూడో పోలీస్ గ్యాంగ్ గుట్టురట్టు

వ్యాపారిని బంధించి రూ.5.26 లక్షలు వసూలు

కుత్బుల్లాపూర్, జూన్ 3: పోలీసులమని నమ్మించి వ్యాపారస్తులను, ఆర్థికంగా బలంగా ఉన్న వ్యక్తులను టార్గెట్ చేస్తూ కిడ్నాప్‌లు, బెదిరింపులతో పాటు డిజిటల్ వసూళ్లకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నకిలీ పోలీసు(సూడో పోలీసు)ల ముఠా పోలీసులకు చిక్కింది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కూకట్‌పల్లి సీసీఎస్, జగద్గిరిగుట్ట పోలీసులు సంయుక్తంగా ఛేదించిన కేసుకు సంబంధించిన వివరాలను కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ కోటిరెడ్డి వెల్లడించారు. కూకట్‌పల్లికి చెందిన కావురి పూర్ణచందర్‌రావు అనే వ్యాపారి మే 18న మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తన మోటర్ సైకిల్‌పై జగద్గిరిగుట్ట పరిధిలోని ప్రశాంత్‌నగర్ వైపునకు వెళ్తున్నాడు. శుభోదయ కాలనీలోని లేక్ బార్ ఎదురుగా కారులో వచ్చిన దుండగులు అతడిని అడ్డుకొని తాము హర్యానాకు చెందిన పోలీస్ అధికారులమని.. మీపై హర్యానాలో ఒక క్రిమినల్ కేసు నమోదైందని, విచారణ నిమిత్తం తమతో రావాలని నమ్మించారు. కాగా అప్పటికే హర్యానాలో పూర్ణచందర్‌రావుపై ఓ కేసు వ్యవహారం నడుస్తుండటంతో నిజమైన పోలీసులేనని మిగతా IIవ పేజీలో

రేపట్నుంచి స్టూడెంట్ బస్‌పాస్‌ల జారీ

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): విద్యాసంస్థలు ప్రారంభం అవుతుండటంతో గ్రేటర్ హైదరాబాద్ ఆర్టీసీ సెంట్రల్ విద్యా సంస్థలకు బస్ పాస్ కోడ్‌లు జారీ చేస్తున్నాయి. ఇప్పటికే కోడ్ ఉన్న సంస్థలు పాస్‌లు దరఖాస్తు చేసుకోవడంపై పలు సూచనలు చేసింది. శుక్రవారం నుంచి స్టూడెంట్ బస్‌పాస్‌లు జారీ చేయనున్నట్టు గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎప్పటిలాగానే విద్యార్థులకు జారీచేసే ఫ్రీ, రూట్, స్టూడెంట్ జనరల్, స్టూడెంట్ గ్రేటర్, స్టూడెంట్ స్పెషల్, స్టూడెంట్ ఎక్స్‌క్లూజివ్, డిస్ట్రిక్ట్ రూట్‌పాసులు పొందడానికి http: //tgsrtc pass.comలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యాసంస్థలు ఆర్టీసీ సూచించిన అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు చెల్లించాలని కోరారు. కాగా, ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థలు అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు చెల్లించడం నుంచి మినహాయించినట్టు వివరించారు. మరింత సమాచారం కోసం 80082 04216 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.





సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

సర్‌తో అప్రమత్తం

స్థానికుల ఓట్లు తొలగించకుండా చూడాలి

ఓట్ల వడబోతపై జాగ్రత్తగా ఉండండి

సర్, బీఆర్ఎస్ సభ్యత్వ నమోదుపై శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం

ఎన్నికల్లో గెలుపొందాలంటే బూత్‌స్థాయి ఏజెంట్ల పాత్ర కీలకం

సికింద్రాబాద్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆకట్టుకున్న కేటీఆర్ ప్రసంగం

IIలో



ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రతి బూత్ పరిధిలోని దొంగ ఓట్లను ఏరి వేయడంతో పాటు స్థానికులకు సంబంధించి ఒక్క ఓటు కూడా తొలగించకుండా చూడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే టీ పద్మారావు గౌడ్ అధ్యక్షతన సీతాఫల్‌మండిలో జరిగిన సికింద్రాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతల విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా ప్రత్యేక నిరంతర సవరణ (సర్), పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలపై కేటీఆర్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్/సర్) పై బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు అత్యంత చురుగ్గా వ్యవహరించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఉపాధి, చదువుల కోసం ప్రజలు కిరాయి ఇళ్లు మారే క్రమంలో ఓట్ల మార్పిడి జరుగుతుందని గుర్తుచేశారు. ఈ క్రమంలో ప్రతి ఒక్క కార్యకర్త బాధ్యతగా తీసుకుని ఓటర్ల జాబితా సవరణలో కీలకమైన నాలుగు అంశాలపై దృష్టి పెట్టాలని కేటీఆర్ సూచించారు. - సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ)

మిత్తితో సహా చెల్లిస్తాం: మాజీ మంత్రి తలసాని



రేవంత్ సర్కార్ రెండున్నరేళ్లుగా హైదరాబాద్‌లో ఒక్క మంచి కార్యక్రమం కూడా చేపట్టలేదని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. అలవికాని హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. కేసీఆర్ అప్పులు చేశారని, కానీ వాటితో సచివాలయం, కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రజాభవన్, ప్రతి జిల్లాలో కలెక్టరేట్, కాళేశ్వరం ప్రాజెక్టు, జిల్లాల్లో మెడికల్ కళాశాలలు నిర్మించారని కొనియాడారు. కాంగ్రెస్ సర్కార్ 4.5 లక్షల కోట్లు అప్పుచేసి ఏమిచేసిందని ప్రశ్నించారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం మన అస్తిత్వంపై దెబ్బ కొట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఈ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. స్థానిక నాయకులు సికింద్రాబాద్ ప్రజల మధ్యే ఉండాలని పిలుపునిచ్చారు. అధికారం, పోలీస్‌లు మన చేతిలో ఉందికదా అని ఏదిపడితే అది చేస్తామంటే.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని.. అప్పుడు మిత్తితో సహా చెలిస్తామని తలసాని ఫైర్ అయ్యారు.

సభ్యత్వ నమోదు అంతా డిజిటల్..

ఇదే నెలలో ప్రారంభం కానున్న పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తిగా డిజిటల్ విధానంలో సరికొత్త మొబైల్ యాప్ ద్వారా చేపట్టనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. కేవలం ఫోన్ నంబర్, ఫొటో అప్‌లోడ్ చేస్తే ఓటర్ ఐడీ ఆధారంగా వివరాలన్నీ ఆటోమేటిక్‌గా నమోదు అవుతాయని చెప్పారు. సికింద్రాబాద్‌లో ప్రతి కార్యకర్తకూ బ్రహ్మాండమైన ఫొటో ఐడీ కార్డులు అందించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

చిరిగిన గ్లౌజులు విరిగిన క్యాథటర్

నిమ్స్‌లో నాసిరకం వైద్య పరికరాలతో శస్త్రచికిత్సలు

- ఆపరేషన్ సమయంలో చిరిగిపోతున్న గ్లౌజులు, విరిగిపోతున్న క్యాథటర్లు
- ప్రశ్నించిన వైద్యులపై బెదిరింపులు
- ఓ అధికారి ఫిర్యాదుతో వెలుగులోకి వ్యవహారం
- పేషెంట్ల ప్రాణాలతో చెలగాటంపై వెల్లువెత్తుతున్న విమర్శలు

దేశంలో ఉత్తమ వైద్య సేవలందించే వైద్య సంస్థగా పేరొందిన నిమ్స్ ఆస్పత్రిలో నాసిరకం వైద్య పరికరాల వినియోగం కలకలం రేపుతోంది. రోగుల ప్రాణాలకు అత్యంత కీలకమైన శస్త్రచికిత్సలో వినియోగించే పరికరాల్లో పూర్తిగా నాణ్యత లోపించడంతో ఆస్పత్రి వైద్యవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆపరేషన్ సమయంలో గ్లౌజులు చిరిగిపోవడం, స్పైనల్ అనస్థీషియాకు వినియోగించే క్యాథటర్ విరిగిపోతుండటంతో అటు రోగులు, ఇటు వైద్యులు గగ్గోలు పెడుతున్నారు. - ఖైరతాబాద్, జూన్ 3

నిమ్స్ దవాఖానకు అవసరమయ్యే వైద్య పరికరాలన్నీ రేట్ కాంట్రాక్ట్ విధానంతో సమకూరుతుంటాయి. కావాల్సిన వస్తువులకు ఒక రేట్ పెట్టి టెండర్లను ఆహ్వానిస్తారు. పరికరాల కొనుగోలుకు ముందు వైద్యుల బృందంతో ఒక కమిటీ వేస్తారు. సదరు కమిటీ ఎలాంటి పరికరాలు తీసుకోవాలి, ఎవరికి అవకాశం ఇవ్వాలి, నాణ్యత ప్రమాణాలను ఎలా గుర్తించాలి....తదితర అంశాలపై విచారణ చేస్తుంది. పరికరాలను సరఫరా చేసే సంస్థల ఎంపికలోనూ ఫైనాన్షియల్, టెక్నికల్ అనే రెండు విభాగాలను పరిగణంలోకి తీసుకుంటారు.ఆయా ప్రక్రియల్లో ఆ పరికరం నాణ్యత, మన్నిక, ట్రాక్ రికార్డ్, టర్నోవర్ తదితర అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. రేట్ ఎక్కువగా ఉన్నా....నాణ్యమైన పరికరాల కొనుగోలుకే ప్రాధాన్యతనివ్వాలి. అలా అన్ని పరీక్షలను నెగ్గిన సంస్థకు అవకాశం మిగతా IIవ పేజీలో



చర్చలు లేకుండానే కొనుగోళ్లు

నిమ్స్ దవాఖానకు ఎలాంటి పరికరాలుకొనాలి...ఎవరికి అవకాశం ఇవ్వాలి. నాణ్యత ప్రమాణాలు తదితర అంశాలు రేట్ కాంట్రాక్ట్ ప్రక్రియ కోసం కూర్చునే వైద్యుల కమిటీ నాతో చర్చించాలి. గత 2 సంవత్సరాలుగా ఆ ప్రక్రియ కొనసాగడం లేదు. దాన్నంతటినీ పర్యవేక్షించాల్సిన బాధ్యత నాదే అయినా రేట్ కాంట్రాక్ట్, టెండర్లు, పరికరాల ఎంపిక అంతా నాకు తెలియకుండానే కానిచ్చేస్తున్నారు.

- డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్



గ్రేటర్‌లో రెండు రోజులు వర్షాలు

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): విదర్భ నుంచి తెలంగాణ మీదుగా కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. సాయంత్రం గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 38.4డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 28.4 డిగ్రీలు, గాలిలో తేమ 44శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ద్రోణి ప్రభావంతో గ్రేటర్‌లోని పలుచోట్ల రానున్న రెండు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఈఎస్ఐలో అధికారుల తిష్ట

దశాబ్దాలుగా హైదరాబాద్‌లోనే పోస్టింగ్

- కేంద్ర సర్వీసు అయినప్పటికీ పైరవీలతో నగరం చుట్టూరానే బదిలీలు, పదోన్నతులు
- తాజా బదిలీల్లోనూ మారని సదరు అధికారుల తీరు
- శాఖలోని ఇతర ఉద్యోగులపై పెత్తనం.. వెల్లువెత్తున్న విమర్శలు
- ఉన్నతాధికారులు దృష్టి సారించాలంటున్న ఉద్యోగులు

IIలో



ఈఎస్ఐలో విధులు నిర్వర్తిస్తున్న కొందరు అధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీల అవకాశం వచ్చినప్పటికీ వాటిని తిరస్కరించి తమకున్న పరిచయాలతో పైరవీలు చేస్తూ సుదీర్ఘ కాలంగా హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లోనే తిష్టవేశారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు 20-30ఏళ్లు గడుస్తున్నా వారు నగరాన్ని వదిలి బయటకు వెళ్లలేదు. కొందరు పైరవీలతో, మరికొందరు యూనియన్‌ల ముసుగులో నగరంలోనే దశాబ్దకాలంగా తిష్టవేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సదరు అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారి..ఇతర ఉద్యోగులను వివిధ రకాలుగా వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు సొంత శాఖలోనే వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే నలుగురు అధికారులు నగరంలోనే అపాయింట్‌మెంట్ కావడం, ఇక్కడే పదోన్నతులు పొందడం, ఒకవేళ బదిలీలు జరిగినా హైదరాబాద్, సికింద్రాబాద్ గడప లోపలే పోస్టింగ్‌లు పొందుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అధికారుల విషయమై కొందరు బాధితులు ఇప్పటికే చీఫ్ సెక్రటరీ, ఐఎంఎస్ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌తో పాటు సంబంధిత శాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు.

- సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ)





ఆయా కమిషనరేట్లలో పీఎస్‌లను సందర్శించి సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీలు తరుణ్‌జోషి, సుమతి (ఫైల్)

సిటీ ప్రజలకు పారదర్శక సేవలు

మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్లు సుమతి, తరుణ్‌జోషి

ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా పోలీసులు పనిచేయాలని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సమతి సూచించారు. ఇటీవల మల్కాజిగిరి పోలీస్ కమిసనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె సోమవారం కీసర పోలీస్‌స్టేషన్‌ను , మంగళ వారం మార్కెట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సిబ్బంది పనితీరు గూర్చి ఆరా తీశారు. అలాగే ఉప్పల్, మల్కాజిగిరి జోన్లలో ఇటీవల పోలీసుల వ్యవహార శైలిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయా జోన్లలోని పోలీస్ అధికారులతో సీపీ వరుస సమీక్షలు నిర్వహించినట్లు తెలిసింది. క్షేత్ర స్థాయిలో పోలీసింగ్ పటిష్టంగా ఉండేలా అధికారుల పర్యవేక్షణ ఉండాలని, నేరాలు జరగకుండా పకడ్బందీగా పెట్రోలింగ్ నిర్వహించాలంటూ సూచనలు చేస్తున్నారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆమె అర్ధరాత్రి వేళల్లో దిల్‌సుఖ్‌నగర్‌లో ఒంటరిగా తిరుగుతూ అడ్డదారులు తొక్కుతున్న యువతను క్రమశిక్షనలో పెట్టేందుకు చర్యలు చేపట్టారు. హాస్టల్స్ ఎక్కువగా ఉండటంతో అదే ప్రాంతంలో సమావేశం ఏర్పాటు చేసి యువతకు హితబోధ చేశారు. అలాగే ఆయా ప్రాంతాలలో ఉన్న హాస్టల్స్‌లో ఉండే వారి జాబితాను తయారు చేసి, రికార్డులు పక్కాగా నిర్వహించాలని తగిన సూచనలు చేయడంతో క్షేత్రస్థాయిలోని పోలీసులు డేటాను సేకరించారు. ఇలా క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను సరిదిద్దుతూ, పోలీసింగ్‌ను పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకంటున్నారు. - సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ)

ఫ్యూచర్ సిటీకి మెట్రో లేనట్టే!

జన సంచారమే లేని ప్రాంతాలకు మెట్రో ఎందుకు?

- రాష్ట్ర సర్కార్ ఆరాటానికి కేంద్రం బ్రేకులు
- సదరు మార్గాన్ని ఫేజ్-3కి మార్చాలనే విజ్ఞప్తి తిరస్కరణ

నగరంలో నిత్యం వేలాది వాహనాలతో కిక్కిరిసిపోయే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ కష్టాలు వర్ణనాతీతం, రోజురోజుకు జనాభా, వాహనాల సంఖ్య పెరుగుతున్నా.. మెట్రో విస్తరణపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి స్పష్టమైన వ్యూహం లేకుండా వ్యవహరిస్తోంది. జనావాసాలు ఉన్న చోటనే ప్రాజెక్టులు చేపట్టకుండా నిర్మానుష్య ప్రాంతాల్లో మెట్రో లైన్ల కోసం ఆరాటపడం కాంగ్రెస్ లోపభూయిష్ట పాలనకు నిదర్శనమని వేలెత్తి చూపుతున్నారు. జన సంచారమే లేని, ఇంకా రూపురేఖలు రాని ఫ్యూచర్ సిటీ మెట్రో మాయలో జనాలను మభ్య పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

- సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ)



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫ్యూచర్ సిటీ జపం చేస్తోంది. జనావాసాలు దట్టంగా ఉండి, నిత్యం ఐటీ ఉద్యోగులు, కూలీలు విద్యార్థులతో కిక్కిరిపోయే నగరంలోని ప్రధాన మార్గాలను గాలికొదిలేసి, ఎక్కడో ఫార్మా సిటీ పరిసరాల్లో ప్రతిపాదిస్తున్న ఫ్యూచర్ సిటీకి మెట్రో లైన్ వేస్తామనడం హాస్యస్పదంగా మారింది. అయితే ఫ్యూచర్ సిటీ మార్గాన్ని ఫేజ్-3గా మార్చాలని, ప్రభుత్వం అత్యంత అవసరమైన రూట్లకు ప్రాధాన్యత ఇవాలని నిపుణులు మొత్తుకుంటున్న రాష్ట్ర సర్కార్ మొండిగా ముందుకెళ్లింది. అయితే ప్రజా సంచారమే లేని అడవుల్లోకి మెట్రో లైను ఎలా వేస్తారంటూ కేంద్రం ఈ విజ్ఞప్తిని తిరస్కరించింది. వేల కోట్లు ఖర్చు చేసి జనం లేనిచోట (ఫ్యూచర్‌సిటీ) మెట్రో వేస్తామంటే కుదరదంటూ కేంద్ర ప్రభుత్వం ఈ రూట్‌ను తిరస్కరించింది. సాంకేతిక కారణాలు, నిబంధనలు, లోపాలతో పక్కన పడేసింది. ఈ క్రమంలో అసలు ఫ్యూచర్ సిటీ వైపు ఉన్న జనాభా మిగతా IIవ పేజీలో





మురుగు పరుగును ఆపండి

- డ్రైనేజీ నీటిలో బైఠాయించి బీఆర్ఎస్ నేతల నిరసన

మియాపూర్, జూన్ 3: అభివృద్ధి పేరుతో గొప్పలు చెప్పుకుంటున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ.. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు అనిల్‌రెడ్డి విమర్శించారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళీనగర్ ప్రధాన రహదారిపై 20 రోజులుగా మురుగు నీరు పారుతూ చెరువును తలపిస్తున్నా సమస్యను పరిష్కరించకపోవటాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ నేతలతో కలిసి అనిల్‌రెడ్డి బుధవారం మురుగు నీటిలో బైఠాయించి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే గాంధీ ఫ్లెక్సీలు చేతపట్టి సమస్య పరిష్కరించాలని నినదించారు. 2 రోజులలో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ నివాసాన్ని ముట్టడిస్తామని అనిల్ రెడ్డి హెచ్చరించారు.

సూడో పోలీస్ గ్యాంగ్ గుట్టురట్టు

(మొదటిపేజీ తరువాయి)

బాధితుడు నమ్మగా.. అతడు తేరుకునేలోపే బలవంతంగా కారులోకి ఎక్కించి అక్రమంగా బంధించారు. అతని మొబైల్ ఫోన్, ఏటీఎం కార్డు, నగదు లాక్కొని బ్యాంకింగ్ ఐడీలు, పాస్‌వర్డ్‌లు తెలుసుకున్నారు. ఈ క్రమంలో బాధితుడు తమను పూర్తిగా నమ్మించేందుకు హర్యానాకు చెందిన ఒక పోలీస్ అధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్నట్లుగా ఒక నకిలీ వీడియో కాల్‌ను క్రియేట్ చేసి డ్రామా ఆడారు. అనంతరం బాధితుడిని కారులోనే సూర్యాపేటకు తీసుకెళ్లారు. అక్కడ ఏటీఎం ద్వారా మొదటగా రూ.లక్ష డ్రా చేశారు. అలాగే ఫోన్ పే ద్వారా బ్యాంకింగ్ అప్లికేషన్ల ద్వారా వివిధ అకౌంట్లకు దాదాపుగా రూ.5 లక్షల 26 వేలు వసూలు చేసి తర్వాత భౌతికంగా దాడిచేసి, అతడి ఫోన్‌లోని సిమ్‌కార్డులు తొలగించి, ఒక సాధారణ బేసిక్ ఫోన్‌ను చేతిలో పెట్టారు. ఆ తర్వాత తిరిగి నగరానికి తీసుకొచ్చి జన సంచారం లేని నిర్మానుష్య ప్రాంతంలో వదిలేసి పరారయ్యారు. జరిగిన ఘటనపై బాధితుడు పూర్ణచందర్‌రావు మే 20న జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను పట్టుకునేందుకు రంగంలోకి దిగారు. లేటెస్ట్ టెక్నాలజీ ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ద్వారా పాత నేరస్తుల డేటాతో పోల్చి చూసి ప్రధాన నిందితుడైన తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఎ-1 నాగరాజును ట్రాక్ చేసి పట్టుకున్నారు. విచారణలో ప్రధాన నిందితుడితో పాటు బీహార్‌కు చెందిన ప్రదీప్‌కుమార్ మిశ్రా, ఆగ్రాకు చెందిన సత్యభాన్‌సింగ్, మహబూబాబాద్‌కు చెందిన నాగేంద్రశర్మ, మరో ముగ్గురు నిందితులను నిజాంపేట్‌లోని ఓ రూమ్‌లో అరెస్ట్ చేసారు. యశ్వంత్ సింగ్, సునీల్‌కుమార్‌సింగ్ పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి కంట్రీ మేడ్ పిస్టల్, నకిలీ పోలీస్ యూనిఫామ్‌లు, ఐడీకార్డులు, ర్యాంక్‌బ్యాడ్జీలు, బేడీలు, లాఠీలు, పోలీస్ స్టాంపులు, నేమ్‌ప్లేట్లు, షూస్, నకిలీ ప్రభుత్వ పత్రాలు, లెటర్ ప్యాడ్‌లు, నకిలీ కోర్టు సీళ్లు, మొబైల్ ఫోన్లు, ల్యాటాప్‌లు, కారు, ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఆపరేషన్‌లో జోన్ క్రైమ్ డీసీపీ ముత్యంరెడ్డి, అడిషనల్ డీసీపీ పురుషోత్తం, కుత్బుల్లాపూర్ ఏసీపీ బాలగంగిరెడ్డి, సీసీఎస్ ఏసీపీ నాగేశ్వర్‌రావు, జగద్గిరిగుట్ట సీఐ పీ నరేంద్రరెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కే రవికుమార్, క్రైమ్ టీం పాల్గొన్నారు.

విదేశీ పౌరుల సమాచారం ఇవ్వాలి

శంషాబాద్ డీసీపీ రాజేష్

శంషాబాద్ రూరల్, జూన్ 3 : విదేశీ పౌరులు ఉంటే వారి సమాచారం ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టం 2025 ప్రకారం వారి వివరాలు పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాలని శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో మీడియాకు తెలిపారు. శంషాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యా సంస్థలు, ఇంటి యాజమానులు, లార్జీల, ఆసుపత్రుల యాజమానులు విదేశాలకు చెందిన వారి వివరాలను పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని సూచించారు. పైన తెలిపిన వాటిలో ఉన్న వారికి విదేశీ పాస్‌పోర్టు కలిగిన వారు. ఓసీఐ కార్డులు కలిగినవారు, నేపాల్ దేశ పౌరులు తదితర వారి వివరాలు వివరించాలని సూచించారు. వివరాల కోసం జోన్ డీసీపీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సర్‌తో అప్రమత్తం

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ఇతర రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను ఉదాహరణగా చూపిస్తూ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో 95 లక్షలు, బీహార్‌లో 65 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించడం వలనే అక్కడి ప్రధాన పార్టీలు నష్టపోయాయని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణలోనూ ఇటువంటి అక్రమాలు జరగకుండా బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏ) సైనికుల్లా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో 'కాంగ్రెస్ పోవాలి.. కేసీఆర్ రావాలి' అనే వాతావరణం ఉందని, దానిని ఓట్ల రూపంలో మార్చాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. బీజేపీ, పార్టీలు దొంగ ఓట్లను చేర్పించి, అక్రమ మార్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీని ఓడించాలని చూస్తున్నాయని కేటీఆర్ ఆరోపించారు. వారి కుట్రలు సాగకుండా చూడాల్సిన బాధ్యత మన సైనికులైన బీఎల్‌ఏలదేనని అన్నారు.

జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే..

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) అనేది ఓటర్ల జాబితాను జల్లడపట్టే వడపోత కార్యక్రమం అని కేటీఆర్ వివరించారు. ఈ యేడాది జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వస్తారని, ఈ సమయంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చూడాలన్నారు. చనిపోయిన వారి ఓట్లను తొలగించడం, ఇళ్లుమారిన వారి వివరాలను సవరించడం వంటి 5 రకాల బాధ్యతలను ఏజెంట్లు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అక్టోబర్ 1న వెలవడే తుది జాబితాయే రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలకు కీలకం కానుందని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ పరిధిలో జరిగిన ఓట్ల అక్రమాలను ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. ఒకే ఓటరుకు ఐదు వేర్వేరు నియోజకవర్గాల్లో ఓట్లు ఉన్న ఉదాహరణలను స్క్రీన్‌పై ప్రదర్శించారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఇటువంటి అనుమానస్పద ఓట్ల జాబితాను పార్టీ తరపున వర్క్ బుక్ రూపంలో ప్రతి ఏజెంట్‌కు అందజేస్తామని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు.

అధికారులే ఇంటికి వచ్చి సమాచారం సేకరిస్తారు..

దేశంలోనే అత్యంత ధనవంతుడైన అంబానీకైనా, సామాన్యుడికైనా ఒకే ఓటు హక్కు ఉంటుందని, ఆ ఓటును సక్రమంగా వినియోగించుకోవడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కేటీఆర్ అన్నారు. సాధారణంగా ప్రతి సంవత్సరం 18 ఏళ్లు నిండిన వారు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఓటుహక్కు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కానీ, ఈ ఎస్ఐఆర్ కార్యక్రమంలో అధికారులే స్వయంగా ప్రతి ఇంటికీ వచ్చి, వివరాలు సేకరించి ఓటు హక్కును నమోదు చేస్తారని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ సలీం, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిషాంక్, బీఎల్‌ఏలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు కేటీఆర్ సూచించిన నాలుగు ముఖ్య సూత్రాలు

- కొత్త ఓట్ల నమోదు: గత ఎన్నికల సమయంలో 16 ఏళ్లు ఉండి, ప్రస్తుతం 18 ఏళ్లు నిండిన యువతీయువకులను గుర్తించి వారి పేర్లను ఓటర్ల జాబితాలో తప్పనిసరిగా నమోదు చేయించాలి.
- మరణించిన వారి ఓట్ల తొలగింపు: నియోజకవర్గంలో చనిపోయిన వారి వివరాలను సేకరించి, వారి ఓట్లను జాబితా నుంచి తొలగించేలా చూడాలి.
- వలస వెళ్లిన వారి ఓట్ల సవరణ: ఉదాహరణకు అంబర్‌పేట్ నుంచి ఎల్‌బీనగర్ లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను ఇక్కడ తొలగించి, వారు ప్రస్తుతం నివసిస్తున్న చోట నమోదు చేయించాలి.
- కొత్తగా వచ్చిన వారి ఓట్ల నమోదు: ఇతర నియోజకవర్గాల నుంచి మన ప్రాంతానికి వలస వచ్చిన వారి వివరాలను సేకరించి, ఇక్కడ వారికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలి.

చిరిగిన గ్లౌజులు విరిగిన క్యాథటర్

(మొదటిపేజీ తరువాయి)

కల్పిస్తారు. కానీ నిమ్స్ దవాఖానలో ప్రస్తుత రేట్ కాంట్రాక్ట్ ద్వారా కొనుగోలు చేసిన పరికరాల్లో నాణ్యత పూర్తిగా కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాసిరకం పరికరాలను సరఫరా చేసే సంస్థలకే అవకాశం ఇస్తున్నారని టాక్. పెద్దల హస్తంతో సర్జికల్ స్టోర్స్ కేంద్రంగా అవినీతి జరుగుతుందని పలువురు వైద్యులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా నాసిరకం గ్లౌజులు, క్యాథటర్లు, ఇతర నాణ్యత లేని పరికరాలు నిమ్స్‌లో వినియోగిస్తున్నట్లు చెబుతున్నారు. కొందరి అవినీతి దాహం వల్ల నాసిరకం పరికరాలు సరఫరా చేసే సంస్థలకే అవకాశం కల్పించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. రేట్ కాంట్రాక్ట్ సైతం 2-3 నెలలు మాత్రమే ఉండాలి....కానీ నిమ్స్ దవాఖానలో మాత్రం ఏడాది దాటినా ఆ కాంట్రాక్ట్ ముగియకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఓ వైద్యుడు సాహసం చేసి సంబంధిత విభాగానికి ఫిర్యాదులో పేర్కొనడంతో ఈ నాసిరకం వ్యవహారం వెలుగుచూసింది.

నరకం చూస్తున్న రోగులు....

గైనకాలజీ, యూరాలజీ, అర్థోపెడిక్, వాస్క్యులర్ తదితర విభాగాల్లో ఎపిడ్యూరల్ అనస్థీషియా ప్రక్రియను వినియోగిస్తారు. ఈ ప్రక్రియ ద్వారా రోగి నడుము కింద భాగంలో వెన్నుపూస వద్ద క్యాథటర్, నీడిల్ సాయంతో మత్తు మందును ఇస్తారు. అయితే నిమ్స్ దవాఖానలో కొత్త రేట్ కాంట్రాక్ట్ ద్వారా ఎల్-1 కేటగిరిలో కొనుగోలు చేసిన (ఎస్‌జిఎస్250119) కోడ్‌కు చెందిన ఎపిడ్యూరల్ మినీ ప్యాక్‌లు పూర్తిగా నాసిరకంగా ఉన్నట్లు పలువురు వైద్యులు యాజమాన్యం, సర్జికల్ స్టోర్స్ కంట్రోలర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ పరికరాలు సమర్థవంతంగా పనిచేయకపోవడంతో ఒకే రోగికి ఎపిడ్యూరల్ ప్రక్రియ నిర్వహించే సమయంలో క్యాథటర్లు విరిగిపోతుండటం వల్ల రెండు నుంచి మూడు ప్యాక్‌లు ఉపయోగించి పలుమార్లు సూదులు గుచ్చాల్సి వస్తోందని, దీంతో రోగి శస్త్రచికిత్స అనంతరం మత్తు నుంచి బయటకు వచ్చిన తర్వాత నొప్పితో నరకాన్ని అనుభవిస్తున్నారని, నాణ్యమైన పరికరాలు తెప్పించండంటూ ఆ వైద్యులు ఫిర్యాదులో వాపోయినట్లు తెలిసింది.

ప్రశ్నించిన వైద్యులపై బెదిరింపులు..!

ఇదిలా ఉండగా, నాసిరకం వస్తువులు వాడలేక ఇబ్బందులు పడుతున్న వైద్యులు పలుమార్లు యాజమాన్యాన్ని నిలదీసినట్లు తెలిసింది. అయితే నిలదీస్తే తమకు పెద్దల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని పలువురు వైద్యులు మీడియాకు వివరించారు. అయితే ఈ ఫోన్‌కాల్ అధిక శాతం అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్నట్లు పలువురు బాహాటంగానే చెబుతున్నారు. దీంతో ఈ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల హస్తం కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫ్యూచర్ సిటీలో ఠాణాల సందర్శన

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ) ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌గా నియమితులైన తర్వాత తరుణ్‌జోషి స్వయంగా ఆయా పోలీస్ స్టేషన్లకు వెళ్లి పరిశీలిస్తున్నారు. అమన్‌గల్, కడ్తాల్, మహేశ్వరం, శంషాబాద్, కొత్తూరు, షాద్‌నగర్ ఠాణాలను ఆయన వరుసగా సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను స్వయంగా పరిశీలించడంతో పాటు పలు సూచనలు చేశారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో ప్రజా భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ సమర్థవంతమైన పోలీసింగ్‌పై పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి అధికారులకు కీలక ఆదేశాలు జారీచేశారు. బుధవారం ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సైబర్‌నేరాలు, డిజిటల్ అరెస్ట్‌లు, ఆన్‌లైన్ మోసాలు, నకిలీ పెట్టుబడి పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు కేసుల నమోదు, దర్యాప్తులలో వేగం పెంచాలని ఆదేశించారు. డ్రంకెన్ డ్రైవ్, అతివేగం, ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటూ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డ్రగ్స్ విక్రయం, వినియోగం, రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి కట్టడి చేయాలని, అసహజ మరణాలు, మోసం, ఆర్థిక నేరాలు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులను నిష్పక్షపాతంగా, నిర్ణీత గడువుల్లో దర్యాప్తు చేయాలన్నారు.

ఫ్యూచర్ సిటీకి మెట్రో లేనట్టే!

(మొదటిపేజీ తరువాయి)

ఎంత? రద్దీ ఏ స్థాయిలో ఉంది.? ప్రస్తుతం ఉన్న రవాణా సదుపాయాలను ఆరాతీసిన కేంద్రం.. జనసంచారమే లేని ఫ్యూచర్ సిటీకి మెట్రో ఎందుకని ప్రశ్నించడంతో.. తదనంతరం రాష్ట్ర సర్కారు ఫ్యూచర్ సిటీ మెట్రోను ఫేజ్-3లో పెట్టాలంటూ చేసిన ప్రతిపాదనను కూడా కేంద్ర తిరస్కరించింది. దీంతో ఫ్యూచర్ సిటీకి మెట్రో లేనట్లేనని అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ప్రజల డిమాండ్ బుట్టదాఖలు..

పాలకులకు నిజంగా నగర ప్రజల ప్రయాణ కష్టాలు తీర్చాలనే తపన ఉంటే ముందుగా జనావాసాలు దట్టంగా ఉన్న నగర రద్దీ మార్గాలపై దృష్టి పెట్టాలి. భవిష్యత్‌లో వచ్చే సిటీ కంటే ఇప్పుడు నరకం చూస్తున్న నగరవాసుల ప్రాధాన్యతలే ముఖ్యమని, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలు పక్కనబెట్టి, ప్రజావసరాల ప్రాతిపదికన మెట్రోఫేజ్-3ని పట్టాలెక్కించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనికితోడు సుదీర్ఘ కాలంగా నార్త్ సిటీ వాసులు తమ ప్రాంతానికి మెట్రో మార్గాన్ని నిర్మించాలని చేసిన ప్రతిపాదనలను బుట్టదాఖలు చేస్తున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు.. మెట్రో విస్తరణ పేరిట కాలయాపన చేస్తున్నాయని మండిపడుతున్నారు.

ఈఎస్ఐలో అధికారుల తిష్ట

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): సెక్రటరీ(ఎల్ఎస్‌టీ)గా పనిచేస్తున్న ఒక అధికారి ఐఎంఎస్‌లో 1990లో చేరి, దాదాపు 35సంవత్సరాలుగా హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలోనే తిష్టవేసినట్లు ఐఎంఎస్ వర్గాల ద్వారా తెలిసింది. పదోన్నతి వచ్చినా, బదిలీ వచ్చినా సదరు అధికారి నగరాన్ని వదిలిపెట్టకుండా తనకున్న పైరవీల బలంతో చక్రం తిప్పుతున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో..

నాచారం ఈఎస్ఐ హాస్పిటల్‌లో మెడికల్ సూపరింటెండెంట్‌కు పీఏగా విధులు నిర్వర్తిస్తున్న ఒక ఉద్యోగి 1990లో ఐఎంఎస్‌లో చేరి, దాదాపు 28సంవత్సరాలుగా హైదరాబాద్ పరిధిలోనే తిష్ట వేశారు. అంతే కాకుండా ప్రస్తుతం నాచారంలో కొనసాగుతున్న పోస్టు కూడా అక్రమమని, సీనియర్ అసిస్టెంట్ హోదాలో ఉన్న వ్యక్తికి ఆఫీస్ సూపరింటెండెంట్ హోదాతో కూడిన మెడికల్ సూపరింటెండెంట్ పీఏ హోదాలో కూర్చోబెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నగరం చుట్టే పోస్టింగ్..

నాచారంలోని ఈఎస్ఐ హాస్పిటల్‌లో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఓ అధికారి సైతం సుమారు 28సంవత్సరాలుగా నగరంలోనే తిష్టవేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి సైతం బదిలీ అయినా లేక పదోన్నతి వచ్చిన జంటనగరాల్లోనే తిరుగుతున్నట్లు సొంత శాఖలోనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ప్రస్తుతం జరిగిన బదిలీల్లో సదరు అధికారులకు ఇతర ప్రాంతాల్లో అవకాశాలున్నప్పటికీ అక్కడి బదిలీ చేయకుండా మళ్లీ నగరం చుట్టే పోస్టింగ్‌లు కల్పించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఐఎంఎస్‌లో సాధారణ ఉద్యోగులకు ఒక న్యాయం, పలుకుబడి, పైరవీలు చేసుకునే వారికి మరో న్యాయం జరుగుతోందని సొంత శాఖ వర్గాలే విమర్శించడం గమనార్హం.

లోన్ రికవరీ ఏజెంట్ల ఒత్తిడి.. యువతి ఆత్మహత్య



రోజారమణి (ఫైల్)

మాదాపూర్, జూన్ 3: లోన్ యాప్‌లో సులభంగా లోన్స్ పొందవచ్చని అనేక మంది రుణాలు తీసుకొని వాటిని కట్టలేక ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా మాదాపూర్‌లో ఓ యువతి లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక మాదాపూర్‌లోని కేబుల్ బ్రిడ్జిపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ వివరాల ప్రకారం నాగోల్‌కు చెందిన రోజారమణి (26) మెడికవర్ దవాఖానాలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నది. రోజారమణి కార్యాలయానికి వెళ్ళి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తమ కూతురు కనిపించడం లేదని నాలుగు రోజుల క్రితం నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్నారు. యువతి మొబైల్ సిగ్నల్స్‌ను గుర్తించి కేబుల్ బ్రిడ్జి వద్ద ఉన్న కెమెరాలను పరిశీలించారు. ఆమె బ్రిడ్జిపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్న దృశ్యాలు నమోదయ్యాయి. దీంతో పోలీసులు హైడ్రా సహాయంతో యువతి మృతదేహాన్ని దుర్గం చెరువులో నుండి వెలికితీశారు. ఇదిలా ఉండగా మృతురాలు తెలిసిన వారికి డబ్బులు ఇచ్చి వారు ఇవ్వకపోవడంతో లోన్ సమయానికి చెల్లింకపోవడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.

విల్లా ప్రాజెక్టుపై రెరా కొరడా

మౌలిక వసతుల కల్పన 60 రోజుల్లో పూర్తి చేయాల్సిందే

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : వినియోగదారుల హక్కుల రక్షణే ధ్యేయంగా తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. కొంపల్లిలోని బాలాజీ ఎలిగాన్సియా విల్లా ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న అన్ని మౌలిక వసతులు, ఉమ్మడి సౌకర్యాలను రాబోయే 60 రోజుల్లోగా పూర్తి చేయాలని బిల్డర్ మెసర్స్ బాలాజీ కన్ స్ట్రక్షన్స్‌ను టీజీ రెరా ఆదేశించింది. ఈ మేరకు ఫిర్యాదు నంబరు 375/2025పై విచారణ జరిపిన అథారిటీ స్పష్టమైన తీర్పును వెలువరించింది. మెరుగైన సౌకర్యాలు, లగ్జరీ లైఫ్ స్టైల్ చూపిస్తామంటూ మార్కెటింగ్ బ్రోచర్లు, సేల్ అగ్రిమెంట్లలో బిల్డర్ భారీ హామీలు గుప్పించారు. పూర్తిస్థాయి క్లబ్ హౌస్, సీవరేజ్ ప్లాంట్, వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్, 100 శాతం పవర్ బ్యాకప్, పటిష్టమైన సెక్యూరిటీ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తామని నమ్మబలికారు. తీరా కోట్లాది రూపాయలు పోసి విల్లాలు కొనుగోలు చేశాక.. ప్రాజెక్ట్ గడువు (సెప్టెంబర్ 1, 2024) ముగిసినప్పటికీ బిల్డర్ ఈ సౌకర్యాలను నిర్మించలేదు. దీంతో మోసపోయామని గ్రహించిన బాలాజీ ఎలిగాన్సియా విల్లా ఓనర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ మెయింటెనెన్స్ సొసైటీ నివాసితులు రెరాను ఆశ్రయించారు. సంబంధిత నివాసితుల ఫిర్యాదుపై స్పందించిన రెరా అథారిటీ.. క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇస్కీ) నిపుణుల కమిటీతో థర్డ్-పార్టీ తనిఖీ చేయించింది. ఈ తనిఖీల్లో నివ్వెరపోయే నిజాలు బయటపడ్డాయి. ప్రాజెక్టులో మెజారిటీ విల్లాల్లో ప్రజలు ఇప్పటికే నివసిస్తున్నప్పటికీ, బిల్డర్ ప్రాథమిక పౌర సదుపాయాలను, ఉమ్మడి వినోద వ్యవస్థలను సగానికి పైగా పెండింగ్‌లో పెట్టినట్లు నిపుణుల కమిటీ నిర్ధారించింది.విచారణ సందర్భంగా డెవలపర్ లేవనెత్తిన సాంకేతిక అభ్యంతరాలను, ప్రాజెక్ట్ ఎక్స్ టెన్షన్ సాకులను రెరా చైర్మన్ తోసిపుచ్చారు. రియల్ ఎస్టేట్ చట్టం 2016 లోని సెక్షన్ 37, 38 ప్రకారం ఆదేశాలు జారీ చేశారు. ఏదైనా ఒక ప్రాజెక్టులో 2/3 వంతు కంటే ఎక్కువ విల్లాలు లేదా ఫ్లాట్లలో కొనుగోలుదారులు చేరినప్పుడు.. ఒప్పందం ప్రకారం హామీ ఇచ్చిన అన్ని ఉమ్మడి వసతులను, మౌలిక సదుపాయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేసి అప్పగించాల్సిన బాధ్యత పూర్తిగా డెవలపర్ దే. ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయకపోతే, రెరా చట్టంలోని సెక్షన్ 63 ప్రకారం సదరు ప్రమోటర్‌పై కఠినమైన క్రిమినల్ మరియు పెనాల్టీ చర్యలు (శిక్షార్హమైన ప్రాసిక్యూషన్) ఉంటాయని టీజీ రెరా హెచ్చరికలు జారీ చేసింది.

న్యాయవాది హత్య కేసులో నిందితుడిని అప్పగించాలి

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూన్ 3 (నమస్తే తెలంగాణ): మాసబ్‌ట్యాంక్ పరిధిలో జరిగిన ప్రముఖ న్యాయవాది ఖాజా మెయిజుద్దీన్ హత్య కేసులో ప్రధాన నిందితుడు టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు ముజాహిద్ ఆలం ఖాన్‌ను పోలీసు కస్టడీకి అప్పగించాలని బుధవారం పోలీసులు పిటీషన్ దాఖలు చేశారు. నాంపల్లి పోలీస్ స్టేషన్ విచారణాధికారి సైదులు నేతృత్వంలో సమాచారం సేకరించేందుకు 10 రోజుల పాటు పోలీసు కస్టడీకి కోరుతూ 12వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టుకు పిటీషన్‌ను సమర్పించారు. మే 24న ఉదయం న్యాయవాది తన ఇంటినుంచి బయటకు వచ్చి కారు ఎక్కుతుండగా నిందితులు స్కార్పియో వాహనంతో బలంగా ఢీకొట్టి కొద్ది దూరం ఈడ్చుకెళ్లారు. పోలీసులు ప్రాథమికంగా హిట్ అండ్ రన్ కింద కేసును భావించిన అనంతరం సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల ఆధారంగా ఇది ప్రమాదం కాదని, పక్కాగా ప్లాన్ ప్రకారం హత్య అని పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. ముజాహిద్ తండ్రి మహబూబ్ ఆలం ఖాన్‌తో కలిసి ప్రణాళిక రచించారని, వీరిద్దరినీ సూత్రధారులుగా పరిగణిస్తూ రిమాండ్ రిపోర్టును రూపొందించారు. ముజాహిద్‌కు జైలులో పోలీసులు నోటీసులు జారీ చేసిన పిదప కస్టడీ పిటీషన్‌ను కోర్టు ఎదుట దాఖలు చేశారు. విచారణకు ముజాహిద్ సహకరించలేదని, విచారణ పూర్తి చేసేందుకు సమయం సరిపోలేదని పేర్కొన్నారు. కీలక ఆధారాలను సేకరించాల్సి ఉందని, నిందితుడి ద్వారా కీలక సమాచారం నమోదు చేయాల్సి ఉందని తెలిపారు. ఈ హత్యను ప్రమాదంగా చిత్రీకరించడానికి రూ.25 లక్షల సుపారీ ఇచ్చినట్టు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. హంతకుడు కిషన్‌సింగ్ అలియాస్ పప్పు, స్టంట్ నిపుణుడు అభిజిత్ సహా మొత్తం ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ముజాహిద్‌ను కాంగ్రెస్ పార్టీనుంచి బహిష్కరించినట్టు ఆ పార్టీ ప్రకటించింది. అభిజిత్ అలియాస్ నానీ, దిఘన్ వినయ్, విక్రమ్ ఆదిత్య అలియాస్ చింటూ, మణిదీప్ అలియాస్ పోగో నానీ, కిషన్ సింగ్ అలియాస్ పప్పులు రిమాండ్ ఖైదీలుగాచంచల్‌గూడా జైలులో ఉన్నారు.

అక్రమంగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్


సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా డిఫెన్స్ మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న ఒక మాజీ సైనిక ఉద్యోగిని సికింద్రాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.లక్షల విలువైన మధ్య ప్రదేశ్‌కు చెందిన 51డిఫెన్స్ మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే....సికింద్రాబాద్‌కు చెందిన మాజీ సైనిక ఉద్యోగి కె. విద్యాసాగర్ రెడ్డి గత కొన్ని రోజులుగా డిఫెన్స్ మద్యం బాటిళ్లను సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు బుధవారం పక్కా ప్రణాళికతో సికింద్రాబాద్‌లోని స్టైల్ యేనియన్ షాపింగ్‌మాల్ సమీపంలో డిఫెన్స్ మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న మాజీ సైనిక ఉద్యోగిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అతడి వద్ద నుంచి 11మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడి ఇంటిపై దాడులు జరిపి తనిఖీ చేయగా మరో 40 డిఫెన్స్ మద్యం బాటిళ్లు లభించాయి. దీంతో నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి మొత్తం రూ.లక్ష విలువైన 51 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మద్యం బాటిళ్లలో 28 టీచర్స్, 18 సీగ్రమ్ స్కాచ్ బాటిళ్లు, మూడు సిగ్నేచర్, వైన్ బాటిళ్లు ఉన్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్. చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

మత్తు కోసం వినియోగిస్తున్న దగ్గు మందు సీజ్

రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు చింతల్‌లోని భగత్ సింగ్ నగర్‌లో జక్కుల సాకేత్ అనే వ్యక్తి నిషేదిత దగ్గు మందు సీసాలను అమ్ముతుండగా పట్టుకున్నారు. ఈ నిషేదిత దగ్గు మందు బాటిళ్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిందితుడిని ప్రశ్నించగా తులసి మెడికల్ షాపు యజమాని గుండ్ల చంద్రశేఖర్ ఇచ్చాడని తెలిపాడు. నిందితుడి సమాచారంతో గుండ్ల చంద్రశేఖర్ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 10 నిషేధిత దగ్గు మందు బాటిళ్లు లభ్యమయ్యాయి. నిందితులిద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 15 నిషేధిత దగ్గు మందు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

సచివాలయల వద్ద దంపతుల ఆత్మహత్యా యత్నం

ఖైరతాబాద్, జూన్ 3 : భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నా అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదంటూ మనస్థాపానికి గురైన దంపతులు సచివాలయం ముందు ఆత్మహత్యకు యత్నించారు. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు వారి ప్రయత్నాన్ని అడ్డుకొని స్టేషన్ తరలించారు. పోలీసుల కథనం ప్రకారం... సిద్దిపేట జిల్లా కొండపోచమ్మ పోసానిపల్లి గ్రామానికి చెందిన పుట్ట కిష్టయ్య (58)రైతు. ఆయనకు భార్య సాయమ్మ, పిల్లలు ఉన్నారు. తన సోదరుడి వద్ద కొంత భూమి కొనుగోలు చేసి డబ్బులు ఇచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, దీనిపై స్థానిక పోలీసులు, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఆ భార్యభర్తలిద్దరూ సచివాలయం ముందు తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను తీసుకొని అంటించుకునే ప్రయత్నం చేశారు. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు వారి ప్రయత్నాన్ని అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



బాధితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

బాలికకు వేధింపులు.. ఆటో డ్రైవర్ రిమాండ్

కాచిగూడ,జూన్ 3: మైనర్ బాలికను వేధిస్తున్న ఆటో డ్రైవర్‌ను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజశేఖర్ వివరాల ప్రకారం సైదాబాద్ ప్రాంతానికి చెందిన శివ(229)వృత్తిరిత్యా ఆటో డ్రైవర్. తిలక్‌నగర్‌కు ప్రాంతానికి చెందిన 14 యేండ్ల బాలికను శివ గత కొన్ని రోజులుగా తరుచుగా ఫోన్‌లో వేధిస్తున్నాడు. అనేక మార్లు మందలించినా ఆతనిలో మార్పు రాలేదు. దీంతో కాచిగూడ పోలీసులకు మైనర్ బాలిక ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న కాచిగూడ పోలీసులు శివను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



కేటీఆర్‌తో కలిసి విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, ఇతర నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మన్నె క్రిశాంక్

అర్హుల ఓట్లు పోవద్దు

బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు

- ఢిల్లీ కుట్రలను తిప్పి కొట్టాలి : ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్
- డిజిటల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలి :మన్నె క్రిశాంక్

అడ్డగుట్ట/ ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 3 : అర్హులైన వారి ఓట్లు ఒక్కటి కూడా తొలగించకుడా బీఆర్‌ఎస్ శ్రేణులు పని చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్‌మండి మల్లి పర్పస్ ఫంక్షన్ హాల్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్‌ఐఆర్), బీఆర్‌ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం బీఆర్‌ఎస్ యువనేత రామేశ్వర్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ మాట్లాడుతూ... సికింద్రాబాద్ నియోజకవర్గం తెలంగాణ వాదానికి కంచుకోటగా మారిందని, ఓటర్లను చైతన్యవంతులను చేశామని అన్నారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో బీఆర్‌ఎస్ శ్రేణులు ముఖ్యభూమిక పోషించాలని, అర్హులైన వారి ఓట్లు తొలగిపోకుండా బూత్ స్థాయి ఏజెంట్లు జాగత్తలు తీసుకోవాలని సూచించారు.

ఢిల్లీ కేంద్రంగా కుట్రలు: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ఓట్ల తొలగింపు కుట్రలతో పార్టీలు ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నాయని, ఎస్‌ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కిందిస్థాయిలో బీఆర్‌ఎస్ శ్రేణులు క్రియాశీలక పాత్ర పోషించాలని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. వెస్ట్ బెంగాల్‌లో ఓట్ల తొలగింపు మూలంగానే బీజేపీ గెలిచిందని, ఎస్‌ఐఆర్‌ను దుర్వినియోగం చేస్తూ ఎలాంటి చర్యలకు పాల్పడొచ్చో మనకు బెంగాల్ ఎన్నికలు మంచి ఉదాహరణ అని ఆయన అన్నారు. బీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంపై కొందరు నాయకులు అనవసర అపోహలు సృష్టిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ అస్థిత్వంపై కుట్ర జరుగుతుంది, కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఢిల్లీ కేంద్రంగా తెలంగాణపై కుట్రలు జరుగుతున్నాయని, బీజేపీ, కాంగ్రెస్ రెండింటినీ ఏ మాత్రం నమ్మకుండా వాటి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన తెలిపారు.

సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలి : మన్నె క్రిశాంక్

ఎస్‌ఐఆర్‌పై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్, మాజీ ఛైర్మన్ మన్నె క్రిశాంక్ సూచించారు. ప్రతి ఐదేళ్లకో సారి ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్రంలో కొందరు నాయకులు పనికట్టుకొని అలజడి సృష్టించాలని చూస్తున్నారని ఆయన తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఈసారి తెలంగాణ ప్రజానీకం బీఆర్‌ఎస్‌ని గెలుపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పార్టీ బలోపేతానికి యువత ఎంతో అవసరమని, అంతేకాకుండా డిజిటల్ మీడియా విస్తృతంగా వినియోగించుకోవడం ద్వారా మంచి ఫలితాలు రాబట్టుకోవచ్చని ఆయన తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి పార్టీని మరింత బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని మాజీ కార్పొరేటర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్సీ సలీం, బీఆర్‌ఎస్ యువ నాయకులు కిషోర్ గౌడ్, త్రినేత్ర గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంటు ఇంచార్జ్ తలసాని సాయి కిరణ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు సామల హేమ, లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్, రాసూరి సునీత, కంది శైలజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హరీశ్‌రావు

జన్మదిన వేడుకలు

ఉప్పల్, జూన్ 3: ఉప్పల్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉప్పల్‌లో హరీశ్‌రావు చిత్ర పటం వద్ద కేక్ కట్ చేసి ఒక రికొకరు తినిపించుకున్నారు. హరీష్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని బీఆర్‌ఎస్ నేత, ఉద్యమ నాయకుడు పిల్లి నాగరాజు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి ఆయనకు కేక్ తినిపించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కేక్ తినిపిస్తున్న ఉప్పల్ బీఆర్‌ఎస్ నేత, ఉద్యమ నాయకుడు పిల్లి నాగరాజు



మాజీ మంత్రి హరీశ్ రావుని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీఆర్‌ఎస్ నాయకుడు తూముల అభిలాశ్‌రావు, అనంతరం హరీశ్‌రావు ఆశీర్వాదం తీసుకున్నారు.



పుట్టిన రోజు సందర్భంగా అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న హరీశ్‌రావు

పూరి బీచ్‌లో సైకత శిల్పాన్ని ఏర్పాటు చేసిన పటాన్‌చెరు బీఆర్‌ఎస్ నాయకులు



ఎట్టకేలకు కదలిక

సీఆర్‌ఎంపీ ఫేజ్-2 పనులకు గ్రీన్ సిగ్నల్

- రహదారుల పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు
- ట్రై కార్పొరేషన్లలో ఉమ్మడి టెండర్లకు అనుమతి
- 169 కిలోమీటర్ల మేర రోడ్ల పునరుద్ధరణకు అవకాశం

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : ట్రై కార్పొరేషన్లు (జీహెచ్‌ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ) పరిధిలోని రహదారుల నిర్వహణ, పునరుద్ధరణకు సర్కారు ఎట్టకేలకు అనుమతులు మంజూరు చేసింది. సమగ్ర రహదారుల నిర్వహణ కార్యక్రమం (సీఆర్‌ఎంపీ) ఫేజ్-2 కింద రూ.3145 కోట్ల వ్యయంతో చేపట్టే పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ బుధవారం పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ జీవో నం 591ను జారీ చేశారు. ట్రై కార్పొరేషన్లకు ఉమ్మడిగా టెండర్లు పిలిచేందుకు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో రూ.1533, ఎంఎంసీ రూ.818, సీఎంసీ రూ.794 కోట్లుగా కేటాయించారు. ఈ నిధులతో మూడు కేటగిరీలలో సాంప్రదాయ పద్ధతిలో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 2230 కోట్లు, మొదటి దశలో పూర్తి కానీ అదనపు సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 208 కోట్లు, ఎఫ్‌డీఆర్ సాంకేతికతో అదనపు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.707 కోట్లు ఖర్చు చేయనున్నారు. 169 కిలో మీటర్ల మేర రహదారుల విస్తరణ సీఆర్‌ఎంసీ ఫేజ్-2 కింద రహదారులను అభివృద్ధి చేయనున్నారు. సీఎంసీలో 67.36 కిలోమీటర్లు, ఎంఎంసీలో 69.90 కిలోమీటర్లు, జీహెచ్‌ఎంసీలో 32.13 కిలోమీటర్ల రోడ్లను పునరుద్ధరించనున్నారు. ఈ పనులకు ఆయా కార్పొరేషన్ల పరిధిలోని ఎస్‌ఈలు జోన్ల వారీగా ఒప్పందాలు కుదుర్చుకోవాలని ఉత్తర్వులో ఆదేశించింది. ఇందుకు అయ్యే ఖర్చును ఆయా మున్సిపల్ కార్పొరేషన్ల సాధారణ నిధుల నుంచి భరించాల్సి ఉంటుందని పేర్కొంది. పనుల వేగవంతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను ప్రభుత్వం ఆదేశించింది. కాగా బీఆర్‌ఎస్ హయాంలో ఇతర మెట్రో నగరాలకు ఆదర్శవంతంగా నిలిచిన సీఆర్‌ఎంపీ పథకాన్ని నీరుగార్చిన కాంగ్రెస్ సర్కారు ఎట్టకేలకు సరిగ్గా రెండున్నరేళ్లకు కదలిక రావడం గమనార్హం.

సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలి

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్



బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దాసోజు శ్రవణ్‌కుమార్

బంజారాహిల్స్, జూన్ 3: బీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదుతోపాటు ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమంలో కార్యకర్తలందరినీ బాగస్వాములను చేయాలని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ సూచించారు. జూబ్లీహిల్స్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఖైరతాబాద్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాలతో డిజిటల్ పద్ధతిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టామని, ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఎస్‌ఐఆర్ పేరుతో ఓటర్ల సవరణ కొనసాగుతోందని, అర్హులైన ఓటర్లను తొలగించకుండా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, నాయకులు వెంకీ ముదిరాజ్, శంకర్, జ్యోతి, మారెమ్మ, కిరణ్‌కుమార్, విష్ణునాయక్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

బీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బంజారాహిల్స్ డివిజన్‌లో సభ్యత్వ నమోదు, ఎస్‌ఐఆర్ కార్యక్రమాలపై చర్చించేందుకు బుధవారం డివిజన్‌కు చెందిన సీనియర్ నేతలతో కలిసి సభ్యత్వ నమోదు ఇంచార్జి దాసోజు శ్రవణ్‌తో మన్నె గోవర్ధన్‌రెడ్డి సమావేశమయ్యారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజల్లో గట్టి పట్టు ఉందని, కార్యకర్తలు ఏకతాటిపై ఉండి సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని మన్నె గోవర్ధన్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో బంజారాహిల్స్ డివిజన్ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి కే.విప్లవ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌నాయుడు, రావుల విజయ్‌కుమార్, నాగరాజు, రాథ, అంజనేయులు, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జలమండలి అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న రహ్మత్‌నగర్ డివిజన్ హనుమాన్ టెంపుల్, పోచమ్మ టెంపుల్ ప్రాంతాల వాసులు

మంచినీళ్లివ్వండి మహాప్రభో..

అధికారులకు పలు ప్రాంతాల ప్రజల వినతి

జూబ్లీహిల్స్, జూన్ 3: 'అసలే వేసవి కాలం.. తాగడానికి నీళ్లు లేక గొంతెండిపోతుంది.. మంచినీళ్లివ్వండి మహాప్రభో..' అంటూ రహ్మత్‌నగర్ డివిజన్ హనుమాన్ టెంపుల్, పోచమ్మ టెంపుల్ ప్రాంతాల వాసులు గొంతెత్తారు. బుధవారం బోరబండలోని జలమండలి కార్యాలయానికి చేరుకుని అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మధురానగర్ పోలీస్‌స్టేషన్ వెనుకవైపున ఉన్న ఈ ప్రాంతాలలో రోజు విడిచి రోజు వచ్చే తాగునీరు కనీసం అరగంట కూడా రావడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కొద్ది సమయంలో పూర్తిగా లో ఫ్రెజర్‌తో వస్తున్న నీరు కనీస అవసరాలకు కూడా సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు బస్తీలలో తాగునీటి సమస్య తీవ్రమవడంతో స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అయితే తమ సమస్యను చెప్పుకునేందుకు వస్తే అధికారులు అందుబాటులో లేరని అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా జలమండలి డీజీఎం సురేష్ కుమార్ ఫోన్ ద్వారా ఆయా ప్రాంతాల ప్రతినిధులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రోడ్డు విస్తరణ పనులపై విచారణ జరిపించాలి

అమీర్‌పేట వాసి లక్ష్మీనారాయణ



ఖైరతాబాద్, జూన్ 3 : పంజాగుట్ట- అమీర్‌పేట రోడ్డు విస్తరణ పరిహారంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని అమీర్‌పేట్‌కు చెందిన లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2007లో జీహెచ్‌ఎంసీ భూసేకరణ ఉత్తర్వుల ప్రకారం అమీర్‌పేట్ రోడ్డులోని 6-3-788/ 33 (32) నంబరు గల భవనానికి చెందిన 198 చదరపు గజాల స్థలాన్ని రోడ్డు విస్తరణ కోసం జీహెచ్‌ఎంసీ స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించిందన్నారు. ఆ స్థలానికి సుమారు రూ.76.19లక్షలు జీహెచ్‌ఎంసీ ఆ ఇంటి యజమాని కృష్ణమూర్తికి చెల్లించిందన్నారు. అయితే మొత్తం కూల్చివేయాల్సి ఉండగా, స్వల్ప భాగం మాత్రమే కూల్చివేసి బల్దియా చేతులు దులుపుకుందన్నారు. ప్రస్తుతం ఆ భవన యజమాని ఎలాంటి అనుమతులు లేకుండా నాలుగో అంతస్తు నిర్మించడంతో పాటు లక్షలాది రూపాయల కిరాయి తీసుకుంటున్నాడన్నారు. ముందుగానే పరిహారం చెల్లించి కూల్చివేయకుండా వదిలివేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. గత 15 ఏండ్లుగా జీహెచ్‌ఎంసీ కాలయాపన చేస్తూనే ఉందని, ఇందులో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు. దీనిపై లోకాయుక్తను సైతం సంప్రదించానన్నారు. ఇందులో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆస్పత్రి, మెడికల్ కళాశాల భవనాలు నిర్మించాలి



కందుకూరులో మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, జూన్ 3 : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట్ గ్రామ రెవెన్యూ పరిధిలోని బేగరికంచ వద్ద మెడికల్ కళాశాల, ఆసుపత్రి భవనాలు నిర్మించాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రంగారెడ్డి జిల్లాకు మాజీ సీఎం కేసీఆర్ మంజూరు చేసిన మెడికల్, 400 పడకల ఆసుపత్రుల భవనాలను ఫార్మాసిటీలో నిర్మించాలని చెప్పి నిధులు సైతం మంజూరు చేశారని ఆమె గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేసి ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్లు చెబుతుందన్నారు. ఫ్యూచర్ సిటీకి తాము వ్యతిరేఖం కాదని, తాను హరీశ్‌రావు శంకుస్థాపన చేసిన పనులను ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. ఫ్యూచర్ సిటీపై చూపుతున్న శ్రద్ధ ఆసుపత్రి, మెడికల్ కళాశాలలపై ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు సురుసాని సురేందర్‌రెడ్డి, గంగాపురం లక్ష్మీనర్సింహరెడ్డి, కాకి దశరధ ముదిరాజ్, సర్పంచ్‌లు, ఎలుక మేఘనాద్‌రెడ్డి, కాసుల స్వాతి రామక్రిష్ణారెడ్డి, మండల క్రిష్ణ, మహిళా అధ్యక్షురాలు తాంద్ర ఇందిరమ్మ దేవేందర్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు పొట్టి ఆనంద్, సురుసాని శేఖర్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి, దేవిలాల్ నాయక్, యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, సోషల్ మీడియా కన్వీనరు బొక్క దీక్షిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ వేధింపులు ఆపాలి

బీసీ సంక్షేమ సంఘం నేతలు

రవీంద్రభారతి, జూన్ 3: బీసీ సంక్షేమ శాఖలో ప్రిన్సిపల్ సెక్రటరీ పోస్టు రెండేళ్లుగా పూర్తిస్థాయి అధికారులను నియమించలేదని, ఇన్‌చార్జిలతో ఈ శాఖను నడుపుతున్నారని బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగ మల్లేష్, బీసీ నేత నీల వెంకటేశ్, బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, జిల్లపల్లి అంజిలు మండిపండారు. బషీర్‌బాగ్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ బాలమాయదేవి పనిగట్టుకొని బీసీ ఉద్యోగులను వేధిస్తున్నారని, నాన్ బీసీ అధికారులకు పెత్తనం ఇస్తున్నారని ఆరోపించారు. బీసీ రెసిడెన్షియల్ సొసైటీ సెక్రటరీగా నాన్ బీసీకి ఇచ్చారని, బీసీ కార్పొరేషన్ ఎండీగా నాన్ బీసీకి ఇచ్చారన్నారు. ఇలా మొత్తం బీసీ సంక్షేమ శాఖలో పెద్ద పోస్టులన్నీ బీసీ వ్యతిరేక అధికారులతో నింపి, బీసీ శాఖను భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బీసీ ఉద్యోగులపై కక్షగట్టి వేధిస్తున్నారని విమర్శించారు. వార్డెన్ పోస్టులపై కమిషనర్‌కు ట్రాన్స్‌ఫర్ అర్హత లేకున్నా, ఇతర జిల్లాలకు బదిలీ చేయడానికి ఉత్తర్వులు జారీ చేసి వేధిస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖలలో ఏ కులానికి చెందిన శాఖలో అ కులం అధికారిని కమిషనర్‌గా నియమిస్తున్నారని, కేవలం బీసీ వెల్ఫేర్ కమిషనర్‌గా నాన్ బీసీని ఎలా నియమిస్తానని ప్రశ్నించారు. బాలమాయదేవిని వెంటనే తొలగించాలని, ఆ స్థానంలో బీసీ అధికారిని నియమించాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేందర్, పగిళ్ల సతీష్, మోడీ రామ్‌దేవ్, శివకుమార్ యాదవ్, భీంరాజు, అంజిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో నేడు నిరుద్యోగుల సభ

ఎల్బీనగర్, జూన్ 3 : 'నిరుద్యోగమే మా సమస్య, ఉపాధి హక్కు మా డిమాండ్' అంటూ తెలంగాణ బంగారు భవిష్యత్తు, నిరుద్యోగ యువత హక్కుల సాధన కోసం ఇంద్రా నిరుద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురిలో గురువారం సభ నిర్వహిస్తున్నారు. వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ఇంద్రా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు.



సెంటెనరీ కాలేజీకి


ప్లాటినం అవార్డు

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ సెంటెనరీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌కు బుధవారం సస్టైనబుల్ క్యాంపస్ ఇంపాక్ట్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ 2026 థీమ్‌లో ప్లాటినం అవార్డుతో పాటు సర్టిఫికెట్ ఆఫ్ రికగ్నిషన్ లభించాయి. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి, గ్రీన్ క్యాంపస్ కార్యక్రమాల అమలులో కళాశాల చేసిన విశిష్ట కృషికి ఈ గౌరవం దక్కిందని నిర్వాహకులు తెలిపారు. ఈ గుర్తింపు కళాశాల సుస్థిర భవిష్యత్తు నిర్మాణంలో సాధించిన మరో మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు.

బీటీఎన్‌జీవోస్‌ల

భూపోరాటం

శేరిలింగంపల్లి, జూన్ 3: గోపన్‌పల్లిలో భాగ్యనగర్ మ్యుచువల్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ (బీటీఎన్‌జీవోస్) ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూపోరాటం బుధవారంతో 323వ రోజుకు చేరుకుంది. బీటీఎన్‌జీవోలకు చెందిన భూములను ప్రభుత్వం తిరిగి అప్పగించాలని, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోంచి తమ భూములను కాపాడి తమకు న్యాయం చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ పలువురు బీటీఎన్‌జీవో ఉద్యోగులు, పెన్షనర్లు, మహిళా ఉద్యోగులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ప్రెసిడెంట్ ముత్యాల సత్యనారాయణ గౌడ్, సెక్రటరీ మల్లారెడ్డి, డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, రషీదాబేగం, సంధ్యారాణి, దామోదర్, కెశియా నాయక్, ఉద్యోగులు, పెన్షనర్లు, మహిళలు పాల్గొన్నారు.



గోపన్‌పల్లిలో 323వ రోజు నిరసన దీక్షల్లో పాల్గొన్న భాగ్యనగర్ మ్యుచువల్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఉద్యోగులు

ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు

క్షేత్రస్థాయి పర్యటనలో సీపీ

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): వర్షాకాలంలో రోడ్లపై వరద నీరు నిల్వ ఉండకుండా, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.ఎం.రమేష్, సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ సృజనతో కలిసి పలు సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వర్షాల సమయంలో నీటి నిల్వలు అధికంగా ఏర్పడే ప్రాంతాలను గుర్తించి, సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా ఐటీ కారిడార్ పరిధిలోని మల్కం చెరువు- బయోడైవర్సిటీ జంక్షన్ సమీపంలోని కేర్ హాస్పిటల్ వద్ద భారీ వర్షాల సమయంలో రోడ్లపై వరద నీరు చేరుతున్న ప్రాంతాలను పరిశీలించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రోడ్, కొండాపూర్‌లోని హర్ష టయోటా షోరూం జంక్షన్ తదితర ప్రాంతాల్లో వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడుతున్న ప్రాంతాలను గుర్తించి, సమస్యల శాశ్వత పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వర్షాలతో రోడ్లపై నీరు నిల్వ ఉండటం వల్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థకు అంతరాయం కలుగకుండా మునిసిపల్, పోలీసు, ఇంజనీరింగ్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పర్యటనలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, కూకట్‌పల్లి డీసీపీ రితీరాజ్, ఏడీసీపీ హనుమంతరావు తదితర అధికారులు పాల్గొన్నారు



క్షేత్రస్థాయిలో పనులు పరిశీలిస్తున్న సీపీ రమేశ్